# ఈనాడు



విజయవాడ 24-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 134
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఐటీకి సిలికాన్ వ్యాలీ

# క్వాంటమ్‌కు అమరావతి

## రాజధాని నుంచే దేశ క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తు నిర్మాణం

**ఈ టెక్నాలజీలో ఏపీ నుంచి నోబెల్ సాధిస్తే రూ.100 కోట్ల నజరానా**

- రెండేళ్లలో అమరావతి నుంచి కంప్యూటర్ల ఎగుమతి
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- విద్యార్థులను ఉద్దేశించి ఆన్‌లైన్‌లో ప్రసంగం
- వైసర్, క్యూబిటెక్ సంస్థలతో కలిసి 54వేల మందికి శిక్షణ ఇస్తున్న ప్రభుత్వం



ఈనాడు - అమరావతి

రాష్ట్రం నుంచి క్వాంటమ్ టెక్నాలజీలో నోబెల్ బహుమతి సాధించినవారికి రూ.100 కోట్ల నజరానా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అమరావతిని ప్రపంచంలోని ఐదు అగ్రశ్రేణి క్వాంటమ్ హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. భారతదేశంలో ఈ టెక్నాలజీలో విప్లవానికి ఏపీ నాయకత్వం వహిస్తుందన్నారు. 180 రోజుల్లో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుచేస్తామని, రెండేళ్లలో అమరావతిలోనే కంప్యూటర్లు ఉత్పత్తి చేసి... విదేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచ ఐటీ రంగానికి కేంద్రస్థానం సిలికాన్ వ్యాలీ. రాబోయే రోజుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌కి అమరావతి కేంద్రంగా మారుతుంది. కొత్త కంపెనీలు ప్రారంభించేందుకు, సాంకేతికతల ఆవిష్కరణకు అందరూ ఇక్కడికే వస్తారు" అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం, వైసర్, క్యూబిటెక్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో నమోదుచేసుకున్న 54వేల మంది విద్యార్థులతో ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. 'సిలికాన్ వ్యాలీ నుంచి క్వాంటమ్ వ్యాలీకి- అమరావతి నుంచి భారత క్వాంటమ్ భవిష్యత్తు నిర్మాణం' అన్న అంశంపై ఆయన ఆన్‌లైన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ ప్రసంగించారు.

### వివిధ దశల్లో 14 లక్షల మందికి శిక్షణ

అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ విజన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. వివిధ స్థాయిల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చి నిపుణులుగా తయారుచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. "క్వాంటమ్ మెకానిక్స్, అల్గరిథమ్స్, కంప్యూటింగ్ ఫండమెంటల్స్ లాంటి ఫౌండేషన్ కోర్సుల్లో 10లక్షల మందికి శిక్షణ ఇస్తాం. అడ్వాన్స్‌డ్ స్థాయిలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సెన్సింగ్ అంశాల్లో 3లక్షల మంది నిపుణుల్ని తయారుచేస్తాం. నీతి ఆయోగ్ లక్ష్యం మేరకు అడ్వాన్స్‌డ్ రీసెర్చ్, ఎన్‌క్యూఎం హబ్ ఇంటిగ్రేషన్, స్టార్టప్ ఇంక్యుబేషన్‌లో లక్ష మంది డెవలపర్లను సిద్ధం చేస్తాం. వివిధ సంస్థలు అవి అందజేసే కోర్సులు, (మిగతా 11లో)

**ఏపీ నాయకత్వం వహిస్తుంది... అనుసరించదు**

ఏ సాంకేతిక విప్లవమైనా ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందే తప్ప ఎవరినీ అనుసరించదని చంద్రబాబు స్పష్టంచేశారు. "అమరావతిలో క్వాంటమ్ ఎకోసిస్టంను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. క్వాంటమ్ అప్లికేషన్ల ద్వారా వ్యక్తిగత ఔషధాలు, వ్యాధుల్ని ముందే గుర్తించి నివారించడం వంటివి సాధ్యమవుతాయి. మరింత సామర్థ్యం, వేగం, కచ్చితత్వం సాధించవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీలో 'ఫస్ట్ మూవర్' ప్రయోజనాల్ని భారతీయులు అందిపుచ్చుకోవాలి" అని సీఎం సూచించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో శిక్షణ పొందేందుకు పేర్లు నమోదుచేసుకోవాలని తాను పిలుపునిస్తే... 48 గంటల్లో 54వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 51% విద్యార్థినులు ఉండడం విశేషమని తెలిపారు. ఇప్పటికే ఈ టెక్నాలజీలో రాష్ట్రంలో 870 కాలేజీలు మైనర్ డిగ్రీలు, 53 కాలేజీలు మేజర్ డిగ్రీలు, ఆంధ్రా యూనివర్సిటీ బీటెక్ కోర్సు అందజేస్తున్నాయని తెలిపారు. 1,056 మంది శిక్షణ పొందిన అధ్యాపకులు ఉన్నారన్నారు. 134 టీచింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నామని, 84 అల్గరిథమ్ రీసెర్చ్ ప్రతిపాదనలు ఉన్నాయని సీఎం వివరించారు.



'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరై మాట్లాడుతున్న విద్యార్థి



**వచ్చే ఏడాది 1,450 విద్యుత్ ఏసీ బస్సులు**
- వీటిలో పల్లెవెలుగులైనా ఏసీతోనే నడపాలి
- కేంద్ర సాయంతో మరో 1,050 విద్యుత్ బస్సులు
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు 3లో

**మీ నాయకత్వం మాకు స్ఫూర్తినిస్తోంది**
'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో విద్యార్థులు 11లో

**2 లక్షల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ**
అమరావతిలో క్వాంటమ్ టాలెంట్ హబ్



## పోలవరం అంచనాలు రూ.62,436 కోట్లకు!

- రెండో దశకు రూ.32,000 కోట్లు అవసరం
- త్వరలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు
- తొలి దశ వరకు రూ.30,436.95 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తాజా అంచనాల ప్రకారం మొత్తం రూ. 62,436 కోట్లు ఖర్చవుతుందని తేలింది. ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం తొలిదశలో +41.15 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిపేందుకు వీలుగా పనులు చేపట్టేందుకు రూ. 30,436.95 కోట్లు మంజూరు చేసింది. రెండో దశలో +45.72 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిపేందుకు అవసరమైన నిధులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు మరో రూ. 32,000 కోట్ల వరకు ఖర్చవుతుందని పోలవరం అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనిపై సమగ్ర లెక్కలు రూపొందించి, త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. తొలిదశలో మంజూరైన నిధులు, రెండోదశ అంచనాలు కలిపి మొత్తంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ. 62,436 కోట్లకు చేరనుంది. ఈ అంచనాలపై సమగ్ర స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సందర్భంగా రెండో దశ నిధుల సాధన కోసం లేఖ సమర్పించారు.

### ఇంతవరకు కేంద్రం ఇచ్చింది రూ.23,658 కోట్లు

పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు నిమిత్తం ఇచ్చిన నిధులు రూ. 23,658.40 కోట్లు. తొలిదశలో మొత్తం రూ. 30,436.95 కోట్లకు ఇంకా రూ. 6,645 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇటీవల కేంద్రం అడ్వాన్స్‌గా నిధులు ఇస్తున్నందున ఒకప్పటిలా రీయింబర్స్‌మెంట్ తిప్పలు లేవు. పైగా ప్రస్తుతం కొంత అడ్వాన్స్ మొత్తం రాష్ట్ర ఖజానాలోనే ఉంది. ఇప్పటికే ఇచ్చిన అడ్వాన్స్‌లో (మిగతా 3లో)

**వాహనం ఢీకొని పులి.. రైలు ఢీకొని చిరుతపులి మృత్యువాత**
పల్నాడు, కర్నూలు జిల్లాల్లో ఘటనలు

**గోడను ఢీకొట్టిన బైక్.. ముగ్గురు యువకుల మృతి**
- పశ్చిమగోదావరి జిల్లాలో ఘోరం

**అమానుషంగా శిశు విక్రయాలు**
- ఉత్తరాది నుంచి తెచ్చి బెజవాడలో అమ్మకాలు
- ఈ వ్యవహారాల్లో ఆరితేరిన సరోజిని
- ఏడాదిన్నరలో చేతులు మారిన 28 మంది పిల్లలు

12లో



ప్రకాశం జిల్లా దర్శిలో సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

## సంక్రాంతికి పల్లె సీమల్లో అన్న క్యాంటీన్లు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా అన్న క్యాంటీన్లు రానున్నాయి. గ్రామీణ ప్రాంతాలైన నియోజకవర్గ, మండల కేంద్రాల్లో 70 క్యాంటీన్లు ఒకేసారి ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వివిధ దశల్లో ఉన్న వీటి నిర్మాణాలు జనవరి 10లోగా పూర్తి చేయనున్నారు. జనవరి 13-15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. రోజూ వీటిలో మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. పూటకు రూ.5కే ఆహారం సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం 70 మంజూరు చేసింది

**7.20 కోట్ల మందికి:** నగరాలు, పట్టణాల్లో ప్రారంభించిన 205 క్యాంటీన్లలో (మిగతా 3లో)

## బంగ్లాదేశ్‌పై భారత్‌లో ఆగ్రహం

- దిల్లీలోని హైకమిషన్ ఎదుట వీహెచ్‌పీ ధర్నా
- బారికేడ్లను ధ్వంసం చేసిన బజరంగ్‌దళ్
- కోల్‌కతాలోనూ నిరసనలు
- అభ్యంతరం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్
- మైనారిటీలపై దాడులను ఖండించిన ఐరాస
- అమెరికా చట్టసభ సభ్యుల ఆందోళన

దిల్లీ, కోల్‌కతా, ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులపట్ల భారత్‌లో ఆగ్రహం వ్యక్తమైంది. దిల్లీలోని ఆ దేశ హైకమిషన్ కార్యాలయంవద్ద వీహెచ్‌పీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను బజరంగ్‌దళ్ కార్యకర్తలు ధ్వంసం చేశారు. అటు కోల్‌కతాలోనూ ఆందోళనలు జరిగాయి. భారత్‌లో ఆందోళనలపట్ల బంగ్లాదేశ్ నిరసన వ్యక్తం చేసింది. మరోవైపు బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులను ఐక్యరాజ్య సమితి ఖండించింది. అమెరికా చట్టసభ సభ్యులూ ఆందోళన వ్యక్తం చేశారు. అల్లరిమూకల దాడుల కారణంగా బంగ్లాదేశ్‌లో బతకడమే (మిగతా 3లో)



కోల్‌కతాలో బారికేడ్లు దాటుకుంటూ బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వైపు చొచ్చుకెళ్తున్న బెంగాల్ హిందూ జాగరణ్ సభ్యులు

## సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లో ఏసీబీ సోదాలు

- ఆయా కార్యాలయాల ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలోనూ..
- రాష్ట్రవ్యాప్తంగా 14 చోట్ల కొనసాగిన దాడులు
- భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ తరఫున పనిచేసే ప్రైవేటు వ్యక్తి నివాసంలో రూ.18 లక్షల పట్టివేత
- జగదాంబ సెంటర్ కార్యాలయ ఉద్యోగులు ఇద్దరికి రూ.కోటి చొప్పున అక్రమాస్తులు



ఆలేటి కనకరాజు ఇంట్లో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు


ఈనాడు, అమరావతి: అక్రమ వసూళ్లకు కేంద్రాలుగా మారిన రాష్ట్రంలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగులు, వారి తరఫున లంచాలు వసూలుచేసే ప్రైవేటు వ్యక్తులపై ఏసీబీ కొరడా ఝుళిపించింది. వారి నివాసాల్లో సోదాలు చేసి, భారీ ఎత్తున ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించింది. ఆస్తిపత్రాలతో పాటు నగదు, బంగారు ఆభరణాలు, మోటారు వాహనాలను స్వాధీనం చేసుకుంది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ ఆదేశాల మేరకు విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం సహా మొత్తం 14 ప్రాంతాల్లో ఈ సోదాలు చేపట్టింది. గత నెల 5, 6 తేదీల్లో రాష్ట్రంలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఏసీబీ అధికారులు పలుచోట్ల భారీ మొత్తాల్లో లెక్కల్లో చూపని నగదు పట్టుకున్నారు. అక్రమ వసూళ్ల కోసం ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నట్లు గుర్తించారు. ఆ తనిఖీల్లో వెలుగుచూసిన అంశాల ఆధారంగా నాలుగు కేసులు నమోదుచేసి.. అధికారులు, ప్రైవేటు వ్యక్తుల నివాసాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఇవి ఇంకా కొనసాగుతున్నాయి. ఇప్పటికి గుర్తించినవి ఇవి.

**భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (విజయనగరం జిల్లా):** జాయింట్ సబ్‌రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బంది (మిగతా 3లో)

అదనపు సొలిసిటర్ జనరల్‌గా

## కనకమేడల రవీంద్రకుమార్

- కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు
- న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం
- తెదేపా నుంచి రాజ్యసభ సభ్యుడిగానూ బాధ్యతలు



ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా తెదేపా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ నియమితులయ్యారు. కేంద్ర నియామక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదంతో ఈ నియామకం చేపట్టినట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ ఈ పదవిలో కొనసాగుతారు. కనకమేడల నాగార్జున యూనివర్సిటీలో బీఎల్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ, అన్నామలై యూనివర్సిటీలో ఎంఎల్ చేశారు. 1983లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో నమోదై న్యాయవాద వృత్తి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం, ఏపీఎస్‌ఆర్టీసీ, ఏపీ విద్యుత్తు బోర్డు, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కంల స్టాండింగ్ (మిగతా 3లో)

## ఇదీ సంగతి!




పైలట్ దాడి చేశాడని ఆసుపత్రిలో చేరితే, అక్కడ డాక్టర్ కొట్టాడు డియర్!

## ఊపిరికి కష్టం.. గుండెకు నష్టం!

చలిలో నడకతో కొందరికి సమస్యలు

ఈనాడు - విశాఖపట్నం

చలి గాలిలో నడక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. మరి తెల్లవారక ముందే నడక అలవాటున్నవారు... పొద్దెక్కినా తగ్గని చలిలో ఎలా నడవాలి?



**ఊపిరితిత్తులపై ఒత్తిడి..**

- దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారికి శీతాకాలం కష్టతరమైంది. తెల్లవారుజామున చల్లటి గాలి పీల్చడం వల్ల శ్వాస వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశముంది..
- ఆస్తమా ఉన్న వారికి ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది. శ్లేష్మం పెరుగుతుంది.
- జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారికి కూడా ఈ గాలి అంత మంచిది కాదు.
- తక్కువ ఉష్ణోగ్రతలు వాయునాళాలను కుంచించుకుపోయేలా చేస్తాయి.
- ఈ గాలి వల్ల శ్వాసనాళాల వాపు, ఇన్‌ఫెక్షన్లు పెరిగే అవకాశముంది.
- బ్రోంకో హైపర్ రియాక్టివిటీ ఉన్న వారికి బ్రోంకోస్పాస్మ్ వచ్చే ప్రమాదముంది.
- ఈ గాలిలో ఉండే కాలుష్య కారకాలూ శ్వాసకోశాలకు కీడు చేస్తాయి.
- క్రమం తప్పకుండా చలిగాలిలో బయటకు వెళ్తే చికాకు, మంట, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. (మిగతా 3లో)

**నిర్లక్ష్యం వద్దు...**

- చలిగాలులు 50 ఏళ్లు దాటిన వారి గుండెపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి అనేక సమస్యలకు కారణమవుతాయి.
- ఎండ వచ్చాక బయటకు వెళ్లడం మేలు. నడకకు ముందు ఇంట్లో కొన్ని శ్వాస వ్యాయామాలు చేయాలి.
- వాకింగ్ చేస్తున్నప్పుడు ఛాతీలో అసౌకర్యం, ఎక్కువ చెమట పట్టడం, విశ్రాంతి సమయంలోనూ శ్వాస ఇబ్బందులు, మత్తు, అలసట లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- చలి ప్రభావం పడకుండా మందమైన జర్కిన్లవంటివి ధరించాలి.



అజయ్‌దేవ్‌ను రోడ్డుపై నడిపిస్తూ తీసుకెళుతున్న పోలీసులు

గర్భిణిపై దాడి కేసులో

## వైకాపా కార్యకర్త అరెస్టు

**రోడ్డుపై నడిపించి తీసుకెళ్లిన పోలీసులు**

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ముత్యాలవాండ్లపల్లిలో ఆదివారం ఓ గర్భిణిపై దాడిచేసిన వైకాపా కార్యకర్త అజయ్‌దేవ్‌ను పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. కదిరి ప్రధానరోడ్లపై అతడిని నడిపించుకుంటూ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి విలేకర్లకు వివరాలు తెలిపారు. తనకల్లు మండలం ముత్యాలవాండ్లపల్లిలో 21న రాత్రి మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా గర్భిణి సంధ్యారాణి ఇంటివద్ద వైకాపా కార్యకర్తలు కేకలు వేస్తూ బాణసంచా కాల్చారు. (మిగతా 3లో)



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్. చిత్రంలో తితిదే బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న వారికి తితిదే అధికారులు స్వాగతం పలికి, శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు జస్టిస్ అరవింద్ కుమార్ శ్రీవారి ఆలయంలో నిర్వహించిన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంలో పాల్గొని ఆలయ శుద్ధి చేశారు. వీరితోపాటు తితిదే బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర తదితరులు

# తెలుగు రాష్ట్రాల శాస్త్రవేత్తలకు రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాల ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి విజ్ఞాన్‌శ్రీ పురస్కారం అందుకుంటున్న ఎస్.వెంకటమోహన్, కుమారస్వామి తంగరాజ్, విజ్ఞాన్ యువ పురస్కారం అందుకుంటున్న జగదీష్ గుప్త కపుగంటి, సత్యేంద్రకుమార్ మంగ్రౌతియా (ఎడమ నుంచి కుడివైపునకు)

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు శాస్త్రవేత్తలు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్-2025 అందుకున్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు ఈ పురస్కారాలను స్వీకరించారు. ఇందులో నాగ్‌పుర్‌లోని సీఎస్ఐఆర్ నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ఎస్.వెంకటమోహన్, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీలో సీఎస్ఐఆర్ భట్నాగర్ ఫెలోగా సేవలందిస్తున్న కుమారస్వామి తంగరాజ్ విజ్ఞాన్‌శ్రీ పురస్కారాలు అందుకున్నారు. దిల్లీలోని టీఈఆర్ఐ- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్‌లో స్టాఫ్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్న జగదీష్ గుప్త కపుగంటి, హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న సత్యేంద్రకుమార్ మంగ్రౌతియాలు విజ్ఞాన్ యువ పురస్కారాలు స్వీకరించారు. వీరిలో ఎస్.వెంకటమోహన్ తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్, ఎంటెక్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, పీహెచ్‌డీ చేశారు. విజయనగరం జిల్లా ధర్మవరానికి చెందిన జగదీష్ గుప్త కపుగంటి జర్మనీ ఉర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. మొత్తం 24 మందికి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాస్త్ర శాఖల మంత్రి జితేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణ

నోటిఫికేషన్ జారీ చేసిన రైల్వే శాఖ

ఈనాడు, దిల్లీ: అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు స్టేషన్ల మధ్య నిర్మిస్తున్న బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లాలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని 8 గ్రామాల్లో 495 సర్వే నంబర్ల పరిధిలోని భూములను సేకరించాలని నిర్ణయించింది. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ, ఎసైన్డ్ భూములున్నాయి. పరిటాల గ్రామ పరిధిలో ఒక చోట 2.942 ఎకరాల గెస్ట్‌హౌస్ సైట్‌కు సంబంధించి హైకోర్టులో 3 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది. ఈ భూముల సేకరణకు 2024 డిసెంబర్ 21న ప్రకటన ఇచ్చిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సంబంధిత అధీకృత అధికారి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, వాటన్నింటినీ పరిశీలించిన తర్వాత ఈ రైల్వే లైన్ నిర్మాణం కోసం ఈ భూములను సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందులో పేర్కొన్న భూములన్నీ ఇకమీదట కేంద్ర ప్రభుత్వానికి చెందుతాయని స్పష్టంచేసింది.

| భూసేకరణ వివరాలు | | |
|---|---|---|
| గ్రామం | ఎంతమంది నుంచి | ఎన్ని ఎకరాలు |
| నరసింహారావు పాలెం | 39 | 17.445 |
| అల్లూరు | 66 | 43.498 |
| చెన్నారావుపాలెం | 52 | 26.453 |
| గూడెం మాధవరం | 15 | 7.712 |
| పెద్దాపురం | 77 | 50.907 |
| జుజ్జూరు | 45 | 29.28 |
| పరిటాల | 143 | 72.826 |
| గొట్టుముక్కల | 58 | 51.260 |
| మొత్తం | 495 | 299.381 |



గాయని డాక్టర్ శోభారాజ్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న చంద్రబాబు ◆ ముఖ్యమంత్రి నుంచి బంగారు పతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న మేఘన (సబ్ జూనియర్ విభాగం), లక్ష్మీహరిచందన (సీనియర్ విభాగం), శ్రీమహాలక్ష్మి(జూనియర్ విభాగం)

## 'తందనానా' విజేతలకు బంగారు పతకాలు

- బహూకరించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అన్నమయ్య అంతర్జాతీయ సంకీర్తన పోటీలు 'తందనానా-2025' విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు పతకాలు బహూకరించారు. వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం సీఎం చేతుల మీదుగా సబ్ జూనియర్ విభాగంలో భక్తిప్రియ మేఘన, జూనియర్ విభాగంలో చిర్రావూరి శ్రీమహాలక్ష్మి, సీనియర్ విభాగంలో సుబ్రహ్మణ్య లక్ష్మీ హరిచందన పతకాలు అందుకున్నారు. ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ నేతృత్వంలోని అన్నమాచార్య భావనా వాహిని, ఈటీవీ లైఫ్ ఆధ్యాత్మిక ఛానల్, తానా, చినజీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో సుమారు 750 మంది ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. గ్రాండ్ ఫినాలేకు ఎంపికైన 14 మందికి ఈనెల 20న హైదరాబాద్‌లోని హైటెక్స్ దగ్గర అన్నమయ్యపురంలో చినజీయర్ స్వామి సమక్షంలో తుది పోటీ నిర్వహించారు. ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల, ప్రముఖ గాయనీగాయకులు సునీత, గోదావరి గాయత్రి, వందేమాతరం శ్రీనివాస్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ బంగారు పతకాలు స్పాన్సర్ చేసింది. కార్యక్రమంలో అన్నమాచార్య భావనా వాహిని తరఫున శోభారాజ్, పి.పి.రాజ్, నందకుమార్, జ్యోత్స్న, రమణ కుమార్, ఈటీవీ లైఫ్ ప్రొడ్యూసర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య తదితరులు

## పుస్తక ప్రదర్శనకు ప్రపంచ స్థాయి గుర్తింపు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ పుస్తక ప్రదర్శనకు ప్రపంచ స్థాయిలోనే గుర్తింపు లభించిందని ఎమెస్కో అధినేత డి.విజయ్‌కుమార్ చెప్పారు. జనవరి 2 నుంచి 12 వరకు విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలో విజయవాడ పుస్తక మహోత్సవం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పుస్తక ప్రదర్శనకు సంబంధించిన గోడ ప్రతులను మంగళవారం గవర్నర్‌పేటలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 200 వరకు స్టాళ్లు పెట్టగా.. ఈసారి 300 వరకు స్టాళ్లు ఉంటాయని వెల్లడించారు. పుస్తక మహోత్సవం సొసైటీ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. పాఠశాల ప్రదర్శన రంగం, కవిత, కథ, నవల, అనువాద సాహిత్యం, విమర్శ, బాల సాహిత్యం సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనవరి 3 నుంచి విద్యార్థులకు పద్యాలు, చిత్రలేఖనం, మ్యాజిక్, వాక్ ఫర్ బుక్స్ (క్విజ్-హెరిటేజ్), సైన్స్ క్విజ్(క్విజ్), ఇచ్చిన అంశంపై కథ చెప్పడం, పుస్తక సమీక్షపై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

## నేడు నింగిలోకి ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా ప్రయోగించేందుకు మంగళవారం కౌంట్‌డౌన్ మొదలైంది. బుధవారం ఉదయం 8 గంటల 54 నిమిషాలకు ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.



# సభాహక్కుల సంఘం ప్రశ్నలకు నీళ్లు నమిలిన డీఐజీ అమ్మిరెడ్డి

- మంత్రి లోకేశ్ చేయని వ్యాఖ్యలను చేసినట్లుగా మీరెలా పోస్ట్ చేస్తారు?
- నాటి ఎమ్మెల్యే మెప్పు కోసం అరెస్టు చేస్తారా?
- ప్రశ్నించిన సంఘం ఛైర్మన్ బీటీ నాయుడు



మీడియాతో మాట్లాడుతున్న బీటీ నాయుడు

ఈనాడు, అమరావతి: అధికార పార్టీ ఎమ్మెల్యే మెహర్బానీ (మెప్పు) కోసం ఒక సామాన్య వ్యక్తిని అరెస్టు చేస్తారా? ఒక ఎమ్మెల్సీ చేయని వ్యాఖ్యలు చేసినట్లుగా మీరెలా ప్రస్తావిస్తారంటూ శాసనమండలి సభాహక్కుల సంఘం (ప్రివిలేజెస్ కమిటీ) సంధించిన ప్రశ్నలకు డీజీపీ కార్యాలయ పరిపాలనా విభాగం డీఐజీ అమ్మిరెడ్డి అదిరిపోయారు. 2020లో పొన్నూరు నియోజకవర్గ పరిధిలో ఒక ప్రభుత్వ భవన ప్రహరీ ప్రారంభ కార్యక్రమానికి నాటి వైకాపా ఎమ్మెల్యే కిలారి రోశయ్య వస్తారని అక్కడి వైకాపా శ్రేణులు ఫ్లెక్సీలు కట్టారు. ఇదేమైనా చైనా వాలా దీన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రావడానికి అంటూ మణిరత్నం అనే తెదేపా కార్యకర్త ఒకరు ఆ ఫ్లెక్సీలు, ప్రహరీని చూపిస్తూ చేసిన వీడియో అప్పట్లో వైరల్ అయింది. దీంతో తలవంపుగా భావించిన ఎమ్మెల్యే ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ నాటి ఎస్పీ అమ్మిరెడ్డికి ఫిర్యాదు చేశారు. మణిరత్నాన్ని పోలీసులు అరెస్టు చేసి, తర్వాత వదిలిపెట్టారు. ఆ వ్యవహారంపై నాడు ఎమ్మెల్సీగా ఉన్న ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. 'ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా' అని పోస్ట్ చేశారు. ఆ పోస్ట్‌పై అప్పుడు ఎస్పీగా ఉన్న అమ్మిరెడ్డి రీట్వీట్ చేస్తూ 'రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా..ఎస్సీలను రెచ్చగొట్టేలా వ్యవహరించకండి. అలా చేస్తే న్యాయపరంగా చర్యలకు బాధ్యుడవుతారు' అని హెచ్చరించారు. దానిపై లోకేశ్ చేసిన ఫిర్యాదుపై కమిటీ సమీక్షించింది. అందులో భాగంగా అసెంబ్లీ కమిటీహాలులో మంగళవారం సభా హక్కుల కమిటీ ఎదుట వివరణ ఇచ్చేందుకు అమ్మిరెడ్డి వచ్చారు. సభా హక్కుల సంఘం ఛైర్మన్ బీటీ నాయుడు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక అమ్మిరెడ్డి నీళ్లు నమిలినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా..

**ఛైర్మన్:** నాటి ఎమ్మెల్యే తనకు పరువునష్టం జరిగిందని అందువల్ల మణిరత్నంపై చర్యలు తీసుకోవాలని కోరినందుకే.. మణిరత్నాన్ని అరెస్టు చేశారా?

**అమ్మిరెడ్డి:** 'వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేస్తూ వీడియో చేశారని, తన పరువుకు నష్టం జరిగిందని అప్పుడు ఎమ్మెల్యే భావించారు.

**ఛైర్మన్ :** పరువునష్టం కలిగించడమంటే అది కాగ్నిజబుల్ అఫెన్స్ కిందకు వస్తుంది కదా? కోర్టు అనుమతి లేకుండా పోలీసులు నేరుగా అరెస్ట్ చేస్తారా?

**అమ్మిరెడ్డి:** కోర్టు అనుమతి తీసుకోకుండా చేయలేం. అందువల్లే ఆ వ్యక్తిని అరెస్టు చేయలేదు, స్టేషన్‌కు తీసుకువెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని వదిలిపెట్టాం.

**ఛైర్మన్ :** మణిరత్నం ఫలానా కులం లేదా మతానికి చెందిన వ్యక్తి అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారా?

**అమ్మిరెడ్డి:** లేదు

**ఛైర్మన్:** మరి అలాంటప్పుడు ఆ వ్యక్తి ఫలానా కులానికి చెందిన వ్యక్తి, ఆ కులాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరించకండి అని లోకేశ్‌ను మీరెలా హెచ్చరిస్తారు? ఒక వ్యక్తి కులాన్ని మీరెలా సామాజిక మాధ్యమం ద్వారా బహిర్గతం చేస్తారు?

**అమ్మిరెడ్డి:** ఆ వ్యక్తి ఒక వీడియోలో తాను ఫలానా సామాజికవర్గానికి చెందిన వ్యక్తినని చెప్పారు..

**ఛైర్మన్ :** ఆ వీడియో ఉందా? మీ దగ్గర ఇతర ఆధారాలేమైనా ఉన్నాయా

**అమ్మిరెడ్డి:** స్పందించలేదు

**ఛైర్మన్:** మీకు ఇచ్చిన నోటీసుపై మీ శాఖ న్యాయసలహాదారు అభిప్రాయాన్ని పంపారు కదా? అందులో ఏముందో చదివారా?

**అమ్మిరెడ్డి:** పోలీసు శాఖ తరఫున డీజీపీ ఆ అభిప్రాయాన్ని ఇప్పించి ఉండొచ్చు.

(దీంతో ఆ అభిప్రాయాన్ని ఇచ్చిన అప్పటి డీజీపీ కార్యాలయ ప్రధాన న్యాయ సలహాదారు రమణను కూడా కమిటీ పిలిపించి విచారించింది)

'మీరిచ్చిన అభిప్రాయంలో ఈ కేసులో శాసనమండలికి, ప్రివిలేజెస్ కమిటీకి అధికారాల్లేవని రాశారు. మరి ఇప్పుడెందుకు విచారణకు వచ్చారు? కేసు వివరాలను తెలుసుకునే అభిప్రాయం చెప్పారా' అని అప్పటి ప్రధాన న్యాయ సలహాదారును ఛైర్మన్ రమణను ప్రశ్నించగా 'అప్పట్లో నా దగ్గరకు వచ్చిన ఫైల్‌ను చూసి అభిప్రాయం ఇచ్చి ఉంటా, ఆ వివరాలు నాకు గుర్తు లేవు' అని ఆయన సమాధానం ఇచ్చారు.

'మీకు 15 రోజుల కిందటే నోటీసు ఇచ్చాం, వివరాలతో రావాలి కదా అని ఛైర్మన్ ప్రశ్నించగా ' నేను ఇప్పుడు ఆ పోస్ట్‌లో లేను.. ఇప్పుడు నాకు ఆ ఫైళ్ల యాక్సెస్ లేదు, నాకు ఫైళ్లు ఇవ్వరు' అని రమణ సమాధానం ఇచ్చారు. దీనికి ఛైర్మన్ ప్రతి స్పందిస్తూ 'రాతపూర్వకంగా అడిగితే ఇస్తారు కదా? ఆ ప్రయత్నం ఎందుకు చేయరు? శాసన వ్యవస్థకు అధికారాల్లేవంటూ కించపరిచే మీలాంటి సలహాదారులు ప్రభుత్వానికి అవసరమా అని మా కమిటీ ప్రభుత్వానికి ఎందుకు సిఫార్సు చేయకూడదు' అని అనగానే. .రమణ ఏదో చెప్పబోయి ఆగిపోయినట్లు తెలిసింది.

### క్షమాపణ కోరిన మున్సిపల్ కమిషనర్లు

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ఫిర్యాదుపై భీమవరం మున్సిపల్ కమిషనర్‌ను కమిటీ పిలిచి విచారించింది. శానిటేషన్, ఇతర మున్సిపల్ పనుల గురించి చెబితే స్పందించకపోగా, మీరు నన్ను బదిలీ చేయిస్తే చేయించండి అంటూ దురుసుగా సమాధానం ఇచ్చినందుకు మున్సిపల్ కమిషనర్‌పై ఛైర్మన్ ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ మంగళవారం ప్రివిలేజెస్ కమిటీ ముందు వివరణ ఇస్తూ.. 'పొరపాటున అన్నాను, అందుకు క్షమాపణ చెబుతున్నా, ఇంకోసారి ఇలా జరక్కుండా చూసుకుంటా' అని చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఫిర్యాదుపై వివరణ ఇచ్చుకునేందుకు వచ్చిన ప్రొద్దుటూరు మున్సిపల్ పూర్వ కమిషనర్, ప్రస్తుత కర్నూలు డీడబ్ల్యూఎంఏ పీడీ కమిటీకి వివరణ ఇచ్చారు. ఆయన కూడా క్షమాపణ కోరినప్పటికీ.. ఆయన ఇచ్చిన వివరణతో కమిటీ సంతృప్తి చెందలేదని తెలిసింది. జనవరి 5న మరోసారి కమిటీ సమావేశం కానుంది. అప్పుడు కూడా డీఐజీ అమ్మిరెడ్డిని పిలిపించనున్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు రమేష్ యాదవ్, తలశిల రఘురాం, పి.చంద్రశేఖర రెడ్డి, పండుల రవీంద్రబాబు, కేఆర్‌జే భరత్ పాల్గొన్నారు.

### 28 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి

శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ వద్ద 28 కేసులు పెండింగులో ఉన్నాయని కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు తెలిపారు. కమిటీ సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభ్యుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులు ప్రవర్తించాలన్నారు.

## వెండింగ్ యంత్రాల ద్వారా వార్తా పత్రికలు

చెన్నై రైల్వేస్టేషన్లలో ప్రారంభానికి సన్నాహాలు



చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో వెండింగ్ యంత్రం ద్వారా పుస్తకం కొంటున్న పాఠకుడు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: చెన్నైలోని రైల్వే స్టేషన్లలో వార్తా పత్రికల కోసం ప్రత్యేకంగా వెండింగ్ యంత్రాలను ప్రవేశపెట్టే యోచనలో దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ ఉంది. అన్ని భాషల ప్రధాన వార్తా పత్రికలు యంత్రంలో అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు. క్రోంపేట, పెరంబూరు, చెంగల్పట్టు, కాట్పాడి, జోలార్‌పేట్టై వంటి 12 స్టేషన్లలో కూడా వీటిని ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబరులో ప్రారంభించిన వెండింగ్ యంత్రాల ద్వారా చెన్నై సెంట్రల్ స్టేషన్‌లో 800, తాంబరం స్టేషన్‌లో 750 పుస్తకాల విక్రయాలు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. వెండింగ్ యంత్రాల ద్వారా పాఠకులు కావాల్సిన పత్రికను ఎంచుకునే వీలుంది. డిజిటల్ మాధ్యమంలో వార్తా పత్రికలు అందుబాటులో ఉన్నా చేతిలోకి తీసుకుని చదవడం ద్వారా భిన్నమైన అనుభూతి పొందగలమని చెన్నైకు చెందిన రైల్వే ప్రయాణికుడు అరుణ్ పాండియన్ తెలిపారు.



## పుషప్స్‌తో ఆకర్షణీయ ఆకృతి

రోజూ క్రమం తప్పక చేసే పుషప్స్‌తో శరీరం బలం పుంజుకోవడంతో పాటు శరీరాకృతి ఆకర్షణీయంగా మారుతుంది. ఉదర, నడుము కండరాలు ఉత్తేజితమై వెన్నెముక స్థిరత్వం పెరుగుతుంది. ఛాతీ, భుజాలు శక్తిమంతం అవుతాయి. మహిళలు, పురుషులకు పుషప్స్ ప్రయోజనకరమైనవి.
- క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

## గ్రహం అనుగ్రహం

24-12-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం
చవితి: ఉ. 10-50 తదుపరి పంచమి
ధనిష్ఠ: తె. 6-14 తదుపరి శతభిష
వర్జ్యం: ఉ. 9-47 నుంచి 11-26 వరకు
అమృత ఘడియలు: రా. 7-36 నుంచి 9-14 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-37 నుంచి 12-21 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.31; సూర్యాస్తమయం: సా.5.28

## చలి - పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 7.8 | 28.3 |
| హైదరాబాద్ | 12.7 | 29.0 |
| విజయనగరం | 15.0 | 26.0 |
| కడప | 15.4 | 28.2 |
| అనంతపురం | 16.4 | 30.1 |
| శ్రీకాకుళం | 17.0 | 28.0 |
| విశాఖపట్నం | 17.0 | 28.2 |
| కర్నూలు | 17.0 | 30.6 |
| రాజమహేంద్రవరం | 18.0 | 34.0 |
| తిరుపతి | 18.6 | 30.0 |
| విజయవాడ | 19.0 | 30.0 |
| గుంటూరు | 19.0 | 30.0 |
| నరసాపురం | 19.4 | 30.6 |
| ఒంగోలు | 21.0 | 30.7 |
| నెల్లూరు | 21.1 | 30.1 |
| తాడేపల్లిగూడెం | 24.0 | 29.0 |

## మన ప్రభుత్వం వస్తుంది.. ధైర్యంగా ఉండండి

కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: 'మన ప్రభుత్వం వస్తుంది. . ధైర్యంగా ఉండండి' అంటూ మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైకాపా కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చేరుకున్నారు. దాదాపు మూడు గంటలసేపు తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వం నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నామని, పోలీసులు కూడా తమను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. 'మన ప్రభుత్వం వస్తుంది.. ఓపికతో, ధైర్యంగా ఉండండి' అని జగన్ వారితో అన్నారు.

## నవ వధూవరులకు శ్రీవారి అక్షతలు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: వివాహ శుభలేఖ పంపిన నవ వధూవరులకు తితిదే శ్రీవారి దీవెనలతో అక్షతలు పంపిస్తోంది. ఏటా లక్షకు పైగా వధూవరులకు అక్షతలతో పాటు కుంకుమ, కంకణం, శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతీ అమ్మవారి ఫొటోలతో కూడిన ఆశీర్వచన పత్రిక, కల్యాణ సంస్కృతి పుస్తకాన్ని కానుకగా అందిస్తున్నట్లు గుర్తుచేసింది. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తితిదే కోరింది. నూతన వధూవరులు తమ వివాహ శుభలేఖను పూర్తి చిరునామాతో 'కార్యనిర్వహణాధికారి, తితిదే పరిపాలన భవనం, కె.టి.రోడ్డు, తిరుపతి, 517501' కు పంపించాలని సూచించింది.

# అట్టహాసంగా 'పెసా' మహోత్సవ్

- ఆకట్టుకున్న ఖేలో ఇండియా కబడ్డీ, ఆర్చరీ పోటీలు



పెసా మహోత్సవ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ, కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి ముక్తా శేఖర్ తదితరులు ◆ ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న గిరిజన క్రీడాకారులు ◆ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏపీ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ

ఈనాడు-విశాఖపట్నం, గురుద్వారా-న్యూస్‌టుడే: విశాఖ వేదికగా 'పెసా' మహోత్సవ్ మంగళవారం అట్టహాసంగా మొదలైంది. బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం నుంచి తెన్నేటి పార్కు వరకు 10కే రన్‌ను అర్జున అవార్డు గ్రహీత, ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోర్టు స్టేడియంలో రెండు రోజులపాటు జరగనున్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. పెసా మహోత్సవ్ ప్రాంగణంలో గిరిజనులు ఏర్పాటు చేసిన 68 స్టాల్స్‌ను అతిథులు ప్రారంభించారు.

పది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా క్రీడాకారులు 'పెసా' మహోత్సవ్‌కు హాజరయ్యారు. ఖేలో ఇండియా టీం సభ్యుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగాయి. 10 పురుష, 8 మహిళా జట్లు పది రాష్ట్రాల నుంచి పాల్గొన్నాయి. ఉదయం నుంచి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్ విజేతగా నిలవగా, రన్నరప్‌గా ఒడిశా, మూడో స్థానంలో తెలంగాణ, గుజరాత్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో విజేతగా ఝార్ఖండ్, రన్నరప్‌గా మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. 8 రాష్ట్రాలకు చెందిన 20 మంది క్రీడాకారులు ఆర్చరీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో ఝార్ఖండ్‌కు చెందిన కృష్ణా పింగువా బంగారు పతకం సాధించగా, రాజస్థాన్‌కు చెందిన బద్రీలాల్ మీనా రజత పతకం సాధించారు. మహిళల వ్యక్తిగత విభాగంలో రాజస్థాన్‌కు చెందిన ఖుషీ నినామా బంగారు పతకం, ఝార్ఖండ్‌కు చెందిన అనురాధ కుమారి రజతం, ఒడిశాకు చెందిన అంబికా పాండే కాంస్య పతకం సాధించారు.

## అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల రవీంద్రకుమార్

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సెల్‌గా పనిచేశారు. 2000-04 మధ్య కృష్ణా జలవివాదాలపై సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వ న్యాయవాదిగా ప్రాతినిధ్యం వహించారు. 2006, 2012ల్లో బార్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. 2012-16 మధ్యకాలంలో నల్సార్ యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా సేవలందించారు. 2012లో ఏపీ హైకోర్టు నుంచి సీనియర్ న్యాయవాది హోదా పొందారు. తెలుగు రాష్ట్రాల హైకోర్టులతోపాటు, సుప్రీంకోర్టులో సివిల్, క్రిమినల్, రాజ్యాంగానికి సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. 2018 నుంచి 2024 వరకు తెదేపా తరఫున రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. పలు పార్లమెంటు స్టాండింగ్ కమిటీల్లో సభ్యుడిగా, రాజ్యసభ ప్యానెల్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు.

## సంక్రాంతికి పల్లె సీమల్లో అన్న క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీటిలో అత్యధికంగా 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేశారు. ఉదయం అల్పాహారం 2.62 కోట్లు, రాత్రి అల్పాహారం 1.42 కోట్ల మందికి సరఫరా చేశారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అత్యధిక సంఖ్యలో పేదలు వస్తున్నారు.

## ఫిబ్రవరి రెండోవారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరి రెండోవారంలో ప్రారంభించి మార్చి రెండోవారం వరకు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అసెంబ్లీ క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు.. స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఆ సందర్భంగా శాసనసభా సమావేశాలపై సీఎం వద్ద స్పీకర్ ప్రస్తావించినట్లు తెలిసింది. శీతాకాల సమావేశాలను జనవరిలో నిర్వహించి, మార్చిలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనేదానిపైనా వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. సమయం తక్కువగా ఉన్నందున నేరుగా బడ్జెట్ సమావేశాలనే ఫిబ్రవరిలో ప్రారంభించి, మార్చి రెండోవారం వరకు నిర్వహిస్తే ఎక్కువ పనిదినాలు జరిగే అవకాశం ఉంటుందన్న భావన వ్యక్తమైనట్లు తెలిసింది.

# బంగ్లాదేశ్‌పై భారత్‌లో ఆగ్రహం



దిల్లీలోని బంగ్లా హైకమిషన్ కార్యాలయం సమీపంలో ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సభ్యులను నిలువరిస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

కష్టమవుతోందని జర్నలిస్టులు వ్యాఖ్యానించారు.

■ బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తిపై అల్లరిమూకల దాడి చేసి హత్య చేసినందుకు నిరసనగా మంగళవారం కాషాయ జెండాలతో వందల మంది విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ కార్యకర్తలు దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వారు బారికేడ్లను ధ్వంసం చేయడంతో పోలీసులు, వారికి మధ్య తోపులాట జరిగింది. హిందూ సంస్థల ఆందోళనలకు ముందుగానే సమాచారం అందడంతో పోలీసులు ఏడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. 1,500 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. దీనివల్ల బంగ్లాదేశ్ హైకమిషన్‌కు 800 మీటర్ల దూరంలోనే ఆందోళనకారులను నిలువరించగలిగారు. ఆందోళనలకు దిగిన 40 మందిని ఆ తర్వాత పోలీసులు అరెస్టు చేశారు.

■ పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం ఎదుట హిందూ సంస్థల కార్యకర్తలు మంగళవారం నిరసనకు దిగారు.



ముంబయిలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వారు ఆ కార్యాలయంవైపు దూసుకురాగా పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను ధ్వంసం చేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో లాఠీ ఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. 12 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. తోపులాటలో పలువురు కార్యకర్తలకు, పోలీసులకు గాయాలయ్యాయి. బోంగాలో హిందూ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో 'హిందూ హుంకార్ పాద యాత్ర' పేరుతో ఈ నిరసనలు జరిగాయి.

■ ముంబయిలోనూ ఆందోళనలు జరిగాయి.

■ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను జమ్మూ, కశ్మీర్ హైకోర్టు బార్ అసోసియేషన్ నిరసించింది. న్యాయవాదులు ఆందోళనకు దిగారు. కశ్మీర్‌లో అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను వెనక్కి పంపాలని డిమాండు చేశారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడుల విషయంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని డిమాండు చేశారు.

■ బంగ్లాదేశ్‌లో హిందూ మహిళను వేధించిన ఘటనపై జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతో కలవరపెట్టిందని పేర్కొన్నారు.

■ బంగ్లాదేశ్‌లో హింస, హిందూ కార్మికుడిపై దాడిని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఖండించారు. మైనారిటీలపై దాడులను ప్రధానంగా గుటెరస్ ఖండించారని ఆయన కార్యదర్శి వెల్లడించారు.

■ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి ఖండించారు. హిందువులను కాపాడేందుకు ఆ దేశం అత్యవసర చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యురాలు జెన్నిఫర్ రాజ్‌కుమార్ ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. యువకుణ్ని కొట్టి తగులబెట్టడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు.

### వీసా కార్యకలాపాల నిలిపివేత

భద్రత ముప్పు నేపథ్యంలో దిల్లీ, సిలిగుడిలోని వీసా కార్యకలాపాలను బంగ్లాదేశ్ నిలిపేసింది. సిలిగుడిలో బంగ్లాదేశ్ అధికారిక మిషన్ లేదు. అక్కడ ఒక ప్రైవేటు ఏజెన్సీ (వీఎఫ్ఎస్) ద్వారా వీసా ప్రాసెసింగ్ జరుగుతుంటుంది. విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఆ వీఎఫ్ఎస్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. దీంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం సిలిగుడిలోని వీసా కార్యకలాపాలను నిలిపివేసింది' అని ఓ అధికారి తెలిపారు.

### బతకడమే కష్టంగా మారింది..

అల్లరిమూకల దాడులతో బంగ్లాదేశ్‌లో బతకడమే కష్టంగా మారిందని మీడియా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పత్రికల కార్యాలయాలకు దుండగులు నిప్పుపెట్టిన నేపథ్యంలో వారు స్పందించారు. 'భావ ప్రకటనా స్వేచ్ఛను పక్కనబెట్టండి. అసలు బతికే హక్కునే కోల్పోతున్నాం' అని డైలీ స్టార్ ఎడిటర్, పబ్లిషర్ మహ్‌ఫుజ్ ఆనం మంగళవారం మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. ఉనికి కోసం బంగ్లాదేశ్ మీడియా పోరాడాల్సి వస్తోందని తెలిపారు.

### బంగ్లాదేశ్ నిరసన

దిల్లీ, కోల్‌కతాల్లోని తమ కార్యాలయాల ఎదుట ఆందోళనలు జరగటం పట్ల బంగ్లాదేశ్ నిరసన వ్యక్తం చేసింది. ఢాకాలోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించి అభ్యంతరం తెలిపింది. వర్మను బంగ్లాదేశ్ విదేశాంగశాఖ కార్యదర్శి అసద్ ఆలం సియామ్ పిలిపించుకున్నారు. భారత డిప్యూటీ హైకమిషనర్ కూడా వెళ్లారు. సిలిగుడి వంటి చోట్ల బంగ్లాదేశ్ యులపై దాడుల అంశాన్ని అసద్ ప్రస్తావించారు.

### తోసిపుచ్చిన భారత్

భారత్‌లో తమ సిబ్బంది భద్రతపై బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేయడాన్ని భారత్ తోసిపుచ్చింది. దిల్లీలో సాధారణ నిరసన జరిగిందని, దౌత్య కార్యాలయానికి గానీ, సిబ్బందికిగానీ ముప్పు వాటిల్లలేదని తెలిపింది.

## రౌడీషీటర్, అనుచరులను రోడ్డుపై నడిపించిన పోలీసులు



పండు, అనుచరులను నడిపించుకుంటూ తీసుకెళుతున్న పోలీసులు

పెనమలూరు, న్యూస్‌టుడే: దందాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడుతున్న రౌడీషీటర్, అతడి అనుచరులకు కృష్ణాజిల్లా పెనమలూరు పోలీసులు వినూత్నరీతిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. మంగళవారం వీరిని బందరు రోడ్డులో కిలోమీటరు మేర నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఓ హత్యాయత్నం కేసులో అరెస్టయిన వీరిని.. ఎస్సైలు రమేష్, జనార్దన్, ఉషారాణి, 20మంది పోలీసులు వెంటబెట్టుకుని తీసుకెళ్లారు. కానూరు సనత్‌నగర్‌కు చెందిన కొండూరి మణికంఠ అలియాస్ కేటీఎం పండును గతేడాది పీడీ యాక్ట్ కింద అరెస్ట్ చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. గతంలో ఇతనిపై హత్య కేసు నమోదైంది. ఈ ఏడాది మార్చిలో గంజాయితో పట్టుబడగా పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లాడు. కొంతకాలం క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. అప్పటి నుంచి అనుచరులతో కలిసి దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తూ అధిక వడ్డీలకు అప్పులిచ్చి బెదిరించి వసూళ్లు మొదలుపెట్టాడు. ఇటీవల ఇతను పటమట అయ్యప్పనగర్‌కు చెందిన మాదిరెడ్డి శివకుమార్‌కు ఆటో అద్దెకు ఇచ్చాడు. అధిక అద్దె చెల్లించాలంటూ బెదిరించడంతో శివకుమార్ ఆటో తిరిగి ఇచ్చేశాడు. ఆటో అద్దె బకాయి రూ.5 వేలుండగా పండు బెదిరించి రూ.70వేలు వసూలు చేశాడు. ఇంకా ఇవ్వాలంటూ శివకుమార్‌ను పండు, అనుచరులు ఈ నెల 21న కానూరులో ఇనుపరాడ్లతో గాయపర్చడంతో పాటు చంపుతామని బెదిరించారు. చికిత్స పొందుతూ ఇతను పెనమలూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదుచేయగా పండు, అతడి అనుచరులు మనోహర్, కరీం, వినోద్, గిరీష్, దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం వీరిని పోరంకి నుంచి పెనమలూరు వరకు బందరు రోడ్డుపై నడిపించి అనంతరం విజయవాడలో న్యాయస్థానానికి తరలించారు. కోర్టు రిమాండ్ విధించింది.

## గర్భిణిపై దాడి కేసులో వైకాపా కార్యకర్త అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఆ శబ్దాలు భరించలేక ఆమె బయటకు వచ్చి కాస్త దూరంగా కాల్చాలని చెప్పారు. దీనిపై ఆగ్రహించిన వైకాపా కార్యకర్త అజయ్‌దేవ్ గర్భిణి అని కూడా చూడకుండా కడుపుపై తన్నాడు. బాధతో విలవిల్లాడిన ఆమెను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు మంగళవారం నిందితుడిని కదిరి-మదనపల్లె ప్రధాన రహదారిపై బీటీ క్రాస్ వద్ద అరెస్టుచేసి కదిరికి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్టాండు నుంచి జాతీయ రహదారి మీదుగా పోలీసుస్టేషన్ వరకు ఉత్త కాళ్లతో నడిపించారు. మహిళలపై దాడులు, గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించేందుకే ఇలా చేసినట్లు డీఎస్పీ చెప్పారు. దాడికి నిందితుడిని ప్రోత్సహించిన అంజనప్పనూ అరెస్టు చేస్తామని ఆయన వెల్లడించారు.

# రూ.3,342 కోట్లతో రహదారుల మరమ్మతులు

- పీపీపీ, హామ్ కింద రోడ్ల విస్తరణ
- సామాన్యులపై టోల్ భారం ఉండదు
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులు, రెన్యూవల్స్ చేయక పోవడంతో అన్ని మార్గాల్లోనూ అధ్వానంగా మారాయని, తాము ఆ పాపాలను కడిగేస్తూ, ప్రజలకు సౌకర్యవంతమైన రోడ్లు అందుబాటులోకి తెస్తున్నామని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఏడాదిన్నరలోనే రూ.3,342 కోట్లతో మరమ్మతులు, రెన్యూవల్స్ పనులు చేస్తున్నామని చెప్పారు. ఆయన మంగళవారం సచివాలయంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మార్చి నాటికి అన్ని రహదారుల్లో గుంతలు పూడ్చివేస్తామని, జూన్ నాటికి రెన్యూవల్స్ పూర్తిచేస్తామని తెలిపారు. 'పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు 12 రద్దీ రోడ్లను ఎంపిక చేశాం. వాటిలో వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కింద రాష్ట్రం, కేంద్రం చెరో 20 శాతం చొప్పున వెచ్చిస్తాయి. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హామ్) కింద 1,500 కి.మీ. మేర రోడ్లు విస్తరించే ప్రతిపాదన ఉంది. ఈ మార్గాల్లో టోల్ వసూలు చేసినా సామాన్యులపై భారం ఉండదు. బైక్‌లు, ఆటోలు, ట్రాక్టర్లు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలకు టోల్ వసూలు చేయం. కార్లు, లారీలు, బస్సులు, ఇతర భారీ వాహనాలకు మాత్రమే టోల్ ఛార్జీ ఉంటుంది' అని మంత్రి వివరించారు. 'రాష్ట్ర హైవేలపై ఎంత టోల్ వసూలు చేయాలో గత ప్రభుత్వమే 2022లో టోల్ పాలసీ తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూపాయి చొప్పున 2022 నుంచి సెస్ వసూలు చేస్తుండగా, ఏటా ప్రభుత్వానికి రూ.700 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ మొత్తంతో బ్యాంకు రుణాలు చెల్లిస్తున్నాం. ఇందులో కొంతమొత్తం హామ్ ప్రాజెక్టుకు వినియోగించాలని, అలాగే కొత్త వాహనాలకు జీవిత పన్ను 10 శాతం పెంచి, దాన్ని కూడా ఖర్చుచేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదించామ'ని మంత్రి వెల్లడించారు.

### మూడేళ్లలో ఓఆర్ఆర్ పూర్తి

'అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణానికి 12 ప్యాకేజీలుగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. ఒక్కో ప్యాకేజీ విలువ రూ.2,500 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల మధ్య ఉండేలా మార్పులు చేయాలని సూచించారు. ఆ మేరకు వారంలో సవరించి పంపిస్తామ'ని ఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. రూ.38 వేల కోట్ల ఈ ప్రాజెక్టును వచ్చే మార్చి నాటికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించేలా చూస్తానని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలతో కలిపి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణబాబు తెలిపారు.

# సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లో ఏసీబీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధిగా అక్రమ వసూళ్లు చేసే ఆలేటి కనకరాజు నివాసంలో సోదాలు. రూ.18.10 లక్షల నగదు, 522.88 గ్రాముల బంగారం, పలు వాహనాల స్వాధీనం

■ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పి.రామకృష్ణతో పాటు కార్యాలయ సిబ్బంది మరో ఐదుగురి నివాసాల్లో సోదాలు. కీలక పత్రాలు, నగదు, బంగారు ఆభరణాలు, వాహనాల స్వాధీనం.

### జగదాంబ సెంటర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (విశాఖపట్నం జిల్లా)

■ జూనియర్ అసిస్టెంట్ టి.సుధారాణి, ఆఫీస్ సబార్డినేట్ బి.ఆనంద్‌కుమార్‌లకు ఒక్కొక్కరికి రూ.కోటి విలువైన అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తింపు.

■ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఎస్.మోహన్‌రావు భారీ ఎత్తున స్థిరాస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు. ఆస్తిపత్రాలు, నగదు, బంగారం స్వాధీనం

### చిలమత్తూరు (శ్రీసత్యసాయి జిల్లా)

■ సబ్‌రిజిస్ట్రార్ మీనుల ప్రసాద్‌బాబు, అక్రమ వసూళ్ల కోసం ఏర్పాటుచేసుకున్న ప్రైవేటు వ్యక్తి నివాసాల్లో సోదాలు. భారీ ఎత్తున ఆస్తి పత్రాలు, నగదు, బంగారం స్వాధీనం

### ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్ జిల్లా)

■ సబ్‌రిజిస్ట్రార్ షేక్ మహమూద్, కార్యాలయ సిబ్బంది మరొకరి నివాసంలో సోదాలు. పెద్ద ఎత్తున ఆస్తిపత్రాలు, నగదు, బంగారు ఆభరణాల స్వాధీనం.

### డాక్యుమెంటు విలువ ఆధారంగా లంచాలు

గత నెల 5, 6 తేదీల్లో రాష్ట్రంలోని జగదాంబ సెంటర్, పెదగంట్యాడ, మధురవాడ (విశాఖపట్నం జిల్లా), భోగాపురం (విజయనగరం), ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్), నరసరావుపేట (పల్నాడు), ఒంగోలు (ప్రకాశం), స్టోన్‌హౌస్‌పేట (నెల్లూరు), రేణిగుంట (తిరుపతి), రాజంపేట (అన్నమయ్య), చిలమత్తూరు (శ్రీసత్యసాయి), ఆళ్లగడ్డ (నంద్యాల) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు అప్పట్లో పలుచోట్ల లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. వారు అప్పట్లో గుర్తించిన అక్రమాలు, అవకతవకలివి.

■ రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను వెంటనే ఇవ్వకుండా తమవద్దే పెట్టుకుని లంచం చెల్లించాకే అందిస్తున్నారు.

■ డాక్యుమెంటు విలువను బట్టి పర్సంటేజీలు నిర్ణయించి లంచాలు తీసుకుంటున్నారు

■ ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు.

■ కార్యాలయాల్లో అనధికారిక వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్ల రాజ్యం నడుస్తోంది.

■ వీటి ఆధారంగానే కేసులు నమోదు చేసి తాజాగా సోదాలు చేశారు.



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. ఏడుకొండలరావు, ఏవీ రావు, యార్లగడ్డ వెంకట్రావు, కేశినేని శివనాథ్, రామ్మోహన్‌రావు, వెంకటేష్

## పీపీపీపై వైకాపావి అసత్య ఆరోపణలు: సత్యకుమార్

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వంలో ఉన్నప్పుడు విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలోని బాలికల వసతి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు ఇవ్వలేకపోయిన వైకాపా నాయకులు 17 వైద్య కళాశాలలు నిర్మించామని ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో నిర్మించిన బాలికల వసతి భవనాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, యార్లగడ్డ వెంకట్రావ్, కలెక్టర్ జి.లక్ష్మీశలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 'వసతి భవన నిర్మాణ పనులకు 2015 నవంబరులో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.21.51 కోట్లతో ఆమోదం తెలిపింది. 2017లో పనులు ప్రారంభించి రూ.16.24 కోట్లు విలువైన పనులు చేసింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం.. కుట్రతో వ్యవహరించి మిగిలిన పనులు వదిలేసింది. అప్పటి నుంచి సుమారు 350 మంది ఎంబీబీఎస్ విద్యార్థినులు అరకొర సౌకర్యాలతో అనేక ఇబ్బందులు పడ్డారు. మరో రూ.5 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే భవనం అప్పుడే పూర్తయ్యేది. వాళ్లు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వం భవనాన్ని పూర్తి చేయించింది. అందుకే పీపీపీ విధానంపై వైకాపా నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, పీపీపీపై వైకాపా చేపట్టిన కోటి సంతకాలన్నీ దొంగవే' అని మంత్రి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ డా.వెంకటేష్, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.



వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వ వైద్య కళాశాల బాలికల వసతి భవనం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు చేపట్టి, పూర్తి చేసిన భవనం

## ఊపిరికి కష్టం.. గుండెకు నష్టం!

(మొదటి పేజీ తరువాయి)

- శీతాకాల ఉదయాలు హృదయనాళ వ్యవస్థకు సవాళ్లు విసురుతుంటాయి.
- ఛాతీ పట్టేయడం, ఊపిరి ఆడకపోవడాన్ని చలి వల్ల కలిగే అలసటని తేలిగ్గా తీసుకోకూడదు.
- చలికి రక్తనాళాలు సంకోచించి.. రక్తపోటును పెంచడంతోపాటు గుండె పని చేయడం కష్టమవుతుంది.
- ఉదయపు వేళల్లో గుండె పోటు వచ్చే అవకాశం ఎక్కువని, చల్లటి వాతావరణం ఈ రిస్కును మరింత పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.
- అత్యల్ప ఉష్ణోగ్రతలు గుండె రక్తనాళాలు కుచించుకుపోయేలా చేసి రక్త ప్రవాహాన్ని ప్రభావితం చేస్తాయి. గుండెకు వెళ్లే ఆక్సిజన్‌ను తగ్గిస్తాయి.
- దాంతో హృదయం మరింత శ్రమించాల్సి వచ్చి... గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది.
- ఈ సీజన్‌లో స్ట్రోక్, గొంతువాపు వ్యాధులు వచ్చే అవకాశమూ ఎక్కువని పరిశోధనలు చెబుతున్నాయి.
- వేగంగా నడవడం, మెట్లెక్కడం వంటి రోజువారీ పనులు గుండెపై ఒత్తిడిని కలిగిస్తాయి.
- రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గుండె సమస్యలున్నవారికి రిస్క్ ఎక్కువ.
- చలి కారణంగా రక్త నాళాలు కుచించుకుపోయి కీళ్లు, మోకాళ్ల నొప్పులు మరింత పెరుగుతుంటాయి.

### వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పు...

ఈ కాలంలో వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు చలిలో బయటకు వెళ్తే సమస్య తీవ్రమై ఆసుపత్రిలో చేరాల్సి వస్తుంది. తప్పనిసరిగా వెళ్లాలనుకుంటే మాత్రం ముక్కుకు మాస్కు, చెవిలో దూది పెట్టుకోవాలి. వీలైనంత వరకు గోరువెచ్చటి నీరు తాగాలి. తీపి పదార్థాలు తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయాన్నే చలి మంట కాగుతుంటారు. ఆరోగ్య సమస్యలున్న వారు ఆ పొగ వద్దకు వెళ్లకూడదు. దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలున్న వారు వైద్యుల సూచనమేరకు ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ), న్యూమోకోకల్ టీకాలు తీసుకోవాలి.

- డాక్టర్ వెంకటేష్, పల్మనాలజిస్ట్, విశాఖపట్నం

# పోలవరం అంచనాలు రూ.62,436 కోట్లకు!

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 80% ఖర్చు చేసినందున మరో విడత నిధుల కోసం పోలవరం అథారిటీకి అధికారులు ప్రతిపాదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,034 కోట్ల వరకు రాబట్టుకోవాలని యోచిస్తున్నారు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస చర్యలు వేగవంతం చేయాల్సి ఉంది.

### కాలువలకు అదనపు నిధులపై విజ్ఞప్తి

■ ఈ ప్రాజెక్టులో భాగంగా కుడి, ఎడమ కాలువలను ఏ ప్రవాహ సామర్థ్యం మేరకు తవ్వారో.. అందుకు తగ్గట్టుగా కేంద్రం నిధులు రీయింబర్స్ చేయలేదు. 2009 డీపీఆర్ ప్రకారం ఎడమ కాలువ 8,123 క్యూసెక్కులు, కుడి కాలువ 11,654 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మేరకు తవ్వాలి. 2019లో సాంకేతిక సలహా కమిటీ సిఫార్సుల ప్రకారం రెండు కాలువలనూ 17,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మేరకు నిర్మిస్తున్నారు. కుడి కాలువ నిర్మాణం పూర్తికాగా, ఎడమ కాలువ పనులు సాగుతున్నాయి.

■ 2017-18 ధరల ప్రకారం, పెంచిన ప్రవాహ సామర్థ్యం మేరకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌లో ప్రతిపాదనలు సమర్పించింది. ప్రస్తుతం కేంద్రం 2009 డీపీఆర్ ప్రకారమే కాలువల పనులకు ధరలు కట్టింది. వాటిలోనూ కుడి కాలువకు సంబంధించి 93%, ఎడమ కాలువకు సంబంధించి 77% మాత్రమే అనుమతించి, మిగిలిన నిధులు కోత పెట్టింది.

■ పెంచిన ప్రవాహ సామర్థ్యం మేరకు కాలువల నిర్మాణానికి అయిన ఖర్చు కేంద్రం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. తాజాగా దిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని కూడా కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ దృష్టికి తీసుకువెళ్లారు.

### రూ.10,151.03 కోట్ల నుంచి రూ.62,436 కోట్లకు..

2005-06 నాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.10,151.03 కోట్లు. తర్వాత ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమయ్యే కొద్దీ పెరిగిన ధరలకనుగుణంగా సవరణలు చేస్తూ వచ్చారు. అలా 2010-11, 2013-14, 2017-18 సంవత్సరాల్లో అంచనాలు సవరించారు. తాజాగా రెండో దశ నిర్మాణం దృష్ట్యా అంచనాలు మళ్లీ సవరిస్తున్నారు.

### అంచనాలు మారిన తీరును పరిశీలిస్తే.. (అంకెలన్నీ రూ.కోట్లలో)

(టీఏసీ: సాంకేతిక సలహా కమిటీ సిఫార్సులు) (ఆర్‌సీసీ: రివైజ్డ్ కాస్ట్ కమిటీ సిఫార్సులు)

| విభాగం | 2005–06 | 2010–11 తొలి అంచనాల సవరణ | 2013–14 రెండో అంచనాల సవరణ (టీఏసీ ప్రకారం) | 2017–18 రెండో అంచనాల సవరణ (టీఏసీ ప్రకారం) | 2013–14 రెండో అంచనాల సవరణ (ఆర్‌సీసీ ప్రకారం) | 2017–18 రెండో అంచనాల సవరణ (ఆర్‌సీసీ ప్రకారం) | తొలిదశ సవరించిన అంచనాలు ఆర్‌సీసీ ప్రకారం |
|---|---|---|---|---|---|---|---|
| ప్రధాన డ్యాం | 3,926.91 | 6,600.56 | 8,969.44 | 9,734.34 | 8,818.21 | 9,734.34 | 14,023.20 |
| ఎడమ కాలువ | 856.55 | 1,472.00 | 2,373.08 | 4,202.69 | 2,373.07 | 2,720.80 | 1,955.23 |
| కుడి కాలువ | 1,273.92 | 2,135.08 | 1,885.44 | 4,318.97 | 1,885.43 | 2,865.75 | 1,812.45 |
| భూసేకరణ | 1153.78 | 1853.16 | 5937.99 | 13077.15 | 5035.05 | 10199.67 | 4853.22 |
| పునరావాసం | 744.60 | 1,081.25 | 7,915.62 | 20,091.09 | 7,278.85 | 17,972.54 | 7,417.19 |
| విద్యుత్ కేంద్రం | 2,195.27 | 2,868.40 | 3,529.33 | 4,124.64 | 3,529.33 | 4,124.64 | ---- |
| పోలవరం అథారిటీ ఖర్చులు | - | - | 108.00 | 108.00 | 108.00 | 108.00 | 375.66 |
| మొత్తం | 10,151.03 | 16,010.45 | 30,718.90 | 55,656.88 | 29,027.94 | 47,725.74 | 30,436.95 |

# వచ్చే ఏడాది 1,450 విద్యుత్ ఏసీ బస్సులు: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరంలో కాలం చెల్లిన డీజిల్ బస్సుల స్థానంలో 1,450 విద్యుత్ బస్సులు కొనుగోలు చేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీకి సీఎం చంద్రబాబు అనుమతించారు. కాలం చెల్లిన బస్సుల్లో పల్లెవెలుగులు ఉంటే, వాటి స్థానంలో తీసుకునే ఏసీ విద్యుత్ బస్సులను.. పల్లెవెలుగులుగానే నడపాలని ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో అన్నీ విద్యుత్ బస్సులే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టే విద్యుత్ బస్సులపై సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా రానున్న ఐదేళ్లలో 8,819 డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టేందుకు సీఎం అనుమతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల కంటే ఎక్కువ కాలం నడిచిన బస్సులను రెట్రోఫిట్‌మెంట్ ద్వారా విద్యుత్ బస్సులుగా మార్చాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఈ-బస్ సేవ కింద 1,050 విద్యుత్ బస్సులను త్వరగా రోడ్డెక్కించేందుకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

### మామిడి రైతుల్ని ఇబ్బంది పెడితే ఊరుకోం

మామిడి రైతుల్ని ఇబ్బందులకు గురి చేసే ప్రాసెసింగ్ పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. కిలో మామిడికి ప్రభుత్వం రూ.4 చొప్పున అదనపు ధర కింద రూ.184 కోట్లు చెల్లించిందని వివరించారు. అయినా ప్రాసెసింగ్ యూనిట్లు ఉదారంగా వ్యవహరించకుండా.. కిలోకి రూ.8 చెల్లింపు విషయంలో ఉద్దేశపూర్వకంగా కర్షకుల్ని ఇబ్బంది పెడుతున్నాయని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులోనూ మిల్లర్లు అక్రమాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు.

## ఉపాధి కొత్త చట్టంపై 26న గ్రామసభలు

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వికసిత భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్‌పై ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. చట్టంలోని కీలక నిబంధనలు, చట్టబద్ధ హక్కులపై శ్రామికులు, ప్రజలకు గ్రామసభల్లో అవగాహన కల్పించడంతో పాటు చర్చించనున్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశించింది.


# ఈనాడు

## పర్యాటకులకు ఏదీ భద్రత?

భిన్న వాతావరణ పరిస్థితులు, సంస్కృతీ సంప్రదాయాలకు నెలవైన ఇండియాలో చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి రమణీయ ప్రదేశాలు అనేకమున్నాయి. దేశదేశాల పర్యాటకులను అవి విశేషంగా ఆకర్షిస్తున్నాయి. స్థానికంగా ఆర్థిక కార్యకలాపాల వృద్ధికి ఊతమిస్తున్నాయి. 2023-24లో ఇండియా జీడీపీలో పర్యాటక రంగ వాటా 5.2శాతం. సుమారు ఎనిమిదిన్నర కోట్ల మందికి అది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. ఇలా దేశ పురోగతికి తోడ్పడుతున్న టూరిజాన్ని ప్రోత్సహించేందుకు 'ప్రసాద్, స్వదేశ్ దర్శన్' వంటి కార్యక్రమాలను కేంద్రం అమలుచేస్తోంది. పర్యాటక రంగ ప్రాధాన్యాన్ని గుర్తించి తెలుగు రాష్ట్రాలూ ప్రత్యేక విధానాలు తెచ్చాయి. అదే సమయంలో మన దేశంలోని సందర్శనీయ ప్రాంతాలపై ఆసక్తితో దూరతీరాల నుంచి వస్తున్న వారిపై జరుగుతున్న దాడులు, హేయ నేరాలు కలవరపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రత్యేక పాలసీ తేవాల్సిన అవసరముందన్న ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాజా సూచన ఆచరణీయమైనది. టూరిస్టులతో ఎలా మెలగాలన్నదానిపై ప్రవర్తనా నియమావళి రూపొందించి అన్ని రాష్ట్రాలు పటిష్ఠంగా అమలు పరిస్తే- అంతర్జాతీయంగా దేశం పరువుప్రతిష్ఠలు దిగజార్చే దారుణాలను సమర్థంగా అడ్డుకోవచ్చు.

ఈ ఏడాది మార్చిలో తమిళనాడులోని తిరువణ్నామలై కొండపై ఫ్రాన్స్ దేశస్థురాలి మీద ఒక గైడ్ అత్యాచారానికి ఒడిగట్టాడు. అదే నెలలో దిల్లీలోని ఓ హోటల్లో బ్రిటిష్ మహిళపై ఇద్దరు దుర్మార్గులు అకృత్యానికి పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలు చూపిస్తానని నమ్మబలికిన ఒక నయవంచకుడు జర్మనీ యువతిపై లైంగిక దాడికి తెగబడ్డాడు. ప్రయాణంలో పరిచయమైన లిథువేనియా మహిళపై నెల్లూరులో ఓ ప్రబుద్ధుడు అత్యాచారయత్నం చేయడం కొన్నాళ్ల క్రితం దుమారం రేపింది. ఇక విజయనగర సామ్రాజ్య వైభవానికి ప్రతీక అయిన ప్రపంచ ప్రసిద్ధ హంపీలో పది నెలల కిందట ఒక ఇజ్రాయెలీ పర్యాటకురాలితో పాటు మరో మహిళను బలాత్కరించిన కీచకులు బాధితులతో ఉన్న వ్యక్తిని హతమార్చడం దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. విదేశీయులకే కాకుండా భారతీయులకూ పర్యాటక ప్రదేశాల్లో చేదు అనుభవాలెన్నో ఎదురవుతున్నాయి. రెండేళ్ల కిందట దిల్లీకి చెందిన ఓ కుటుంబం గోవా పర్యటనకు వెళ్తే కిరాతకులు కొందరు కత్తులతో విరుచుకుపడ్డారు. ఇలాంటి అమానుష ఉదంతాలు పర్యాటక రంగ ప్రగతికి ప్రతిబంధకాలవుతున్నాయి.

విదేశీ పర్యాటకులను దోచుకోవడం, వారి ప్రాణాలను హరించడం, అపహరణ, లైంగిక దాడులు తదితరాలపై 2016-2023 మధ్య దేశవ్యాప్తంగా పదిహేడు వందలకుపైగా కేసులు నమోదయ్యాయి. అందులో 111 అత్యాచారాలకు సంబంధించినవైతే, 45 హత్యోదంతాలున్నాయి. ఇలాంటి దాష్టీకాలకు తెగబడుతున్న వారికి త్వరితగతిన శిక్షలు పడుతున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితులన్నింటినీ ప్రస్తావిస్తున్న పలు దేశాలు బాగా ఆలోచించుకుని భారత పర్యటనకు వెళ్లాలని తమ పౌరులను హెచ్చరిస్తున్నాయి. జాతికి ఇదెంత అవమానకరం! ఇంటికొచ్చిన అతిథులను దేవుళ్లుగా భావించి సకల మర్యాదలూ చేసే సంస్కృతి మనది. అలాంటిది ఉరుకులూ పరుగుల జీవితంలో కాస్త సేదతీరదామని ఎంతో ఖర్చు, శ్రమకోర్చి వందలూ వేల కిలోమీటర్ల నుంచి తరలివచ్చే వారిని గౌరవంగా, సురక్షితంగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. పర్యాటకులపై దురాగతాలకు ఒడిగట్టే వారిని ఎంత మాత్రం ఉపేక్షించకూడదు. దర్శనీయ ప్రదేశాలన్నిచోట్లా మౌలిక వసతులను పెంచి భద్రతను కట్టుదిట్టం చేయాలి. అప్పుడే పర్యాటక రంగాన అగ్రస్థానానికి చేరాలన్న ఇండియా కల వాస్తవరూపం దాలుస్తుంది.



అందరినీ ప్రేమించమని చెప్పేది మాత్రమే నిజమైన మతం. సూర్యకిరణాలు మంచుకొండలను కరిగించినట్లే ప్రేమ అహంకార పర్వతాల్ని కరిగిస్తుంది. మనం మానవీయత అనే విలువైన సంపదను కోల్పోతున్నాం. దాన్ని పెంపొందించుకుని రక్షించుకోవడం తక్షణావసరం.

– పాండురంగ్ సదాశివ్ సానె
మరాఠీ రచయిత, సంఘ సంస్కర్త

## తలరాత మార్చుకుందాం!

'ఎంతటి మహనీయునకు ఉద్భవించిన/ తల(వ్రాత మార్చంగ తరము గాదు...' అన్నట్టు సృష్టి మొత్తం దైవానుగ్రహంతో నడుస్తుంది. తామనుకున్నట్టే అంతా జరుగుతోందని భ్రమపడతారు మానవులు. తెలియనిదేమంటే జరిగేవన్నీ భగవంతుడి కనుసన్నల్లో, దైవ నిర్ణయం ప్రకారం జరుగుతున్నాయి. 'శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నట్టు' ఒక జీవి శ్వాస పోసుకోవాలన్నా, ఆయువు ముగిసి పోవాలన్నా అంతర్యామి నిర్దేశం ప్రధానం. ఆధ్యాత్మిక కోణానికి ఒకవైపు అలా ఉంటే, స్వశక్తితో, సంకల్పబలంతో నుదుటిరాతను సరిదిద్దుకోవచ్చని నిరూపించిన వాళ్లూ ఉన్నారు. పదహారేళ్ల అల్పాయువుతో జన్మించిన మార్కండేయుడు, అకుంఠిత తపోదీక్షతో మరణాన్ని జయించాడు. శివలింగాన్ని కౌగిలించుకుని పరమేశ్వరుని ధ్యానించిన అతణ్ని యమపాశాలు తాకలేకపోయాయి. కైలాసనాథుడే భక్తుడి కోసం దిగివచ్చాడు. కఠిన దీక్షతో ప్రయత్నిస్తే తలరాత మార్చుకోవడం సులభమేనన్న పాఠాన్ని బోధించింది మార్కండేయ చరిత్ర.



అంతర్యామి

ద్యుమత్సేనుడి పుత్రుడు సత్యవంతుడికి సరిగ్గా ఏడాదే ఆయువుందని తెలిసీ పతిగా స్వీకరించింది సావిత్రి. అనుకున్న దుర్దినాన యమపాశాలతో ప్రత్యక్షమయ్యాడు దండధరుడు. దిగులు పడితే సాధించలేమనే ఎరుక కలిగిన సావిత్రి చురుకుగా ఆలోచించింది. అద్భుతమైన జ్ఞానంతో, వాక్చాతుర్యంతో సమవర్తిని మెప్పించి, మామగారి కంటిచూపును, కోల్పోయిన రాజ్యాన్ని, తండ్రికి పుత్రులను వరాలుగా పొందడమే కాక పతి ప్రాణాలనూ దక్కించుకుంది. అదీ సంకల్పబలమని లోకాలు గర్వపడేలా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది సావిత్రి.

నుదుటిరాతని విధికి వదిలేయకుండా తామే లిఖించుకున్న వారున్నారు చరిత్రలో. కొలువుకోసం వెళ్లిన చాణక్యుడిని దారుణంగా అవమానించారు నంద రాజులు. విధి లిఖితమంటూ చింతించకుండా తరుణోపాయం వెదికాడాయన. సరైన బాలుణ్ని చేరదీసి ఉత్తమ వీరుడిగా మలిచాడు. నందరాజులను అంతం చేస్తూ, మౌర్యరాజ్య స్థాపనకు పునాది వేశాడు. గొప్ప ప్రామాణిక గ్రంథంగా పేరొందిన కౌటిల్యుడి అర్థశాస్త్ర సృజనకు బీజం మాత్రం ఆయన హృదయంలో రగిలిన అవమానాల ప్రతీకార జ్వాలలతోనే పడింది.

నుదుటిరాత ప్రకారమే జరుగుతుందని భావిస్తూ కాలం గడిపేస్తారు కొందరు. తలరాత రాసుకుంటానని ధైర్యంగా అడుగేసి విజయం సాధించేవారు ఇంకొందరు. అలాంటివారే సమాజానికి దారిదీపాల్లాంటివారు. కొందరు... సమాజం మారాలంటారు కానీ వాళ్లు మారరు. అక్కడే ఆగిపోతారు. దాంతో వెనకున్న వాళ్లు ముందుకు వెళ్లిపోతారు. లియో టాల్‌స్టాయ్ అన్నట్టు బలమైన సంకల్పం, ఉన్నత ఆశయాలతో ముందడుగేస్తేనే విజయం ముంగిట నిలిచేది. గెలుపు పిలుపు వినపడేది.

తలరాత కేవలం విధాత ప్రసాదించిన ముడిసరుకు. దాన్ని గొప్పగా మలచుకునే శక్తి మన(సు)లోనే ఉంది. యోగవాశిష్ఠంలో చెప్పినట్టు మనసులో ఆలోచించి సంకల్పించినప్పుడే కార్యాలను సఫలీకృతం చేసుకోగలం. ఏ కార్యం జరగాలన్నా ప్రయత్నం తప్పనిసరి. సంకల్పం, ప్రయత్నం, సత్కర్మలు మాత్రమే భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అది గుర్తుంచుకుంటే విధిని, తలరాతను తిట్టుకుంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడదు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు


# నేరగాళ్లపై బ్రహ్మాస్త్రం... బ్లాక్ చెయిన్!

**డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు, డేటా ఉల్లంఘనలు పెద్ద సవాలుగా మారాయి. ఇలాంటి నేరాలపై బ్లాక్ చెయిన్ సాంకేతిక పరిజ్ఞానం శక్తిమంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. మొదట్లో క్రిప్టో కరెన్సీలకు ఉపకరించిన బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఇప్పుడు పలు రంగాలకు విస్తరిస్తోంది. ఇందులో ఒకసారి డేటాను నమోదు చేసిన తరవాత మార్చడం కుదరదు. పారదర్శకత, భద్రత అధికం. కాబట్టి పోలీసులు, సైబర్ భద్రతకు సమర్థంగా తోడ్పడనుంది.**

లావాదేవీలను అనేక కంప్యూటర్ వ్యవస్థల్లో నమోదు చేసి భద్రపరిచే సురక్షిత భాగస్వామ్య డిజిటల్ లెడ్జర్ బ్లాక్ చెయిన్. ప్రతి లావాదేవీ (బ్లాక్) ఎప్పుడు జరిగిందో కచ్చితంగా నమోదు చేస్తారు. అన్ని బ్లాకులు కాలానుగుణంగా, ఒక గొలుసు(చెయిన్)లా అనుసంధానమవుతాయి. ఈ సమాచారం అనేక కంప్యూటర్ నెట్‌వర్కుల్లో పంపిణీ అవుతుంది. డేటా లేదా బ్లాకులో ఏ మార్పునైనా భాగస్వాములందరి ఏకాభిప్రాయం తప్పనిసరి. పూర్తి పారదర్శకంగా, వికేంద్రీకృతంగా పనిచేసేది పబ్లిక్ బ్లాక్ చెయిన్. ఏదో ఒక సంస్థ అధీనంలో ఉండేది- ప్రైవేట్ బ్లాక్ చెయిన్. పలు సంస్థలు కలిసి నిర్వహించేది- కన్సార్టియం బ్లాక్ చెయిన్. పబ్లిక్, ప్రైవేట్ బ్లాక్ చెయిన్లు కలగలిస్తే హైబ్రిడ్ బ్లాక్ చెయిన్ అవుతుంది.

### నిరంతర నిఘాకు అమోఘ సాధనం

డేటాపై నిరంతరం నిఘా వేసి అనుమానాస్పద లావాదేవీలను చప్పున పసిగట్టడం ఈ సాంకేతికతతో వీలవుతుంది. నేర ముఠాల కార్యకలాపాలను, నెట్‌వర్కులను, డార్క్‌వెబ్‌ను కనిపెట్టడానికి




ఉపకరిస్తుంది. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌తో బ్లాక్ చెయిన్‌ను అనుసంధానించి నగదు అక్రమ చలామణీని ఇట్టే పట్టేయవచ్చు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినవారెవరో, వారు కార్యకలాపాలు నడిపే తీరు ఏంటో కనిపెట్టవచ్చు. పకడ్బందీగా సాక్ష్యాధారాల నివేదన, వ్యక్తుల గుర్తింపు, డిజిటల్ పాలనా నిర్వహణకు బ్లాక్ చెయిన్ అమోఘ సాధనం. మన పోలీసు, భద్రతా వ్యవస్థలకు ఎంతో ప్రయోజనకరం. డిజిటల్ వేలిముద్రలను బ్లాక్ చెయిన్‌లో భద్రపరచవచ్చు. బాడీ కెమేరాల ద్వారా సేకరించిన ఆడియో, వీడియో సమాచారాన్నీ నిక్షిప్తం చేయవచ్చు. సీసీటీవీ దృశ్యశ్రవణ సమాచారాన్నీ పొందుపరచవచ్చు. ఈ డేటాలో ఎవరూ జోక్యం చేసుకోలేరు కాబట్టి కోర్టులకు పకడ్బందీ సాక్ష్యాధారాలుగా సమర్పించవచ్చు. నేరగాళ్ల ముఖచిత్రాలు, నేర చరిత్రను, ఫోరెన్సిక్ నివేదికలనూ బ్లాక్ చెయిన్‌లో డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయవచ్చు. ఈ సమాచారాన్ని తారుమారు చేయడం ఎవరికీ సాధ్యంకాదు.

### సైబర్ దాడుల నుంచి రక్షణకు...

బ్లాక్ చెయిన్ వల్ల కేసుల దర్యాప్తు, విచారణ వేగవంతమవుతుంది. పోలీసులు, నిఘా యంత్రాంగం, న్యాయవ్యవస్థ, అంతర్జాతీయ నేర నిరోధక సంస్థల మధ్య బ్లాక్ చెయిన్ చక్కని సమన్వయం ఏర్పరుస్తుంది. మన భద్రతా సంస్థల మధ్య కీలక, రహస్య సమాచారాన్ని మూడో కంటికి తెలియకుండా బ్లాక్ చెయిన్ ద్వారా పంపిణీ చేయవచ్చు. సైబర్ దాడులు, సైబర్ చౌర్యం నుంచి డేటాను కాపాడుకోవచ్చు. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలను ఎదుర్కొనేందుకు సైతం ఈ సాంకేతికత ఉపకరిస్తుంది. బ్లాక్ చెయిన్ టెక్నాలజీలో అరితేరిన అమెరికా, ఇజ్రాయెల్, ఎస్టోనియా వంటి దేశాల నుంచి భారతీయ భద్రతా సంస్థలు నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. అయితే, ఇందులో కొన్ని సాంకేతిక లొసుగులు లేకపోలేదు. ఈ సాంకేతికతపై ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో అదుపు ఉండదు. అందులోని సమాచారం సీమాంతర, గుప్త స్వభావం కలిగి ఉంటుంది. ఇలాంటి లక్షణాల వల్ల బ్లాక్ చెయిన్ సాంకేతికతను పోలీసు, భద్రత, న్యాయ వ్యవస్థలు నూటికి నూరు శాతం చేపట్టేందుకు అడ్డువస్తున్నాయి.

### మౌలిక వసతులు కరవు

భారత్‌లో బ్లాక్ చెయిన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో చేపట్టడానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పడలేదు. కేంద్ర, రాష్ట్రాల సిబ్బందికి అవసరమైన శిక్షణ కూడా లేదు. ఒకరి అధికారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదనే నిబంధన ఎటూ ఉంది. అంతర్జాతీయ స్థాయిలో కేంద్రీకృత నియంత్రణ సంస్థ కూడా లేకపోవడంతో ఒక దేశంలో జరిగిన నేరంపై దర్యాప్తు చేసేందుకు ఇతర దేశాలు- ఎంతవరకు ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించవచ్చనేది సందేహమే. ఇది సమస్యాత్మకంగా మారవచ్చు. క్రిమినల్ కేసుల్లో ఒక దేశం మరొక దేశ అధికార పరిధిని అతిక్రమించకూడదు కదా! అలాగే వ్యక్తిగత సమాచార గోప్యతకు అత్యధిక దేశాలు చట్టాలు చేశాయన్న సంగతి మరవద్దు. నేరగాళ్లు బోగస్ పేర్లు, చిరునామాలను ఉపయోగించడం వల్ల వారి సమాచారం ఎంతవరకు విశ్వసనీయమనే ప్రశ్న ఎటూ ఉంది. ముఖ్యంగా క్రిప్టో కరెన్సీల విషయంలో ఈ ప్రశ్న చాలా కీలకం. నేరగాళ్లు అక్రమ ధనాన్ని దేశాల సరిహద్దులు దాటించడానికి బ్లాక్ చెయిన్ సాంకేతికతను ఉపయోగిస్తారు. వేర్వేరు దేశాల నుంచి కార్యకలాపాలు సాగించే ఈ అంతర్జాతీయ ముఠాలను గుర్తించడం సులభమేమీ కాదు. బ్లాక్ చెయిన్ నెట్‌వర్కులు స్వతంత్రంగా పనిచేసే కంప్యూటర్ యంత్రాంగాల నిర్వహణలో ఉంటాయి. వాటిపై ఏ ఒక్క దేశానికీ చట్టపరమైన అదుపు ఉండకపోవచ్చు. అవసరమైనప్పుడు ఈ కంప్యూటర్ల నుంచి మనకు కావాల్సిన సమాచారం పొందడం తేలిక కాకపోవచ్చు.

మనదేశంలో 2000 సంవత్సరంనాటి సమాచార సాంకేతిక చట్టంతో పాటు రిజర్వు బ్యాంకు నిబంధనలూ బ్లాక్ చెయిన్ కార్యకలాపాలను నియంత్రిస్తాయి. వ్యక్తిగత సమాచారాన్ని కాపాడటానికి దాన్ని ఏయే సందర్భాల్లో చెరిపేయాలో, సరిదిద్దాలో 2023నాటి డిజిటల్ వ్యక్తిగత సమాచార గోప్యతా రక్షణ చట్టం నిర్దేశిస్తోంది. భారతీయ కోర్టులు ఎలక్ట్రానిక్ కాంట్రాక్టుల చెల్లుబాటును ఆమోదిస్తున్నా, బ్లాక్ చెయిన్ స్మార్ట్ కాంట్రాక్టులకు చట్టపరమైన ప్రాతిపదిక మాత్రం ఇంకా ఏర్పడాల్సి ఉంది. దీనికి సంబంధించి ఇతర దేశాలు రూపొందించిన చట్టాలను భారత్ పరిశీలించాలి. అలాగే బ్లాక్ చెయిన్ సాంకేతికతను పౌరులపై నిఘాకు ఉపయోగించకూడదు. పౌర హక్కులకు భంగం కలగకుండా జాగ్రత్తపడాలి. నైతికపరమైన సందిగ్ధతకు తావివ్వకూడదు.



డాక్టర్ రావెళ్ల భానుకృష్ణ కిరణ్
అంతర్జాతీయ న్యాయ, భద్రతా వ్యవహారాల నిపుణులు

'నమస్కారం.. కులాసానా?'
'ఆ.. ఏం కులాసాలెండి'

ఓ సంస్కారవంతమైన పలకరింపునకు విసురుగా వచ్చిన జవాబుతో సంభాషణకు ఫుల్‌స్టాప్ పడిపోతుంది. అదే విజ్ఞతతో కూడిన సమాధానమైతే.. 'నమస్తే.. కులాసాండీ...' అనే ఒద్దికైన మాటతో ఆ సంభాషణ అలాఅలా పరిచయమనే పలకమీద ఓనమాలు దిద్దుకుంటుంది. అదీ పలుకుల బడిలో పలుకుబడి తరగతులకు పెద్ద బాలశిక్ష. కలుపుగోలుతనం అనే లక్షణం పెంపొందించుకోవడం సామాజిక జీవనానికి సంజీవని మూలిక లాంటిది. అలా అని ముఖపరిచయ మాత్రాన ముఖ్యమైన వ్యక్తిగత వివరాలన్నీ మూటగట్టి అప్పజెప్పేయమని కాదు. అక్కరకు రాని అమాయకత్వంతో

## పరిచయ ఫలాలు



అసలుకే ఎసరు పెట్టుకోమని కాదు. ఆచితూచి మాట్లాడటం, ఆమూలాగ్ర పరిశీలన, అవతలి వ్యక్తి చూపు, పలుకు, శరీరభాషల గమనింపు తప్పనిసరి. అపరిచితులనగానే అనుమానించి అవమానించక్కరలేదు. అలాగని అట్టుపుట్టు ఆనవాళ్లను... అంటే మన పుట్టుపూర్వోత్తరాలన్నీ పళ్లెంలో పెట్టి ఇచ్చేయనక్కరలేదు కూడా.

ఏ పుట్టలో ఏ పాముందో అనే యోచనతో పాటు ఏ ఎరుకతో ఎంత మెరుగుపడబోతున్నామో అనే చింతన కూడా అవసరం. లేచిన వేళావిశేషం, చూసిన ముహూర్త బలం అని పెద్దలంటూంటారు. అవి అలా ఫలించాలంటే మనం చేస్తున్న కృషి వల్ల కలిగే తృప్తి, సంతుష్టి కను కొనలలో కళలీనాలి. ముఖ ప్రమిదలో తళుక్కుమనాలి. అలా కాకుంటే అలనాడు గుడివాడ స్టేషన్‌లో ఆగిన రైలు కిటికీలోంచి క్షణకాలం ప్రసరించిన చూపును ఓ బాల కళాకారుడు ఆకర్షించగలిగేవాడా?! అనంతర కాలంలో దశాబ్దాల పాటు వెండితెరను ఏలగలిగేవాడా? ఆ చూపు దర్శకులు ఘంటసాల బలరామయ్యదైతే ఆ బాల నటరాజసం అనంతర కాలాన ఏఎన్నార్‌గా ఎదిగిన అక్కినేని నాగేశ్వరరావుది.

యువ నరేంద్రుడి అన్వేషణ ఆదిలోనే ఆగిపోయుంటే రామకృష్ణ పరమహంసతో పరిచయం జరిగేదా, స్వామి వివేకానందుడిగా ఖండాంతరాలలో భారతీయ తత్త్వజ్యోతి వెలుగులీనేదా?! శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి 'వడ్లగింజలు' కథలో తంగిరాల శంకరప్ప సాధించిన చదరంగ క్రీడా విజయ నేపథ్యం అంచెలంచెల పరిచయాల నిచ్చెనల హెచ్చువేతలతోనే కదా!

రైలు పరిచయాలు, హోటళ్లలో టిఫిన్ బల్ల పలకరింపులు, బస్టాపుల భాషణలు, పుస్తక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్ల వంటి నలుగురు కలిసి నవ్వే చోటుల్లో కాసింత పెదవి బిగింపులు సడలనివ్వండి. అవతలి ముఖంలో నిజాయతీ కనిపిస్తే ఫోన్ నెంబర్ ఇవ్వొచ్చు. దగాకోరుదనం కోరచూపులు చూస్తే వేగం తగ్గించి వెనకడుగు వేయొచ్చు. కలివిడితనంలో తెలివిడి ఉపయోగంతో అన్నీ కలిసొచ్చినట్లయితే నిలకడ పునాదుల మీద నిజమైన స్నేహసౌధం నిటారుగా నిలబడుతుంది. పెళ్లిళ్లూ కావచ్చు, ఉద్యోగాలూ రావచ్చు. ఊళ్లేలనూవచ్చు. కాకపోతే మరీ బొత్తిగా ముక్కూ మొహం తెలిసిపోయాయోచ్ అనుకుంటూ సోషల్ మీడియా పరిచయాలతో చిన్నప్పటి ఉగ్గుగిన్నె మొదలు పిల్లో పిల్లాడికో పెట్టాల్సిన పెట్టుపోతల నగల వరకూ వివరాల తాళంచేతులిచ్చేయడం లాంటివి మాత్రం అతి. అదీ, సర్వత్ర వర్జయేత్. కానీ, సవ్యంగా ఉంటే పరిచయాలిచ్చే ఫలమాధుర్యమే వేరు.

– రాంభట్ల నృసింహశర్మ



## పరువుతీస్తున్న డోపింగ్

**ఎలాగైనా పతకాలు గెలిచి తీరాలన్న దురాశతో పలువురు క్రీడాకారులు నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకుంటున్నారు. కొందరేమో చికిత్సలకు వాడుతున్న మందుల మూలంగా డోపింగ్ మకిలి అంటించుకుంటున్నారు. 2021-24 మధ్యకాలంలో ఇండియాలో 640 మంది ఆటగాళ్లు డోపింగ్ టెస్టుల్లో విఫలమయ్యారు. 2021లో డోపీలు 42 మంది ఉంటే, 2024 నాటికి వారి సంఖ్య 260కి పెరిగింది. నాలుగేళ్లలో డోపింగ్ పరీక్షల్లో దొరికిపోయిన క్రీడాకారుల్లో ఆయా విభాగాల వారు...**

| | |
|---|---|
| అథ్లెటిక్స్ | 200 |
| వెయిట్ లిఫ్టింగ్ | 99 |
| రెజ్లింగ్ | 60 |
| పవర్ లిఫ్టింగ్ | 57 |
| బాక్సింగ్ | 28 |
| బాడీబిల్డింగ్, కబడ్డీ | 21 |
| వుషు | 14 |
| పారా అథ్లెటిక్స్ | 11 |

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

# వాణిజ్య ఒప్పందాల్లో దూకుడు!

**ప్రపంచంలోకెల్లా నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన ఇండియా- రానున్న రెండేళ్లలో మరో మెట్టు ఎగబాకాలని ఉవ్విళ్లూరుతోంది. 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశం'గా నిలవాలని కాంక్షిస్తోంది. ఇందుకోసం దేశీయంగా జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకొచ్చిన కేంద్రం వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) కుదుర్చుకోవడంలో దూకుడు ప్రదర్శిస్తోంది.**



వస్తుసేవల వాణిజ్యంలో సుంకాలు, సుంకాలేతర అడ్డంకులను పూర్తిగా తొలగించుకునేందుకు, గణనీయంగా తగ్గించుకునేందుకు రెండు, అంతకన్నా ఎక్కువ దేశాలు తమ మధ్య ఎఫ్‌టీఏలను కుదుర్చుకుంటుంటాయి. పెట్టుబడుల పరిరక్షణ, మేధోసంపత్తి హక్కులు, వివాద పరిష్కార మార్గాల వంటి అంశాలు ఇందులో మిళితమై ఉంటాయి. ఎఫ్‌టీఏలు- ఎగుమతులు, దిగుమతుల భారాన్ని తగ్గిస్తాయి. అంతర్జాతీయ విపణుల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాయి. తక్కువ టారిఫ్‌లకే ముడిపదార్థాలు పొందడంలో ఉపకరిస్తాయి. వీటివల్ల వ్యాపారులు లబ్ధి పొందుతారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 350కి పైగా ఎఫ్‌టీఏలు అమల్లో ఉన్నాయి. ఈ ఒప్పందాలు సుంకాల పరంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ లాభదాయకమే. విదేశీ పెట్టుబడులు పెరగడానికి, ఉద్యోగ కల్పన మెరుగవ్వడానికి ఇవి ఉపయోగపడతాయి. అంతర్జాతీయ విపణుల్లో ఒడుదొడుకులను తట్టుకొని నిలబడటానికి దోహదపడతాయి. అందుకే- కొన్నేళ్లుగా ఎఫ్‌టీఏలపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించింది. జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ తదితర దేశాలతోపాటు ఆసియాన్ వంటి సంఘాలతోనూ మన దేశానికి ఎఫ్‌టీఏలు కుదిరాయి. ఒమన్‌తో గతవారమే ఒప్పందం ముడిపడింది. న్యూజిలాండ్‌తో కూడా తాజాగా ఎఫ్‌టీఏ ఖరారైంది.

### దేశీయ పరిశ్రమలకు లబ్ధి

భారత ఆర్థిక వ్యూహానికి ఎఫ్‌టీఏలు మూల స్తంభాల్లాంటివి. అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో మన దేశం లోతుగా సమ్మిళితమవడానికి ఇవి దోహదపడతాయి. ఎగుమతుల శక్తిని, ఎగుమతి విపణుల సంఖ్యను పెంచుకోవడానికి ఉపకరిస్తాయి. ఇప్పటికే కుదిరిన ఎఫ్‌టీఏలతో- కొన్ని విదేశీ విపణుల్లో భారతీయ ఉత్పత్తులు, సేవలకు సుంకాలరహితంగా, కొన్నిసార్లు తక్కువ సుంకంతో ప్రవేశం దక్కుతోంది. దీనివల్ల దేశీయంగా కార్మిక శక్తి ఎక్కువగా అవసరముండే జౌళి, వ్యవసాయం, తోలు, ఇంజినీరింగ్ ఉత్పత్తుల వంటి పరిశ్రమలు లబ్ధి పొందుతున్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ఆయా దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరుగుతుంది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేసుకోవాలని బ్రిటన్, ఇండియా తలపోశాయి. ఇందుకోసం 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సెటా)' పేరుతో ఎఫ్‌టీఏ కుదుర్చుకున్నాయి. సెటాతో 99శాతం భారతీయ ఉత్పత్తులకు బ్రిటన్‌లో సుంకాలరహిత ప్రవేశం లభిస్తుంది. దీనివల్ల చైనా, వియత్నాం వంటి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌లతో భారతీయ ఉత్పత్తులు పోటీ పడగలుగుతున్నాయి.

ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం(ఈఎఫ్‌టీఏ)తో ఇండియా కుదుర్చుకున్న 'వాణిజ్యం, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(టెపా)' ఈ ఏడాది అక్టోబరు నుంచి అమల్లోకి వచ్చింది. స్విట్జర్లాండ్, నార్వే, లీచ్‌టెన్‌స్టీన్, ఐస్‌లాండ్‌ల్లో 99.6శాతం భారతీయ ఉత్పత్తులపై సుంకాలను పూర్తిగా తొలగించేందుకు అది దోహదపడుతోంది. రానున్న పదిహేనేళ్లలో ఇండియాలో పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టికి ఈ ఒప్పందం సహాయపడనుంది.


### ఒడుదొడుకులను తట్టుకునేలా...

ఇండియా ఎగుమతులు గత నెలలో 15.52శాతం పెరిగి (ఏడాది కిందటితో పోలిస్తే) 73.99 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 80.63 బిలియన్ డాలర్ల వద్ద దాదాపు స్థిరంగా ఉన్నాయి. దీంతో- వాణిజ్యలోటు 61శాతం తగ్గి, 6.64 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అమెరికా సుంకాలు పలు దేశాలను కలవరపెడుతున్నాయి. సరఫరా గొలుసుల స్థిరత్వాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి. రష్యా నుంచి ముడిచమురు భారీగా కొనుగోలు చేస్తున్నందుకు దిల్లీపైనా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సుంకాల కొరడా ఝళిపించారు. అయినప్పటికీ మన ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరునే కనబరిచింది. అంతర్జాతీయంగా తలెత్తే అనిశ్చిత పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడానికి ఎఫ్‌టీఏలు దోహదపడతాయి. ఈయూతోపాటు అమెరికా, చిలీ, పెరూ, ఇజ్రాయెల్ వంటి దేశాలతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకునేందుకు ఇండియా గట్టిగా ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ విపణిలో పోటీ కారణంగా పాడి, నూనె, విత్తనాల వంటి రంగాల్లో దేశీయ వ్యాపారులు ఒత్తిడికి లోనయ్యే ముప్పుంది. కాబట్టి, వారికి భరోసా కల్పిస్తూనే ఎఫ్‌టీఏలను పట్టాలెక్కించే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. పలు దేశాలతో చర్చలు తుదిదశకు చేరుకున్నాయి. అవి ఫలిస్తే- అంతర్జాతీయ ఆర్థిక రంగంలో ఒడుదొడుకులను ఇండియా మరింత సమర్థంగా తట్టుకోగలుగుతుంది. ఎఫ్‌టీఏ ఫలాలను పొందేందుకు దేశంలో తయారీ యూనిట్లను నెలకొల్పేందుకు విదేశీ కంపెనీలు ముందుకొస్తాయి. భారతీయులకు తక్కువ ధరలకే ఎక్కువ రకాల, మేలిమి ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. స్వదేశీ ఉత్పత్తుల నాణ్యత కూడా మెరుగవుతుంది. 'వికసిత్ భారత్' సాకారం సులువవుతుంది.

– ఎం.నవీన్‌కుమార్ గౌడ్

## గుణపాఠం


ఒక అడవిలో సోమరి నక్క ఉండేది. ఆహార సేకరణకు వెళ్లేదే కాదు. అడవిలోని పెద్ద జంతువులు వెళ్లిన తరవాత బయటికి వచ్చేది. ఆట కోసం వచ్చే పిల్లల దగ్గరికి వెళ్లి, మాయ మాటలు చెప్పి.. వాటి దగ్గరున్న ఆహారం తినేసేది. నక్క తీరును గమనించిన ఒక ముసలి ఎలుగుబంటి.. 'పిల్లల ఆహారం తింటావేంటి? నీది నువ్వు తెచ్చుకో!' అంది. 'నాకు చెప్పడానికి నువ్వు ఎవరు?' అంది నక్క. మరుసటిరోజు ఉదయాన్నే పిల్ల జంతువులకు కొన్ని పండ్లు ఇచ్చి.. 'వీటిని తినకండి. నేను వచ్చే వరకు జాగ్రత్తగా చూసుకోండి' అని చెప్పింది ఎలుగు. కాసేపటికి నక్క అక్కడికి వెళ్లింది. దానికి ఆ పండ్లు కనిపించాయి. 'ఇవేవో కొత్తరకం పండ్లలా ఉన్నాయి. ఎలాగైనా తినేయాలి'



అనుకుంది. పిల్లలు తినొద్దని చెప్పేలోపే తినేసింది. కాసేపటికే దానికి ఒళ్లంతా దురద మొదలైంది. వెంటనే పిల్ల జంతువులు వెళ్లి ఎలుగుని తీసుకొచ్చాయి. పసరుమందు ఇచ్చి దానికి దురద తగ్గేలా చేసింది ఎలుగు. 'వాటిని తినొద్దని చెప్పాను కదా! మీరు నక్కకు చెప్పలేదా?' అంది ఎలుగు. 'మేము చెప్పేలోపే నక్కమామ తినేసింది' అన్నాయి పిల్లలు. 'అయినా నీకు అంత తొందర దేనికి. అక్కడ ఎందుకు పెట్టారని ఆలోచించాలి కదా!' అంది ఎలుగు. 'ఉదయం నుంచి ఏమీ తినలేదు.. చాలా ఆకలేసి తినేశా!' అంది నక్క. 'నీ ఆహారం నువ్వు వెతుక్కొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా! ఏది తినాలి.. ఏది తినొద్దు అనే విషయాలూ తెలిసేవి. ఇంకొకరు తిండి పెట్టే వరకు ఆకలితో ఇబ్బంది పడే బాధ తప్పేది' అంది ఎలుగు. 'నువ్వు చెప్పింది నిజమే మిత్రమా! స్వయంగా వెళ్లి వెతికినప్పుడే ఏది మంచిది, ఏది కాదనేది తెలుస్తుంది. ఇతరుల మీద ఆధారపడితే వాళ్లు ఏది తెస్తే అదే తినాలి. ఇక నుంచి నా ఆహారం నేనే సంపాదించుకుంటా' అంది నక్క.

– మొర్రి గోపి

హాయ్! బుజ్జీ!!



## అధినేతతో భేటీ...



ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలిగా నియమితులైన.. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. - పటమట




## విజయ దరహాసం

విజయవాడలో 78వ ఇంటర్ స్టేట్–జోనల్ బ్యాడ్మింటన్ టీం ఛాంపియన్‌షిప్–2025 ఉత్కంఠభరితంగా సాగింది. మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన హరియాణా, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, అసోం జట్ల క్రీడాకారులతో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, సెక్రటరీ పి.అంకమ్మచౌదరి తదితరులు - ఈనాడు, అమరావతి

# ఎగిరే రాజసం.. వెలిగే సౌరభం

- పార్కింగ్ పైకప్పు అంతా.. సోలారే...
- విజయవాడ విమానాశ్రయంలో ఏర్పాటు

ఈనాడు, అమరావతి

'విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న పార్కింగ్ ప్రాంతంలో చాలావరకు.. పైకప్పు మొత్తం.. సౌర విద్యుత్తు పలకలను ఏర్పాటు చేస్తున్నారు. 800 కార్లను ఏర్పాటు చేసేలా అత్యాధునిక పార్కింగ్ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతున్నారు. వాహనాలను ఆపేందుకు నిర్మిస్తున్న షెడ్డులన్నింటికీ పైకప్పును సౌర విద్యుత్తు పలకలతో నింపుతున్నారు. 300కిలోవాట్ సామర్థ్య విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను సమకూర్చి.. ఈ పలకలను బిగిస్తున్నారు.'

విమానాశ్రయంలో ఇప్పటికే.. ఒక మెగావాట్ సామర్థ్య సౌర విద్యుత్తు ప్లాంట్ ఉంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ ప్లాంట్‌ను పెట్టారు. విమానాశ్రయానికి విద్యుత్తు బిల్లులు తగ్గించడానికి ఈప్లాంట్ తోడ్పడుతోంది. తాజాగా మరో 300 కిలోవాట్ సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటుతో... నూతనంగా ఏర్పాటయ్యే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్, పార్కింగ్ ప్రాంతం ద్వారా వచ్చే అదనపు బిల్లుల భారం కొంతవరకూ తగ్గించుకునే వీలుంది.



పార్కింగ్ ఏరియాలో షెడ్డులకు పైకప్పుగా సౌర పలకలు

విమానాశ్రయంలో రూ.470 కోట్లతో దేశీయ, అంతర్జాతీయ సేవలను ఒకేచోట నుంచి అందించేందుకు నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనానికి అనుబంధంగా.. విశాలమైన పార్కింగ్ ప్రాంతం సిద్ధమవుతోంది. ఒకేసారి 800 కార్లను ఈ పార్కింగ్ ప్రాంతంలో నిలిపే సామర్థ్యం ఉంది.

### విశాలమైన పార్కింగ్

ప్రస్తుతం విమానాశ్రయంలోని పార్కింగ్ ప్రదేశంతో పోలిస్తే ఇది రెట్టింపు సామర్థ్యంతో అందుబాటులోకి రాబోతోంది. వచ్చే రెండు దశాబ్దాల.. అవసరాలకు తగ్గట్టుగా.. 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మిస్తున్నారు. ఒకేసారి 1200 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ టెర్మినల్‌కు తగినట్లు పార్కింగ్ కూడా తీర్చిదిద్దుతున్నారు.


### నేరుగా వచ్చి వెళ్లిపోయేలా..

విమానాశ్రయంలోకి వచ్చాక.. నేరుగా టెర్మినల్ దగ్గరికి వెళ్లిపోయేలా భారీ పైవంతెన ఏర్పాటు చేస్తున్నారు. ఈ వంతెన మీదుగా వెళ్లి.. ప్రయాణికులను దించేసి.. నేరుగా కిందకు పార్కింగ్ ప్రదేశానికి వాహనాలు వెళ్లిపోతాయి. అక్కడి నుంచి.. పార్కింగ్‌లో ఉంచి.. తిరిగి వెళ్లిపోయేందుకు అనుసంధాన దారులు వేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశం మధ్యలో ఫౌంటెయిన్‌లు, గ్రీనరీతో.. అధునాతన పద్ధతులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

# సాధనతో పట్టు.. సీటు కొట్టు!

ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే పరీక్ష జేఈఈ మెయిన్. ఇందులో ప్రతిభ చూపిన వారు నేరుగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక సంస్థల్లో ప్రవేశాలు పొందవచ్చు. అదే విధంగా జేఈఈ అడ్వాన్సుడు ప్రవేశ పరీక్షకు సైతం మెయిన్‌లో అర్హత సాధించడం తప్పనిసరి.


- కానూరు, తాడిగడప, యనమలకుదురు, న్యూస్‌టుడే



**ఛాయిస్ ఉండదు:** బీఈ, బీటెక్ విద్యార్థులకు జేఈఈ మెయిన్-2026లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేపర్-1 నిర్వహిస్తారు. అందులోని పార్ట్-బీలో ఛాయిస్ విధానం తొలగించారు. ఐదు ప్రశ్నలే ఉంటాయి. అన్నింటికీ సమాధానాలు రాయాలి. గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలో పార్ట్-ఏలో 20, బీలో 5 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 75 ప్రశ్నలకు సమాధానం రాయాలి. మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్టు వారికి పేపర్-2ఏ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ వారికి పేపర్-2బీ నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లా నుంచి (సుమారు) హాజరయ్యే వారు: 25,000
మొదటి సెషన్: జనవరి 21–30
రెండో సెషన్: ఏప్రిల్ 1–10
పరీక్షా విధానం: ఆన్‌లైన్

### కెమిస్ట్రీలో రాణించండి..



గతేడాది రసాయన శాస్త్రంలో ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి న్యూమరికల్స్ ఎక్కువగా వచ్చాయి. ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్ ఛాప్టర్ల నుంచి కూడా ప్రశ్నలు అడిగారు. గతంలో ఇనార్గానిక్ కెమిస్ట్రీలో 10 ప్రశ్నల వరకు అడిగారు. 60శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల నుంచి వస్తున్నాయి. వాటిలో ప్రతిలైన్ చదవాలి. ఎక్కువ వెయిటేజీ ఉన్న కోఆర్డినేషన్ కాంపౌండ్స్, పీరియాడిక్ క్లాసిఫికేషన్స్, క్వాడ్రేటివ్ ఇనార్గానిక్ అనలిటిక్స్, కెమికల్ బాండింగ్ ఛాప్టర్లపై దృష్టి సారించాలి.
**- జి.వెంకటరావు, శ్రీభవిష్య జూనియర్‌కాలేజీ**

### భౌతిక శాస్త్రంపై పట్టు సాధించండి



భౌతిక శాస్త్రంలో ప్రతి ఛాప్టర్ నుంచి ముఖ్యమైన ఫార్ములాలు, పాయింట్లు గుర్తుంచుకోవాలి. మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ, మాగ్నటిజం, థర్మోడైనమిక్స్, ఆప్టిక్స్, మోడర్న్ ఫిజిక్స్, ఎలక్ట్రోమాగ్నటిజమ్ వంటి ఛాప్టర్లలపై శ్రద్ధ వహించాలి. ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలను ప్రామాణికంగా చేసుకొని చదవాలి. రోజూ 10 ప్రశ్నలు సాల్వ్ చేయాలి.
**-ఎం.మురళీకృష్ణ, ఈజీఎం, శ్రీచైతన్య విద్యాసంస్థలు**

### గణితంలో నెగ్గండిలా..



గణితంలో మార్కులు సాధించాలంటే నిత్యం సాధన ముఖ్యం. సూత్రాలు రివిజన్ చేయాలి. మాడ్యులస్, ఆర్గ్యుమెంట్, డిమోయివర్ సిద్ధాంతం, వర్గ సమీకరణాలు, క్యాలిక్యులస్‌లో డిఫరెన్షియల్, ఇంటిగ్రల్, కాలిక్యులస్, ఆల్జీబ్రాలో సీక్వెన్సెస్, సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, మ్యాట్రిసెస్, డెటర్మినెంట్స్, కోఆర్డినేట్ జామెట్రీ, 3డీ జామెట్రీ, వెక్టార్స్, ఛాప్టర్‌లను ఎక్కువ సాధన చేయాలి. స్మార్ట్ టెక్నిక్స్‌పై దృష్టిపెట్టాలి. సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి.
**-జీవీరావు, జీఎం, శారదా విద్యా సంస్థలు**

# పూచీ లేదని.. పేచీ!

- బ్యాంకు గ్యారంటీ లేక అన్నదాతల బేజారు
- 4 రోజులుగా నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

ఈనాడు, అమరావతి - నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ధాన్యం కొనుగోళ్లకు బ్యాంకు గ్యారంటీల సమస్య ప్రతిబంధకంగా మారింది. ఇప్పటికే ఇచ్చిన గ్యారంటీ (బీజీ) పూర్తవడంతో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు సవ్యంగా సాగడం లేదు. ధాన్యం రవాణా కాకపోవడంతో అన్నదాతలు ధాన్యం తరలించేదెలా అని పడిగాపులు కాస్తున్నారు.

### నిరీక్షణ మిగిలింది..

✦ జిల్లాలో కొన్న ధాన్యాన్ని 28 మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లు మొత్తం రూ.130 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లకు బ్యాంకు గ్యారంటీలు తీసుకున్నారు. నాలుగు రోజుల కిందట నందిగామ, జగ్గయ్యపేట మిల్లుల్లో మిల్లుల బ్యాంకు గ్యారంటీలు మొత్తం పూర్తవడంతో సమస్య మొదలైంది. ✦ కొద్దిరోజుల కిందట నందిగామ రైతులు.. మునగచర్ల, దాములూరు మిల్లులకు ధాన్యం తరలించారు. ఈ రెండు మిల్లులకు బీజీలు పూర్తవడంతో జగ్గయ్యపేట, మైలవరం మిల్లులకు తరలించారు. ఇప్పుడు ఆ మిల్లులకు బీజీలు లేక ట్రక్‌షీట్ నమోదవడం లేదు. కొందరు ట్రక్‌షీట్లు లేకుండా మిల్లులకు తరలించినా కొనుగోలు చేసినట్లు చూపడం లేదు. ✦ సమీప మిల్లుల్లో అవకాశం లేక అధికారులు ఇబ్రహీంపట్నం తరలిస్తున్నారు. రవాణా ఖర్చులు తామే చెల్లిస్తున్నామని అధికారులు చెబుతున్నా చాలా మంది రైతులు వారి సొమ్ముతోనే తరలిస్తున్నారు. ✦ లోడు చేసే మిల్లులు తరలింపు చాలని కోతలు. అయితే కావాలనే సంచులు ఇవ్వకుండా సిబ్బంది తాత్సారం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ✦ దీనిపై పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ మాట్లాడుతూ.. బ్యాంకు గ్యారంటీ సమస్య పరిష్కారమైంది. త్వరలోనే తామే వాహనాల్లో ధాన్యం తరలిస్తామన్నారు.



మాగల్లు: ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలు

10 ఎకరాల్లో సాగు చేశా. 250 బస్తాల దిగుబడి రాగా మిల్లుకు తరలించడానికి మూడురోజులుగా ఎదురు చూస్తున్నాం. అధికారులు స్థానిక మిల్లుల్లో ధాన్యం కొనేలా చూడాలి. లేదంటే రవాణా భారం భరించలేం.



**- సత్యంబాబు, అబ్రహాం, వెంకటేశ్వరరావు, మాగల్లు రైతులు**

# ముక్కోటి వేడుకకు శతకోటి దండాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

నందిగామ రథం సెంటరులోని ముక్కోటి మండపానికి ప్రత్యేకత ఉంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 126 ఏళ్లుగా ఒకే అర్చక కుటుంబానికి చెందిన నాలుగు తరాలవారు ఈ మండపంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను అనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈ మండపం ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగాల ప్రముఖులకు సన్మాన వేదికగా గుర్తింపు పొందింది. నందిగామలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు 1905లో ఇక్కడ సీఐగా పనిచేసిన సువర్ణ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ వెంపా గోపాలరావునాయుడు శ్రీకారం చుట్టారు. 1999లో భక్తుల విరాళాలతో వేడుకలకు శాశ్వత మండపం నిర్మించారు. 2001లో మండపానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కింది. అప్పటి నుంచి ఏటా వైకుంఠ ఏకాదశి నుంచి వారం రోజులు హరికథాగానం, భరత నాట్యం, కూచిపూడి నాట్యం, ఆధ్యాత్మిక ప్రవచనాలతో పండగ వాతావరణం నెలకుంటుంది. శోభానాయుడు వంటి ఎందరో నాట్య కళాకారులు ఇక్కడ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. సినీనటులు ధూళిపాళ్ల, కాంతారావు, నూతనప్రసాద్, చంద్రమోహన్, గుమ్మడి, సోమయాజులు, అల్లు రామలింగయ్య, పద్మనాభం, సినీగేయ రచయితలు సిరివెన్నెల సీతారామశాస్త్రి, చంద్రబోస్ సన్మానం అందుకున్నారు. హరికథా పితామహుడు కోట సచ్చిదానందశాస్త్రి, ఆదిభట్ల నారాయణదాసు ఇక్కడ హరికథా గానం చేశారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సుశీల, శైలజ తమ గానంతో వీనులవిందు చేశారు. మేడసాని మోహన్, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు అష్టావధానం, సహస్రావధానంతో సాహితీ ప్రియులను అలరించారు.

### 126 ఏళ్ల ఉత్సవాలకు అరుదైన రికార్డు



# ఆయుర్వేదం.. అమృతతుల్యం

### బెజవాడ వేదికగా ఉత్తమ సేవలు

✱ మధుమేహంతో కాలికి పుండు ఏర్పడి రోజుల తరబడి తగ్గడం లేదా? దానికి కచ్చితమైన చికిత్స ఉంది. జలగలతో కాలి పుండును శుభ్రం చేసి తగ్గించే చికిత్స విధానం నగరంలో అందుబాటులో ఉంది. ✱ సుదీర్ఘకాలం నడుం నొప్పితో విలవిలలాడిపోతున్నారా... కంటి నిండా నిద్ర పోనీయని ఈ నొప్పిని అంచెలంచెలుగా తగ్గించేస్తున్నారు...' ✱ అల్లోపతి మందులకు లొంగని అనేక మొండి వ్యాధులను తగ్గించి రోగులకు ఉపశమనం కలిగిస్తున్నారు... విజయవాడ మహాత్మాగాంధీరోడ్డులోని డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల. – గవర్నర్‌పేట, న్యూస్‌టుడే



విభాగాలు : 8 వైద్యులు : 12
పడకలు : 100
పీజీ విద్యార్థులు: 50మందికి పైగా
ఇన్‌పేషెంట్లు : 40–50 మంది
ఓపీ : 300 నుంచి 350 మంది

**ఏయే విభాగాలున్నాయంటే...** ఆయుర్వేద ఆసుపత్రిలో 8 రకాల వైద్య విభాగాలున్నాయి. అష్టాంగ ఆయుర్వేద అని పిలిచే దీనిలో శల్య (పైల్స్, ఫిస్టులా వంటి వ్యాధులకు శస్త్రచికిత్సలు), శాలాక్య (చెవి ముక్కు గొంతు), కాయచికిత్స (జనరల్ మెడిసిన్), బాల రోగ (పిల్లల వ్యాధులు), ప్రసూతి స్త్రీ రోగ, పంచకర్మ, స్వస్థ వృతి (ప్రివెంటివ్ మెడిసిన్), విష చికిత్స (ఫోరెన్సిక్ మెడిసిన్).

ఆయుర్వేదం అంటే పంచకర్మ చికిత్సలకు ప్రసిద్ధి. పక్షవాతం, కీళ్ల నొప్పులు, భరించలేని నడుం నొప్పి, శిరస్సుకు సంబంధించిన వ్యాధులకు... తైలాలతో చికిత్స చేస్తారు. కాలిపై పుండ్ల సమస్యకు వినూత్నమైన చికిత్స అందిస్తారు. పుండుపై జలగలను ఉంచుతారు. అవి చెడు రక్తాన్ని పీల్చేస్తాయి. తర్వాత జలగలను తీసివేసి దానిపై మందు వేసి కట్టుకడతారు. ఇలా తరచూ చేస్తుంటే.. పుండు మానుతుంది.

### 24×7 వైద్య సేవలు



ఏడాది పొడవునా 3 షిఫ్టుల్లో వైద్యులు 24 గంటలూ వైద్య సేవలు అందిస్తున్నాం. మందులు ఉచితం. ఇన్‌పేషెంట్లకు భోజనం కూడా ఉచితమే. అనేక ఆసుపత్రుల్లో తిరిగి పూర్తి స్థాయిలో వ్యాధి తగ్గని అనేక మంది దీర్ఘవ్యాధి రోగులు ఇక్కడకు చికిత్స కోసం వస్తుంటారు. వారందరికీ సాంత్వన కలిగిస్తాం. అభ్యంగనం, ఆవిరి చికిత్సలతో శారీరక దోషాలను ఒక చోటకు తీసుకువస్తారు. తైల చికిత్సలు, మందులు ఇచ్చి వాటిని తగ్గిస్తాం. సోమవారం, శనివారాల్లో 350 మందికి పైగా రోగులు వస్తారు
**- డాక్టర్ పి.కృష్ణవేణి, ఆసుపత్రి సూపరింటెండెంట్**

# కష్టమన్నా చూడరు.. కన్నీళ్లయినా తుడవరు!



కొత్త ప్రభుత్వ ఆసుపత్రికొచ్చే... నడవలేని రోగుల కోసం కేటాయించిన.. స్ట్రెచర్లు, వీల్‌ఛైర్లను అక్కడ పని చేసే సిబ్బంది మెడికల్ వ్యర్థాలు, చెత్త తరలిండానికి వినియోగిస్తుండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు. చెత్తకు, వ్యర్థాలకు ఉన్న విలువ రోగులకు ఇవ్వడం లేదని వాపోతున్నారు. మంగళవారం బ్రెయిన్ సర్జరీ జరిగి.. నడవలేని ఓ యువకుడిని బంధువుల ఆసుపత్రికి తీసుకొచ్చారు. స్ట్రెచర్ వెతికినా.. అందుబాటులో లేదు. దీంతో అక్కడ సిబ్బందిని ప్రాథేయపడినా కనికరించని వేళ.. నడిపించి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. అదే సమయంలో మెడికల్ వ్యర్థాల సంచులను స్ట్రెచర్‌పై పెట్టుకుని చెత్తతొట్టెల వరకు సిబ్బంది తీసుకెళుతున్న చిత్రమిది.



- ఈనాడు, అమరావతి

## క్రిస్మస్ శోభ!



వన్‌టౌన్: సెయింట్ పాల్ సెంటినరీ చర్చి

క్రిస్మస్ వేళ... నగరంలో చర్చిలు విద్యుత్తు కాంతులతో మెరిసిపోతున్నాయి. క్రిస్మస్ ట్రీలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. బీసెంట్‌రోడ్డు, లెనిన్ సెంటర్ తదితర ప్రాంతాలన్నీ షాపింగ్‌తో కిటకిటలాడుతున్నాయి. - **ఈనాడు, అమరావతి**



గాంధీనగర్: సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి వద్ద..

# అక్రమం గుట్టు.. అనిశాతో రట్టు!

- ఇబ్రహీంపట్నం ఎస్సార్వో ఉద్యోగుల ఇళ్లల్లో సోదా...
- ఇద్దరి వద్ద కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్న బృందాలు

**ఈనాడు - అమరావతి, ఇబ్రహీంపట్నం, భవానీపురం - న్యూస్‌టుడే:** ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఇద్దరు ఉద్యోగుల ఇళ్లల్లో మంగళవారం ఉదయం అనిశా తనిఖీలు చేపట్టింది. రాత్రి వరకు జరిగిన తనిఖీలు బుధవారమూ కొనసాగనున్నాయి. భవానీపురంలో ఉండే ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్.. సీనియర్ అసిస్టెంట్ షేక్ మహమూద్ ఇల్లు, కొండపల్లిలోని జూనియర్ అసిస్టెంట్ దివ్య నివాసంలో సోదాలు సాగాయి. గత నెల 5, 6న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు జరిగాయి. నాటి అక్రమాలపై అనిశా కేంద్ర కార్యాలయానికి అందిన నివేదిక మేరకు.. తాజా సోదాలు జరిగాయి.

**వేకువనే ఆరంభం...** ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏసీబీ అధికారుల బృందం మంగళవారం వేకువనే చేరుకుంది. మరో రెండు బృందాలు ఉద్యోగుల నివాసాల్లో సోదాలు చేశాయి. వీరిళ్లలో కీలక పత్రాలను (ఆస్తి పత్రాలు) స్వాధీనం చేసుకుని.. పరిశీలిస్తున్నారు. ఏసీబీ తనిఖీలను తెలుసుకొన్న దస్తావేజు లేఖరులు మంగళవారం కార్యాలయాలను మూసేశారు.

**అడుగడుగునా అక్రమాలే..** ★ ఇబ్రహీంపట్నం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏడాదిలోపే 1,500 ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో ఎక్కువగా యర్రగొండపాలెంలో కొన్న భూములవే... 400 వరకు ఇక్కడి నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ★ స్టాంప్ డ్యూటీలోనూ అక్రమాలు తేలాయి. నిర్ణీత రుసుము కన్నా తక్కువ వసూలు చేయడంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.40 వేలు గండి పడిందని గుర్తించారు. ★ గత 10 నెలలుగా రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ లేకనే.. భారీ అక్రమాలతో పాటు.. డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలింది. ★ కార్యాలయ సిబ్బంది పలువురు యూపీఐ ఖాతాలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి నుంచి సొమ్ము బదిలీ చేయించుకున్నారు. నేరుగా నగదు కాకుండా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తీసుకున్నారు. ★ తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.74,600 దొరికింది.



భవానీపురంలోని మహమూద్ ఇల్లు

### క్రిమినల్ కేసు నమోదు...

తాజా అవకతవకలపై అనిశా క్రిమినల్ కేసు పెట్టింది. నిందితులుగా షేక్ మహమూద్, దివ్యలను చేర్చారు. త్వరలో వీరిపై నమోదు చేసిన అభియోగాలపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. ఆపై శాఖాపరమైన చర్యలకు వీలుంది. ★ ప్రస్తుత తనిఖీలతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా గాంధీనగర్ కార్యాలయ ఉద్యోగి శ్రీనివాస్‌కు తాత్కాలిక సబ్‌రిజిస్ట్రార్‌గా, సాయిరాజ్‌కు జూనియర్ అసిస్టెంటుగా బాధ్యతలు అప్పగించారు.

# కొనుగోళ్లు.. టాప్‌లో మనోళ్లు..!

### అన్నీ ఆన్‌లైన్‌లోనే..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

ఒకప్పుడు కిరాణా సరకులు కొనాలంటే.. కాగితంపై రాసుకుని దుకాణానికి వెళ్లి తెచ్చుకునేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆన్‌లైన్లో ఆర్డర్లు పెడితే.. ఇంటికే తీసుకొచ్చే వెసులుబాటు ఉండడంతో.. రూ.లక్షల్లో కొనేస్తున్నారు. చక్కకూర, ఉల్లిపాయ, టమాటా, పంచదార, కుర్‌కురే.. . కాదేదీ షాపింగ్‌కు అనర్హం అంటున్నారు. రాష్ట్రంలోనే ముఖ్యమైన వ్యాపార కేంద్రంగా విజయవాడ ప్రసిద్ధి. 2025లో సరికొత్త వ్యాపార మార్పును నమోదు చేసింది. చుక్కకూర నుంచి ఐ ఫోన్ వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసి నగరవాసులు సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. కార్పొరేట్ నగరాలకు ధీటుగా కొంటున్నారు. నిద్ర లేచింది మొదలు.. పడుకునే లోపు ఉప్పు పప్పులు, సౌందర్య సాధనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వరకు.. అన్నింటినీ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తూ మారిన తమ జీవనశైలిని తెలియజేస్తున్నారు. తాజాగా దేశంలోని అగ్రగామి క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారంల్లో ఒకటైన ఇన్‌స్టామార్ట్ బెజవాడవాసుల కొనుగోళ్లపై తన తాజా నివేదికను వెల్లడించింది.



### అత్యధిక పెరుగుదల 538 శాతం

తాజా నివేదిక ప్రకారం.. వివిధ రకాల ఉత్పత్తుల కొనుగోళ్లలో గత ఏడాదితో పోలిస్తే అనూహ్యమైన కొనుగోలు శాతం నమోదైంది. బ్యాగులు, వాలెట్లు ఆర్డర్లు 538 శాతం పెరిగాయి. క్రీడలు, ఫిట్‌నెస్ ఉపకరణాల్లో 495 శాతం, ఆభరణాలు సౌందర్య సాధనాల్లో 330 శాతం, బొమ్మలు 245 శాతం, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు 223 శాతం చొప్పున పెరిగాయి.

### ఉదయం వేళ నిత్యావసరాలు

ఉదయం వేళలో నిత్యావసరాల ఆర్డర్లు ఎక్కువగా ఉంటున్నాయి. వీటిలో చుక్కకూర మొదటి స్థానంలో ఉంది. ఉల్లిపాయలు, టమాటాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. బంగాళాదుంపలు, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటి వస్తువుల ఆర్డర్లలో గణనీయంగా పెరుగుదల నమోదైంది. థమ్స్‌అప్, లేస్, బింగో, కుర్‌కురే, పంచదార, బిస్లరీ, విమ్ తదితర ఉత్పత్తులు తమ ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి.

### రూ.3.62 లక్షల ఉత్పత్తులు..

నగరానికి చెందిన ఒక వ్యక్తి ఏడాదిలో రూ.3.62 లక్షలు విలువైన ఉత్పత్తులు కొనుగోలు చేసి.. మొదటి స్థానంలో నిలిచారు. మరో నలుగురు రూ.3 లక్షలకు పైనే కొనుగోళ్లు చేశారు. ఈ లెక్కలు.. బెజవాడ వాసులు ప్రీమియం కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారని తెలియజేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మేమూ మారిపోతున్నామని స్పష్టం చేస్తున్నారు. కార్పొరేట్ నగరాలకు భవిష్యత్తులో పోటీ ఇస్తామని చాటి చెబుతున్నారు.

## లక్ష్యానికి చేరువగా ధాన్యం కొనుగోళ్లు

**ఎన్టీఆర్ కలెక్టరేట్ :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ లక్ష్యానికి చేరువలో ఉంది. మొత్తం 1,50,000 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 17,399 మంది రైతుల నుంచి 1,23,683.320 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ తెలిపారు. రైతులకు రూ.254.54 కోట్లను వారి ఖాతాల్లో 24 గంటల్లోగా జమచేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఒక్క రోజులోనే 3,012.280 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వివరించారు.

# కారు ఉందండి.. కంత్రీ లేడండి..!

- ★ ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో కారు వదిలి రాజేష్ పరారీ
- ★ తేజకు రిమాండ్

**ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట:** ఎండీఎంఏ కేసులో పోలీసులకు పట్టుబడి మాచవరం స్టేషన్ నుంచి కారులో పరారైన రాజేష్ వాహనం దొరికింది. రమేష్ ఆసుపత్రి జంక్షన్ సమీపంలోని ఎగ్జిక్యూటివ్ క్లబ్ వద్ద మంగళవారం కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం పోలీసు స్టేషన్ నుంచి పరారై.. అమ్మ కల్యాణ మండపం మీదుగా వెళ్లి ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో కారు పార్క్ చేశాడు. రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్దకు నడిచి వెళ్లి ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి రామవరప్పాడు రింగ్ వద్ద దిగాడు. ఆపై ఆటోలో రామవరప్పాడు పైవంతెన మీదుగా గొల్లపూడి వరకు వెళ్లాడు. అక్కడ కిరాయికి కారు మాట్లాడుకున్నాడు. కానీ రాజేష్ కంగారు చూసి కారు డ్రైవర్ కిరాయి నిరాకరించాడు. దీంతో చేసేది లేక నిందితుడు అక్కడ నుంచి నడిచి వెళ్లిపోయాడు. గొల్లపూడి సెంటర్ వరకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అక్కడ నుంచి ఎటు వెళ్లాడనేది ఆచూకీ దొరకలేదు. రాజేష్ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాలు గాలిస్తున్నాయి.

**తొమ్మిది మంది నిందితులు...** బెంగుళూరు ఎండీఎంఏ కాంటాక్టును ఇచ్చిన తేజను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించడంతో నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపారు. ఈ కేసులో జగదీష్ కుమార్, అఖిలేష్, రాజేష్, తేజను నిందితులుగా చేర్చారు. మరికొందరినీ చేర్చే వీలుంది. బెంగళూరులో వీరికి ఎండీఎంఏ ఇచ్చిన వారు.. విజయవాడలో జగదీష్ కుమార్ గ్యాంగ్‌లో మరికొందరి ప్రమేయాన్ని గుర్తించారు. మొత్తం తొమ్మిది మంది నిందితుల జాబితాలోకి ఎక్కనున్నారు. నిందితుడు తేజ నుంచి పోలీసులు కీలక విషయాలు రాబట్టి ఆ మేరకు తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.



రాజేష్ వదిలివెళ్లిన కారు..

# బౌలర్ల జోరు.. బ్యాటర్ల హుషారు

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం సీనియర్స్ విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల, శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల (నందమూరు), ప్రభుత్వ దంత కళాశాల (విజయవాడ) జట్లు విజయకేతనం ఎగురవేశాయి.



విజేతగా నిలిచిన ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల జట్టు



టాస్ వేసి మ్యాచ్ ప్రారంభిస్తున్న గోస్‌పెల్ మెడికల్ అకాడమీ చైర్మన్ వి.నరేంద్రబాబు

★ తొలి మ్యాచ్‌లో ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఉషారామా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన పీవీపీ సిద్ధార్థ జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. కె. చంద్రకిరణ్ 15 పరుగులతో రాణించాడు. ప్రత్యర్థి బౌలర్ ఎండీ రెహాన్ 9 పరుగులు ఇచ్చి 4 వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఉషారామా జట్టు 8.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. డి. ప్రవీణ్ 18 బంతుల్లో 3 సిక్సర్లతో 31 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. ఈ మ్యాచ్‌లో డి.ప్రవీణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.





విజయం సాధించిన ఆనందంలో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల (నందమూరు) జట్టు

★ మరో మ్యాచ్‌లో శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల (నందమూరు) జట్టు 66 పరుగుల ఆధిక్యంతో ఎస్సీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల జట్టుపై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వాసవి కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. టి.ఇస్మాయిల్ 27 పరుగులతో రాణించాడు.. ఎస్‌కే రాకిబ్ 18 బంతుల్లో 28 పరుగులు చేసి క్రీజ్‌లో నిలిచాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన న్యాయ కళాశాల జట్టు 7.4 ఓవర్లలో 25 పరుగులకే కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్లు సీహెచ్ శ్యాంబాబు, జె.రోహిత్‌బాబు, ముస్సుర్ బేగ్ రెండేసి వికెట్లు కూల్చారు. ఈ మ్యాచ్‌లో ఎస్‌కే రాకిబ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. గోస్‌పెల్ మెడికల్ అకాడమీ చైర్మన్ వి.నరేంద్రబాబు అతిథిగా హాజరై టాస్ వేసి ఈ మ్యాచ్‌ను ప్రారంభించారు.





విజేతగా నిలిచిన ప్రభుత్వ దంత కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే



డి.ప్రవీణ్ ఎస్‌కే రాకిబ్ ఆర్.రంజిత్

వేరొక మ్యాచ్‌లో ప్రభుత్వ దంత కళాశాల జట్టు 13 పరుగుల ఆధిక్యంతో నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన నిమ్రా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన దంత కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. ఎస్.సూర్య ఆకాష్ 24, సయ్యద్ అబ్దుల్ రెహ్మాన్ 28 పరుగులతో రాణించారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన నిమ్రా కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 57 పరుగులకే ఆలౌటైంది. ఎండీ మెహబూబ్ అలీ 24 పరుగులు చేయగా.. ప్రత్యర్థి బౌలర్ ఆర్.రంజిత్ 5 పరుగులు ఇచ్చి 4 వికెట్లు కూల్చాడు. ఈ మ్యాచ్‌లో ఆర్.రంజిత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

| | |
|---|---|
| మొదటి మ్యాచ్ | నలంద డిగ్రీ కళాశాల X ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల |
| రెండో మ్యాచ్ | గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల X ఆంధ్రా లయోలా డిగ్రీ కళాశాల |
| మూడో మ్యాచ్ | పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల X కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల |

# వ్యవసాయ ఉపకరణాలు సరఫరా చేస్తే మేలు

- జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి విజయకుమారికి రైతుల విజ్ఞప్తి
- 'ఈనాడు' ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

ఎన్టీఆర్ కలెక్టరేట్, సూర్యారావుపేట, న్యూస్‌టుడే

జిల్లాలో రబీ సీజన్ ప్రారంభమైంది. రైతులు మొక్కజొన్న, వరి వంటి పంటలు వేశారు. ఈ క్రమంలో రైతుల సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి డి.ఎఫ్.ఎం.విజయకుమారితో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు ఆమె సమాధానం ఇచ్చారు. ఎరువుల సరఫరాపై రైతులు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు.



ఈనాడు మీతోడు

? **సరిపడా బయో ఫెర్టిలైజర్స్ అందుబాటులో ఉంచగలరు.** - రామకోటేశ్వరరావు, మాగల్లు, నందిగామ మండలం

✔ జిల్లాలో మొత్తం 1,192 టన్నుల ఎరువులు, 375 టన్నుల యూరియా అందబాటులో ఉంది.

? **ధాన్యం ఆరబోసేందుకు ప్లాట్‌ఫారం లేదు.** - జవ్వాది రాధాకృష్ణ (కొణతమాత్మకూరు, నందిగామ మండలం)

✔ మార్కెటింగ్‌శాఖ సమన్వయంతో రైతులకు ఏర్పాటు చేస్తాం.

? **వ్యవసాయంలో యంత్రాల ఆవశ్యకత పెరిగింది. ప్రభుత్వం సరఫరా చేస్తే బాగుంటుంది.** - పుచ్చకాయల శ్రీనివాసరావు (జి.కొండూరు), వెంకటేశ్వరరావు (వెంకటాపురం, జి.కొండూరు మండలం), అప్పారావు ఎర్రగుంట్ల (తోటరావులపాడు, చందర్లపాడు మండలం)

✔ ప్రభుత్వం దీనిపై గైడ్‌లైన్స్ రూపొందిస్తోంది. రాగానే.. ఉపకరణాలు అందిస్తాం.

? **కూరగాయలు వేశాం. ఈ క్రాప్ నమోదైతేనే మందులు ఇస్తామంటున్నారు. కొంత మంది మొక్కజొన్న వేశారు. పట్టాలు ఉంటే మొక్కజొన్న ఆరబోసుకుంటాం.** - షేక్ మస్తాన్‌వలీ (షేర్ మహ్మద్ పేట, జగ్గయ్యపేట మండలం)

✔ రైతులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ఎకరాకు ఒక కట్ట ఇస్తున్నాం. అవసరమైనపుడు మళ్లీ ఇస్తాం. పట్టాల సమస్య తీరుస్తాం.

? **మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.** - చింతాడ సాంబశివరావు (దాములూరు, నందిగామ మండలం)

✔ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం దీనికి ధర కూడా నిర్ణయించింది.

? **ధాన్యం ఎత్తేందుకు సంచులు కావాలి.** - అర్జయ్య (శ్రీరాంపురం, రెడ్డిగూడెం మండలం)

✔ అధికారులకు చెప్పి సంచులు సమకూరుస్తాం.

? **మొక్కజొన్న పంట వంగపువ్వు రంగులోకి మారుతోంది. ఎరువుల వాడకంపై సూచనలు ఇవ్వగలరు.** - మాదిరాజు వెంకటేశ్వరరావు (జుజ్జూరు, వీరులపాడు మండలం)

✔ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. కరపత్రాలు తయారు చేయించి.. స్థానిక వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు అందేలా చేస్తాం.

? **రైతులు పండించిన కూరగాయలను ఒకే చోట విక్రయించేలా చర్యలు తీసుకోగలరు.** - శ్రీనివాస్, నున్న

? **అన్ని రకాల ఎరువులు ఉన్నాయి. కానీ నాకు జిప్సం కావాలి.** - గుండెబోయిన వీరవెంకటేశ్వరరావు, షేర్ మహ్మద్‌పేట, జగ్గయ్యపేట మండలం

✔ భూసార పరీక్ష కేంద్రం వారు చవుడు భూమి అని నిర్ధారిస్తే.. జిప్సం ఇస్తాం.

✔ సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటలను ప్రకృతి వ్యవసాయం పేరుతో ఇప్పటికే ప్రజల ముంగిటకు తీసుకువస్తున్నాం.

? **పంటల బీమా కోసం ఈ-క్రాప్ నమోదు గడువు పెంచగలరు.** - హనుమాన్‌రెడ్డి, నున్న

✔ సమస్యను తెలియజేస్తూ ఒక లేఖ ఇవ్వండి. ప్రభుత్వం దృష్టిలో పెట్టి గడువు పెంచేలా చర్యలు తీసుకుంటాం.

? **రబీ పంటలకు జింక్, జిప్సం కావాలి.** - సగ్గుర్తి పెదబాబు (మర్సుమిల్లి, మైలవరం మండలం), ముల్లంగి వెంకటరెడ్డి (పోచంపల్లి, జగ్గయ్యపేట మండలం)

✔ భూసార పరీక్షా కేంద్రం నుంచి నివేదిక తీసుకువస్తే.. కావాల్సినవి ఇస్తాం.

? **తైవాన్ స్ప్రేయర్, రోటా విల్లర్ యంత్రాలను రాయితీపై ఇవ్వాలి.** - సైదారెడ్డి, పోచంపల్లి, జగ్గయ్యపేట మండలం

✔ యంత్రాల సరఫరాకు గైడ్‌లైన్లు రాగానే రైతులకు కావాల్సిన ఉపకరణాలు అందిస్తాం.

★ సోమవరపు వెంకట నాగేశ్వరరావు, నందుల విశ్వకుమార్, బొంతు మాధవరావు, జంగాల శివాజీ తదితర రైతులు ఎరువుల సరఫరా సక్రమంగా జరిగిందని, వ్యవసాయాధికారుల సహకారం బాగుందని కితాబు ఇచ్చారు.

# సినీ, సాహిత్య, సాంస్కృతిక మేళవింపు

## విజయవాడలో ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** రాజధాని ప్రాంతమైన విజయవాడ మరో ఉత్సవానికి వేదిక కానుంది. 2026, జనవరి 8వ తేదీ నుంచి 10 వరకు మూడు రోజుల పాటు ఆంధ్రుల అభిమాన ఆవకాయ పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నారు. సినీ, సాహిత్య, సాంస్కృతిక మేళవింపుగా 'ఆవకాయ్- అమరావతి సాంస్కృతిక ఉత్సవాలు' జరుగుతాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అమరావతిని సాంస్కృతిక, సాహితీ రాజధానిగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశానికి అనుగుణంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

**పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో..** ఉత్సవాలను నగరంలోని పున్నమి ఘాట్, భవానీ ద్వీపం (ఐల్యాండ్)లో నిర్వహించే ఉత్సవాలకు ప్రవేశం ఉచితమని కలెక్టర్ వివరించారు. ఉత్సవాలను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. సినిమా, సంగీతం, సాహిత్యం, సాంస్కృతిక వైభవాన్ని ఒకే వేదికపైకి తెచ్చే గొప్ప ఉత్సవాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వ సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు సినిమా మూలాలు, సాహిత్య నేపథ్యం, నేటి మార్పులపై చర్చలు, ప్రదర్శనలూ ఉంటాయన్నారు. సంగీత ప్రదర్శనలు, హెర్ ఫ్రేమ్స్, హెర్ ఫైర్ ప్రదర్శనలు, ది మ్యూజిక్, మస్తీ, మ్యాజిక్, టైమ్ లెస్ టేల్స్, ముషాయిరా ఎక్స్ పీరియన్స్ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



ప్రచార పత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్ లక్ష్మీశ, శ్రీనివాస్, సయ్యద్ శామ్స్ తదితరులు

**రుచికర వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్..** వారసత్వ యాత్రలు, ఘాట్ ఫెర్రీ ప్రయాణాలు, రుచికరమైన స్థానిక వంటకాలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు చెప్పారు. తొలుత వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీటీఏ డిప్యూటీ సీఈవో ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇది తొలి అడుగు మాత్రమేనని, ఏటా నిర్వహించనున్నట్టు తెలిపారు. టీమ్ వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీటీఏ అధికారులు, టీమ్ వర్క్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఉత్సవాల ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు.

## ఫ్లెక్సీల విచ్చలవిడి వినియోగంపై పిల్

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌కు ఎన్నికల నేపథ్యంలో విజయవాడ సిటీ సివిల్ కోర్టు పరిసరాల్లో కొంతమంది న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది షేక్ మస్తాన్ వలి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కట్టడం వల్ల ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనలు ఖరారు చేసేలా ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శిని ఆదేశించాలని కోరారు.

## చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షలు

**విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే:** మాజీ ఎమ్మెల్యే, వైకాపా నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జిల్లా జైలు అధికారులు మంగళవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. చర్మ వ్యాధి, ఈఎన్‌టీ, ఆస్తమాలజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు ఆయన పోలీసులకు తెలపడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. తొలుత డెర్మటాలజిస్టుకు చూపించారు. ఆయన చూసి మందులు రాసిచ్చారు. అనంతరం ఈఎన్‌టీ, ఆస్తమాలజీ విభాగాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం మందులు రాసిచ్చారు. తిరిగి ఆయన్ని జైలుకు తరలించారు. మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## పిల్లల విక్రయం కేసులో పీటీ వారెంట్లు

**విజయవాడ నేరవార్తలు:** చిన్న పిల్లల విక్రయం కేసులో విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన పలువురు నిందితులను కస్టడీ కోరుతూ భవానీపురం, నున్న, కొత్తపేట పోలీసులు న్యాయస్థానాల్లో వేర్వేరుగా పీటీ వారెంట్లు దాఖలు చేశారు. ప్రధాన సూత్రధారి బలగం సరోజినితో పాటు పలువురిని అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో భవానీపురం పోలీసులు బలగం సరోజిని, భారతిపై న్యాయస్థానంలో మంగళవారం పీటీ వారెంట్ వేశారు. సోమవారం కొత్తపేట, నున్న పోలీసులు పీటీ వారెంట్‌లు దాఖలు చేశారు.

## విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌లో పరీక్ష ఫలితాలు

**మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే :** కృష్ణా విశ్వ విద్యాలయ పరిధిలో వివిధ కోర్సులకు ఇటీవల నిర్వహించిన పరీక్ష ఫలితాలను విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.వీరబ్రహ్మాచారి తెలిపారు. బీటెక్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) ఐదో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ/ఎంబీఎల్‌బీ నాలుగు, ఎనిమిదో సెమిస్టర్ల రీవాల్యుయేషన్, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ రీవాల్యుయేషన్, బీపీడీ/డీపీడీ రెండో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. పునర్మూల్యాంకనం కోసం జనవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీఫార్మసీ నాలుగు, ఏడో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆయన తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

## పీజీ మెడికల్ రెండో విడత కౌన్సెలింగ్‌కు ఐచ్ఛికాలు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన కన్వీనర్/యాజమాన్య పీజీ మెడికల్ సర్వీస్/నాన్ సర్వీస్ సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత గల అభ్యర్థులు 23వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఆప్షన్లు ఇచ్చుకోవాలి. సమస్యలుంటే 90007-80707, 80082-50842 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు దరఖాస్తులు

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** 2026-27 విద్యా సంవత్సరానికి దేశంలోని కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఉన్న కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు జాతీయ వైద్య కమిషన్ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈనెల 29 నుంచి జనవరి 28వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరింది.

**మొదటి ఏడాది ఫలితాల వెల్లడి:** ఈ ఏడాది నవంబరు/డిసెంబరులో జరిగిన మొదటి సంవత్సరం 2020-21, 2023-24 బ్యాచ్‌ల ఎంబీబీఎస్ ఫలితాలు విడుదలయ్యాయి. వ్యక్తిగత పరిశీలన కోరే అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.2000 చొప్పున చెల్లించి ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

## ఆకలి రాజ్యం క్యాంటీన్‌లో అధికారుల తనిఖీ

**విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే:** విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఆకలి రాజ్యం క్యాంటీన్‌లో నూడుల్స్‌ని ఎలుకలు తింటున్న వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థి క్యాంటీన్ లోపల పరిస్థితి, ఆహారం నాణ్యతగా లేదంటూ పోస్ట్ చేశారు. దాంతో మంగళవారం జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీనివాస్ తన బృందంతో వెళ్లి క్యాంటీన్‌లో తనిఖీలు చేపట్టారు. వంటమేస్త్రీ రాకపోవడంతో నూడుల్స్‌ని డస్ట్‌బిన్‌లో పడేసేందుకు అక్కడ ఉంచామని క్యాంటీన్ నిర్వాహకులు సమాధానం ఇచ్చారని తెలిసింది. వీడియో క్యాంటీన్ లోపలిదా? కాదా? అని అధికారులు పరిశీలిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, గోడలకు రంగులు వేయలేదని, వంట నూనె వాడిందే వాడుతున్నారని, 25 డిగ్రీలు ఉండాల్సిన నూనె ఉష్ణోగ్రత... 37 వరకు ఉన్నట్టు అధికారులు పరీక్షలు చేసి గుర్తించారు. భోజనం చేసే వారి ఆరోగ్యానికి ముప్పు ఏర్పడేలా నిర్వాహకులు తీరుందని, ఈ ఏడాది జనవరితో లైసెన్స్ గడువు ముగిసినా రెన్యువల్ చేయలేదని తేలింది. దీంతో క్యాంటీన్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. సంయుక్త కలెక్టర్ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు. జేసీ తీర్పు అనంతరం తదుపరి చర్యలుంటాయని తెలిపారు.



నూనె పరిశీలిస్తున్న ఆహార నియంత్రణాధికారి శ్రీనివాస్



నూడుల్స్ తింటున్న ఎలుకలు



## పాఠశాల బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**నందిగామ, న్యూస్‌టుడే :** మండలంలోని కేతవీరునిపాడు వద్ద మంగళవారం పాఠశాల బస్సును ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. త్రుటిలో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. చందర్లపాడు మండలం మునగాలపల్లి గ్రామానికి చెందిన సెయింట్ లూసీ పాఠశాల బస్సు 25 మంది విద్యార్థులను ఎక్కించుకుని వస్తోంది. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు దాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో పాఠశాల బస్సు డ్రైవర్ వైపు భాగంలో అద్దం పగిలింది. బస్సు దెబ్బతినగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే నందిగామలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాలు రాజీ పడటంతో కేసు నమోదు చేయలేదు.



దెబ్బతిన్న పాఠశాల బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులపై సమీక్ష

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులపై నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ, వైద్య శాఖ అధికారులతో మంగళవారం సమీక్షించారు. క్షేత్ర స్థాయిలోని పలు ఆసుపత్రుల వైద్యులు జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా, శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువ సంఖ్యలో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసినీ, విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వి.రావు, డీసీహెచ్ఎస్ ఎస్.మాధవీదేవి, వివిధ విభాగాల వైద్యాధికారులు హిమబిందు, అనిల్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరు
• తిరువూరు • మైలవరం

## దేశ మాజీ ప్రధాన మంత్రులకు నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, దుర్గారావు, వంటి, మనిపల్లి, సుధాకర్, వెంకటరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు వర్ధంతి, మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి నిర్వహించారు. వారిద్దరి చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు బి.ప్రకాశ్‌రావు, జీవన్‌బాబు, లక్ష్మీదాసు తదితరులు నివాళులర్పించారు. పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో పీవీ.నరసింహారావు చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

## ప్రకృతి విపత్తులపై మాక్‌డ్రిల్

ఇబ్రహీంపట్నం : ప్రకృతి విపత్తు, తుపాన్ల సమయాల్లో చేపట్టాల్సిన చర్యలపై బుధవారం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద మాక్‌డ్రిల్‌ను నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం మంగళవారం తెలిపారు.

## పైవంతెన నిర్మాణంపై ఆందోళన వద్దు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీ చిన్ని, పక్కన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే : విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గొల్లపూడి వద్ద నుంచి భవానీపురం వరకు పైవంతెన నిర్మాణంతోనే అభివృద్ధి జరుగుతుందని, గ్రామస్థులెవరూ ఆందోళన చెందవద్దని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొల్లపూడి వద్ద వారధి నిర్మించడం వల్ల దిగువనున్న ప్రాంతం అభివృద్ధికి నోచుకోదనే అభిప్రాయం కొందరు వ్యక్తం చేస్తున్నారని, అందులో నిజం లేదన్నారు. దీని నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు కొన్నేళ్ల సమయం పడుతుందని, తద్వారా అభివృద్ధి ఆగిపోతుందని చెప్పారు. పైవంతెన వద్దనుకుంటే పశ్చిమ బైపాస్ వరకు మాత్రమే జాతీయ రహదారి విస్తరణ పరిమితం చేయాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గొల్లపూడి వద్ద పైవంతెన నిర్మాణానికి గ్రామస్థులు కొందరు అభ్యంతరం తెలియజేస్తున్నప్పటికీ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

➡ కవులూరులోని మస్జిద్ బజార్‌లో పంచాయతీ బోరు మరమ్మతులకు గురైందని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సరోజ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు. ➡ తిరువూరు 7వ వార్డులోని డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి స్థానికులు ఇబ్బందుల్ని మున్సిపల్ అధికారులకు తెలిపారు. శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రైనేజీని శుభ్రం చేయించారు. ➡ తిరువూరు 18వ వార్డులోని మురుగు కాలువల్లో పారుదల లేదని స్థానికులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ అధికారి స్పందించి కార్మికులను పంపించి పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

? ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి రేపూడి తండా వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. - బి.హరి, రేపూడి తండా

✔ ఆ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు త్వరలో ప్రారంభిస్తాం. - ఓ.అచ్యారావు, ఆర్అండ్‌బీ ఏఈ, ఎ.కొండూరు - న్యూస్‌టుడే, ఎ.కొండూరు

## వినూత్న ఆలోచన.. సామర్థ్యాల ఆధారంగా విభజన

మైలవరం, న్యూస్‌టుడే

'ఏరా.. నీకన్నిసార్లు చెప్పినా అర్థం కాదా? అలాగైతే నీ చదువు సాగినట్లే..' తరగతిలో వెనుకబడిన విద్యార్థులనుద్దేశించి ప్రతి పాఠశాలలో ఇలా మందలించే ఉపాధ్యాయులను చూస్తుంటాం. అయితే వారిని ఎలా మార్చాలో ఎవ్వరూ తగిన శ్రద్ధ పెట్టరన్నది తెలిసిందే. వీరిని సైతం చదువులో ముందుకు తీసుకొచ్చే ప్రణాళికను విద్యా శాఖ చేపట్టింది. చదువు సామర్థ్యం ఆధారంగా విద్యార్థులను విభజించి, ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాజాగా ప్రభుత్వం పునాది అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం ప్రవేశపెట్టింది. ఒకటో తరగతి నుంచి పద ప్రయోగం, గణితం, ఇతర అంశాల్లో హైస్కూళ్లకు వెళ్లే లోగా సంసిద్ధం చేయాలనేది కార్యక్రమ లక్ష్యం. ఇప్పటికే విద్యార్థుల సంఖ్య తగ్గి, ప్రాథమిక విద్యా వ్యవస్థ ఒడిదుడుకుల లోనవుతున్న తరుణంలో ఈ వినూత్న కార్యక్రమం రూపొందించారు. ఈ నెల 8 నుంచి దీన్ని ప్రారంభించగా 75 రోజుల పాటు కొనసాగించనున్నారు.

### బడుల్లో కార్యాచరణ ఇలా..

పాఠశాలల్లో 1, 2 తరగతులను ఒక భాగం, 3, 4, 5 తరగతులను మరో భాగంగా విభజించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి బాగా చదివే వారిని స్కై, మధ్యస్థంగా ఉన్న వారిని మౌంటెయిన్, వెనుకబడి ఉన్న వారిని స్ట్రీమ్ పేరిట విభజించారు. పూర్తిగా వెనుకబడిన 3, 4, 5 తరగతులవారిని ఒక్కో ఉపాధ్యాయుడు బాధ్యతగా తీసుకోవాల్సి ఉంటుంది. చదవలేని వారికి సైతం అర్థమయ్యే రీతిలో బోధించి, ఎగువన గ్రూపుల్లోకి చేర్చేలా చేయడం వారి విధి.

| మైలవరం నియోజకవర్గంలో.. | |
|---|---|
| ప్రభుత్వ పాఠశాలలు | 159 |
| విద్యార్థులు | 14,551 |
| ప్రాథమిక బడులు | 116 |
| ప్రాథమికలో చిన్నారులు | 6,253 |
| స్ట్రీమ్ విభాగంలోని వారు | 50% పైగా |


వెల్వడం పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

సగానికి పైగా స్ట్రీమ్: కార్యక్రమం అమలులో భాగంగా డైట్ కళాశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, మండలంలోని ఒక సీఆర్పీని జత చేసి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. ఇందులో సగానికి పైగా స్ట్రీమ్ విభాగంలోనే ఉన్నట్లు తెలిసింది. కొన్ని సులువైన పదాలను ఉచ్చరించలేని విద్యార్థులున్నారని వారు గుర్తించారు. దాంతో పూర్తి స్థాయిలో సానబెట్టేలా, బోధనేతర కార్యక్రమాలు తగ్గాలని సూచిస్తున్నారు.



## ప్రతిభకు ప్రశంసలు.. బహుమతులు

మైలవరం, న్యూస్‌టుడే : 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం స్థానిక అక్షర ఎన్నార్ పాఠశాలలోని విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ అంశంపై క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో ఎస్.తేజస్వి(9వ తరగతి), యు. పీటర్, జి.నరేష్(8వ తరగతి) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వారికి పాఠశాల కరస్పాండెంటు వీవీ.లక్ష్మి, ప్రిన్సిపల్ కేవీ కృష్ణారావు బహుమతులను అందజేశారు.


మైలవరం : విజేతలతో లక్ష్మి, కృష్ణారావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక వికాస్ టెక్నో స్కూల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఎస్.కె.సానియా (9వ తరగతి), జి.అబి లక్ష్మి ప్రసన్న(9వ తరగతి), పి.ఆరాధ్య(9వ తరగతి) విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ నరెడ్డ వేమన కుమార్, ప్రిన్సిపల్ రాయుడు గోపి బహుమతులను అందజేశారు. ప్రైమరీ ఇన్‌ఛార్జి చెన్నకేశవులు, ఉపాధ్యాయులు పి.శివకృష్ణ, రాజేష్ నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.


విస్సన్నపేట: గెలుపొందిన వారితో ఉపాధ్యాయులు


గొల్లపూడిలో చరణ్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని


విస్సన్నపేటలో ప్రసంగిస్తున్న శశికళ


మైలవరం: స్ప్రేయర్లు అందుకున్న వారితో ఏడీఏ, ఏవో, లయన్స్ క్లబ్ నాయకులు

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

సుస్థిర వ్యవసాయం కోసం రైతులను శక్తి వంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో జాతీయ రైతు దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదాతలను ఘనంగా సన్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బృందం


పెనుగొలనులో సత్కారం అందుకున్న వారితో నిర్వాహకులు


కొత్తూరు తాడేపల్లి: అన్నదాతతో కలిసి కేకు కోస్తూ..

## డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ

మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 2026 నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను కళాశాల గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశరెడ్డి, అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ కె.అప్పారావు, ఉప ప్రిన్సిపల్ బి.రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియామకం

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక అక్షర స్కూల్ డైరెక్టర్, విద్యావేత్త కల్లి నాగేశ్వరరావు భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు.

## ఉరుసు మహోత్సవాలకు ఆహ్వానం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 29, 30, 31 తేదీల్లో కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశకు నగరంలోని కలెక్టరేట్‌లో ఉరుసు కమిటీ ఛైర్మన్ అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఇస్లాం సంప్రదాయం ప్రకారం కలెక్టర్‌ను సత్కరించారు. కొండపల్లి పురపాలిక కో ఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్ సుభానీ, ఇబ్రహీంపట్నం మండల తెదేపా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జిలానీ, షేక్ బాషా, సయ్యద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## తొలగిన అవస్థలు.. వేగంగా సేవలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అధికారులు తాజాగా 5జీ స్మార్ట్ ఫోన్లను అందించారు. వీటితో లబ్ధిదారులకు కేంద్రాల ద్వారా అందించే సేవలను వేగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చని సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు పోషకాహారం, కిశోర బాలికలకు ఆరోగ్య అవగాహన సదస్సులను వీరు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి పది రకాల యాప్‌లను ప్రభుత్వం కేటాయించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి రోజు అందించిన సేవలను యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు నివేదించాలి. గతంలో సిబ్బందికి 2జీ ఫోన్లు పంపిణీ చేశారు. అవి సమాచారం పంపించేందుకు సరిగా పని చేయక పోవడంతో కార్యకర్తలు నానా అవస్థలు పడ్డారు. వైకాపా హయాంలో తమకు యాప్‌లు వినియోగానికి, వేగానికి తగిన స్మార్ట్ ఫోన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ ఉద్యోగులు పోరాడిన ఫలితం దక్కలేదు.


గంపలగూడెం: ఎమ్మెల్యే శ్రీనివాసరావు నుంచి చరవాణులు అందుకున్న అంగన్‌వాడీ పర్యవేక్షకులు, కార్యకర్తలు

| ఫోన్లు అందుకున్న వివరాలు.. | |
|---|---|
| మండలం | కార్యకర్తలు |
| గంపలగూడెం | 78 |
| ఎ.కొండూరు | 51 |
| విస్సన్నపేట | 72 |
| తిరువూరు | 64 |

### హామీ మేరకు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల ద్వారా చిన్నారులు, కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలు, పోషకాహారం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ మేరకు కార్యకర్తలతో పాటు సెక్టార్ పర్యవేక్షకులకు 5జీ చరవాణులు పంపిణీ చేశారు. ఈ నెల 19న తిరువూరు నియోజకవర్గంలోని 10 మంది పర్యవేక్షకులు, 265 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు, సీడీపీవో పి.కృష్ణకుమారి ఫోన్లు అందించారు. మూడ్రోజుల నుంచి వాటిని వినియోగిస్తున్న కార్యకర్తలు, సూపర్‌వైజర్లు గతంలో ఉన్న ఇబ్బందులు తొలగాయని, అంతర్జాలం, సర్వర్ సమస్యలు తలెత్తడం లేదన్నారు.

## సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలికలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణతో అలరించారు.

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక రహదారులు భవనాల శాఖ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈఈ ఎం.సిద్ధయ్య కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : వాసవ్య మహిళ మండలి, ది లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ కమ్యూనిటీ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో దొనబండలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టరు డాక్టరు రామారావు కేకు కోశారు. గ్రామ సర్పంచి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జూపూడి నోవా ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ నెహెమయ్య, వైస్ ప్రిన్సిపల్ నాగబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొండపల్లి : శాంటాక్లాజ్ వేషధారణలో చిన్నారులు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో క్రిస్మస్ సందడి ఆరంభమైంది. తిరువూరులో యునైటెడ్ మైటీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన ఐక్య సెమీ క్రిస్మస్ వేడుకలో విజయవాడకు చెందిన పాస్టర్ సాల్మన్‌రాజు సందేశం అందించారు.

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక వివేకానంద పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఇతర వేషధారణల్లో అలరించారు.


మైలవరం ర.భ. కార్యాలయంలో కేకు కోస్తున్న ఉద్యోగులు


మారేపల్లి: విద్యుత్తు దీపాలతో క్రైస్తవాలయం

## కూనపరాజుపర్వలో పర్యటించిన ఆర్డీవో

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కూనపరాజుపర్వలోని ధాన్యం కొనుగోలు, అంగన్‌వాడీ కేంద్రాలను తిరువూరు ఆర్డీవో కె.మాధురి మంగళవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీని పరిశీలించి చిన్నారులతో మాట్లాడి రికార్డులు తనిఖీ చేశారు. రెడ్డిగూడెంలో 22ఎ ఫైలుకు సంబంధించిన కుప్పాల వీరయ్యకు చెందిన భూమిని క్షేత్ర స్థాయిలో చూశారు. తహసీల్దార్ జె.సుశీలాదేవి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారితో సంభాషిస్తున్న మాధురి

## విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం


భూషణ కుమారికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : పాతికేళ్లుగా విద్యార్థులకు విద్యనందిస్తున్న తనకు రెండు అవార్డులు రావడం సంతోషంగా ఉందని సెయింట్ పాల్స్ పాఠశాల ఛైర్‌పర్సన్ జోయి భూషణ కుమారి పేర్కొన్నారు. గొల్లపూడిలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. విద్యారంగంలో చేస్తున్న కృషికిగాను సౌత్ ఇండియన్ ఉమెన్ ఎచీవర్స్ అవార్డు(ఎస్ఐడబ్ల్యూఏఏ)ను బెంగళూరులో ఇచ్చినట్లు తెలిపారు. ఈటీ టెక్ఎక్స్ ట్రైల్‌బ్లాజర్ అవార్డు లభించినట్లు వెల్లడించారు. పాఠశాల నిర్వాహకులు లంకా కరుణాకర్ దాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'దుందిరాలపాడును విభజించ వద్దు'


ఎన్టీఆర్ కలెక్టరేట్: గంపలగూడెం మండలం దుందిరాలపాడు గ్రామ పంచాయతీని రెండుగా విభజించాల్సిన అవసరం లేదని గ్రామస్థులు పలువురు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు.

### కోయసుధకు పురస్కారం

మైలవరం: స్థానిక మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధకు అమరావతి విశిష్ట సేవా పురస్కారం లభించింది. విజయవాడలో నిర్వహించిన పురస్కారాల కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు ఆమె మంగళవారం తెలిపారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ధనుర్మాసోత్సవంలో భాగంగా మంగళవారం పాత తిరువూరులోని వేంకటాచలస్వామి గుడిలో అర్చకుడు డీవీ.కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌లను ఫలాలతో అలంకరించారు. గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదారంగనాయకులకు విశేష పూజలు నిర్వహించారు.


తిరువూరు వేంకటా చలస్వామి గుడిలో..


గొల్లపూడిలో పుష్పాభిషేకం

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడి ల్యాంకో కాలనీలోని శ్రీమహాలక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో పుష్పాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాల లక్ష్మీనరసింహాచార్యులు పూజలు చేశారు. తమ్మన చిన్న బాపనయ్య కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

విరాళం అందజేత : గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయానికి తిరువూరు మండలం కాకర్లకు చెందిన నన్నపనేని శ్రీనివాసరావు, ప్రతిమ దంపతులు మంగళవారం రూ.50 వేలు విరాళం అందజేశారని ఆలయ ఉద్యోగులు తెలిపారు. తెదేపా నాయకుడు, ఆలయ మాజీ అధ్యక్షుడు బెల్లం మధుసూదనరావు ఆధ్వర్యంలో దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



## వైకాపా ప్రదర్శనపై కేసు నమోదు

మైలవరం, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మైలవరంలో అనుమతి లేకుండా వైకాపా శ్రేణులు ద్విచక్ర వాహనాల ప్రదర్శన చేయడంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు రాజీవ్, నాగులూరి దుర్గాప్రసాద్, అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, తోట తిరుపతిరావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## గడ్డి మందు తాగి యువకుడి బలవన్మరణం

ఏదులాపురం, న్యూస్‌టుడే : జీవితం మీద విరక్తితో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన ఇది. మృతుడి అన్నయ్య మోరం రాము చెప్పిన వివరాల ప్రకారం.. మోరం శంకర్(30) ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మోదూరుకు చెందినవాడు. రెండేళ్ల కిందట భార్యతో విడాకులు తీసుకొని ఖమ్మంలో డ్రైవింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 19న శంకర్ తన అన్నకు వీడియో కాల్ చేసి జీవితం మీద విరక్తితో గడ్డి మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. తర్వాత బంధువులు వెతకగా కరుణగిరి సమీపంలోని మున్నేరు వద్ద స్పృహ కోల్పోయి కనిపించాడు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాయుడు తెలిపారు.

## 'అయిలా'.. వైజ్ఞానిక ప్రయోగాలు చేయగలిగేలా..

• శాస్త్రవేత్తలకు చేదోడుగా కృత్రిమ మేధ



దిల్లీ: కృత్రిమ మేధ రోజురోజుకూ అనూహ్య పురోగతి సాధిస్తోంది. ఇప్పటివరకూ చాట్ జీపీటీ వంటి కృత్రిమ మేధ నమూనాలు వివిధ రకాల పత్రాల రచనలో, ప్రశ్నలకు సమాధానం చెప్పడంలో, డేటాను విశ్లేషించడంలో సహాయపడుతూ వచ్చాయి. దిల్లీ ఐఐటీ శాస్త్రవేత్తలు డెన్మార్క్, జర్మనీలకు చెందిన శాస్త్రవేత్తలతో కలిసి 'ఏఐ-పవర్డ్ ఇంటెలిజెంట్ ల్యాబ్ అసిస్టెంట్ (అయిలా)' అనే సరికొత్త కృత్రిమ మేధ సహకారిని రూపొందించారు. శాస్త్రవేత్తల మాదిరిగానే వైజ్ఞానిక ప్రయోగాలను నిర్వహించే సామర్థ్యం దీనికి ఉంటుంది. 'అయిలా నా దైనందిన ప్రయోగాల్లో ఎంతో సాయపడుతుంది. గతంలో మైక్రోస్కోప్ సాయంతో హై రిజల్యూషన్ చిత్రాలు తీసేందుకు ఒకరోజు పట్టేది. ఇప్పుడా పనిని కేవలం 7 నుంచి 10 నిమిషాల్లో పూర్తి చేస్తున్నా' అని స్కూల్ ఆఫ్ ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ఇంద్రజీత్ కౌండల్ తెలిపారు. అతి సూక్ష్మస్థాయిలో పదార్థాలను విశ్లేషించే అటామిక్ ఫోర్స్ మైక్రోస్కోప్‌పై అయిలా సాయంతో పరిశోధనలు నిర్వహించారు. అయిలా అత్యంత సంక్లిష్టమైన ఈ పరికరాన్ని సమర్థంగా ఉపయోగించ గలుగుతోంది. పరిశోధనల సమయంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలుగుతోంది.

## 3 వేల డాలర్లు తీసుకోండి అమెరికా నుంచి వెళ్లిపోండి

అక్రమ వలసదారులకు అగ్రరాజ్యం ఆఫర్

U.S. DEPARTMENT OF HOMELAND SECURITY

ఇంటర్నెట్ డెస్క్: అక్రమ వలసదారులను అమెరికా నుంచి పంపించేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. అమెరికాను స్వచ్ఛందంగా వీడేవారికి ప్రోత్సాహకంగా ఇచ్చే స్టైపెండ్‌ను మూడు వేల డాలర్లకు (సుమారు రూ.2.68 లక్షలు) పెంచుతున్నట్లు తెలిపింది. స్వదేశానికి వెళ్లిపోయేందుకు ఉచితంగా కల్పించే విమాన ప్రయాణ సదుపాయానికి ఇది అదనమని పేర్కొంది. ఈ ఏడాది చివరికల్లా అమెరికాను వీడేవారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని వెల్లడించింది. ఇప్పటివరకూ ఈ స్టైపెండ్ కేవలం వెయ్యి డాలర్లుగా ఉన్న సంగతి గమనార్హం. ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోకుండా అమెరికాలోనే ఉంటే.. అక్రమ వలసదారులపై అరెస్టు, బహిష్కరణల రూపాల్లో కొరడా ఝుళిపిస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) అధికారులు హెచ్చరిస్తున్నారు.

## నా భార్యను తిడితే ఖబడ్దార్

కామెంటేటర్లకు వాన్స్ హెచ్చరిక



వాషింగ్టన్: భారత సంతతికి చెందిన తన భార్య ఉషా వాన్స్‌ను తిట్టేవారికి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'నేను ఒకటే స్పష్టం చేయదలుచుకున్నా. నా భార్యపై విమర్శల దాడి చేసే వారు.. జెన్ సాకీగానీ, నిక్ ఫ్యుయెంటెస్‌గానీ.. వారు ఎవరైనాసరే అశుద్ధం తినొచ్చు. అమెరికా ఉపాధ్యక్షుడిగా అది నా అధికారిక విధానం' అని వాన్స్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన పాడ్‌కాస్ట్‌లో ఉషను జాతిపరంగా కించపరిచేలా.. ఉపాధ్యక్షుడిని జాతి ద్రోహిగా పేర్కొంటూ నిక్ విమర్శలు చేశారు. దీనిపై వాన్స్ స్పందించారు. 'ప్రజలను జాతిపరంగా, సంస్కృతిపరంగా జడ్జ్ చేసేవాళ్లపట్ల నా వైఖరి ఇలాగే ఉంటుంది. వారు యూదులైనా, శ్వేతజాతీయులైనా అంతే. మనం అలా వ్యవహరించకూడదు' అని స్పష్టం చేశారు.

## ప్రజా జీవిత నియమాలు




✦ యువతను కలిసినప్పుడు వారిలో స్ఫూర్తి నింపాలి.
✦ చిన్నారులతో మమేకం అయినప్పుడు వారికి జ్ఞానం అందించాలి.
✦ వృద్ధులను కలిసినప్పుడు వారికి సాయం చేయాలి.
✦ మేధావులతో సమావేశమైనప్పుడు వారిని అధ్యయనం చేయాలి.
✦ నాయకులతో భేటీ అయినప్పుడు వారిని గౌరవించాలి.
✦ మూర్ఖులు ఎదురైనప్పుడు వారిని తప్పించుకోవాలి.
✦ వినయశీలురతో భేటీని విలువైనదిగా భావించాలి.
✦ మంచి మనసున్న వారిని కలిసినప్పుడు వారిలా వ్యవహరించేందుకు ప్రయత్నించాలి.

– జార్జ్, సీఈవో

## అమెరికాలో
# ట్రంప్ శ్రేణి యుద్ధనౌకలు

• శత్రుభీకరంగా నిర్మించనున్నట్లు దేశాధ్యక్షుడి ప్రకటన



వాషింగ్టన్: అమెరికా నౌకాదళాన్ని మరింత శక్తిమంతంగా మార్చేదిశగా ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఇందులో భాగంగా శత్రుభీకరమైన భారీ యుద్ధనౌకలను నిర్మిస్తామని వెల్లడించారు. ఈ 'ట్రంప్ శ్రేణి' యుద్ధనౌకలు ప్రపంచంలోకెల్లా అత్యంత వేగవంతమైనవి, పెద్దవి ఉంటాయన్నారు. చరిత్రలో ఇప్పటివరకూ నిర్మించిన ఏ యుద్ధనౌకతో పోల్చినా.. తాము నిర్మించేవి 100 రెట్లు ఎక్కువ శక్తిమంతమైనవిగా ఉంటాయని చెప్పారు. అమెరికా నౌకాదళం కోసం సిద్ధం చేస్తున్న 'గోల్డెన్ ఫ్లీట్'లో ఇవి భాగమవుతాయని పేర్కొన్నారు. ఫ్లోరిడాలోని తన మార్-ఎ-లాగో రిసార్ట్‌లో ట్రంప్ ఈ మేరకు నౌకాదళ ఆధునికీకరణ ప్రణాళికలను వివరించారు. పరిమాణంలో చిన్నగా ఉండే కొత్త యుద్ధనౌకల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను దాదాపు నెల రోజుల కిందటే అమెరికా నౌకాదళం ఉపసంహరించుకున్న సంగతి గమనార్హం.

### 'అయోవా' కంటే పొడవుగా, పెద్దగా..

అమెరికా అధ్యక్షుడు వెల్లడించిన వివరాల ప్రకారం- 'ట్రంప్ శ్రేణి' యుద్ధనౌకల్లో మొదటి దానికి 'యూఎస్ఎస్ డిఫైయంట్' అని నామకరణం చేస్తారు. ఇది రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి అయోవా తరగతి భారీ యుద్ధనౌకల కంటే పొడవుగా, పెద్దగా ఉంటుంది. దానిలో హైపర్‌సోనిక్ క్షిపణులు, అణు సామర్థ్యమున్న క్రూయిజ్ క్షిపణులు, రెయిల్ గన్‌లు, అత్యంత శక్తిమంతమైన లేజర్లను మోహరిస్తారు. ట్రంప్ శ్రేణి యుద్ధనౌకల డిజైనింగ్ పనులు ప్రస్తుతం సాగుతున్నాయని, 2030ల తొలినాళ్లలో వాటి నిర్మాణ ప్రక్రియ మొదలవుతుందని అమెరికా అధికారి ఒకరు తెలిపారు.

## అస్సాంలోని కర్బీలో మళ్లీ హింస


• ఇద్దరి మృతి

డిఫు, గువాహటి: అస్సాంలోని కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. ఆందోళనలు నిర్వహిస్తున్న రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో ఇద్దరు మృతి చెందారు. 38 మంది పోలీసులుసహా 45 మంది గాయపడ్డారు. ఖెరోని మార్కెట్ ప్రాంతంలో సోమవారం అల్లరి మూక కొన్ని దుకాణాలకు నిప్పు పెట్టింది. దీంతో మహిళలు, పిల్లలతో కలిసి బాధితులు మంగళవారం నిరసనకు దిగారు. ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని డిమాండు చేశారు. అదే సమయంలో మరో గ్రూపూ ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నాయి. అంతకుముందు ఆందోళనకారులు రెండు మోటారు సైకిళ్లకు నిప్పు పెట్టారు. ఘర్షణల నేపథ్యంలో కర్బీ ఆంగ్‌లాంగ్, పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపేసింది. కర్ఫ్యూ అమలవుతోంది. ఘర్షణలు సద్దుమణిగిన తర్వాత 25 ఏళ్ల సురేశ్ దేయ్ అనే దివ్యాంగుడి మృతదేహం లభ్యమైంది. ఘర్షణలో అథీక్ తైమొంగ్ అనే వ్యక్తి మృతి చెందారు.



కర్బీఆంగ్‌లాంగ్‌లో పోలీసుల పహారా

## జ్ఞానపీఠ్ గ్రహీత వినోద్‌కుమార్ కన్నుమూత



రాయ్‌పుర్: ప్రముఖ హిందీ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత వినోద్‌కుమార్ శుక్లా (88) ఇక లేరు. వయోభారం సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. శుక్లా 1937 జనవరి 1న ప్రస్తుత ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించారు. హిందీ సాహిత్యంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. నౌకర్ కీ కమీజ్, ఖిలేగాతో దేఖేంగే, దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతీ థీ, ఏక్ చుప్పీ జగాహ్ వంటి నవలలను రచించి అందరి ప్రశంసలు పొందారు. సాధారణ వ్యక్తుల భావోద్వేగాలను తన రచనల్లో కళ్లకు కట్టినట్లు వివరిస్తారని శుక్లాకు పేరుంది. 'దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతీ థీ'కిగాను 1999లో సాహిత్య అకాడమీ అవార్డును ఆయన పొందారు. ఈ ఏడాది నవంబరులో 59వ జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్లా ఈ నెల 2న ఊపిరి తీసుకోవడంలో బాగా ఇబ్బందిపడటంతో రాయ్‌పుర్ ఎయిమ్స్‌లో చేర్పించామని, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారని ఆయన కుమారుడు శశ్వంత్ తెలిపారు. శుక్లా మరణంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. హిందీ సాహిత్యానికి ఆయన చేసిన సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుందని మోదీ పేర్కొన్నారు.

### 95 లక్షల మంది ఓటర్ల తొలగింపు

దిల్లీ: ఎన్నికల సంఘం మంగళవారం ప్రచురించిన ఓటర్ల జాబితాల ముసాయిదాల్లో 95 లక్షల మంది పేర్లు లేవు. మధ్యప్రదేశ్‌లో 5.74 కోట్ల మంది ఓటర్ల నుంచి 42.74 లక్షల మందిని తొలగించారు. కేరళలో 2.78 కోట్ల మంది నుంచి 24.08 లక్షల మందిని, ఛత్తీస్‌గఢ్‌లో 2.12 కోట్ల మంది నుంచి 27.34 లక్షల మంది ఓటర్లను తీసేశారు. అండమాన్ నికోబార్‌లో 3.10 లక్షల ఓటర్లలో సుమారు 64 వేల మందిని తొలగించారు. ఈ మేరకు ఓటర్ల జాబితాలు సవరించారు.

# నైపుణ్యాలు, వేతనం ఎక్కువుంటేనే హెచ్-1బీ!

• ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి కొత్త విధానం
• వీసాల జారీలో లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పనున్న అమెరికా





న్యూయార్క్, వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పు చేపట్టేందుకు అమెరికా సిద్ధమైంది. ప్రస్తుతమున్న ర్యాండమ్ లాటరీ విధానానికి స్వస్తి పలికి.. అధిక నైపుణ్యాలు, ఎక్కువ వేతనాలు ఉన్న వ్యక్తులకు ఆ వీసాల జారీలో ప్రాధాన్యమిచ్చే సరికొత్త వ్యవస్థను దాని స్థానంలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ కొత్త పద్ధతికి సంబంధించిన నిబంధన వచ్చే ఏడాది ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. 2027 ఆర్థిక సంవత్సరం హెచ్-1బీ క్యాప్ రిజిస్ట్రేషన్ సీజన్‌కు కూడా ఇదే వర్తిస్తుందని వెల్లడించింది. అమెరికా కార్మికుల ఉద్యోగ అవకాశాలతో పాటు పని పరిస్థితులు, వేతనాలను పరిరక్షించేందుకే నూతన నిబంధనను అమల్లోకి తీసుకొస్తున్నట్లు పేర్కొంది. హెచ్-1బీ వీసాల జారీకి ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ చాలా కంపెనీలు విదేశాల నుంచి తక్కువ వేతనాలకే ఉద్యోగులను రప్పించుకుంటున్నాయని గుర్తుచేసింది.

## ప్రియాంక ఏదో ఒకరోజు
# ఉన్నత పదవికి వెళ్లడం ఖాయం: వాద్రా

దిల్లీ: తన భార్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఏదో ఒకరోజు రాజకీయాల్లో ఉన్నత పదవిని చేరే (ప్రధానమంత్రి అయ్యే) సమయం వస్తుందని రాబర్ట్ వాద్రా ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందిరాగాంధీలా ప్రియాంక కూడా బలమైన ప్రధాని అవుతారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యపై పీటీఐ వార్తాసంస్థ వాద్రా స్పందనను కోరింది. ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిత ఉందని ఆయన చెప్పారు. 'ప్రియాంక కూడా తన నానమ్మ (ఇందిరాగాంధీ) నుంచి చాలా నేర్చుకుని ఉంటుందనుకుంటున్నాను. అలాగే తండ్రి (రాజీవ్‌గాంధీ), తల్లి (సోనియాగాంధీ), సోదరుడు (రాహుల్‌గాంధీ) నుంచి కూడా చాలా విషయాలు తెలుసుకుని ఉంటుంది. ప్రజలు ఆమెను ఆరాధిస్తున్నారు. ఆమె హృదయాంతరాళాల నుంచి మాటలు వస్తాయి. దేశానికి నిజంగా అవసరమైన అంశాలపై ఆమె చర్చిస్తుంటుంది. ఆమెలో సత్తా ఉందని, చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా చెబుతుందని ప్రజలకు తెలుసు. ఆమె మంచి స్థాయికి చేరుతుంది. దేశంలో కావాల్సిన మార్పుల్ని తీసుకువస్తుంది. నేనైతే అలాగే అనుకుంటున్నా. తన సిద్ధాంతాలనే కాకుండా అందరి సమ్మతిని ఆమె దృష్టిలో పెట్టుకుంటుంది. ఎలాంటి మార్పులు రావాలో ప్రజలకు ఆలోచనలు ఉన్నాయి. మున్ముందు ఇవి జరుగుతాయి. తప్పదు' అని వాద్రా చెప్పారు. ప్రస్తుతం ప్రియాంక దృష్టి ప్రజా సమస్యలపైనే ఉందన్నారు.



# బంగ్లాదేశ్‌కు సర్జరీ చేయాలి

• అస్సాం సీఎం హిమంత



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌తో దౌత్యానికి సమయం మించి పోయిందని, ఇక శస్త్ర చికిత్స (సర్జరీ) అవసరమని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ అభిప్రాయపడ్డారు. 'వ్యూహాత్మకమైన చికెన్స్ నెక్ గురించే ఆందోళన అంతా. దౌత్యం, ఇతర మార్గాల ద్వారా 20, 22 కి.మీ. భూభాగాన్ని భారత్ కాపాడుకోవాల్సి ఉంది. కానీ ఔషధాలు పనిచేయనప్పుడు శస్త్రచికిత్స తప్పదు' అని స్పష్టం చేశారు. చికెన్స్ నెక్ కారిడార్ పశ్చిమ బెంగాల్‌లోని శిలిగుడీ భూభాగంలో ఉంటుంది. '7 సిస్టర్స్'గా పిలిచే 7 ఈశాన్య రాష్ట్రాలను (అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర) భారత ప్రధాన భూభాగంతో ఈ కారిడార్ కలుపుతోంది. ఈ ప్రాంతంలో కొంత భాగం కేవలం 22 కిలోమీటర్ల వెడల్పు ఉంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు అతి దగ్గర్లో ఇది ఉంది. చైనా అధీనంలోని చుంబీలోయ దీనికి అత్యంత సమీపంలో ఉంది.

## బిహార్‌లో మౌలిక వసతులు మెరుగయ్యాయి

• ఎన్డీయే పాలనపై ఎంపీ శశిథరూర్ పొగడ్తలు



దిల్లీ: ఇటీవల భాజపా పాలనపై సానుకూల వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తాజాగా బిహార్‌లో ఎన్డీయే పాలనపై ప్రశంసలు కురిపించారు. తాజాగా రాష్ట్రంలో పర్యటిస్తున్న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టిందన్నారు. "నేను విన్న దాని కంటే బిహార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా మెరుగయ్యాయి' అని విశ్లేషించారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గురించి విలేకర్లు అడగ్గా.. తనను రాజకీయాల్లోకి లాగొద్దని శశిథరూర్ బదులిచ్చారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందనా రాలేదు.

### జైశంకర్ కృషి అద్భుతం

నలంద విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తెచ్చినందుకు విదేశీ వ్యవహారాల శాఖను, ఆ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పొగడ్తల్లో ముంచెత్తారు. ఇది ఎవరూ గుర్తించని విజయమని కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించడం అంటే దేశ నాగరికత వైభవాన్ని తిరిగి తీసుకురావడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. నలందలో జరుగుతున్న సాహిత్య ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు.

# మెక్సికోలో కూలిన నేవీ విమానం

• ఐదుగురి మృతి

గాల్వెస్టన్: మెక్సికో నేవీకి చెందిన విమానం ప్రమాదానికి గురైంది. టెక్సాస్‌లోని గాల్వెస్టన్ కాజ్‌వే వద్ద అది కుప్పకూలింది. వైద్యపరమైన పనిపై వెళ్తున్నప్పుడు జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మెక్సికో నౌకాదళం తెలిపిన వివరాల ప్రకారం.. ఏడాది వయసున్న చిన్నారిని వైద్య చికిత్స కోసం తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందులో చిన్నారితో పాటు నలుగురు నేవీ అధికారులు, మరో నలుగురు పౌరులు ఉన్నారు. వీరిలో ఎవరు మృతి చెందారనేది స్పష్టం చేయలేదు. ప్రమాదానికి కారణం ఇంకా తెలియరాలేదని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. పౌర విమానయాన అధికారులు, జాతీయ రవాణా భద్రత మండలి బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని వెల్లడించారు. సహాయక చర్యల కోసం డ్రోన్ సేవల్నీ వినియోగించుకుంటున్నారు. ప్రమాదానికి పొగమంచే కారణమా అనేది స్పష్టం కాలేదు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతం దట్టమైన పొగమంచుతో నిండిపోతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



విమానం కూలిన ప్రాంతంలో సహాయక చర్యలు



విజయ్ మాల్యాతో లలిత్ మోదీ

## మేం అతి పెద్ద పలాయనవాదులం

లలిత్ మోదీ వ్యంగ్యం

లండన్: భారత్ దృష్టిలో తాము అతి పెద్ద పలాయనవాదులుగా ఉన్నామని మోసం, మనీ లాండరింగ్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ బ్రిటన్‌కు పరారైన ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బ్యాంకులను మోసం చేసిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ దేశం నుంచి పరారై లండన్‌లో ఉంటున్న విజయ్ మాల్యా 70వ పుట్టిన రోజు ఇటీవల జరిగింది. దీనికి లలిత్ మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా తీసిన వీడియోను ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ తాను, విజయ్ మాల్యా అతి పెద్ద పలాయనవాదులుగా నిలిచామని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుకు ఆయన 'లెట్స్ బ్రేక్ ద ఇంటర్నెట్ డౌన్ ఇన్ ఇండియా ఎగెయిన్ (మళ్లీ భారత్‌లో ఇంటర్నెట్‌ను బద్దలు కొడదాం)' అని క్యాప్షన్ పెట్టారు. మాల్యా ఈ నెల 18వ తేదీన 70వ పుట్టిన రోజును జరుపుకొన్నారు.

### హెచ్-1బీ వీసాలకు క్రైస్తవాన్ని ముడిపెడుతూ జె.డి.వాన్స్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: తమ దేశంలో ఉద్యోగాలు, హెచ్-1బీ వీసాలకు క్రైస్తవాన్ని ముడిపెడుతూ అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తాజాగా పలు వ్యాఖ్యలు చేశారు. అసలైన అమెరికా క్రైస్తవ గుర్తింపు.. ఇంకా లోకంలో అడుగుపెట్టని శిశువులను రక్షించడంలోనే కాకుండా, ప్రభుత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడంలోనూ ఇమిడి ఉంటుందని పేర్కొన్నారు. స్వదేశీ కంపెనీలు ఉద్యోగాలకు అమెరికా పౌరులను ఎంచుకోకుండా.. తక్కువ వేతనాలకు లభిస్తున్నారు కదా అని తృతీయ ప్రపంచ దేశాల్లోని పౌరులకు వాటిని కట్టబెట్టడం తప్పని ఆదివారం ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

### కార్తీ చిదంబరంపై అభియోగ ప్రకటనకు కోర్టు ఆదేశం

దిల్లీ: చైనా వీసా కుంభకోణానికి సంబంధించి కాంగ్రెస్ ఎంపీ కార్తీ పి చిదంబరంతో పాటు మరో ఆరుగురిపై అభియోగాలు ప్రకటించాలని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు వెలువరించింది. ఈ కేసులో చేతన్ శ్రీవాస్తవ అనే వ్యక్తిని నిర్దోషిగా తేలుస్తూ న్యాయమూర్తి దిగ్ వినయ్ సింగ్ తీర్పు వెలువరించారు.

# దిల్లీని కమ్మేసిన పొగమంచు

• 10 విమానాల రద్దు
• 270కి పైగా ఆలస్యం

దిల్లీ: దేశ రాజధానిలో కాలుష్యంతో పాటు దట్టమైన పొగమంచు వల్ల పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. మంగళవారం ఉదయం వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 'తీవ్రమైన' స్థాయికి చేరుకుంది.. నగరంతో పాటు 27 పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ 400కు పైగా నమోదై తీవ్రత ఎక్కువున్న విభాగంలోకి చేరింది. ఈ స్థాయి కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారిందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు దట్టమైన పొగమంచు ప్రభావంతో దృశ్యస్పష్టత బాగా తగ్గిపోయి 270కు పైగా విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయని.. 10 రద్దు అయ్యాయని ఫ్లైట్‌రాడార్ సంస్థ వెల్లడించింది. జీఆర్ఏపీ-4 ఆంక్షలు ఎత్తివేసినా కూడా "పీయూసీ లేకుంటే ఇంధనం లేదు'' విధానాన్ని దిల్లీ ప్రభుత్వం కొనసాగిస్తుందని పర్యావరణశాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. జీఆర్ఏపీ-4 ఎత్తివేసినా వాయు కాలుష్య చర్యలను కఠినంగా అమలు చేస్తామని, కాలుష్య నియంత్రణ (పీయూసీ) ధ్రువీకరణ లేని ఏ వాహనాన్నీ కూడా నగరంలో నడవనివ్వబోమని స్పష్టం చేశారు. నాలుగు కొత్త వాహన ఉద్గార పరీక్ష కేంద్రాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు.



### ఉత్తర్‌ప్రదేశ్‌లో పొగమంచులో ఢీకొన్న 6 వాహనాలు

అమేఠీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీ జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. దట్టమైన పొగమంచు కారణంగా ఓ హైవేపై పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. 16 మంది గాయపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అమేఠీ-సుల్తాన్‌పుర్ అండర్ బ్రిడ్జి సమీపంలో రెయిలింగ్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టింది. అనంతరం మరో మూడు ట్రక్కులు, ఒక కారు, దానికి వెనక నుంచి వస్తున్న బస్సు వరుసగా ఒకదానికొకటి ఢీ కొట్టుకున్నాయి. గాయపడిన 16 మంది ప్రయాణికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు.





శ్రీలంకలోని జాఫ్నా వరద ప్రభావిత ప్రాంతంలో పునరుద్ధరించిన వంతెన వద్ద భారత సైన్యానికి చెందిన ఇంజినీరింగ్ బృందం

# శ్రీలంకకు 45 కోట్ల డాలర్ల ప్యాకేజీ

• ప్రకటించిన భారత్

కొలంబో: దిత్వా తుపాను కారణంగా అతలాకుతలమైన శ్రీలంకకు భారత్ 45 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం ప్రకటించింది. శ్రీలంక పునర్నిర్మాణానికి స్థిరమైన నిబద్ధతతో భారత్ ఉందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. భారత ప్రధానమంత్రి మోదీ తరఫున ప్రత్యేక రాయబారిగా శ్రీలంకకు వచ్చిన ఆయన.. ఇక్కడి అగ్రనేతలతో సమావేశమయ్యారు. ఆర్థిక సాయంపై మోదీ రాసిన లేఖను శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకెకు అందించారు. రోడ్లు, రైలుమార్గాల పునరుద్ధరణకు.. ధ్వంసమైన ఇళ్ల పునర్నిర్మాణానికి.. వ్యవసాయ, ఆరోగ్య, విద్యా వ్యవస్థల మద్దతుకు ఈ ఆర్థిక సాయం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీలంకకు ఇది క్లిష్టమైన పరిస్థితి అని, ఈ సమయంలో భారత్ మద్దతు మునుపెన్నడూ లేని విధంగా, మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. పొరుగు దేశానికి సాయం చేయడానికి భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీలంక నాయకులు కొనియాడారు.

## కుటుంబ సభ్యులకు, పార్టీ నేతలకు రాహుల్‌పై విశ్వాసం లేదు: భాజపా

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బెర్లిన్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని భాజపా తప్పుపట్టింది. కాంగ్రెస్ నేతలతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాహుల్ మీద విశ్వాసం లేదని, అందుకే ఆయన విదేశాల్లో భారత ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టింది. ఇలా వ్యవహరించడం ప్రతిపక్ష నేతకు అలవాటుగా మారిపోయిందని భాజపా ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. రాహుల్ విదేశీ పర్యటనలో లేరని, భారత్‌ను అవమానించే పనిలో ఉన్నారని విమర్శించారు. భారత్‌ను విమర్శిస్తూ.. చైనాకు మద్దతివ్వడం ఆయనకు అలవాటేనన్నారు. విదేశాల్లో భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. మరో ప్రతినిధి శోభా కరంద్లాజె మాట్లాడుతూ.. రాహుల్ దేశ వ్యతిరేక నాయకుడని అన్నారు. ఓ పార్టీకి అగ్రనేతగా కొనసాగుతున్నప్పటికీ చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

### ముంబయి విమానాశ్రయంలో రూ.48 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ఎనిమిది మంది అరెస్టు

ముంబయి: కస్టమ్స్ అధికారులు ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన ఆపరేషన్లలో రూ.48 కోట్ల విలువైన 40 కిలోలకు పైగా ద్రవరూప గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, ఎనిమిది మంది ప్రయాణికులను అరెస్టు చేశామని మంగళవారం అధికారులు తెలిపారు. బ్యాంకాక్ (థాయ్‌లాండ్), మస్కట్ (ఒమన్) నుంచి వచ్చిన ప్రయాణికుల వద్ద ఈ మాదకద్రవ్యాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. షాంపూ సీసాలు, స్నాక్ బాక్సుల్లో డ్రగ్స్ దొరికాయి. సోమవారం ఫుజైరా వెళ్తున్న ప్రయాణికుల వద్ద రూ.45.28 లక్షల విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని కేసుల్లోనూ నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

### మాదకద్రవ్యాలతో వెళ్తున్న పడవపై అమెరికా సైన్యం దాడి

వాషింగ్టన్: మాదకద్రవ్యాల రవాణాపై అమెరికా ఉక్కుపాదం మోపుతోంది. తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో డ్రగ్స్‌ను తీసుకెళ్తున్న ఓ పడవపై తాజాగా తాము దాడి చేసినట్లు ఆ దేశ సైన్యం సోమవారం వెల్లడించింది. ఈ ఘటనలో ఒకరు మృత్యువాతపడ్డారని పేర్కొంది.

# బరువు తగ్గించే బ్రాకలీ..!



శీతకాలం వచ్చిందంటే చాలు వెచ్చదనం కోసం కాఫీ, టీలు ఎక్కువగా తాగుతుంటాం. మరి బరువు సంగతేంటి? వేళాపాళా లేకుండా ఎప్పుడంటే అప్పుడు వీటిని తాగితే ఆరోగ్యానికి చేటు చేస్తాయి. అందుకే ఈ సీజన్‌లో ఎక్కువగా దొరికే బ్రాకలీ రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటూ బరువునీ తగ్గిస్తుంది.

- బ్రాకలీలో కెలోరీలు తక్కువగా, పీచుపదార్థం ఎక్కువగా ఉండి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీనివల్ల అనవసరంగా తినే చిరుతిళ్లకు అడ్డుకట్ట వేస్తుంది.
- విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి జీర్ణక్రియనూ, జీవక్రియనూ మెరుగుపరుస్తాయి.
- ఇందులో గ్లూకోసినోలేట్లు, ఫినోలిక్ యాంటీ ఆక్సిడెంట్లు ఉండటంవల్ల శరీరంలో కొవ్వు, లిపిడ్‌లు పేరుకోకుండా చేస్తాయి. నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. దాంతో ఆహారం తక్కువగా తీసుకుంటారు.
- దీనిలో విటమిన్ ఎ, సి, కెలతోపాటూ కాల్షియం, పొటాషియం, ఐరన్ మెండుగా ఉండి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇందుకు దీనిలోని పోషకాలు పోకుండా ఆవిరిమీద ఉడికించి నిమ్మరసం, వెల్లుల్లితో కలిపి తీసుకుంటే నోటికి రుచిగానూ, ఆరోగ్యంగానూ ఉంటుంది.

## మీకు తెలుసా!

పురుషుల కంటే మహిళలు సగటున రెండు డెసిబుల్స్ శబ్దాన్ని ఎక్కువగా వినగలరు. ఈస్ట్రోజన్ హార్మోన్ కారణంగా వీళ్ల చెవిలోని సున్నితమైన కాక్లియా చిన్న శబ్దాలనీ గ్రహించగలదట. వయసుతోపాటు వచ్చే వినికిడి లోపం మగవాళ్లలో కన్నా ఆడవాళ్లలో తక్కువగా ఉండటానికీ ఈ హార్మోనే కారణమట.

2025 నాయిక

భారత్‌లో వినోద రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. సినిమాలూ, సిరీస్‌లూ, కంటెంట్ క్రియేషన్‌లో సృజనాత్మకత వెల్లివిరుస్తోంది. ప్రజల నాడిని తెలుసుకుని వాళ్లకు వీటిని చేర్చడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నది నారీమణులే. మన కథల్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ... భారత్ 'సాఫ్ట్ పవర్'గా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తున్నారీ అధినాయికలు!

# ఆమె కళ్లతో చూడాల్సిందే!

### అయిదేళ్లలో ప్రపంచస్థాయికి...

– జ్యోతి దేశ్‌పాండే, ప్రెసిడెంట్ (మీడియా అండ్ కంటెంట్ బిజినెస్), రిలయన్స్ ఇండస్ట్రీస్

రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన జియో స్టూడియోస్‌కు నాయకత్వం వహిస్తున్నారు. అదివరకు వయాకామ్ 18కి సీఈఓగా పనిచేశారు. ఇటీవల కాలంలో ధురంధర్, లాపతా లేడీస్, ఆర్టికల్ 370, సైతాన్... హిట్లు ఈ సంస్థ నుంచి వచ్చాయి. చివరి మూడూ నెట్‌ఫ్లిక్స్‌లో గ్లోబల్ స్థాయిలో టాప్ 10 ఛార్ట్‌లో నిలిచాయి. వీటిలో లాపతా లేడీస్‌ని 43 దేశాల్లో చూశారు. 'కేవలం భారతీయులూ, ప్రవాస భారతీయులే కాకుండా ఇతరులూ భారతీయ సినిమాలు చూస్తున్నారు. మన కథలూ, అవి చెప్పే తీరులోని బిగువే ఇందుకు కారణం. అయినా, హాలీవుడ్‌తోనే కాదు, కొరియాతో పోల్చుకున్నా మనం చాలా వెనకే. జియో స్టూడియోస్‌ని వచ్చే అయిదేళ్లలో అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలనేదే నా ప్రణాళిక. తద్వారా భారతీయ కథల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తా' అంటారు జ్యోతి. దీనికోసం కొన్ని రిస్కులు తీసుకోవాల్సిందేనని, మంచి కథల్లో భారీగా పెట్టుబడులు అవసరమని చెబుతారామె. డిస్నీ ఆదాయంలో 30 శాతం మర్చండైజ్ నుంచి వస్తోందనీ, మనమూ ఆ దిశగా వెళ్లొచ్చంటారు. ప్రస్తుతం ఈ సంస్థ చిత్రీకరిస్తోన్న 'మహావతార్'తో ఆ లక్ష్యాన్ని చేరుకోవాలని చూస్తున్నారు.



### ఇంకొందరు...

- స్తుతీ రామచంద్ర, డైరెక్టర్, హెడ్ ఆఫ్ ప్రొడక్షన్ అండ్ పోస్ట్ ఇంటర్నేషనల్ ఒరిజినల్స్, ఇండియా, ప్రైమ్ వీడియో
- అపర్ణా పురోహిత్, సీఈఓ, ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్
- అరుణా దర్యానానీ, డైరెక్టర్, అమెజాన్ ఎమ్ఎక్స్ ప్లేయర్

### సరిహద్దులు చెరిగిపోయాయి

– మోనికా షెర్గిల్, వైస్ ప్రెసిడెంట్, కంటెంట్, నెట్‌ఫ్లిక్స్ ఇండియా

జర్నలిస్టుగా, డాక్యుమెంటరీ సృష్టికర్తగా కెరియర్ ప్రారంభించారు. సొంతూరు మేరఠ్... అక్కడే స్కూలింగ్, దిల్లీ మిరండా హౌస్ కాలేజీ నుంచి బీఏ చేశారు. 2019లో నెట్‌ఫ్లిక్స్‌లో చేరకముందు స్టార్‌ప్లస్, వయాకామ్ 18 డిజిటల్ విభాగాల్లో పనిచేశారు. భారతీయ భాషలన్నింటిలోనూ నెట్‌ఫ్లిక్స్‌కు కథల ఎంపిక, సృష్టి, లైసెన్సింగ్, హక్కులు... వంటి బాధ్యతల్ని మోనికానే చూస్తారు. భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ విజయంలో ఈమెది కీలకపాత్ర. దిల్లీ క్రైమ్, అమర్ సింగ్ చమ్కీలా, హీరా మండి లాంటి సిరీస్‌లు నెట్‌ఫ్లిక్స్‌లో విజయం సాధించాయి. దిల్లీ క్రైమ్... అంతర్జాతీయ ఎమ్మీ అవార్డు అందుకున్న మొదటి భారతీయ సిరీస్. 'హీరా మండి' సిరీస్ విజువల్, కల్చరల్ విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసల్ని అందుకుంది. 'మేం తీసిన కథలు కేవలం ఒక భాషకో, ప్రాంతానికో పరిమితం కావడంలేదు' అని చెబుతారు మోనికా. 'హీరా మండి' 70 దేశాల్లో మూడు నెలలపాటు టాప్-10లో ఉంది. 'భారత్‌లో ప్రతిభకు కొదవలేదు. యువ క్రియేటర్లు తమ కథల్ని బలంగా నమ్మి ఉత్సుకతతో పనిచేస్తే తప్పక విజయం దక్కుతుంది' అంటారు మోనికా. నెట్‌ఫ్లిక్స్ ఇండియా బృందంలో 50 శాతం మంది మహిళలే.



### ఈ విజయం అందరిదీ!

– గుంజన్ సోనీ, ఎండీ, యూట్యూబ్ ఇండియా

దేశంలో 'క్రియేటర్ ఎకానమీ' పెరగడంలో యూట్యూబ్‌ది కీలకపాత్ర. క్రియేటర్లు వినోదాన్నే కాదు, విజ్ఞానాన్నీ పంచుతున్నారు. ఏటా పదికోట్లకు పైగా వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయి. యూట్యూబ్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్(50 కోట్ల మంది యూజర్లు) భారత్. 15 శాతం వాచ్‌టైమ్ ఇతర దేశాల నుంచి వస్తోంది. అందుకే యూట్యూబ్ ఉనికికీ, భవితకూ భారత్ కీలకం. ఆ బాధ్యతను గుంజన్ సోనీకి అప్పగించిందా సంస్థ. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కెరియర్ ప్రారంభించిన గుంజన్... ఆపై ఎంబీఏ చేసి మెకన్సీ, స్టార్ ఇండియా సంస్థల్లో పనిచేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూట్యూబ్‌లో చేరారు. అంతకు ముందు సింగ్‌పూర్ కేంద్రంగా ఆన్‌లైన్ ఫ్యాషన్ షాపింగ్ సంస్థ 'జలోరా'కు హెడ్‌గా పనిచేశారు. ఆ అనుభవంతో వీక్షకుల్ని నేరుగా షాపింగ్‌వైపు మళ్లించేందుకు పెద్ద ప్రణాళికలు వేస్తున్నారు గుంజన్. లైవ్ కంటెంట్‌నీ పెంచాలని చూస్తున్నారు. సినిమాలనీ యూట్యూబ్‌లోనే రిలీజ్ చేయాలనేది మరో ఆలోచన. 'సితారే జమీన్ పర్' థియేటర్ రిలీజ్ తర్వాత 'పే పర్ వ్యూ' పద్ధతిలో యూట్యూబ్‌లోనే అందుబాటులో ఉంది. 'భారత్‌లో యూట్యూబ్ విజయం... వినోద, వ్యాపార రంగాల విజయం కూడా. అందుకే దీన్లో భాగమయ్యే అన్ని వర్గాలకూ లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు వేస్తున్నాం' అంటారు గుంజన్. రాబోయే రెండేళ్లలో రూ.850 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 'క్రియేటర్లు, వ్యాపారం, కనెక్టడ్ టీవీ' లక్ష్యంగా పనిచేస్తున్నారు గుంజన్.



# వసుంధర

vasundhara@eenadu.in

## సమయం వస్తేనే..!



అందం, ఆరోగ్యం, ఆహ్లాదం, గృహ అలంకరణ... వంటి విషయాల్లో జపనీయుల పద్ధతుల్ని ఫాలో అవ్వడానికి ఆసక్తి చూపించే మహిళలు పెరుగుతున్నారు. అమ్మాయిలూ ట్రెండ్స్, స్టైల్స్ విషయంలో వాళ్లని అనుకరిస్తున్నారు. అయితే జీవనవిధానాల్ని మెరుగుపరచుకోవడంలోనూ వారు మనకంటే చాలా ముందున్నారు. వాటిలో ఒకటే 'ఓబైటోరీ'. దీని గురించి తెలుసుకోవడం, మన జీవనశైలిలో భాగం చేసుకోవడం నాటి, నేటి తరాలకి చాలా అవసరం. 'ఎంత కష్టపడినా... అనుకున్న ఫలితాల్ని సాధించలేకపోతున్నా.' 'మూడేళ్ల నుంచి ఇల్లు కొనడానికి ప్రయత్నిస్తున్నా కానీ, సాధ్యం కావడం లేదు.' 'ఎంత ప్రయత్నించినా మా బంధాన్ని కాపాడుకోలేకపోతున్నా.'... ప్రస్తుత జీవనశైలిలో ఏ మహిళని కదిపినా వచ్చే మాటలే ఇవి. మరి కొంతమంది మహిళలు ఇతరులతో పోల్చుకుని, తమ పరిస్థితులు తలచుకుని బాధపడుతుంటారు. రెండూ తప్పే. జీవనశైలిని మరింత కఠినం చేసేవే. బాధపడుతూ, దూషించుకుంటూ కూర్చున్నంత మాత్రాన పరిస్థితులు మారవు కదా అంటారు జపనీయులు. వాళ్ల ఓబైటోరీ విధానం చెబుతున్నది కూడా అదే. ఓబైటోరీ అంటే బ్లూమింగ్ అని అర్థం. పువ్వైనా పండైనా పూసేదీ, కాసేదీ వాటి సమయం వచ్చినప్పుడే కదా! అలానే ప్రతి ఒక్కరికి వాళ్ల పరిస్థితులు మెరుగుదిద్దుకోవడానికి, అనుకున్నది సాధించడానికి సరైన సమయం, అవకాశం వస్తుంది. దాని గురించి వేచి చూసి అవకాశాల్ని అందిపుచ్చుకోమని చెప్పడమే దీని సారాంశం. అలాకాకుండా చింతనతోనే సమయాన్ని గడిపేసి... మానసిక, శారీరక ఒత్తిళ్లను కొనితెచ్చుకోవద్దని చెబుతోంది. నిజమే కదా!

## యాభై ఏళ్లలో మొదటిసారి..!

గెలుపు మంత్ర 2025

లాక్‌డౌన్‌లో నేనూ పిల్లలూ కలిసి చెస్ ఆడుతున్నప్పుడు మా బాబు మొండితనం, పట్టుదల వల్ల ఓ ఆలోచన నా మనసులో తళుక్కుమంది. దాంతో ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితంతో ముడిపెట్టి చదరంగాన్ని సరికొత్తగా ఆవిష్కరించా. దానికి ఆయన పేరే పెట్టా. అప్పుడు కాస్త సమయం ఉండేది కాబట్టి సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పెట్టే దాన్ని. కానీ, ఆ తర్వాత పిల్లలు నీట్ పరీక్షలో బిజీ అయితే, నేను వారి సంరక్షణలో తీరిక లేకుండా గడిపేశా. తర్వాత వాళ్లు వైద్య విద్య కోసం కాలేజీలో చేరారు. ఆ సమయంలోనే జుట్టులేదని ఓ డాక్టర్ అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నారని పత్రికల్లో చదివా. ఓ అమ్మగా, ఇద్దరు మెడికోల తల్లిగా ఎంతో బాధపడ్డా. ఆ స్థాయికి రావడానికి ఎన్నో ఏళ్లు కష్టపడి ఉంటారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో ఇబ్బందులను దాటి.. చివరకు జుట్టు కోసం చనిపోయాడని తెలిసి మనసుకి కష్టమనిపించింది.

వైద్యుడే అయినా... మానసిక బలహీనతతో ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. ఇప్పుడు ఎన్నో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. వాటి మీద పరిశోధన చేసి ఉంటే మరికొంత మందికి మేలు చేసినవాళ్లు అవుదురు కదా! ఆపదలు వచ్చినప్పుడు, అవమానాలు ఎదురైనప్పుడు మనిషిలోని ధైర్యం, తెగువ... వాటిని ఎదుర్కొని నిలదొక్కుకోవడానికి ఉపకరిస్తాయి. అందుకే పిల్లల్లో పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం పెంచడానికి... నేను తయారు చేసిన ఛత్రపతి చెస్ గేమ్‌ని నేర్పించాలనుకున్నా. స్థానికంగా ఉండే నచికేత తపోవన్ స్కూల్‌కి వెళ్లి తరగతులు చెబుతాను. ఈ ఏడాది తొలి ఏకాదశి నుంచి ఈ ప్రయాణం మొదలుపెట్టా. ఇప్పటి వరకూ 21 మంది పిల్లలు ఈ ఆటను నేర్చుకున్నారు. వారు వాళ్ల స్నేహితులతో, తల్లిదండ్రులతో ఆడుతూ సంతోషపడుతున్నారు. యాభై ఏళ్ల పాటు ఇంటికే పరిమితం అయిన నేను... ఈ ఏడాది సాధించిన విజయం ఇది. వచ్చే ఏడాది దీన్ని మరికొందరికీ నేర్పడం ద్వారా వాళ్ల జీవితంలో కష్టం, నష్టం, దుఃఖం, ఆపదలు వంటివి ఎదుర్కొనేలా మానసికంగా దృఢంగా తీర్చిదిద్దాలనుకుంటున్నా. ఇదే నా కొత్త ఏడాది లక్ష్యం.

– చింతమనేని మంజుల, హైదరాబాద్

## పక్కాగా ప్రణాళికల్ని వేసుకోవాలంటే..?



గజిబిజి జీవితాల్లో మనకంటూ కాస్త సమయం దొరకడం ఎంతో కష్టంగా మారింది కదా. అదీ ఇంటాబయటా పనులు చేస్తున్న మహిళలూ, అమ్మాయిలకైతే మరీనూ. దీనివల్ల సామాజిక జీవనానికి దూరం అవుతూ స్నేహితులు, బంధువుల నుంచి ప్రతికూల భావాల్ని ఎదుర్కొంటున్న వారూ లేకపోలేదు. దీనికి పరిష్కారంగా 8-8-8 విధానాన్ని అనుసరించమంటున్నారు నిపుణులు. అంటే... 24 గంటల్ని మూడు ఎనిమిదులుగా విభజించుకోవాలి. దీనిలో ఎనిమిది గంటలు పనికీ, మరో 8 నిద్రపోవడానికీ పక్కాగా కేటాయించుకోవాలి. దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదు. మిగతా ఎనిమిదిని మీకోసం, సామాజిక జీవితం కోసం కేటాయించమంటున్నారు నిపుణులు. అంటే మూడు గంటల్ని స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడపడానికి... వ్యాయామం, ఆరోగ్యం, పరిశుభ్రత, హాబీలకు మూడు గంటలు ఇవ్వమంటున్నారు. మిగతా రెండు గంటలు ప్రయాణాల్లో పోతుంది. దీనివల్ల మీకూ దేన్నీ మిస్ అయిన భావన అనిపించదు. అసంతృప్తికి అవకాశం ఉండదు. అసంతృప్తితో మానసిక సమస్యల బారిన పడకూడదంటే ఈ మాత్రం ప్లాన్ ఉండాల్సిందే. ఎవరి జీవనవిధానానికి అనుగుణంగా వాళ్లు ప్రణాళికల్ని వేసుకుంటే సరి. ఓసారి ప్రయత్నించి చూడండి మరి!

# జనక్ దీదీ... పర్యావరణ ప్రేమికురాలు!



**పదిహేడేళ్ల వయసులో గుండెకు శస్త్రచికిత్స... తర్వాత క్యాన్సర్‌పై పోరాటం... ఆపై భర్త మరణం... ఇలా జీవితం విసిరిన ప్రతి సవాలునూ స్వీకరించారామె. మనం జీవిస్తూ మరో పదిమందికి చేయూతనివ్వాలనుకునే మనసు... జీరోవేస్ట్ పద్ధతిలో జీవనం సాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు, మహిళా సాధికారతకూ మార్గం చూపిస్తున్నారు. తనే పద్మశ్రీ గ్రహీత జనక్ పాల్టా మైక్ గిలింగన్.**



పంజాబీ కుటుంబంలో పుట్టిపెరిగిన జనక్ బాల్యం అంతా చండీగఢ్‌లో సాగింది. 17ఏళ్ల వయసులో గుండె జబ్బు బారిన పడ్డారామె. ఆంగ్ల సాహిత్యంలో పీజీ, పొలిటికల్ సైన్స్‌లో ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. చదువుకుంటూనే పీఎఫ్ ఆఫీస్, హైకోర్టు, గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాల్లో పనిచేశారు. ఆ సమయంలోనే ఐరిష్‌కి చెందిన జేమ్స్ మైక్ గిలింగన్‌తో పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. జీవితం అంటే మనం బతకడమే కాదు, పదిమందికీ దారి చూపించాలి అనే మనస్తత్వం ఉన్న ఈ జంట మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై పనిచేయాలనుకున్నారు. 'బర్లీ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ విమెన్'తో మొదటి అడుగువేశారీ ద్వయం. చదువుకి దూరమై గ్రామీణ, గిరిజన మహిళలకు నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పన దిశగా అడుగులు వేసిందీ సంస్థ. జనక్ 1992లో రియో డిజెనీరోలో జరిగిన మొదటి ఎర్త్ సమ్మిట్‌కు ఆహ్వానం అందుకున్నారు. అప్పుడే ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యావరణ సమస్యలను తెలుసుకున్నారీమె. ఆ రోజే నేలకు హాని చేయకూడదని నిర్ణయించుకున్నారట జనక్. ఆ మార్పుని తన ఇంటి నుంచే మొదలుపెట్టాలనుకున్నారు.

### అవార్డుతో గుర్తింపు...

2007లో క్యాన్సర్ బారిన పడ్డారు జనక్. తన సంస్థనీ, నివాసాన్ని ఇండోర్ సమీపంలో సనావాడియాకి మార్చుకున్నారు. జీరో వేస్ట్ జీవనశైలిని అలవాటుచేసుకున్నారు. సోలార్, విండ్ పవర్ స్టేషన్ల నిర్మాణంతో ఇంటికి కావలసిన విద్యుత్‌ను సమకూర్చుకోవడమే కాదు... మరో యాభై ఇళ్లల్లో సోలార్ దీపాలను వెలిగించారు. సోలార్ కుక్కర్లు, దీపాల వినియోగాన్ని స్థానిక మహిళలకు నేర్పించడం వల్ల వంటచెరకు కోసం 20-30మైళ్లు నడిచి వెళ్లే దూరాన్ని తగ్గించారు. 'మైక్ గిలింగన్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' సంస్థను స్థాపించారు. దీనిలో వెయ్యి గ్రామాల్లోని లక్షా యాభై వేలకు పైగా యువతకు, ఆరువేలకు పైగా గ్రామీణ, గిరిజన మహిళలకు సౌరశక్తిని ఉపయోగించి వంటచేయడంలో శిక్షణనిచ్చారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి జైవిక్ సేతుని మొదలుపెట్టారు. అంతేకాదు, స్థానికుల కష్టసుఖాలను పంచుకునే జనక్‌ని 'దీదీ' అని ఆప్యాయంగా పిలుస్తుంటారు అక్కడి ప్రజలు. అంతా బాగుంది అనే సమయంలో ఓ ప్రమాదంలో భర్తని కోల్పోయారీమె. అయినా తన ప్రయాణాన్ని ఆపలేదు. తన సామాజిక సేవను గుర్తించిన భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీతో గౌరవించింది. 77ఏళ్ల వయసులోనూ ప్రకృతికి హాని చేయకుండా జీవిస్తూ ఇతరులకు దాంట్లో శిక్షణనిస్తున్న జనక్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమే కదూ!

# వేడిగా... ఆరోగ్యంగా..!

**ఎప్పుడు కావాలంటే అప్పుడు నిమిషాల్లో వేడి వేడి ఆహారం కళ్ల ముందు ఉంటే... వేపుళ్లు చేసేటప్పుడు మాడిపోకుండా, అడుగంటకుండా పదార్థాల్ని వండగలిగితే... వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేం కదూ! అవకతవకలు లేకుండా, ఆరోగ్యం పాడవకుండా ఈ పనుల్ని పక్కాగా చేసేందుకు సహకరిస్తాయీ గ్యాడ్జెట్లు.**

### పక్కాగా చెబుతుంది...

వేపుళ్లు చేసేటప్పుడు నూనె సరైన ఉష్ణోగ్రత వద్ద ఉండటం చాలా అవసరం. లేదంటే వంటకం రుచించదు. అయితే మాడిపోతుంది, లేదా వేగకుండానే పాన్ లోంచి తీసేస్తుంటాం. అలా కాకూడదంటే సరైన ఉష్ణోగ్రత వద్ద ఆహార పదార్థాలు వేయించాలి. ఈ 'నాన్ ఎలక్ట్రిక్ డీప్ ఫ్రైయర్ పాట్' దీనికి ఉపయోగపడుతుంది. దీనిలో త్రీ ఇన్ వన్ ఫీచర్లు ఉన్నాయి. ఉష్ణోగ్రతను మానిటర్ చేసే థర్మామీటర్ అతికించి ఉంటుంది. నూనె వడకట్టడానికి వీలుగా జాలీ కూడా ఉంటుంది. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేయడంవల్ల పదార్థాలు పాన్‌కు అతుక్కుంటాయన్న భయం ఉండదు.







స్మార్ట్ కిచెన్

### ఎప్పటికప్పుడు వేడి చేసుకునేలా...

మూడుపూటలా వేడి వేడి ఆహారాన్ని అందించడం ఉద్యోగినులకు కష్టమైన విషయం. అందుకే ఉదయాన్నే వంట పూర్తిచేసేయాలి అనుకుంటారు. అసలే శీతకాలం చల్లని ఆహారపదార్థాలు తినాలి అనిపించదు. ఆరోగ్యానికీ మంచిది కాదు. 'ఫుడ్ వార్మింగ్ మ్యాట్స్' ఈ సమస్యకు చెక్ చెప్పేస్తాయి. ఆహారాన్ని వెచ్చగా ఉంచడానికి రూపొందించిన సిలికాన్ హీట్ మ్యాట్స్ ఇవి. వినియోగించేటప్పుడు విద్యుత్తుకు కనెక్ట్ చేసి రెండు మూడు నిమిషాలు ఉంచితే మ్యాట్ వేడెక్కుతుంది. తర్వాత ఆహార పదార్థాలు ఉన్న పాత్రల్ని నేరుగా దీనిపై పెట్టేస్తే సరి. స్థలాన్ని ఆక్రమిస్తుందన్న సమస్యా లేదు. వినియోగం తర్వాత చుట్టేసి ర్యాక్స్‌లో సర్దేయొచ్చు.

## బంగారం - వెండి



23న ముగింపు

| | బంగారం (24క్యా) | ఆర్నమెంట్ (22క్యా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,39,900 | 1,27,400 | 2,17,259 |
| విజయవాడ | 1,36,615 | 1,27,000 | 2,16,400 |
| ప్రొద్దుటూరు | 1,38,500 | 1,27,420 | 2,12,000 |
| రాజమహేంద్రవరం | 1,38,550 | 1,27,000 | 2,34,000 |
| విశాఖపట్నం | 1,38,550 | 1,27,000 | 2,15,000 |
| తమిళనాడు | ----- | 1,27,700 | 2,34,000 |

## రంగవల్లిక





ఎ. శ్రీరుక్మిణి అశ్రిత, బుట్టాయగూడెం

20 చుక్కలు
20 వరుసలు వచ్చే వరకూ

21 చుక్కలు
1 వచ్చే వరకూ





పి. సునీత, మహబూబ్ నగర్

15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకూ





బొండాడ కరుణ, భీమడోలు

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

**మా చిరునామా:** వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in




అదే వేదిక.. అదే ప్రత్యర్థి.. అదే ఫలితం! మొదట బౌలర్లు అదరగొట్టారు.. తర్వాత బ్యాటర్లు చెలరేగిపోయారు.. భారత్ ఖాతాలో మరో ఘన విజయం జమ అయింది. వన్డే ప్రపంచకప్ గెలిచాక జరుగుతున్న తొలి సిరీస్‌లో భారత మహిళల జట్టు రెచ్చిపోతోంది. విశాఖపట్నంలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.


షెఫాలి వర్మ
69 నాటౌట్

# అదే జోరు..

- రెండో టీ20లోనూ భారత్ ఘనవిజయం
- విశాఖలో శ్రీలంక మళ్లీ చిత్తు
- మెరిసిన శ్రీ చరణి, షెఫాలి

ఈనాడు - విశాఖపట్నం


రెండు నెలల కిందట వన్డే ప్రపంచకప్‌లో విశాఖపట్నంలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత జట్టు.. ఇప్పుడు అదే వేదికలో శ్రీలంకతో ఆడిన రెండు టీ20ల్లోనూ ఘనవిజయాలు సాధించింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో 8 వికెట్ల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ బృందం.. మంగళవారం రెండో టీ20లో 7 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట తెలుగమ్మాయి శ్రీ చరణి (2/23)తో పాటు వైష్ణవి శర్మ (2/32), స్నేహ్ రాణా (1/11), క్రాంతి గౌడ్ (1/21) సత్తా చాటడంతో లంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 128 పరుగులే చేయగలిగింది. ప్రత్యర్థి జట్టులో హర్షిత సమరవిక్రమ (33; 32 బంతుల్లో 4×4), చమరి ఆటపట్టు (31; 24 బంతుల్లో 3×4, 2×6) ఓ మోస్తరు ప్రదర్శన చేశారు. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షెఫాలి వర్మ (69 నాటౌట్; 34 బంతుల్లో 11×4, 1×6) చెలరేగడంతో లక్ష్యాన్ని భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.


జెమీమా

**పడగొట్టి.. దంచేసి..:** తొలి టీ20తో పోలిస్తే ఈ మ్యాచ్‌లో లంక ఒక దశ వరకు మెరుగ్గానే బ్యాటింగ్ చేసినప్పటికీ.. చివరి ఓవర్లలో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో ఆ జట్టు మరోసారి 130 లోపు స్కోరుకే పరిమితమైంది. గత మ్యాచ్‌లో 39 పరుగులతో లంక జట్టులో టాప్‌స్కోరర్‌గా నిలిచిన విష్మి గుణరత్నె ఈసారి 1 పరుగుకే వెనుదిరగడంతో లంక ఇన్నింగ్స్ పేలవంగా మొదలైంది. విష్మిని ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే క్రాంతి రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చింది. అయితే కెప్టెన్ చమరి ఆటపట్టు మెరుపు ఇన్నింగ్స్ ఆడటం.. హాసిని (22), హర్షిత జోడీ నిలకడగా ఆడటంతో 104/3తో లంక మెరుగ్గానే కనిపించింది. కానీ హర్షిత ఔటయ్యాక లంక నిలవలేకపోయింది. చివరి 4 ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్లు కోల్పోయి 29 పరుగులే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు స్నేహ్, శ్రీ చరణి గొప్పగా బౌలింగ్ చేశారు. గత మ్యాచ్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ.. మంగళవారం వికెట్ల ఖాతా తెరిచింది. ఆమె ఇద్దరిని ఔట్ చేసింది. వైష్ణవి వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో రెండు రనౌట్లు సహా మూడు వికెట్లు పడ్డాయి. ఛేదనలో భారత్ ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. తొలి టీ20లో జెమీమా మెరుపు ఇన్నింగ్స్ ఆడితే.. ఈసారి షెఫాలి రెచ్చిపోయింది. స్మృతి మంధాన (14) త్వరగా ఔటైనా.. జెమీమా (26; 15 బంతుల్లో 4×4, 1×6)తో కలిసి షెఫాలి ధాటిగా ఆడడంతో భారత్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. జెమీమాతో రెండో వికెట్‌కు 58 పరుగులు జోడించిన ఆమె.. హర్మన్‌ప్రీత్ (10)తో మూడో వికెట్‌కు 45 పరుగులు జత చేసి జట్టును గెలిపించింది.

**శ్రీలంక ఇన్నింగ్స్:** విష్మి (సి) అండ్ (బి) క్రాంతి 1; చమరి (సి) అమన్‌జ్యోత్ (బి) స్నేహ్ 31; హాసిని (సి) అండ్ (బి) శ్రీ చరణి 22; హర్షిత రనౌట్ 33; కవిష (సి) అమన్‌జ్యోత్ (బి) శ్రీ చరణి 14; నీలాక్షిక (సి) శ్రీ చరణి (బి) వైష్ణవి శర్మ 2; కౌషిని రనౌట్ 11; శషిని (సి) స్మృతి (బి) వైష్ణవి 0; కావ్య రనౌట్ 1; మల్కి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **128; వికెట్ల పతనం:** 1-2, 2-38, 3-82, 4-104, 5-109, 6-121, 7-122, 8-126, 9-128; **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 3-0-21-1; అరుంధతి రెడ్డి 3-0-22-0; స్నేహ్ రాణా 4-1-11-1; అమన్‌జ్యోత్ 2-0-11-0; వైష్ణవి శర్మ 4-0-32-2; శ్రీ చరణి 4-0-23-2

**భారత్ ఇన్నింగ్స్:** స్మృతి (సి) కావ్య (బి) కవిష 14; షెఫాలి నాటౌట్ 69; జెమీమా (సి) కవిష (బి) కావ్య 26; హర్మన్‌ప్రీత్ (బి) మల్కి 10; రిచా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (11.5 ఓవర్లలో 3 వికెట్లకు) **129; వికెట్ల పతనం:** 1-29, 2-87, 3-128; **బౌలింగ్:** మల్కి మదారా 2.5-0-22-1; కావ్య కవింది 3-0-32-1; కవిష దిల్హరి 2-0-15-1; ఇనోక రణవీర 2-0-31-0; చమరి ఆటపట్టు 1-0-17-0; శషిని 1-0-12-0


దీప్తి శర్మ

## దీప్తి.. నం.1

**దుబాయ్:** భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మహిళల టీ20 బౌలర్ ర్యాంకుల్లో నంబర్‌వన్ స్థానాన్ని సొంతం చేసుకుంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో 20 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టిన దీప్తి.. ర్యాంకుల్లో ఒక స్థానం మెరుగై (737 పాయింట్లు) కెరీర్‌లో తొలిసారి నంబర్‌వన్‌గా నిలిచింది. అనాబెల్ సదర్లాండ్ (న్యూజిలాండ్, 736), సాదియా ఇక్బాల్ (పాకిస్థాన్, 732) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అరుంధతి రెడ్డి అయిదు ర్యాంకులు మెరుగుపరుచుకుని 36వ స్థానంలో నిలిచింది. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన (766) మూడో స్థానంలో ఉండగా.. విశాఖలో జరిగిన తొలి టీ20లో అర్ధసెంచరీ చేసిన జెమీమా రోడ్రిగ్స్ (653) అయిదు ర్యాంకులు మెరుగై తొమ్మిదో స్థానం దక్కించుకుంది. షెఫాలి వర్మ (650) పదో స్థానంలో ఉంది. ఈ జాబితాలో బెత్ మూనీ (ఆస్ట్రేలియా, 794)ది అగ్రస్థానం. ఆల్‌రౌండర్లలో దీప్తి (390) మూడో స్థానంలో కొనసాగుతుండగా.. హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్, 505) నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకుంది.

చాంపియన్

# ఒకే ఓవర్లో 5 వికెట్లు


ప్రియందన

## టీ20ల్లో ప్రియందన రికార్డు

**బాలి:** అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్లో అయిదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా ఇండోనేసియాకు చెందిన గడే ప్రియందన రికార్డు నెలకొల్పాడు. కంబోడియాతో ఎనిమిది టీ20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఒక్క ఓవరే బౌలింగ్ చేసిన ప్రియందన.. ఒక్క పరుగే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. 15 ఓవర్లకు 106/5తో ఉన్న కంబోడియా.. తర్వాతి ఓవర్లోనే ఇన్నింగ్స్‌ను ముగించింది. తొలి మూడు బంతుల్లో మూడు వికెట్లతో హ్యాట్రిక్ తీసిన అతడు.. చివరి రెండు బంతుల్లో మరో రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థికి 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన ఇండోనేసియా.. 60 పరుగుల తేడాతో నెగ్గింది.

# గ్లోబల్ చెస్ లీగ్ విజేత అల్పైన్


ప్రజ్ఞానంద, కరువానా

**ముంబయి:** గ్లోబల్ చెస్ లీగ్ మూడో సీజన్లో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌కు అల్పైన్ షాకిచ్చింది. మొదట ర్యాపిడ్‌లో 4-2తో పైచేయి సాధించిన అల్పైన్.. బ్లిట్జ్‌లో 4.5-1.5తో గెలిచి ట్రోఫీ ఎగరేసుకుపోయింది. కరువానా, ప్రజ్ఞానంద, అనీష్ గిరి, నినో బాట్సియాస్విలి అల్పైన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ టోర్నీలో అలాస్కన్ నైట్స్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆ జట్టు 4-2తో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్‌ను ఓడించింది. చివరి గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ (గ్యాంజెస్)పై ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ విజయం సాధించడంతో అలాస్కన్ నైట్స్‌దే పైచేయి అయింది.

# డేవిస్‌కప్ జట్టులో రిత్విక్


రిత్విక్

**దిల్లీ:** నెదర్లాండ్స్‌తో ఫిబ్రవరి, 7, 8 తేదీల్లో బెంగళూరు వేదికగా జరిగే డేవిస్ కప్ క్వాలిఫయర్స్ తొలి రౌండ్ పోరులో తలపడే భారత జట్టులో హైదరాబాద్ కుర్రాడు రిత్విక్ బొల్లిపల్లి చోటు దక్కించుకున్నాడు. నెదర్లాండ్స్‌ను ఢీకొనే భారత జట్టును మంగళవారం అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) ఎంపిక చేసింది. డబుల్స్‌లో యుకి బాంబ్రితో రిత్విక్ బరిలోకి దిగుతాడు. ఈ జట్టులో దక్షిణేశ్వర్ సురేశ్, కరణ్ సింగ్, ఆర్యన్ షా, అనిరుధ్ చంద్రశేఖర్, దిగ్విజయ్ సింగ్ కూడా ఉన్నారు. ఆర్యన్, అనిరుధ్, దిగ్విజయ్ రిజర్వ్‌లుగా ఎంపికయ్యారు. ప్రజ్వల్ దేవ్, ఆర్ణవ్ పపార్కర్‌లను ప్రాక్టీస్ భాగస్వాములుగా ఐటా ఎంపిక చేసింది. సెప్టెంబరులో స్విట్జర్లాండ్‌పై ఆడిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న శ్రీరామ్ బాలాజీకి అవకాశం దక్కలేదు.

## విజయ్ హజారేకు

# స్టార్ కళ

బరిలో కోహ్లి, రోహిత్, పంత్, గిల్, రాహుల్

- నేటి నుంచే దేశవాళీ వన్డే టోర్నీ

బెంగళూరు

దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లను ఈసారి మైదానాల్లో, టీవీల్లో అభిమానులు ఎగబడి చూస్తారనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఎన్నడూ లేనంత ఆకర్షణతో టోర్నీ ముస్తాబైంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ లాంటి సూపర్ స్టార్లకు తోడు రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ లాంటి టీమ్‌ఇండియా ఆటగాళ్లు ఈ టోర్నీలో బరిలోకి దిగబోతున్నారు. టీమ్‌ఇండియా మ్యాచ్‌లు లేని సమయంలో దేశవాళీ టోర్నీలు జరిగితే.. భారత ఆటగాళ్లందరూ వాటిలో ఆడడాన్ని బీసీసీఐ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. రోహిత్, కోహ్లి, రాహుల్ గత నెల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగారు. పంత్ అంతకుముందు అదే జట్టుతో టెస్టు సిరీస్ ఆడాడు. శుభ్‌మన్, సూర్య, అభిషేక్ ఇటీవలే టీ20 సిరీస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. వీళ్లంతా వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో సిరీస్ ఆడనున్నారు. ఈ లోపు టీమ్‌ఇండియా ఆటగాళ్లందరినీ విజయ్ హజారే టోర్నీలో ఆడాలని బీసీసీఐ ఆదేశించింది. బుధవారం మొదలయ్యే టోర్నీలో బెంగళూరులో ఆంధ్రతో మ్యాచ్‌లో కోహ్లి దిల్లీ తరపున బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌లో పంత్ దిల్లీకి నాయకత్వం వహించనుండగా.. ఆంధ్రను ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి నడిపించనున్నాడు. టీమ్‌ఇండియా పేసర్ హర్షిత్ రాణా కూడా దిల్లీ జట్టులో ఉన్నాడు. మరోవైపు జైపుర్‌లో సిక్కింతో జరిగే మ్యాచ్‌లో రోహిత్ శర్మ ముంబయికి ఆడనున్నాడు. శార్దూల్ ఠాకూర్ సారథ్యంలో హిట్‌మ్యాన్ ఆడనున్నాడు. సూర్యకుమార్ టోర్నీ కోసం ముంబయి జట్టుకు అందుబాటులో ఉన్నప్పటికీ.. తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగకపోవచ్చు. టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. మహారాష్ట్రతో మ్యాచ్‌లో పంజాబ్‌కు ఆడనున్నాడు. మరో మ్యాచ్‌లో కర్ణాటకతో కేరళ తలపడనుండగా.. కేఎల్ రాహుల్, సంజు శాంసన్ ప్రత్యర్థులుగా ఆడబోతున్నారు. టోర్నీలో హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌తో ఆడనుంది. అన్ని మ్యాచ్‌లూ ఉదయం 9కే ఆరంభమవుతాయి.


పంత్, కోహ్లి


రోహిత్


### చిన్నస్వామికి అనుమతి నిరాకరణ

చిన్నస్వామి స్టేడియంలో దిల్లీ, ఆంధ్ర మధ్య విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌ను నిర్వహించాలన్న కర్ణాటక క్రికెట్ సంఘం ప్రయత్నం ఫలించలేదు. కర్ణాటక ప్రభుత్వం ఇందుకు అనుమతి ఇవ్వలేదు. ఈ ఏడాది ఐపీఎల్ ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గెలిచిన అనంతరం విజయోత్సవ వేడుకల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం ముందు జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన నేపథ్యంలో ఈ మైదానాన్ని మూసేశారు. అప్పటి నుంచి ఏ మ్యాచ్ జరగలేదు. ఇప్పుడు అభిమానులు లేకుండా చిన్నస్వామిలో విజయ్ హజారే మ్యాచ్‌ను నిర్వహించడానికి ప్రయత్నాలు జరిగాయి. తర్వాత ఐపీఎల్‌కు కూడా ఈ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలనుకున్నారు. కానీ విజయ్ హజారే మ్యాచ్‌కు అనుమతి లభించలేదు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణను నిరాకరించింది. కారణాలు వెల్లడికాలేదు. తొక్కిసలాట ఉదంతం అనంతరం ఏర్పాటైన జస్టిస్ జాన్ మైకేల్ కున్హా కమిషన్.. స్టేడియం భద్రతపై చేసిన సిఫార్సులను అమలు చేయకపోవడంతోనే అనుమతి నిరాకరించినట్లు సమాచారం. దీంతో దిల్లీ, ఆంధ్ర మ్యాచ్‌ను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో నిర్వహించనున్నారు. మరి చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ సాధ్యపడుతుందో లేదో చూడాలి.

# ఆంధ్రప్రదేశ్‌కు రజతం

- తమిళనాడు, హరియాణాలకు టైటిళ్లు
- అంతర్ రాష్ట్ర జోనల్ బ్యాడ్మింటన్

**ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు:** అంతర్ రాష్ట్ర, జోనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు రజతం గెలుచుకుంది. మంగళవారం విజయవాడలో జరిగిన టోర్నీ ఫైనల్లో ఏపీ 0-3తో హరియాణా చేతిలో ఓడింది. తొలి సింగిల్స్‌లో నవ్య కందేరి 22-20,16-21, 16-21తో దేవికకు తలొంచింది. రెండో సింగిల్స్‌లో సూర్య చరిష్మ 14-21, 14-21తో ఉన్నతి హుడా చేతిలో పరాజయం పాలైంది. డబుల్స్‌లో నవ్య-చరిష్మ జంట 13-21, 22-24తో ఉన్నతి-అన్మోల్ జోడీ చేతిలో ఓడింది. పురుషుల ఫైనల్లో తమిళనాడు 3-2తో హరియాణాను ఓడించింది. తొలి సింగిల్స్‌లో శంకర్ ముత్తుస్వామి (తమిళనాడు) 16-21, 21-17, 18-21తో మన్‌రాజ్ సింగ్ (హరియాణా) చేతిలో పరాజయం పాలయ్యాడు. డబుల్స్‌లో హరిహరన్-రూబెన్ జోడీ 21-16, 21-10తో భరత్, మన్‌రాజ్‌సింగ్ జంటపై గెలిచి తమిళనాడును పోటీలోకి తెచ్చింది. తర్వాత సంజీవి 11-21, 19-21తో భరత్ చేతిలో ఓడడంతో హరియాణా 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సింగిల్స్‌లో తమిళనాడు షట్లర్ సుగి సాయిబాల 21-11, 21-16తో గౌతమ్‌పై నెగ్గడంతో మళ్లీ స్కోర్లు సమమయ్యాయి. నిర్ణయాత్మక డబుల్స్‌లో నవీన్-లోకేశ్ జంట 21-17, 23-25, 21-18తో మయాంక్-ఆర్యన్ జోడీపై గెలిచి తమిళనాడుకు విజయాన్ని అందించింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఏపీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ద్వారకానాథ్, ప్రధాన కార్యదర్శి డా.పోలినేని అంకమ్మచౌదరి విజేతలకు బహుమతులు అందజేశారు.



# ప్రధానితో నీరజ్ భేటీ

**దిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని భారత స్టార్ జావెలిన్ క్రీడాకారుడు నీరజ్ చోప్రా మర్యాదపూర్వకంగా కలిశాడు. తన భార్య హిమాని మోర్‌తో కలిసి నీరజ్ మంగళవారం మోదీతో సమావేశమయ్యాడు. ''ఈరోజు నీరజ్, ఆయన భార్య హిమాని మోర్‌ను కలిశా. క్రీడలతో సహా వివిధ అంశాలపై గొప్ప సంభాషణ జరిగింది'' అని ప్రధాని మోదీ 'ఎక్స్‌లో' పేర్కొన్నారు.

# యాషెస్ నుంచి కమిన్స్ ఔట్!

## నాలుగో టెస్టుకు స్పిన్నర్ మర్ఫీ

**మెల్‌బోర్న్:** యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆట ఒక్క మ్యాచ్‌కు పరిమితం కానుంది. గాయం కారణంగా కొన్ని నెలల పాటు ఆటకు దూరంగా ఉన్న కమిన్స్.. యాషెస్‌లో తొలి రెండు టెస్టులకు అందుబాటులో లేడు. మూడో మ్యాచ్‌లో బరిలోకి దిగిన అతను.. 6 వికెట్లతో సత్తా చాటాడు. కానీ గాయం తిరగబెట్టే ప్రమాదం ఉండడంతో నాలుగో టెస్టు నుంచి కమిన్స్‌ను పక్కన పెట్టారు. సిరీస్ ఇప్పటికే 3-0తో ఆస్ట్రేలియా సొంతమైన నేపథ్యంలో అతను చివరి మ్యాచ్‌లో కూడా ఆడడం అనుమానమే. నాలుగో టెస్టు తర్వాత ఆ మ్యాచ్‌కు జట్టును ప్రకటిస్తారు. ప్రధాన పేసర్లలో ఒకడైన హేజిల్‌వుడ్ గాయంతో సిరీస్ మొత్తానికి దూరం కాగా.. తొలి రెండు టెస్టుల్లో జట్టుకు నాయకత్వం వహించిన స్టీవ్ స్మిత్, మూడో మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. నాలుగో టెస్టుకు అతనే కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. మూడో టెస్టులో గాయపడ్డ స్పిన్నర్ నాథన్ లైయన్ స్థానంలో తర్వాతి మ్యాచ్‌కు టాడ్ మర్ఫీ జట్టులోకి వచ్చాడు. బాక్సింగ్ డే సందర్భంగా ఈ నెల 26న మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు మొదలవుతుంది.

# అది నా చేతుల్లో లేదు: మెక్‌కలమ్

**మెల్‌బోర్న్:** కోచ్‌గా కొనసాగాలా వద్దా అనేది తన చేతుల్లో లేని నిర్ణయమని ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ అన్నాడు. ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌ను ఇంగ్లాండ్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 0-3తో కోల్పోయిన నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. ''కోచ్‌గా కొనసాగాలా లేదా అన్నది నా చేతుల్లో లేదు. నేను చేయాల్సింది నా పనిని సమర్థంగా పోషించడం. పాఠాలు నేర్చుకోవడం. కోచ్ పాత్ర చాలా ఆసక్తికరమైంది. జట్టుతో ప్రపంచంలో చాలా చోట్లకు తిరుగుతూ ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. అలాగే జట్టు సభ్యుల నుంచి ఉత్తమ ప్రదర్శనను రాబట్టొచ్చు. విమర్శల గురించి పట్టించుకోను'' అని మెక్‌కలమ్ పేర్కొన్నాడు.


విలియమ్సన్

# భారత్‌తో వన్డేలకు విలియమ్సన్ దూరం

**వెల్లింగ్టన్:** భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌కు న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ దూరమయ్యాడు. న్యూజిలాండ్ బోర్డు కాంట్రాక్టును వదులుకుని వీలున్నప్పుడే జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేన్.. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ఆడాల్సి ఉండడంతో, భారత పర్యటనకు దూరమయ్యాడు. జనవరి 11 నుంచి భారత్‌తో మూడు వన్డేలు ఆడనున్న కివీస్.. ఆ తర్వాత అయిదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ రెండు సిరీస్‌లకూ న్యూజిలాండ్ జట్లను సెలక్టర్లు ప్రకటించారు. వన్డే జట్టుకు మైకేల్ బ్రాస్‌వెల్, టీ20 జట్టుకు మిచెల్ శాంట్నర్ నాయకత్వం వహిస్తారు. వన్డే జట్టులో కొత్త స్పిన్నర్ జైడెన్ లెనాక్స్ చోటు దక్కించుకున్నాడు. భారత సంతతికి చెందిన ఆది అశోక్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. **న్యూజిలాండ్ వన్డే జట్టు:** బ్రాస్‌వెల్ (కెప్టెన్), ఆది అశోక్, క్రిస్టియన్ క్లార్క్, క్లార్క్‌సన్, కాన్వే, ఫౌక్స్, మిచ్ హే, జేమీసన్, నిక్ కెల్లీ, లెనాక్స్, మిచెల్, నికోల్స్, ఫిలిప్స్, మైకేల్ రే, విల్ యంగ్; **టీ20 జట్టు:** శాంట్నర్ (కెప్టెన్), బ్రాస్‌వెల్, చాప్‌మన్, కాన్వే, డఫీ, ఫౌక్స్, హెన్రీ, జేమీసన్, బెవాన్ జాకబ్స్, మిచెల్, నీషమ్, ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ రాబిన్సన్, ఇష్ సోధి.

# సిరీస్ మధ్యలో.. మద్యం మత్తులో!

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌ను రెండు టెస్టులు మిగిలి ఉండగానే చేజార్చుకున్న ఇంగ్లాండ్.. మరో సమస్యలో చిక్కుకుంది. రెండు, మూడు టెస్టుల మధ్య విరామంలో ఇంగ్లాండ్ ఆటగాళ్లు అతిగా మద్యం తాగినట్లు సమాచారం. బ్రిస్బేన్ సమీపంలోని నూసా బీచ్ రిసార్ట్‌కు వచ్చిన ఇంగ్లిష్ ప్లేయర్లు మద్యం మత్తులో మునిగి తేలినట్లు తెలిసింది. దీనిపై ఇంగ్లాండ్ అధికారులు విచారణ చేపట్టారు. ''మా ప్లేయర్లు అతిగా మద్యం సేవించినట్లు కొందరు చెప్పారు. ఈ విషయంపై విచారణ జరుపుతున్నాం. ఎలాంటి స్థితిలోనైనా ఒక అంతర్జాతీయ జట్టు ఇష్టానుసారంగా మద్యం సేవించడం ఊహించని విషయం. అక్కడ అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలి. నాకు తెలిసినదాన్ని బట్టి నూసాలో విరామానికి వెళ్లిన తర్వాత ఇంగ్లాండ్ జట్టు లంచ్ చేసింది.. తర్వాత డిన్నర్ ముగించింది. రాత్రి వేళ బయటకు ఎక్కడికి వెళ్లలేదు. ఆహారం తీసుకునే సమయంలో కాస్త మద్యం సేవిస్తే పర్వాలేదు.. మోతాదు మించితేనే సమస్య'' అని జట్టు డైరెక్టర్ రాబ్ కీ చెప్పాడు. యాషెస్ సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌తో మూడో వన్డే ముంగిట కూడా ఇంగ్లాండ్ ప్లేయర్లు మద్యం సేవిస్తూ కనిపించినట్లు తనకు సమాచారం అందినట్లు రాబ్ కీ చెప్పాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు ముందు రోజు రాత్రి వెల్లింగ్టన్‌లో హ్యారీ బ్రూక్, జాకబ్ బెతెల్ తిరుగుతున్నట్లు సామాజిక మాధ్యమంలో ఒక వీడియో హల్‌చల్ చేసింది.

# క్వాంటమ్‌లో 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు శిక్షణ

- ఏపీ, వైసర్ భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద శిక్షణ కార్యక్రమం
- వైసర్ డైరెక్టర్ ప్రాచీ వఖారియా

**ఈనాడు, అమరావతి:** అమరావతిలో వచ్చే ఏడాది ప్రారంభంలో క్వాంటమ్ టాలెంట్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వైసర్ సంస్థ డైరెక్టర్ ప్రాచీ వఖారియా ప్రకటించారు. దీని ద్వారా 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు క్వాంటమ్ శిక్షణ అందించనున్నామని, దీంతో ఏపీలో అత్యుత్తమ ప్రతిభతో కూడిన ఒక పెద్ద టాలెంట్ పూల్ ఏర్పడుతుందని తెలిపారు. క్యూబిటెక్, వైసర్, క్యూ కృషి, రాష్ట్ర క్వాంటమ్ మిషన్ సంయుక్తంగా 54 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులకు క్వాంటమ్ టెక్నాలజీపై ఇస్తున్న శిక్షణను ఉద్దేశించి వఖారియా మాట్లాడారు. 'అమరావతి ప్రపంచానికి ఒక క్వాంటమ్ రాజధానిగా మారుతుందని భావిస్తున్నాం. విద్యార్థులు రాబోయే సాంకేతికతలను నేర్చుకోవడంతో పాటు వాటి రూపకర్తలుగానూ మారబోతున్నారు. ఈ ఏడాది ఏపీలో 54 వేల మందికి పైగా విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీపై శిక్షణ అందిస్తున్నాం. ఏపీ, వైసర్ భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద క్వాంటమ్ శిక్షణ కార్యక్రమంగా ఇది నిలుస్తుంది. అమరావతి క్వాంటమ్ టెక్నాలజీ, వినూత్న ఆవిష్కరణలకు గ్లోబల్ కేంద్రంగా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీలో వైసర్ భాగస్వామి కావడం ఉత్సాహాన్నిస్తోంది. వైసర్ సంస్థ ద్వారా 120కి పైగా దేశాలకు చెందిన 10 వేల మంది బ్యాచిలర్ స్థాయి నుంచి పీహెచ్‌డీ పరిశోధకుల వరకు శిక్షణ పొందారు. క్వాంటమ్-1.0 ఇప్పటికే ఎంఆర్ఐ, సెమీ కండక్టర్లు, ఓఎల్ఈడీ టీవీ స్క్రీన్ల ద్వారా ఆధునిక ప్రపంచాన్ని మార్చింది. ఇప్పుడు మనం ప్రవేశిస్తున్న దశ క్వాంటమ్-2.0. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్, సెన్సింగ్, కమ్యూనికేషన్, మెటీరియల్స్ ఇవన్నీ ప్రయోగశాల నుంచి నిజమైన విస్తృత స్థాయి వ్యవస్థలుగా మారుతున్నాయి' అని తెలిపారు.

## శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అద్భుతమైన కెరీర్

– అభయ్ కరాండికర్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి

క్వాంటమ్ వ్యాలీకి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రతి అవకాశాన్నీ విద్యార్థులు పూర్తిగా వినియోగించుకోవాలి. ఏపీ ప్రభుత్వం ఇంత పెద్ద స్థాయిలో క్వాంటమ్ వర్క్‌ఫోర్స్‌ను తయారు చేస్తున్నందుకు అభినందనలు. జాతీయ క్వాంటమ్ మిషన్ ఆశించిన దిశలో ఏపీ ముందంజలో ఉంది. జాతీయ మిషన్ కింద క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెన్సింగ్, మెటీరియల్స్ రంగాల్లో నాలుగు థీమాటిక్ హబ్‌లు ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా 14 సాంకేతిక గ్రూపులు, 150 మంది ప్రధాన, సహ పరిశోధకులతో కొనసాగుతోంది. ఏఐసీటీఈతో కలిసి క్వాంటమ్ టెక్నాలజీలో యూజీ మైనర్ ప్రోగ్రామ్, మాస్టర్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించాం. ఇంజినీరింగ్ కళాశాలల్లో టీచింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు సహకారం అందిస్తున్నాం. ఏపీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఇవి క్వాంటమ్ నైపుణ్య కార్యక్రమాలకు అదనపు బలాన్ని ఇస్తాయి. శిక్షణ పొందిన యువతకు పరిశ్రమలు, పరిశోధన ప్రయోగశాలలతో పాటు సొంతంగా స్టార్టప్‌లను ప్రారంభించడానికి భారీ అవకాశాలున్నాయి. నైపుణ్యం కలిగిన యువత ఉద్యోగాలు సృష్టించే వారిగానూ మారగలరు. క్వాంటమ్ టెక్నాలజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులందరికీ అద్భుతమైన కెరీర్ ఉంటుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ రూపంలో ఇక్కడ ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులు, పరిశ్రమలతో అనుసంధానం, ఐఐటీ మద్రాస్, తిరుపతిలాంటి ప్రఖ్యాత విద్యా సంస్థలతో ఏర్పడుతున్న భాగస్వామ్యం విద్యార్థుల కలల సాకారానికి ఉపయోగపడతాయి.

## తక్కువ సమయంలోనే క్వాంటమ్ ఏర్పాటు చర్యలు వేగం

– సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ తిరుపతి

ఏపీని డీప్ టెక్, క్వాంటమ్, ఇన్నోవేషన్ల కేంద్ర స్థానంగా మార్చాలనే సీఎం చంద్రబాబు ఆలోచన అత్యంత వేగంగా కార్యరూపం దాల్చుతోంది. క్వాంటమ్ వ్యాలీ ఆలోచన మార్చిలో ప్రారంభమై మే 2న అధికారిక ప్రకటనగా వెలువడింది. మే మొదటి వారంలో ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చాం. జూన్ 30న భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే వర్క్‌షాప్ నిర్వహించాం. దీని తర్వాత జాతీయ క్వాంటమ్ మిషన్‌కు అనుగుణంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, అకడమిక్‌తో పాటు శిక్షణ ఎకో సిస్టమ్‌ను అన్ని రంగాల వారితో కలిసి ఈ పెద్ద కార్యక్రమాన్ని ప్రారంభించాం. క్వాంటమ్ వ్యాలీ ప్రారంభ దశలోనే 50 ఎకరాల్లో ఏర్పాటు చేసి, 200 ఎకరాలకు వరకు విస్తరించే ఆలోచన ఉంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సులో క్వాంటమ్‌కు సంబంధించి 28 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో పాటు క్వాంటమ్ కమ్యూనికేషన్, మెటీరియల్స్, సెన్సింగ్, మెట్రాలజీ లాంటి రంగాల్లోనూ బలమైన ఎకోసిస్టం ఏపీలో ఏర్పాటు చేస్తున్నాం. ఈ మొత్తం వ్యవస్థను ముందుకు నడిపించడానికి మానవవనరులు చాలా ముఖ్యం. ఇప్పుడు ప్రారంభిస్తున్న శిక్షణ ఆ దిశగా ఒక కీలక అడుగు

## డీప్‌టెక్‌లో అమరావతి నుంచి గొప్ప ప్రయాణం

– కామకోటి, డైరెక్టర్, ఐఐటీ మద్రాస్

అమరావతి నుంచి డీప్‌టెక్ రంగంలో ఒక గొప్ప ప్రయాణం మొదలవుతోంది. కంప్యూటింగ్, కమ్యూనికేషన్ రంగాల్లో భారీ మార్పును మనం చూస్తున్నాం. మనలో చాలా మంది ఉపయోగిస్తున్న క్లాసికల్ కంప్యూటర్లకు కొన్ని పరిమితులున్నాయి. అందుకే ఇప్పుడు ప్రపంచం మొత్తం క్వాంటమ్ కంప్యూటింగ్ అనే కొత్త విధానానికి మారుతోంది. ఇది కంప్యూటర్ సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకే పరిమితం కాదు.. వ్యవసాయం, ఆరోగ్యం, ఆర్థికం ప్రతి రంగానికీ విస్తరిస్తుంది. మౌలిక, అధునాతన, అత్యున్నత.. ఇలా మూడు స్థాయిల్లో శిక్షణ ఉంటుంది. అమరావతిలో త్వరలోనే భౌతిక క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయబోతున్నాం. దీంతో విద్యార్థులందరూ ప్రత్యక్షంగా పని చేసే అవకాశం లభిస్తుంది. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించడంతో క్వాంటమ్ ప్రక్రియ వేగంగా సాగుతోంది.

## మీ నాయకత్వం మాకు స్ఫూర్తినిస్తోంది

'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో విద్యార్థులు

**ఈనాడు, అమరావతి:** క్వాంటమ్ టెక్నాలజీపై అందిస్తున్న ఆన్‌లైన్ శిక్షణ తమ భవిష్యత్తుకు పునాది వేస్తుందని విద్యార్థులు తెలిపారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికవృద్ధికి అవకాశం లభిస్తుందన్నారు. వైసర్, క్యూబిటెక్, క్యూ కృషి, రాష్ట్ర క్వాంటమ్ మిషన్ సంయుక్తంగా రాష్ట్రంలో 54వేల మందికి నిర్వహిస్తున్న క్వాంటమ్ టెక్నాలజీ శిక్షణలో భాగంగా 'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో విద్యార్థులు వర్చువల్‌గా మాట్లాడారు.

### నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం

– సోమ ప్రభ, బీటెక్, జేఎన్‌టీయూ, అనంతపురం

ఐటీ రంగం అభివృద్ధి నుంచి ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే సంస్థల నిర్మాణంలో మీ నాయకత్వం మాకు స్ఫూర్తినిస్తోంది. ఏపీ విద్యార్థులకు కేవలం రూ.500 ఫీజుతో ఈ శిక్షణ అందిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం.

### కొత్త అవకాశాలు లభిస్తాయి

– గంగపూజిత, బీటెక్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌లో బీటెక్ కోర్సు ప్రారంభించారు. ఈ సిలబస్‌లో 60% హార్డ్‌వేర్, 40% సాఫ్ట్‌వేర్ ఉంది. క్వాంటమ్ శిక్షణ మా భవిష్యత్తు చదువులు, పరిశోధన, గ్లోబల్ అవకాశాలకు బలమైన పునాది వేస్తుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తోంది.

### క్వాంటమ్‌లోనే కొనసాగుతాను

– వి.మౌరియస్, బీటెక్, వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చిత్తూరు

అమరావతిలో క్వాంటమ్‌వ్యాలీ ఏర్పాటు సంప్రదాయ ఐటీకి భిన్నంగా కొత్త దారి చూపిస్తుంది. నా భవిష్యత్తును క్వాంటమ్ టెక్నాలజీలోనే కొనసాగించాలని నిర్ణయించుకున్నాను. 2028 నాటికి వెయ్యి క్వాంటమ్ ఆల్గరిథమ్‌ల లక్ష్యాన్ని చేరుకోవడానికి మేము కష్టపడతాం.

### ఆర్థికవృద్ధి వేగవంతమవుతుంది

– జశ్వంత్, బీటెక్, వీవీఐటీ, గుంటూరు

ఏపీ ప్రభుత్వం క్వాంటమ్ నైపుణ్య శిక్షణ అందించి, భవిష్యత్తుకు బలమైన పునాది వేసింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీతో క్వాంటమ్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. దీంతో ఉపాధి అవకాశాలతో పాటు ప్రతి వ్యక్తికీ ఆదాయాన్ని పెంచేలా ఆర్థికవృద్ధి వేగవంతమవుతుంది.

# లారీ యజమానులకు ఊరట

- పెంచిన ఫిట్‌నెస్ ఫీజులు నిలుపుదల
- మెమో జారీ చేసిన ప్రభుత్వం

**ఈనాడు, అమరావతి:** సరకు రవాణా వాహనాల ఫిట్‌నెస్ ఫీజులు పెంచుతూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ (మోర్త్) ఈ నెల 11న జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు గతంలో ఉన్న పాత ఫిట్‌నెస్ ఫీజులనే వసూలు చేయాలని పేర్కొంది. దీంతో రాష్ట్రంలో లారీ యజమానులకు ఊరట కలిగినట్లయింది. పెంచిన ఫిట్‌నెస్ ఫీజుల విషయంలో ఇతర రాష్ట్రాలు ఏం చేస్తున్నాయనేది అధ్యయనం చేసి, తగిన సూచనలతో రవాణాశాఖ కమిషనర్ నివేదిక అందజేయాలని రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు.

**సీఎం ఆదేశాలతో..:** కేంద్రం ఫిట్‌నెస్ ఫీజులు పెంచడంతో 20 ఏళ్లు దాటిన లారీలకు ఫిట్‌నెస్ ఫీజు గరిష్ఠంగా రూ.33 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇటీవల జరిగిన రహదారి భద్రత సమావేశంలో ఈ అంశాన్ని లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని పరిశీలించాలని రవాణాశాఖ అధికారులకు సీఎం ఆదేశించారు. అనంతరం తాజా నిర్ణయం వెలువడింది. దీనిపై ఏపీ లారీ యజమానుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. సీఎంకు, రవాణాశాఖ మంత్రి, ఉన్నతాధికారులకు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపింది.

## ఆప్కోలో సంక్రాంతి రాయితీలు

మంత్రి సవిత



**ఈనాడు, అమరావతి:** సంక్రాంతి సందర్భంగా ఆప్కో షోరూంలలో భారీ రాయితీలపై వస్త్రాలు విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. 60, 50, 40 శాతం రాయితీలపై చేనేత వస్త్రాల విక్రయాలు ఉంటాయని వెల్లడించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత, జౌళి శాఖల అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. "సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని ఆప్కో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. 60% రాయితీపై వస్త్రాల అమ్మకాల కోసం గుంటూరు చేనేత ఏడీ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలోని యర్రబాలెంలోనూ ప్రత్యేక కౌంటర్ ప్రారంభించాలి. విజయవాడలోని ఆప్కో మెగా షోరూంలో 50% రాయితీపై అమ్మకాలు చేయాలి. రాష్ట్రంలోని మిగిలిన అన్ని షోరూంలలో 40% రాయితీ వర్తింపజేయాలి" అని ఆదేశించారు.

# ఐటీకి సిలికాన్ వ్యాలీ.. క్వాంటమ్‌కు అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యాన్ని బట్టి మాతో భాగస్వాములుగా చేరొచ్చు" అని సీఎం పేర్కొన్నారు.

**అమరావతిలోనే పూర్తి సప్లై చైన్ తయారీ**

భవిష్యత్తులో క్వాంటమ్ సప్లై చైన్‌కి అవసరమైన మొత్తం పరికరాల్ని అమరావతిలోనే ఉత్పత్తి చేస్తామన్నారు. రాష్ట్ర యువతకు వేలకొద్దీ అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. "క్వాంటమ్ కంప్యూటర్లలో వినియోగించే 85% పరికరాలను తయారుచేస్తున్న కంపెనీలు ఇప్పటికే రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. మిగతా 15% రావడం పెద్ద కష్టం కాదు. సూపర్ కండక్టింగ్, న్యూట్రల్ ఆటమ్, ఫోటానిక్, అయాన్-ట్రాప్ టెక్నాలజీలతో అన్ని రకాల క్వాంటమ్ కంప్యూటర్లు అభివృద్ధి చేస్తాం. ఏఐ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ మెటీరియల్స్ వంటి నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలు పెంపొందిస్తాం. క్రయోజెనిక్స్, సెమీకండక్టర్ల నుంచి అల్గరిథమ్స్, ఏఐ ఎనేబుల్డ్ అప్లికేషన్ల వరకూ అమరావతి నుంచే అందజేస్తాం" అని సీఎం తెలిపారు. క్వాంటమ్ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను మించిన ప్రదేశం మరొకటి లేదని, వేగం, ఆవిష్కరణ, కార్యాచరణల్లో మనతో ఎవరూ సరితూగలేరని తెలిపారు.

**అప్పుడు ఐటీ విజన్... ఇప్పుడు క్వాంటమ్ విజన్**

మూడు దశాబ్దాల క్రితం ఐటీ విజన్‌తో అద్భుతమైన ఫలితాలు సాధించామని సీఎం తెలిపారు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచపటంలో నిలిపేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. "ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ నిపుణుల్ని తయారుచేసి ప్రపంచానికి అందించాం. సైబరాబాద్ అభివృద్ధితో హైదరాబాద్ ప్రపంచ ఐటీహబ్‌గా ఎదిగింది. అప్పట్లోనే మైక్రోసాఫ్ట్‌ని హైదరాబాద్‌కి తీసుకొచ్చాం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ కంపెనీలకు సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ కృష్ణ వంటి భారతీయ మూలాలున్నవారే సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. "ఏపీని క్వాంటమ్‌తో పాటు, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.




'క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్' కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన విద్యార్థినితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

**ఆర్థికంగా పుంజుకుంటున్నాం**

'చైనా 1978లోనే ఆర్థిక సంస్కరణలకు తెరతీస్తే, మనం 1991లో ప్రారంభించాం. సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, నాలెడ్జ్ ఎకానమీ, మేకిన్ ఇండియా, స్టార్టప్, స్కిల్, డిజిటల్ ఇండియా, జీఎస్టీ లాంటి చర్యల వల్ల ఆర్థికంగా పుంజుకున్నాం. నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించాం" అని సీఎం వివరించారు. "మన డీఎన్ఏలోనే విజ్ఞానం ఉంది. క్రీస్తుపూర్వం 2,500లోనే పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్‌లో మనం నిష్ణాతులం. క్రీ.పూ.900 నాటికే ఆరోగ్య రంగం, యోగ విద్యల్లోనూ, క్రీ.పూ.600 నాటికి ఆయుర్వేద వైద్యంలోనూ మనం అగ్రగణ్యులం. క్రీ.పూ.138లోనే సిల్క్‌రూట్ ఏర్పాటైంది. క్రీ.శ. 427లో నలంద విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. క్రీ.శ. 500లో ఆర్యభట్ట 'సున్నా'ను కనిపెట్టారు. అప్పటికే లోహశాస్త్రంలో దిట్టలం. క్రీ.శ.600లో చదరంగం కనిపెట్టాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రాబోయే 22 ఏళ్లు కీలకం**

"2047 నాటికి భారత్‌ను అగ్రశ్రేణి ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాబోయే 22 ఏళ్లు మనకు కీలకం. ఈ కాలాన్ని జారవిడుచుకుంటే మళ్లీ సాధించలేం. డీప్‌టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ విజన్‌ని మీరంతా అందిపుచ్చుకోవాలి. 5-7 ఏళ్లు కష్టపడితే భవిష్యత్తులో మీరు కోరుకున్నది జరుగుతుంది. టెక్నాలజీలో మౌలికాంశాలపై పట్టుసాధించి మెదడుకు సానబెడితే అద్భుతాలు చేస్తారు" అని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, మద్రాస్, తిరుపతి ఐఐటీల డైరెక్టర్లు సత్యనారాయణ, కామకోటి, వైసర్ కంపెనీ డైరెక్టర్ ప్రాచీ వఖారియా తదితరులు పాల్గొన్నారు.




'క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

## పాఠశాల విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీ నైపుణ్యాలు

ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇందుకోసం పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటుచేయాలని, క్వాంటమ్ టెక్నాలజీలో అవగాహన కల్పించేలా జనవరి నెలాఖరులోగా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో విద్యార్థులకు కృత్రిమ మేధపై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను ఐఐటీ ప్రతినిధులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఏపీలోని ప్రతి విద్యార్థికీ క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి. వివిధ ఐఐటీలు క్వాంటమ్‌లో చేస్తున్న అధ్యయనాలను పరిశీలించాలి. టెక్ విద్యార్థులు క్వాంటమ్, ఏఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు పాఠశాల స్థాయి నుంచే క్వాంటమ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. 2026 జనవరి నెలాఖరులో విద్యార్థి భాగస్వామ్యం నిర్వహిస్తాం. ఈ సదస్సులో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దాం. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన కలిగించేందుకు ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఉపకరిస్తాయి" అని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ట్రూ 5జీ సేవల విస్తరణపైనా బీఎస్ఎన్ఎల్ అధికారులతో సీఎం సమీక్షించారు.

## విద్యార్థులకు రాకెట్ తయారీ పోటీలు

దక్షిణ భారత రాకెట్రీ ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం

**ఈనాడు, అమరావతి:** విద్యార్థుల్లో రాకెట్ల తయారీ నైపుణ్యాలను వెలికితీసేందుకు దక్షిణ భారత రాకెట్రీ ఛాలెంజ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన దక్షిణ భారత రాకెట్రీ ఛాలెంజ్ 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజులపాటు గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఫైనల్స్ జరగనున్నాయి. సైన్స్‌సిటీ అమరావతి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వివరించారు. కళాశాల స్థాయిలో కెమికల్ రాకెట్రీ, పాఠశాల స్థాయిలో హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కెమికల్ రాకెట్రీ విభాగంలో 16 ఏళ్లకు పైబడిన వారు, హైడ్రో రాకెట్రీ విభాగంలో 6 నుంచి 12 ఏళ్ల వయసున్న వారు పాల్గొంటారని పేర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా http://www.sciencecity.ap.gov.in/rocketry_challenge.aspx రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది.

## హైకోర్టులో సెమీ క్రిస్మస్ వేడుకలు

కేకు కోసి శుభాకాంక్షలు తెలిపిన సీజే




క్రిస్మస్ కేకు కోస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్. చిత్రంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ తదితరులు

**ఈనాడు, అమరావతి:** హైకోర్టులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. సీజే కేకును కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## మూడు నెలలకోసారి రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదు

18 ఏళ్లు నిండిన యువతకు వెసులుబాటు

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఏడాదిలో నాలుగు సార్లు అవకాశం కల్పించారు. దాంతో ఇకపై ప్రతి మూడు నెలలకోసారి ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఈ మేరకు చేసిన చట్ట సవరణకు గవర్నర్ ఆమోదంతో మంగళవారం ఆర్డినెన్స్ వెలువడింది. ఏటా జనవరి 1న అర్హత తేదీగా నిర్ణయించి 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకుంటోంది. ఆ తేదీ తర్వాత 18 ఏళ్లు పూర్తయిన వారు మళ్లీ వచ్చే జనవరి 1 వరకు ఎదురు చూసేవారు. దీన్ని కేంద్ర ఎన్నికల సంఘం మారుస్తూ. ఏడాదిలో మొత్తం 4 సార్లు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. ఇదే విధానం స్థానిక సంస్థల్లోనూ అమలు చేయాలన్న ఆదేశాలపై పంచాయతీరాజ్ చట్టంలో ప్రభుత్వం పలు సవరణలు చేసింది. దీని ప్రకారం జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1న కూడా 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది.

## ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఏకీకృత కుటుంబ సర్వేను ప్రారంభించింది. ఈ నెల 23 (మంగళవారం)న ప్రారంభమైన సర్వేను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని పేర్కొంటూ ప్రణాళికశాఖ ఎస్ఓపీ జారీ చేసింది. సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగా ఆర్టీజీఎస్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని మరింత మెరుగుపరచడంతో పాటు, ధ్రువీకరించిన డేటాను ప్రభుత్వ విభాగాలకు అందిస్తారు. సర్వే పూర్తయ్యాక ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు అందిస్తారు.

## నొప్పులు.. కారణాలు



కొన్ని రకాల శారీరక నొప్పులకు చిన్నచిన్న సమస్యలే కారణాలు. వాటి పరిష్కారంపై దృష్టి పెడితే నొప్పుల నుంచి ఉపశమనం పొందొచ్చు. కొన్నింటిని పరిశీలిస్తే.. భుజం నొప్పి- పిత్తాశయంపై ఒత్తిడి.

- మోకాలు నొప్పి - డీ విటమిన్ లోపం.
- మెడ నొప్పి - డీహైడ్రేషన్ లేదా మూత్రపిండాలపై ఒత్తిడి.
- ఛాతీలో ఇబ్బంది - ఆమ్లాలు ఎగదన్నడం, బీపీ సమస్య.
- వేళ్ల తిమ్మిర్లు - బీ12 లోపం.
- అరికాళ్ల మంటలు - మధుమేహం లేదా ఖనిజాల అసమతౌల్యత.
- తుంటి నొప్పి - కీళ్ల వాపు లేదా బిగుసుకుపోవడం.

– బార్బరా ఓనియల్, ఆరోగ్య సలహాదారు

# కేంద్రం, ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం కుదిరితేనే.. గోదావరి-కావేరి అనుసంధానానికి సమ్మతి

- కావేరికి పోలవరం నుంచే నీళ్లు తరలించాలి
- అదీ బనకచర్ల, సోమశిల మీదుగానే..
- జాతీయ జల అభివృద్ధి సంస్థ భేటీలో ఏపీ డిమాండ్
- హాజరైన కేంద్రమంత్రి పాటిల్, పలు రాష్ట్రాల ప్రతినిధులు

**ఈనాడు, అమరావతి:** 'గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుకు మేం అంగీకరించాలంటే మా షరతులను కూడా పరిగణించాలి. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన హామీ కావాలి. గోదావరికి ప్రత్యామ్నాయ జలాలు వచ్చేవరకూ ఏపీకి నీటి వాటాలో ఢోకా లేకుండా చూస్తామని లిఖితపూర్వక ఒప్పందం జరగాలి' అని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది. మంగళవారం దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలు రాష్ట్రాల మంత్రులు, జల్‌శక్తి శాఖ కార్యదర్శి కాంతారావు, జాతీయ జల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బాలేశ్వర్ ఠాకూర్, కేంద్ర జల సంఘం ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఎజెండాలోని మిగతా అంశాలతో పాటు గోదావరి-కావేరి అనుసంధానంపైనా చర్చించారు. ఏపీ జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం చీఫ్ ఇంజినీరు సుగుణాకరరావు రాష్ట్ర వాదనను వినిపించారు. ప్రభావిత రాష్ట్రాల ప్రతినిధులు వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఆఖర్లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ 'గోదావరి-కావేరి అనుసంధానంపై ఇప్పటికే ఆరు సార్లు భాగస్వామ్య రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపాం. ఏకాభిప్రాయం రాలేదు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమై, ఈ అంశాన్ని కొలిక్కితెద్దామ'ని సూచించారు.

**ఇదీ ఏపీ వాదన**

■ ఛత్తీస్‌గఢ్ ఇప్పటిదాకా తన వాటా మేరకు నీళ్లు వాడుకోలేదని, ఆ నీటితో గోదావరి-కావేరి అనుసంధానం చేపడతామని చెబుతున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ తమ నీళ్లు తాము వాడుకునేందుకు ప్రాజెక్టులు నిర్మించుకుంటామని చెబుతోంది. గోదావరి ద్వారా కావేరికి తరలించే నీటిని హిమాలయ నదుల నుంచి మహానదికి, అక్కడి నుంచి గోదావరికి మళ్లిస్తామని చెబుతున్నారు. ఈ రెండు ప్రతిపాదనలు కనీస స్థాయిలోనూ ప్రారంభం కాలేదు. మహానది నుంచి గోదావరికి నీళ్లు ఎప్పటికి వస్తాయో తెలియదు. ఈలోపు కావేరికి అనుసంధానిస్తే ఏపీ నష్టపోతుంది. ఈ ప్రాజెక్టుకు ఏపీ అంగీకరించాలంటే మాతో కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకోవాలి. మహానది నుంచి గోదావరికి ఎప్పటికి నీళ్లు తీసుకువస్తారో కేంద్రం చెప్పాలి. అప్పటిదాకా ఛత్తీస్‌గఢ్ తమ వాటా నీళ్లు వాడుకోబోమని అంగీకరించాలి. ఈ ఒప్పందాలన్నీ చట్ట పరిధిలో జరగాలి.

■ ఇప్పటికే గోదావరిపై తెలంగాణ అనేక కొత్త ప్రాజెక్టులు నిర్మించింది. ఎగువన పెద్దగా ప్రాజెక్టులు లేనందున తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లు అందుతున్నాయి. ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులు చేపడితే, గోదావరి పరీవాహక ప్రాంతంలో జలాల లభ్యతపై అంచనాలు కొత్తగా తయారుచేయాలి. ఇప్పుడున్న అవసరాలు పోనూ, ఇంకా నదిలో ఎంత నీరుంటుందో లెక్కలు తేల్చాలి.

■ గోదావరి-కావేరి అనుసంధానంలో నాగార్జునసాగర్, ఇతర రిజర్వాయర్లను వాడుకుంటామని చెబుతున్నారు. ఆ ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ఆయకట్టు ఉన్నందున ఈ అనుసంధాన ప్రాజెక్టులో కొత్త బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు కట్టాలి.

■ గోదావరి-కావేరి అనుసంధానం ఇచ్చంపల్లి నుంచి చేపడితే మేం అంగీకరించం. పోలవరం నుంచే అనుసంధానించాలి. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్, బొల్లాపల్లి రిజర్వాయర్, బనకచర్ల, సోమశిల మీదుగా జలాలు తరలించాలన్నది మా ప్రణాళిక. ఈ ఎలైన్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవాలి.

■ తుంగభద్రకు అనుబంధంగా కర్ణాటక చేపట్టిన బెంటీ వరద అనుసంధాన ప్రాజెక్టులో ఏపీకి నీటి వాటా పెంచాలి.

**ఇతర రాష్ట్రాల వాదనలు..**

**తెలంగాణ:** గోదావరి-కావేరి అనుసంధానాన్ని సూత్రప్రాయంగా ఆమోదిస్తున్నాం. మళ్లిస్తున్న నీటిలో 50% తెలంగాణకే ఇవ్వాలి. కొత్తగా రెండు రిజర్వాయర్లు నిర్మించాలి. ఆయకట్టును బట్టి అవి మార్చుకునేలా ఉండాలి. ప్రస్తుతం ట్రైబ్యునల్ విచారణ కొనసాగుతున్నందున ఆ లోపు అనుసంధానంపై నిర్ణయం తీసుకోవద్దు. ట్రైబ్యునల్ నిర్ణయాలు వెల్లడయ్యాక అడుగు ముందుకు వేయాలి.

- **తమిళనాడు:** ఈ ప్రాజెక్టు మాకు పూర్తి సమ్మతమే, త్వరగా చేపట్టాలి.
- **కర్ణాటక:** ఇతర రాష్ట్రాలకు 40 టీఎంసీలు పంచుతూ, మాకు 30 టీఎంసీలే ఇస్తామంటున్నారు. మరో 10 టీఎంసీలు కూడా మాకు కావాలి.
- **కేరళ:** కావేరి పరీవాహకానికి నీళ్లు తరలిస్తూ, మాకు నీటి వాటాలు లేకుంటే ఎలా? మాకూ నీళ్లు ఇవ్వాలి.
- **మహారాష్ట్ర:** గోదావరి పరీవాహకంలో ఉన్న మా రాష్ట్రాన్ని ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. మాకూ నీటి వాటా ఉండాలి.

# అప్పుడే తెల్లారిందా..?

**చేతిలో సెల్‌ఫోన్.. అందులో లోన్‌యాప్‌లు ఇక అడ్డేముంది... ఇష్టానుసారం రుణాలు తీసుకోవడం! ఆ తర్వాత అలవిగాని ఈఎంఐలు చెల్లించడం. ఆ తప్పే సిబిల్ స్కోర్‌ను తగ్గించి భవిష్యత్తుకు ముప్పుగా మారుతోంది.**




### భవిష్యత్తుపై ప్రభావం...

- బీటెక్, ఇతర డిగ్రీలు పూర్తయ్యాక ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు కష్టాల్లో ఇరుక్కుని ఆశ్రయిస్తున్నారు.
- విద్యారుణం కోసం దరఖాస్తు చేసినపుడు సిబిల్ స్కోర్ తక్కువ ఉండటంతో అవి తిరస్కరణకు గురవుతున్నట్లు గుర్తిస్తున్నారు.
- అది పెరిగితే తప్ప మళ్లీ దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కావడంలేదు. ఇలా వారికి ఒక సంవత్సరం వృథా అవుతోంది.
- ఈ రుణాలు తీసుకునే ప్రతి 10 మందిలో ఆరుగురు కాలేజీ విద్యార్థులే ఉంటున్నారని కష్టాల్లోని నిర్వాహకులు చెబుతున్నారు.
- గేమింగ్, ఫోన్ రీఛార్జి, షాపింగ్ కోసం ఎక్కువగా ఈ యాప్‌ల్లో రుణాలు తీసుకుంటున్నారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, స్నేహితులతో కలిసి వీకెండ్ పార్టీల కోసం అప్పటికప్పుడు ఖాతాలో పడే డబ్బు కోసం కూడా వీటిని ఆశ్రయిస్తున్నారు.

హైదరాబాద్‌కు చెందిన ఓ ఇంజినీరింగ్ కళాశాల యువకుడు లోన్‌యాప్‌లో రూ.10వేల రుణం తీసుకుంటే రూ.30వేలు కట్టించుకోవడమే కాకుండా ఇంకా కట్టాలంటూ వేధించడంతో ఆత్మహత్యాయత్నం చేసి చివరకు చికిత్స పొందుతూ మరణించాడు.

గుంటూరుకు చెందిన పవన్ బీటెక్ చేసి విదేశాలకు వెళ్లాలని ప్రయత్నించాడు. సిబిల్ స్కోర్ 350 కంటే తక్కువ ఉందని మెరుగయ్యాక విద్యా రుణం వస్తుందని బ్యాంకర్లు వాళ్లు సూచించారు. సంవత్సరం కిందట లోన్‌యాప్‌లో చేసిన అప్పే దీనికి కారణమని వాపోయాడు.

### సులభతర నిబంధనలు..

- లోన్ యాప్‌ల్లో నిబంధనలు సులభతరంగా ఉండటంతో యువత వాటి వైపు ఆకర్షితులవుతున్నారు.
- ఫేక్ యాప్‌ల్లో మన కాంటాక్ట్స్, గ్యాలరీ పర్మిషన్, స్టోరేజ్, లొకేషన్ పర్మిషన్ అడుగుతుంటారు.
- ఆర్‌బీఐ అనుమతి ఉన్న వాటిలో ఇవేవీ అడగకుండా.. సిబిల్ స్కోర్, ఐడెంటిటీ, ఈఎంఐలు చెల్లించినప్పుడు చెక్‌బౌన్స్ కావడం వంటివి చూసుకుని ఇస్తాయి.
- ఆధార్, పాన్‌కార్డు ఉంటే ఎటువంటి స్కోర్ తక్కువ ఉన్నా విద్యార్థులకు రుణాలు ఇచ్చేస్తున్నాయి.

### వడ్డీల మోత..

- విద్యార్థులు రూ.3,000 నుంచి రూ.10,000 మధ్య తీసుకునే రుణాలకే 10 నుంచి 36శాతం వడ్డీలు వసూలు చేస్తున్నారు.
- ఇవి ఒక్కో యాప్‌లో ఒక్కో రకంగా ఉంటాయి.
- ఉదాహరణకు రూ.2,000 తీసుకుంటే మొత్తం చెల్లించే సరికి రూ.4,000 అవుతుంది.
- ఈఎంఐ తేదీ దాటిపోతే రోజుకు రూ.100 చొప్పున అదనపు ఛార్జీలు పడుతుంటాయి.

### వేధింపులతో రికవరీలు..

- మొదట మనకు కాల్ వస్తుంది. తర్వాత మన కుటుంబ సభ్యులకు.. ఆ తర్వాత మన కాంటాక్ట్స్‌లోని అందరికీ ఫోన్లు వెళతాయి.
- ఎన్ని నంబర్లు బ్లాక్ చేసినా వేర్వేరు నంబర్లతో ఫోన్లు చేస్తూ వేధిస్తారు.
- ఆర్‌బీఐ అనుమతి ఉన్నవాటిల్లో ఇలాంటి వేధింపులు లేకపోయినా.. ఎప్పుడైనా మన ఖాతాలో నగదు పడితే మరుక్షణమే మొత్తం కట్ చేసుకుంటారు.

### పోలీసుల సూచనలు..

- ఏ అవసరమున్నా ఇంట్లో అమ్మానాన్నలను, స్నేహితులను అడగాలే కానీ ఆన్‌లైన్‌లో అప్పు తీసుకోకూడదు.
- లోన్ యాప్‌లు సురక్షితం కాదని గుర్తించాలి.
- గ్యాలరీ, కాంటాక్ట్ అనుమతివ్వొద్దు. అనుమతిస్తే మన సమస్త సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లినట్లే.
- అత్యవసరమైతే ఆర్‌బీఐ అనుమతి ఉన్న లోన్ యాప్‌ల్లో రుణం తీసుకోవచ్చు. అదీ మంచి రేటింగ్ చూసి సురక్షితం అనుకున్నాకే ముందుకెళ్లాలి.

**సైబర్ వేధింపుల బారినపడితే 1930కి ఫిర్యాదు చేయాలి.**

- తీసుకున్న అప్పును క్రమపద్ధతిలో చెల్లించేలా జాగ్రత్తపడాలి.
- బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీలాంటివి ఆడటం ఆపేయాలి. అసలు సమస్య అక్కడి నుంచే మొదలవుతుంది.

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట




భూమి, ఆకాశాల మధ్య నిర్మించిన మహీఫ్లైఓవర్‌లా కనిపిస్తున్న ఈ వైవం తిరుపతిలోనిది. 'గరుడ వారధి'గా పిలిచే ఈ వంతెన తిరుచానూరు, రేణిగుంట వైపున వస్తూ రామానుజ కూడలి వద్దకు వచ్చేసరికి ఇంజినీరింగ్ అద్భుతంగా మారుతుంది. పగలు ఈ వంతెన సొగసు ఒకెత్తయితే నుంచి వెలిగే ప్రత్యేక సౌందర్యాన్ని చూడొచ్చు. రాత్రి వేళ విద్యుద్దీపాల కాంతుల్లో ఈ కూడలి ఓ అందంగా మారిపోతుంది. రోటరీ ఫ్లైఓవర్ శైలిలో నిర్మించిన ఈ వంతెనపై కూడలిలో ఉన్న 35 అడుగుల రౌండ్ అబౌట్ మరో ప్రత్యేక ఆకర్షణ.




- ఈనాడు, తిరుపతి

## ఏమిటీ..!

తెలంగాణలోని ములుగు జిల్లా అడవుల్లో కనిపించిన అరుదైన గొంగళి పురుగు (క్యాటర్ పిల్లర్) ఇది. ఇటీవల ఏటూరునాగారం అభయారణ్యంలోని మేడారం ప్రాంతంలో నిర్వహించిన సీతాకోక చిలుకల సర్వేలో ఈ గొంగళి పురుగును క్లిక్‌మనిపించారు. ఇవి ఆగ్నేయాసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయని హనుమకొండలోని వాగ్దేవి పీజీ కళాశాల జీవ వైవిధ్య నిపుణులు డాక్టర్ సుతారి సతీష్ తెలిపారు.

- న్యూస్‌టుడే, ములుగు క్రైం



## తలిచారు.. కొండపైకి మెట్లు నిర్మించారు






కొండపైకి ఏర్పాటు చేసిన ట్రాక్ ★ పూర్తయిన కొత్త మెట్లు ★ నిర్మాణానికి వాడిన ట్రాక్టర్

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు పురపాలక పరిధి చిన్నయ్యగారిపల్లె సమీపంలో 900 మీటర్ల ఎత్తులో ముక్కొండపై ఉందీ ఆలయం. మహాశివరాత్రి, కార్తికమాసాల్లో ఇక్కడి ముక్కంటేశ్వరుడిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుంటారు. అయితే కొండ ఎక్కడానికి మెట్లు లేకపోవడంతో రాళ్ల మధ్యే అవస్థలు పడుతూ భక్తులు వెళ్లేవారు. ఈ సమస్యను పరిష్కరించడానికి దాతల సహాయంతో మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేయాలని చిన్నయ్యగారిపల్లె వాసులు నిర్ణయించారు. అందుకు కొండపైకి రాళ్లను తరలించేందుకు తమకు తెలిసిన 'ట్రాక్టర్-రోప్' మార్గాన్ని ఎంచుకున్నారు. తొలుత ట్రాక్టర్ ఇంజిన్ భాగాలను విడదీసి కొండపైకి మోసుకెళ్లి బిగించారు. అనంతరం కింది నుంచి ఓ ఇనుప ట్రాక్ ఏర్పాటు చేశారు. దీనిపైన ట్రాలీ తిరిగేలా ట్రాక్టర్‌కు ఏర్పాటు చేసిన రోప్‌తో అనుసంధానించారు. నాలుగు దశలుగా పెద్ద నల్లబండ రాళ్లను తరలిస్తూ మెట్ల నిర్మాణానికి 2019లో శ్రీకారం చుట్టారు. అలా దాదాపు రూ.80 లక్షలు వెచ్చించి అయిదేళ్లలో 1300 మెట్లు పూర్తి చేసి మార్గాన్ని ఇటీవల ప్రారంభించారు. దాంతో ఇప్పుడు భక్తులు సులువుగా ముక్కంటేశ్వరుడిని దర్శించుకుంటున్నారు.



కొండపైన ముక్కంటేశ్వరుడు

- న్యూస్‌టుడే, మైదుకూరు



## శిలువ చర్చి

శిలువ ఆకారంలో నిర్మించిన అరుదైన క్రీస్తు మందిరంగా గుర్తింపు పొందింది తెలంగాణలోని కరీంనగర్ వెస్లీ కెథడ్రల్ చర్చి. 1910లో జిల్లాలో ప్రచార సేవకుడిగా ఉన్న ఆంగ్లేయుడు పి.బెంజమిన్ ఈ మందిరం నిర్మాణానికి శ్రీకారం చుట్టగా... 1912 జనవరి 6న రెవరెండ్ హెచ్ గార్డ్ ప్రెస్ ప్రారంభించారు. ఆ రోజుల్లో రూ.8 లక్షల ఖర్చుతో చేపట్టిన ఈ చర్చి నిర్మాణానికి మేస్త్రీలను ఇంగ్లాండ్ నుంచి రప్పించారు.

-ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, తెలంగాణచౌక్

## ఎర్ర చీమల చట్నీ.. చిత్రమైన నెమలీక!

ఎర్ర చీమల పచ్చడి చూడాలంటే విశాఖలో జరుగుతున్న పెసా మహోత్సవ్‌కు వెళ్లాల్సిందే. గిరిజన ఉత్పత్తులు, సంప్రదాయ వంటకాలు ఇక్కడ ఆకర్షణగా నిలిచాయి. అందులో ఎర్రచీమల పచ్చడి ఆకట్టుకుంటోంది. ఉప్పు, మిర్చి, వెల్లుల్లి, నిమ్మరసం, చింతపండు కలిపి చీమలను రుబ్బి దీన్ని తయారు చేస్తారని స్టాల్ నిర్వాహకులు తెలిపారు. మరో స్టాల్‌లో రాజస్థాన్‌కు చెందిన దిలీప్ కుమార్ డమర్ అనే గిరిజన కళాకారుడు ఆడ నెమలి ఈకలను సేకరించి, వాటిపై చిత్రాలు గీశారు.



ఎర్రచీమల పచ్చడి



నెమలి ఈకలపై చిత్రాలు

- ఈనాడు, విశాఖపట్నం; న్యూస్‌టుడే, గురుద్వారా

## కుమార్తెలను కాలువలోకి తోసేసిన తండ్రి

### ఒకరి మృతి, మరొకరి గల్లంతు



సింధు అనూష

**బొమ్మనహాళ్, ఉరవకొండ, న్యూస్‌టుడే:** భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి తన ఇద్దరు కుమార్తెలను కాలువలోకి తోసేశాడు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో చోటుచేసుకున్న ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. శిల్ప-కల్లప్ప దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. మద్యానికి బానిసైన కల్లప్ప.. భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో అతడు తన ఇద్దరు కుమార్తెలు సింధు(11), అనూష(10)లను ఈ నెల 21న బళ్లారిలోని మహదేవప్ప ఆలయానికి తీసుకెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఆలయానికి వెళ్లకుండా బళ్లారి జిల్లా శిరిగేరి క్రాస్‌కు చేరుకుని తుంగభద్ర ఎల్ఎల్‌సీ కాలువలోకి కుమార్తెలను తోసేశాడు. సోమవారం రాత్రి ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. అతడి ప్రవర్తనపై అనుమానంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు కల్లప్పను తమదైన శైలిలో ప్రశ్నించగా అసలు విషయం చెప్పాడు. మంగళవారం కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా సింధు మృతదేహం లభించింది. అనూష ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోడను ఢీకొట్టిన బైక్.. ముగ్గురు యువకుల మృతి

### పశ్చిమగోదావరి జిల్లాలో దుర్ఘటన

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ రోడ్డు పక్కనున్న భవనం గోడను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పొలమూరు వద్ద సోమవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పొలమూరుకు చెందిన ఏలేటి అంజిబాబు (24).. స్థానిక చర్చిలో జరిగిన యూత్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం తన స్నేహితులైన ఏలేటి రాజు (18), కోళ్ల సత్యనారాయణ (20)లతో కలిసి స్పోర్ట్స్ బైక్‌పై ప్రధాన కూడలికి బయలుదేరాడు. మధ్యలో బైక్ అదుపుతప్పి రహదారి పక్కనున్న భవనం గోడను ఢీకొట్టడంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న వారిని స్థానికులు గుర్తించి 108లో పెనుమంట్రలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ వెల్లడించారు.

## అమానుషంగా శిశు విక్రయాలు

- ఉత్తరాది నుంచి తెచ్చి బెజవాడలో అమ్మకాలు
- ఈ వ్యవహారాల్లో ఆరితేరిన సరోజిని
- ఏడాదిన్నరలో చేతులు మారిన 28 మంది పిల్లలు

**ఈనాడు, అమరావతి:** నిరుపేద కుటుంబాలు, ఎక్కువమంది పిల్లలుండి పోషించలేని వారిని లక్ష్యంగా చేసుకుని ఉత్తరాది శిశు విక్రయముఠా వలవేస్తోంది. వారికి పదో పరకో డబ్బులు ఎరవేసి పిల్లల్ని కొనుగోలు చేసి విజయవాడ తెచ్చి అమ్ముతోంది. వీరితో ప్రధాన నిందితురాలు బలగం సరోజిని ఒప్పందం చేసుకుని.. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకుని వారిద్వారా పిల్లలు లేని దంపతులను గుర్తిస్తారు. వారినుంచి రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని పిల్లల్ని అప్పగిస్తారు. ఈ కేసులో ఇప్పటివరకు ఉత్తరాది ముఠా సహా మొత్తం 12 మందిని విజయవాడ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు.

### ఆసుపత్రుల్లో సొంత నెట్‌వర్క్

గుజరాత్, దిల్లీ, ముంబయి ప్రాంతాలకు చెందిన ముఠాలతో మాట్లాడుకుని సరోజిని పిల్లలను విజయవాడకు తెప్పించుకుంటారు. విజయవాడ, హైదరాబాద్‌లలో నమోదైన కేసుల్లో అరెస్టయి.. నెల కిందటే సరోజిని జైలు నుంచి విడుదలయ్యారు. మళ్లీ శిశు విక్రయాలను ప్రారంభించారు. ఏడాదిన్నరలో 28 మంది పిల్లలను ఈ ముఠా విక్రయించింది. ముఠా సభ్యులు గర్భిణులు, బాలింతలతో మాట్లాడతారు. పేదరికంతో పిల్లల్ని పోషించలేనివారిని గుర్తించి ఫోన్ నంబర్లు ఇస్తారు. తమ బంధువులకు పిల్లల్లేరని, పెంచుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సరోజిని నమ్మిస్తారు. వీరి నుంచి పిల్లల్ని తీసుకుని అవసరం ఉన్నవారికి విక్రయిస్తారు. దిల్లీలో కిరణ్‌శర్మ, ముంబయి నుంచి కవిత తమ మనుషుల ద్వారా విజయవాడకు పంపిస్తారు. వీరిపైన ఆగ్రా, ముంబయిలో మరికొందరు ఉన్నట్లు తేలింది.

### పాత్రను బట్టి కమీషన్లు

పిల్లలను విక్రయించేవరకూ అన్ని స్థాయిల్లో వారికి ఎంతో కొంత కమీషన్ దక్కుతుంది. ఉత్తరాది నుంచి సరోజినికి పిల్లల్ని అప్పగించి వెళ్తారు. పిల్లలను అమ్మాకే వారికి డబ్బులు ముడతాయి. ఒక్కో శిశువును రూ.3.50-4 లక్షల వరకు విక్రయిస్తారు. ఇందులో సరోజిని రూ.50వేలు తీసుకుని, రూ.2.50 లక్షలు ఉత్తరాది ముఠాకు పంపుతారు. పిల్లలను కొన్నాళ్లు పోషించినవారికి రూ.5-10వేలు, బేరం మాట్లాడినవారికి రూ.20వేల చొప్పున ఇస్తారు.

### వాట్సప్‌లో పిల్లల ఫొటోలు పెట్టి..

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లల ఫొటోలను.. పిల్లలు కావల్సినవారికి వాట్సప్‌లో పంపుతారు. వాళ్లు సరేననగానే బేరం మొదలవుతుంది. బేరం కుదిరాక వారికి శిశువును అప్పగించి డబ్బులు తీసుకుంటారు. అమ్మేవరకూ పిల్లలను విజయవాడ, సత్తెనపల్లిలో ఏజెంట్ల వద్ద ఉంచి, బేరం కుదిరిన తర్వాత తెప్పించి అడిగిన వారికి ఇస్తారు. అవతలి వ్యక్తులు ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధరించుకున్న తర్వాత తీసుకెళ్తారు.

### పలు కేసులు

ప్రధాన నిందితురాలు పలు సంతానసాఫల్య కేంద్రాలకు ఏజెంటుగా పనిచేస్తున్నారు. అండాల దాతలు, సరోగసీకి అంగీకరించేవారిని తీసుకుని సంతాన సాఫల్య కేంద్రాలకు తీసుకెళ్తారు. వారి నుంచి కమీషన్లు అందుతాయి. సరోగసీ, అండాల దాతలతో మాట్లాడి.. వీరు డాక్టర్ నమ్రత వద్దకు తీసుకెళ్లేవారు. సరోజినిపై గతంలో విజయవాడలోని నున్న, హైదరాబాద్‌లోని మేడిపల్లి, గోపాలపురం స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. విజయలక్ష్మిపై మంగళగిరి, ఏలూరు, కోదాడ, జనగామ, సూర్యాపేట స్టేషన్లలో ఐదు కేసులున్నాయి. ఫరీనాపై నున్నతో పాటు హైదరాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున రెండు కేసులు, నందినిపై హైదరాబాద్‌లో ఒక కేసు ఉన్నాయి.

## అటల్‌జీ స్మృతివనంలో వాజ్‌పేయీ జీవిత విశేషాల మ్యూజియం

- 25న అమరావతిలో సుపరిపాలన యాత్ర ముగింపు
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



అమరావతిలోని వెంకటాయపాలెంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఇతర నాయకులు

**ఈనాడు, అమరావతి:** మాజీ ప్రధాని వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ముగింపు కార్యక్రమం అమరావతిలో ఈ నెల 25న నిర్వహిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. అమరావతిలోని వెంకటాయపాలెంలో విగ్రహావిష్కరణ ఏర్పాట్లు భాజపా నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అమరావతిలో అటల్‌జీ స్మృతివనంలో వాజ్‌పేయీ జీవిత విశేషాలతో కూడిన మ్యూజియం నిర్మించనున్నట్లు తెలిపారు. వాజ్‌పేయీ జీవితం అందరికీ ఆదర్శమని, అందుకే అందరిలో స్ఫూర్తి నింపేలా అమరావతిలో వాజ్‌పేయీ కాంస్య విగ్రహం ఆవిష్కరించనున్నట్లు మాధవ్ తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్..దిల్లీ నుంచి కేంద్ర నాయకులు హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ నాగోతు రమేష్‌నాయుడు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాతూరి నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్రా శివన్నారాయణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని పులి.. రైలు ఢీకొని చిరుతపులి మృత్యువాత

- పల్నాడు, కర్నూలు జిల్లాల్లో ఘటనలు



ప్రమాదంలో చనిపోయిన పెద్దపులి




చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు

**ఈనాడు డిజిటల్-నరసరావుపేట, న్యూస్‌టుడే-వెల్దుర్తి, ఆదోని నేరవార్తలు:** ఒకే రోజు వేర్వేరు ప్రమాదాల్లో పులి, చిరుతపులి మృత్యువాత పడ్డాయి. పల్నాడు జిల్లా శిరిగిరిపాడు గ్రామంలోని అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారి 565పై మంగళవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని పులి ప్రాణాలు కోల్పోయింది. సుమారు 12 ఏళ్ల వయసున్న టైగర్-80 అనే ఆడపులి శిరిగిరిపాడు బీట్‌లోని మొదటి టైగర్‌పాత్ వద్ద రోడ్డు దాటే క్రమంలో వేగంగా వెళ్తున్న ఓ వాహనం దాన్ని ఢీకొట్టినట్లు ఆనవాళ్లు దొరికాయి. గాయపడిన పులి మరికొంత దూరం నడిచి వెళ్లి చనిపోయినట్లు పాదముద్రల ఆధారంగా నిర్ధారించారు. అయితే ఎక్కడా రక్తపు మరకలు లేకపోవడం గమనార్హం. పొగమంచుకు తోడు మూలమలుపు ఉండటంతో వాహనదారులు ముందస్తుగా పులిని చూసి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. మార్కాపురం డీఎఫ్‌ఓ అబ్దుల్ మాట్లాడుతూ.. ఘటనపై విచారణకు కమిటీ ఏర్పాటు చేశామని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోని మండలం కుప్పగల్లు రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీకొని చిరుతపులి చనిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆదోని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ రేంజ్ అధికారిణి తేజశ్వి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రెండు ప్రమాదాలపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

## కేసీఆర్.. ఇష్టారీతిన మాట్లాడతారా?

### పెట్టుబడులపై అనుమానాలుంటే రండి చూపిస్తాం: మంత్రి పార్థసారథి



**ఈనాడు, అమరావతి:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు భాష, యాస, ప్రాసపై పట్టుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్రం, పెట్టుబడులపై కేసీఆర్ మాట్లాడిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని, ఈ విషయాన్ని ఆయన పలుమార్లు చెప్పారని గుర్తుచేశారు. మంగళవారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో మంత్రి పార్థసారథి కేసీఆర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న పెట్టుబడులపై మీకు ఏమైనా అనుమానాలు ఉంటే, మేం వాటిని పారదర్శకతతో చూపిస్తాం. ఆ పెట్టుబడిదారులు తెలంగాణలో కూడా పెట్టారు.. అది తెలుసుకోండి. హైదరాబాద్ నగరానికి బలమైన పునాది ఉంది. దానిని మీరు అభివృద్ధి చేసి ఉండొచ్చు. అసలు పునాదే లేని పరిస్థితుల్లో వైకాపా ఐదేళ్ల విధ్వంసం నుంచి అమరావతిని అభివృద్ధి చేస్తుంటే.. మీరు ఇలా మాట్లాడటం తగదు' అని పేర్కొన్నారు.

## ఒడిశాలో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసు అధికారులు

**మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే:** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 22 మంది మావోయిస్టులు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో కీలక మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం, ఛత్తీస్‌గఢ్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతుండడంతో ఈ 22 మంది లొంగిపోయినట్లు మల్కాన్‌గిరి ఎస్పీ వినోద్ పాటిల్ మంగళవారం విలేకరులకు తెలిపారు. లొంగిపోయిన వారిలో 10 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. ఏకే47 ఒకటి, మూడు 303 రైఫిల్స్ తదితర ఆయుధాలతో పాటు 15 టిఫిన్ బాంబులు, కరెంటు తీగలను మావోయిస్టులు పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వం తరఫున వీరికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఈ మేరకు మావోయిస్టులకు మొత్తం రూ.1.84 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. దీంతోపాటు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున సహాయం అందజేశారు.

EENADU Vol: 52, Issue: 134 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

## చైనా సంయుక్త కంపెనీలో మరో 20% వాటా: అరబిందో ఫార్మా

ఈనాడు, హైదరాబాద్: చైనాలోని లూగ్జిన్ అరోవిటాస్ ఫార్మా (ఛెంగ్డు) కం. లిమిటెడ్ అనే సంయుక్త కంపెనీలో 5.12 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.45 కోట్లు) వెచ్చించి, మరో 20% వాటా కొనుగోలు చేయాలని అరబిందో ఫార్మా సబ్సిడరీ కంపెనీ హెలిక్స్ హెల్త్ కేర్ బీవీ., నిర్ణయించింది. లూగ్జిన్ అరోవిటాస్ ఫార్మాలో హెలిక్స్‌కు 30%, షాన్‌డాంగ్ లూగ్జిన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ స్టాక్ కం. లిమిటెడ్ అనే చైనా కంపెనీకి 70% వాటాలున్నాయి. మరో 20% వాటా కొనుగోలుకు షాన్‌డాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. 2029 డిసెంబరు కల్లా, మిగిలిన 50% వాటా కూడా కొనుగోలు చేస్తామని, దీనికి మరో 18.86 మిలియన్ డాలర్లు (సుమారు రూ.170 కోట్లు) చెల్లించనున్నట్లు వివరించింది.

## లారస్ బయోలో రూ.35 కోట్ల పెట్టుబడి

లారస్ ల్యాబ్స్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: అనుబంధ సంస్థ లారస్ బయోలో రూ.34.99 కోట్ల పెట్టుబడి పెట్టాలని లారస్ ల్యాబ్స్ నిర్ణయించింది. లారస్ బయో జారీ చేసే, సిరీస్ ఏ3 కంపల్సరీ కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లు తీసుకుని, ఈ పెట్టుబడి అందిస్తామని లారస్ ల్యాబ్స్ వెల్లడించింది. ప్రిఫరెన్స్ షేర్ల కన్వర్షన్ తర్వాత, ఈ సబ్సిడరీ కంపెనీలో లారస్ ల్యాబ్స్ వాటా 75.61 శాతానికి పెరుగుతుంది.

## ఉత్పత్తి చేసి ఇతరదేశాలకు సరఫరా చేయొచ్చు

జైడస్ లైఫ్ సైన్సెస్ 'సెమాగ్లుటైడ్'కు దిల్లీ హైకోర్టు అనుమతి

దిల్లీ: మధుమేహం, ఊబకాయం బాధితులకు చికిత్సలో వినియోగిస్తున్న సెమాగ్లుటైడ్ ను ఉత్పత్తి చేసి.. బహుళ జాతి ఫార్మా కంపెనీ నొవో నార్డిస్క్‌కు పేటెంట్ లేని దేశాలకు ఎగుమతి చేయడానికి జైడస్ లైఫ్ సైన్సెస్‌కు దిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మందును 2026 మార్చి వరకు మన దేశంలో మాత్రం విక్రయించరాదని ఆదేశించింది. ఈ మందుపై మనదేశంలో నొవో నార్డిస్క్‌కు వచ్చే ఏడాది మార్చి వరకు పేటెంట్ ఉండటమే ఇందుకు కారణం. జైడస్ లైఫ్‌సైన్సెస్‌కు ఇచ్చిన మాదిరిగానే గతంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, సన్ ఫార్మాకు సైతం సెమాగ్లుటైడ్‌ను ఉత్పత్తి చేసి నొవో నార్డిస్క్‌కు పేటెంట్ లేని దేశాలకు సరఫరా చేయడానికి న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.

## సన్ టెక్ ఎనర్జీతో సచిన్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: ట్రూజోన్ సోలార్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న సన్ టెక్ ఎనర్జీ సిస్టమ్స్‌తో, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ వ్యూహాత్మక పెట్టుబడి, భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంస్థ వెల్లడించింది. దాదాపు 1.8 లక్షల షేర్ల (2% వాటా) కోసం రూ.3.2 కోట్ల పెట్టుబడిని ఆయన పెట్టినట్లు పేర్కొంది. దేశంలో 2030 నాటికి అగ్రగామి 3 సోలార్ ఈపీసీ కంపెనీల్లో ఒకటిగా మారాలనే లక్ష్యాన్ని సాధించేందుకు, సచిన్ భాగస్వామ్యం తోడ్పడుతుందని ట్రూజోన్ సోలార్ వ్యవస్థాపకుడు, సీఈఓ చారుగుండ్ల భవాని సురేశ్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉనికి ఉన్న ఈ సంస్థ యూపీ, తమిళనాడు, ఒడిశా, కేరళకు విస్తరించే వ్యూహంతో ఉంది.

**కోడి గుడ్లు**

24న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 675 |
| వరంగల్ | 677 |
| విజయవాడ | 720 |
| తూ/ప గోదావరి | 695 |
| విశాఖపట్నం | 702 |
| చిత్తూరు | 703 |

# 25 ఏళ్లు.. 2700% ప్రతిఫలం



వెండిపై పెట్టుబడులు పెడుతున్న వారికి కళ్లు చెదిరే రీతిలో ప్రతిఫలాలు లభిస్తున్నాయి. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే పసిడిపైకి పెట్టుబడులు అధికమై, ఆ లోహం ధరలు దూసుకెళ్తుంటాయి. ఇప్పుడు వెండి ధర కూడా అంతకుమించిన వేగంతో పెరుగుతున్నందున, ఈ లోహంపైకి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు అధికమవుతుండగా.. విక్రయశాలల్లోనూ భారీగా కొనుగోళ్లు చేస్తున్నారు. విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు వ్యవస్థలు, రక్షణ రంగం నుంచి గిరాకీ పెరగడం, డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం కూడా వెండి ధరలు స్వల్పకాలంలోనే, భారీగా పెరిగేందుకు కారణమవుతున్నాయన్నది బులియన్ వర్తకుల విశ్లేషణ.

### హెడ్జింగ్ కోసం దశాబ్దాలుగా ఆదరణ

ఈక్విటీ, బాండ్ మార్కెట్లలో ఒడుదొడుకులను తట్టుకునేందుకు, నమ్మదగిన పెట్టుబడి సాధనంగా - హెడ్జింగ్ పథకంగా వెండిని దశాబ్దాలుగా పెట్టుబడిదారులు చూస్తున్నారని చెబుతున్నారు. అయితే పసిడి ధరల పెరుగుదలతో చూస్తే, వెండి ధరతో పాటు, ధరల కదలికలు గత కొన్నేళ్ల వరకు తక్కువగా ఉన్నందున అంత ప్రాచుర్యం దక్కలేదు.

### పాతికేళ్లలో ఇంత రాబడా..!

2000 సంవత్సరంలో కిలో వెండిధర రూ.7,900 కాగా, ఇప్పుడు రూ.2.20 లక్షలు మించింది. అంటే పాతికేళ్లలో 27 రెట్లకు (2700%) పైగా ప్రతిఫలం లభించింది. వెండికి మొదట్లో పారిశ్రామిక, ఆభరణాల రంగం నుంచే గిరాకీ ఉండేది. 4 దశాబ్దాల నుంచి మాత్రం పెట్టుబడిదారులు హెడ్జింగ్ కోసమూ వినియోగిస్తున్నారు. ఇప్పుడు కొత్త రంగాల నుంచి లభిస్తున్న గిరాకీ ఫలితంగా, 2026 లోనూ వెండి ధగధగలు కొనసాగుతాయనే అంచనాలున్నాయి.

### తాజా అంతర్జాతీయ ఉద్రిక్తతలూ దోహదం

గత అక్టోబరు నుంచి వెండి సరఫరా నెమ్మదించడం, అమెరికా ప్రభుత్వం వెండినీ కీలక ఖనిజంగా ప్రకటించడంతో ఈ లోహానికి ప్రాధాన్యత మరింత పెరిగింది. చైనాలో వెండి నిల్వలు తగ్గిపోవడం వల్లా, ఈ లోహానికి గిరాకీ అధికమవుతోందని యెస్ బ్యాంక్ నివేదిక వెల్లడించింది. తాజాగా అమెరికా-వెనెజువెలా మధ్య ఉద్రిక్తతలు అధికమవ్వడం, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా జనరల్ హతమవ్వడం వల్ల అంతర్జాతీయ అనిశ్చితులు తీవ్రమవుతాయనే ఆందోళనలతో, బంగారం-వెండిపైకి పెట్టుబడులు వస్తున్నాయని చెబుతున్నారు.

### వెండికి గిరాకీ - సరఫరా మధ్య అంతరం 2500 టన్నులు?

వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలోకి వచ్చే పెట్టుబడులకు సమానంగా వెండిని ఆయా సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇటీవలి ధరల పెరుగుదల నేపథ్యంలో, ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు అంతకంతకూ పెరుగుతున్నాయి. గతేడాది అంతర్జాతీయంగా 25,000 టన్నుల వెండిని ఉత్పత్తి చేశారని అంచనా. ఇందులో మెక్సికో 6,300 టన్నులతో అగ్రస్థానంలో ఉండగా, చైనా (3300 టన్నులు), పెరు (3100 టన్నులు), బొలీవియా (1300 టన్నులు), పోలెండ్ (1300 టన్నులు), చిలీ (1200 టన్నులు), రష్యా (1200 టన్నులు), అమెరికా (1100 టన్నులు), ఆస్ట్రేలియా (1000 టన్నులు), కజక్‌స్థాన్ (1000 టన్నులు).. తరవాత స్థానాల్లో ఉన్నాయి. ఇతర లోహాల ఉత్పత్తిలో భాగంగానూ వెండిని ఉత్పత్తి చేస్తుంటారు. అంతర్జాతీయంగా పెట్టుబడులు - పారిశ్రామిక రంగాల నుంచి ఏటా వస్తున్న గిరాకీ కంటే 2,500 టన్నులు తక్కువగా వెండి ఉత్పత్తి అవుతోందని.. ఈ అంతరం మరింత పెరగొచ్చనే అంచనాలున్నాయి.

### 2025లో పసిడి కంటే రెట్టింపు రాబడి

ఈ ఏడాదిలో బంగారం, వెండి ధరల పెరుగుదలను పరిశీలిస్తే.. బంగారం ధర 76% పెరగ్గా, వెండి ధర 140% దూసుకెళ్లింది. అంటే పసిడి ధరల వృద్ధికి రెట్టింపు స్థాయిలో వెండి ధర పెరిగింది. అయితే వెండి ధరల్లో తీవ్ర ఒడుదొడుకులుంటాయని.. దీన్ని దృష్టిలో పెట్టుకునే మదుపర్లు ముందడుగు వేయాలని బులియన్ నిపుణులు సూచిస్తున్నారు.



### రూ.1.40 లక్షలు మించిన బంగారం

హైదరాబాద్ బులియన్ విపణిలో మంగళవారం కిలో వెండి ధర రూ.2,20,000ను మించింది. ఇదే సమయంలో 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర కూడా తొలిసారిగా 1,40,000ను మించింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10గ్రాముల) బంగారం ధర 4500 డాలర్లను సమీపించడం, వెండి ఔన్సు ధర 70 డాలర్లను మించడం వల్లే.. ఈ లోహాల ధరలు దేశీయంగా ఇంతకు చేరాయి.

- ఈనాడు వాణిజ్య విభాగం

## అయిదేళ్లలో 5 రెట్ల వృద్ధి లక్ష్యం

రాంకీ ఇన్‌ఫ్రా సీఈఓ సునీల్ నాయర్



ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వచ్చే అయిదేళ్లలో 5 రెట్లు వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ చేతిలో ఇప్పటికే ఉన్న కాంట్రాక్టులతో పాటు కొత్తగా లభించే ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని, ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు రాంకీ ఇన్‌ఫ్రా సీఈఓ సునీల్ నాయర్ మంగళవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో రాంకీ ఇన్‌ఫ్రా ఆదాయం రూ.969 కోట్లు, నికరలాభం రూ.152 కోట్లు ఉన్నాయి. 2024-25తో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరానికి టర్నోవర్‌లో 30% వృద్ధి నమోదు చేయగలుగుతామని నాయర్ పేర్కొన్నారు.

**రూ.10,000 కోట్ల కాంట్రాక్టులు:** కంపెనీ చేతిలో ప్రస్తుతం రూ.10,000 కోట్ల విలువైన కాంట్రాక్టులు ఉన్నాయి. మరో రూ.9,000 కోట్ల దేశీయ కాంట్రాక్టులతో పాటు రూ.1,000 కోట్ల అంతర్జాతీయ కాంట్రాక్టులు లభించే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టుల్లో దాదాపు 40% ఈపీసీ కాంట్రాక్టులు కాగా, హమ్ (హైబ్రిడ్ యాన్యూటీ మోడల్) కాంట్రాక్టులు 30%, ఆపరేషన్స్ - మెయింటెనెన్స్ కాంట్రాక్టులు 30% ఉంటున్నాయి. మహారాష్ట్రలో రెండు భారీ పారిశ్రామిక పార్కులు చేపట్టనున్నామని ఇందులో ఒక ప్రాజెక్టుకు ఎల్‌ఓఐ వచ్చినట్లు సునీల్ నాయర్ వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టు కోసం బిడ్ చేసినట్లు తెలిపారు. రూ.1,000 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులనే తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే త్రైమాసికంలో రూ.500- 600 కోట్ల టెండర్ సంపాదించే అవకాశం ఉందన్నారు.

**రుణ భారం లేదు**

కంపెనీకి పెద్దగా రుణ భారం లేదని, వర్కింగ్ కేపిటల్, బాండ్లు, గ్యారెంటీలు మినహా స్టాండ్అలోన్ ఖాతాల్లో అప్పు లేదని నాయర్ అన్నారు. ఒక హమ్ ప్రాజెక్టుపై రూ.160 కోట్ల అప్పు ఉన్నట్లు, ఇది ఏకీకృత ఖాతాల్లో కనిపిస్తుందన్నారు. రుణభారం లేనందున కంపెనీ ఆర్థికంగా బలోపేతం అవుతోందని సీఎఫ్ఓ ప్రవంత్ రాయపూడి తెలిపారు.

## 2030 కల్లా 5 కొత్త ఈవీలు

- రూ.16,000-18,000 కోట్ల పెట్టుబడులు
- టీఎంపీవీ ఎండీ శైలేష్ చంద్ర



రాబోయే అయిదేళ్లలో కొత్తగా 5 విద్యుత్ వాహన (ఈవీ) మోడళ్లు ఆవిష్కరిస్తామని.. ఇందులో ప్రీమియం మోడల్ అవిన్య కూడా ఉంటుందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. దేశీయంగా ఈ విభాగంలో 45-50% మార్కెట్ వాటాను కొనసాగించేందుకు.. 2030 నాటికి రూ.16,000-18,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు వెల్లడించారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను 10 లక్షల పాయింట్లకు చేరుస్తామని వివరించారు. 'దేశంలో విద్యుత్ వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఈ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు, దేశంలోనే ప్రథమంగా అధునాతన సాంకేతికత ఆవిష్కరణ, స్థానికంగా విడిభాగాల సమీకరణ కోసం పెట్టుబడులు కొనసాగిస్తామ'ని శైలేష్ వెల్లడించారు. టియాగో, పంచ్, నెక్సాన్, కర్వ్, హ్యారియర్ మోడళ్లలోని ఈవీలు వ్యక్తిగత కొనుగోళ్లలో ఆధిపత్యం వహిస్తున్నాయి. వాణిజ్య విభాగంలో ఎక్స్‌ప్రెస్-టి ఈవీను టీఎంపీవీ విక్రయిస్తోంది. వచ్చే ఏడాది సియారా.ఈవీ, కొత్త పంచ్. ఈవీలను పరిచయం చేయాలని కంపెనీ భావిస్తోంది.

**వచ్చే ఏడాదిలో అవిన్య:** ప్రీమియం ఈవీ అవిన్యను 2026 ఆఖరుకు తీసుకురావాలనుకుంటున్నట్లు శైలేష్ తెలిపారు. 2029-30 నాటికి సియారా, అవిన్యతో పాటు ప్రస్తుత మోడళ్లకు అనేక అప్‌డేట్లు తెస్తామని, మొత్తం 5 ఈవీలను కొత్తగా ఆవిష్కరిస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు 2.5 లక్షల ఈవీలను టీఎంపీవీ విక్రయించింది. 2030 నాటికి ప్రయాణికుల వాహన (పీవీ) పరిశ్రమలో ఈవీల వాటా 15-20 శాతానికి చేరుతుందని శైలేష్ అంచనా వేస్తున్నారు. టీఎంపీవీ మొత్తం పీవీల విక్రయాల్లో ఈవీల వాటా ప్రస్తుతం 17 శాతంగా ఉందని తెలిపారు.


**ప్రారంభస్థాయి ఈవీ విభాగమే సంక్లిష్టం:** ఈవీలు, సంప్రదాయ ఇంజిన్ (ఐసీఈ) వాహనాల మధ్య ధరల్లో వ్యత్యాసంపై శైలేష్ మాట్లాడుతూ ప్రారంభ స్థాయి ఈవీ విభాగం ప్రస్తుతం ఉన్న అత్యంత కఠినమైన విభాగం అన్నారు. దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని పరిగణనలోకి తీసుకునే, నిబంధనలను ప్రభుత్వం రూపొందిస్తోందని.. కేఫ్ నిబంధనలనూ ఈ కోణంలోనే చూడాలన్నారు.

## 15 లక్షలకు పైగా సవరించిన ఐటీఆర్‌లు దాఖలు: సీబీడీటీ

దిల్లీ: 2025-26 మదింపు సంవత్సరానికి 15 లక్షల మందికి పైగా పన్ను చెల్లింపుదార్లు 'సవరించిన రిటర్న్'లు దాఖలు చేసినట్లు ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం మంగళవారం వెల్లడించింది. గుర్తింపు లేని రాజకీయ పార్టీలు లేదా స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చిన విరాళాలకు సంబంధించి, తప్పుడు మినహాయింపులను క్లెయిమ్ చేసినట్లు గుర్తించిన పన్ను చెల్లింపుదార్లకు ఐటీ శాఖ నడ్జ్ ప్రచారం ద్వారా సలహా నియమావళిని పంపడం ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21 లక్షల మందికి పైగా పన్ను చెల్లింపుదారులు తమ ఐటీ రిటర్న్‌లు అప్‌డేట్ చేయగా, పన్నుల రూపేణా రూ.2,500 కోట్లు చెల్లించారు. పన్ను చెల్లింపుదారులు తమ ఐటీఆర్‌లను సమీక్షించుకోవాలని, మినహాయింపు క్లెయిమ్‌లను సరిచూసుకోవాలని ఐటీ విభాగం సూచించింది. అవసరమైతే, 2025 డిసెంబరు 31లోగా సవరించిన ఐటీఆర్‌లు దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మినహాయింపు క్లెయిమ్‌లు సరిగ్గా ఉంటే ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని వివరించింది. 2025-26 మదింపు సంవత్సరానికి సవరించిన రిటర్న్ దాఖలు చేయడానికి చివరి తేదీ డిసెంబరు 31గా ఉంది. జనవరి 1 నుంచి పన్ను చెల్లింపుదార్లు అప్‌డేటెడ్ ఐటీఆర్ దాఖలు చేయడానికి 2025-26 కోసం ఐటీఆర్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది.

## ఈ ఏడాది రూ.1.76 లక్షల కోట్ల ఐపీఓలు

- లిస్టింగ్ లాభాలపై మదుపర్ల ఆసక్తి
- కొత్త ఏడాదిలోనూ ఇదే ధోరణికి అవకాశం




స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తమ కంపెనీ షేరు నమోదు చేయాలనే కల, వ్యవస్థాపకుల్లో ఎక్కువమందికి ఉంటుంది. ఈ ఏడాదిలో చూస్తే పెద్ద కంపెనీలే కాదు అంకుర సంస్థలు సైతం అధిక సంఖ్యలోనే ఆ కలను నెరవేర్చుకున్నాయి. 2025లో రికార్డు స్థాయిలో ఐపీఓ మార్కెట్లో రూ.1.76 లక్షల కోట్ల నిధుల సమీకరణ జరిగింది. మదుపర్ల విశ్వాసం బలంగా ఉండడం, స్థూల ఆర్థిక అంశాలు కలిసిరావడం, దేశీయంగా ద్రవ్య లభ్యత గట్టిగా ఉండడంతో ఇది సాధ్యమైంది. కొత్త ఏడాదిలోనూ ఇదే ధోరణి కొనసాగుతుందన్న అంచనాలున్నాయి. ఆయా షేర్ల నమోదు (లిస్టింగ్) రోజునే, లాభాలు జేబులో వేసుకోవాలనుకునే మదుపర్ల ఆసక్తి అంతకంతకూ పెరుగుతోంది. లిస్టింగ్ రోజున 103 కంపెనీల్లో 70 లాభాలనివ్వగా, 32 నష్టపోయాయి. సగటు ఐపీఓ పరిమాణం రూ.1700 కోట్లుగా నిలిచింది.

| ఏడాది | నిధులసమీకరణ (రూ.కోట్లలో) | కంపెనీల సంఖ్య |
|---|---|---|
| 2025 | 1,76,000 | 103 |
| 2024 | 1,60,000 | 90 |
| 2023 | 49,436 | 57 |

### అంకురాల హవా

ఈ ఏడాదిలో 18 అంకురాలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. లెన్స్‌కార్ట్, గ్రో, మీషో, ఫిజిక్స్‌వాలాలు కొన్ని. ఇవన్నీ కలిసి రూ.41,000 కోట్లు సమీకరించాయి. 2024లో అంకురాలు సమీకరించిన రూ.29,000 కోట్లతో పోలిస్తే ఇవి ఎక్కువే.

✦ ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్).. అంటే ప్రమోటర్లు తమ కంపెనీల్లో వాటా విక్రయించడమూ బాగా పెరిగింది. 2025లో మొత్తం ఐపీఓల్లో ఓఎఫ్ఎస్ వాటానే 60% కావడం విశేషం.

✦ చిన్న, మధ్య స్థాయి కంపెనీ(ఎస్ఎమ్ఈ)ల విభాగంలో ఈ ఏడాది 252 కంపెనీలు రూ.11,400 కోట్లను సమీకరించాయి. గతేడాది 222 సంస్థలు రూ.9,580 కోట్లను సాధించాయి.

### 2026లో.. 175 కంపెనీలకు పైనే

కొత్త ఏడాదిలో ఐపీఓకు వచ్చేందుకు ఇప్పటికే 75కు పైగా కంపెనీలు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందగా.. మరో 100 ఆమోదముద్ర కోసం వేచిచూస్తున్నాయి. ఇందులో టెక్, ఆర్థిక సేవలు, మౌలిక, ఇంధన, వినియోగదారు రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. రిలయన్స్ జియో, ఎస్‌బీఐ మ్యూచువల్‌ఫండ్, ఓయో, ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్ వంటి భారీ ఐపీఓలు కూడా కొత్త ఏడాదిలోనే రానున్నాయని అంచనా.

**ఈ ఏడాది పెద్ద ఐపీఓలివే**

| కంపెనీ | ఇష్యూ పరిమాణం(రూ.కోట్లలో) |
|---|---|
| టాటా క్యాపిటల్ | 15,152 |
| హెచ్‌డీబీ ఫైనాన్షియల్ | 12,500 |
| ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ | 11,607 |
| హెక్సావేర్ టెక్నాలజీస్ | 8750 |
| లెన్స్‌కార్ట్ | 7278 |
| బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ | 6632 |

✦ అతిచిన్న ఐపీఓ జింకుశాల్ (రూ.116.5 కోట్లు)

**నమోదు రోజున రాణించిన సంస్థలు**


| కంపెనీ | ఇష్యూ ధరతో పోలిస్తే ప్రతిఫలం (%లో) |
|---|---|
| ఆదిత్య ఇన్ఫోటెక్ | 136 |
| స్టాలియన్ ఇండియా | 125 |
| ఏథర్ ఎనర్జీ | 116 |
| మీషో | 81.69 |
| జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ | 81 |
| బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ | 75 |

## ఐకేపీ నాలెడ్జీ పార్క్ సీఈఓగా సత్య ప్రకాశ్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీలోని ఐకేపీ నాలెడ్జీ పార్క్ సీఈఓగా సత్య ప్రకాశ్ దాష్ నియమితులయ్యారు. సైన్స్, ఇన్నోవేషన్‌తో పాటూ ఎకో సిస్టమ్ రూపకల్పనలో ఆయనకు 28 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. అంతకుముందు ఆయన మోల్బియో డయాగ్నొస్టిక్స్ యాజమాన్యంలోని ఆర్ అండ్ డీ విభాగం బిగ్‌టెక్‌లో ప్రెసిడెంట్ (స్ట్రాటజీ)గా పనిచేశారు. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలతో కలిసి తదుపరి తరం బయోటెక్ అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలను శక్తిమంతం చేయడానికి కృషి చేస్తానని సత్యప్రకాశ్ తెలిపారు. ఐకేపీ నాలెడ్జీ పార్క్ శామీర్‌పేటలో దాదాపు 200 ఎకరాల్లో విస్తరించి ఉంది.

## విజయ్ మాల్యా లొంగిపోతేనే పిటిషన్లు పరిశీలిస్తాం

స్పష్టం చేసిన బాంబే హైకోర్టు



ముంబయి: భారత న్యాయవ్యవస్థకు లొంగిపోయే వరకు, విజయ్ మాల్యా పిటిషన్లను పరిశీలించేది లేదని బాంబే హైకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల (ఎఫ్ఈఓ) చట్టానికి' వ్యతిరేకంగా వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆయన లొంగిపోయే వరకు, కోర్టు సదరు పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, న్యాయమూర్తి జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాల్యా భారతదేశానికి ఎప్పుడు తిరిగి రావాలని యోచిస్తున్నారని ప్రశ్నించింది. 2016 నుంచి యూకేలో నివసిస్తున్న మాల్యా, హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఒకటి తనను పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన ఉత్తర్వులను సవాలు చేశారు. 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ మరొక పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే, మాల్యా ముందుగా భారత న్యాయవ్యవస్థ పరిధిలోకి రావాలని ఆయన న్యాయవాది అమిత్ దేశాయ్‌కు కోర్టు సూచించింది. పారిపోయిన ఆర్థిక నేరస్థుడు, మన దేశ కోర్టుల పరిధిలోకి రాకుండానే, ఎఫ్ఈఓ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్‌ను అనుమతించకూడదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.

## రూ.2 లక్షల కోట్ల ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోళ్లు: ఆర్‌బీఐ

బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదును చొప్పించేందుకు రూ.2 లక్షల కోట్ల ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తామని, 10 బిలియన్ డాలర్ల (రూ.90,000 కోట్ల) బై/సెల్ డాలర్-రూపాయి స్వాప్ వేలాన్ని నిర్వహిస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం పేర్కొంది. 2025 డిసెంబరు 29 నుంచి 2026 జనవరి 22 మధ్య వీటిని చేపట్టనుంది.

## జపాన్ సంస్థ నుంచి బయోకాన్‌కు బయోసిమిలర్ హక్కులు

జపాన్ సంస్థ ఫుజిఫిల్మ్ కిరిన్ బయోలాజిక్స్ కో లిమిటెడ్ నుంచి హులియో (బయోసిమిలర్ అడాలిముమాబ్) కోసం పూర్తి, ప్రత్యేక అంతర్జాతీయ హక్కులను తమ అనుబంధ సంస్థ బయోకాన్ బయోలాజిక్స్ దక్కించుకున్నట్లు బయోకాన్ ప్రకటించింది. ఈ ఔషధం తయారీ నుంచి విక్రయాల వరకు పూర్తి బాధ్యతను బయోకాన్ బయోలాజిక్స్ తీసుకోనుంది.

## యమహా మోటార్ ఇండియా గ్రూప్ కొత్త ఛైర్మన్ హజిమే అఓటా

యమహా మోటార్ ఇండియా గ్రూప్ కొత్త ఛైర్మన్‌గా హజిమే అఓటాను నియమించినట్లు ఇండియా యమహా మోటార్ ప్రకటించింది. జనవరి 1న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకు ముందు ఆయన యమహా మోటార్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ వ్యయాలు రూ.1068 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలపై రూ.1,068.03 కోట్లు ఖర్చు చేసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మంగళవారం తెలిపింది. 2023-24లో ఖర్చు చేసిన దానితో పోలిస్తే ఇది రూ.123 కోట్లు ఎక్కువ. మొత్తంగా సీఎస్ఆర్ కార్యక్రమాలపై బ్యాంక్ 2025 మార్చి వరకు రూ.6,176 కోట్లు వెచ్చించింది.

# ఐటీ, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ



**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1795 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.3,812 కోట్లు**

సెన్సెక్స్ ▼ 43 85525

నిఫ్టీ ▲ 05 26177

ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు మిశ్రమంగా ముగిశాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు.. ఐటీ, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు పెరిగి 89.63 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.10% లాభంతో 62.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.38,000 కోట్లు పెరిగి రూ.475.70 లక్షల కోట్లు (5.30 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 123 పాయింట్ల (క్రితం ముగింపు 85,567.48) లాభంతో 85,690.10 వద్ద ప్రారంభమైంది. రోజంతా పరిమిత శ్రేణిలోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 85,342.99 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 42.64 పాయింట్ల నష్టంతో 85,524.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 4.75 పాయింట్లు పెరిగి 26,177.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో 26,119.05- 26,233.55 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ అంబుజా సిమెంట్స్‌లో ఏసీసీ, ఓరియెంట్ సిమెంట్ కంపెనీల విలీనానికి బోర్డు ఆమోదం తెలుపడంతో.. ఈ మూడు కంపెనీల షేర్లు వెలుగులోకి వచ్చాయి. ఓరియెంట్ సిమెంట్ షేరు 4.39%, అంబుజా సిమెంట్స్ 1.25%, ఏసీసీ 1.21% చొప్పున లాభాలు నమోదుచేశాయి.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. ఇన్ఫోసిస్ 1.28%, భారతీ ఎయిర్‌టెల్ 1.28%, అదానీ పోర్ట్స్ 0.97%, సన్‌ఫార్మా 0.91%, టెక్ మహీంద్రా 0.88% డీలాపడ్డాయి. ఐటీసీ 1.27%, అల్ట్రాటెక్ 1.24%, టాటా స్టీల్ 1.03%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.91%, ఎన్‌టీపీసీ 0.75% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. ఐటీ, ఫోకస్డ్ ఐటీ, స్థిరాస్తి, మన్నికైన వినిమయ వస్తువులు 0.71% వరకు పడ్డాయి. కమొడిటీస్ 0.68%, యుటిలిటీస్ 0.59%, లోహ 0.52%, విద్యుత్ 0.40% మెరిశాయి. బీఎస్ఈలో 1962 షేర్లు నష్టపోగా, 2246 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 174 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల జారీలో ఉల్లంఘనలకు సంబంధించిన కేసును రూ.32 లక్షలు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు టాటా మోటార్స్ ఫైనాన్స్ వెల్లడించింది.

✦ విమానాశ్రయంలో సమీకృత నెట్‌వర్క్, సెక్యూరిటీ కార్యకలాపాల కేంద్రం (ఎన్ఓసీ- ఎస్ఓసీ) ఏర్పాటు, నిర్వహణ కోసం భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, టెక్ మహీంద్రా ప్రకటించాయి.

✦ ఆస్ట్రేలియా బొగ్గు ఎగుమతుల టెర్మినల్ ఎన్‌క్యూఎక్స్‌టీ కొనుగోలును అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ పూర్తి చేసింది. తద్వారా ఆసియా-పసిఫిక్‌లో కంపెనీ బలోపేతమవుతుందని తెలిపింది.

✦ హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ) రైట్స్ ఇష్యూకు రెండు రెట్ల స్పందన లభించింది. ఇష్యూ పరిమాణం రూ.999.99 కోట్లు కాగా, రూ.2,008 కోట్ల దరఖాస్తులు వచ్చాయి.

## ఐపీఓ సమాచారం

✦ నిర్మాణ సంస్థ ధరివాల్ బిల్డ్‌టెక్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా కేంద్రాల సేవల ప్రొవైడర్ ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, బీఎల్ఎస్ పాలీమర్స్ కంపెనీల ఐపీఓలకు సెబీ అనుమతి ఇచ్చింది. ఈ మూడు కంపెనీలు తాజా షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరించనున్నాయి. ఎటువంటి ఆఫర్ ఫర్ సేల్ ఉండదు. ఈ ఏడాది ఏప్రిల్- సెప్టెంబరు మధ్య ఐపీఓల కోసం ఈ కంపెనీలు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.

✦ గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ ఐపీఓ రెండో రోజుకు 2.67 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,32,26,880 షేర్లను జారీ చేయనుండగా, 3,53,62,816 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ మదుపర్ల నుంచి 10.45 రెట్ల స్పందన నమోదైంది.

✦ కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ షేరు, ఇష్యూ ధర రూ.384తో పోలిస్తే బీఎస్ఈలో ట్రేడింగ్ 3.64% నష్టంతో రూ.370 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.350.05 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 7.66% నష్టంతో రూ.354.55 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,402.28 కోట్లుగా నమోదైంది.

✦ ప్రతిపాదిత ఐపీఓలో భాగంగా తాజా షేర్ల జారీ ద్వారా రూ.6,650 కోట్ల వరకు సమీకరించేందుకు ఓయో మాతృసంస్థ ప్రిజమ్‌కు వాటాదార్ల అనుమతి లభించింది.




సాంకేతికపరంగా చూస్తే 2025 ఏఐ నామ సంవత్సరమే. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వినూత్న ఏఐ మోడళ్ల రూపకల్పన పుంజుకుంది. ఏజెంటిక్ ఏఐ విస్తృతమైంది. మల్టీమోడల్, రీజనింగ్ సామర్థ్యాలు గణనీయంగా మెరుగయ్యాయి. పరిశ్రమలు సైతం పెద్ద పెద్ద భాగస్వామ్యాలు కుదుర్చుకున్నాయి. సమ్మిళిత ఏఐ గొప్ప విజయాలు సాధించింది. మనిషిని పోలిన హ్యూమనాయిడ్ రోబోలు క్లిష్టమైన పనులనూ చేయగల స్థాయికి చేరుకోవటమే దీనికి నిదర్శనం. భవిష్యత్ ఏఐ కాలానికి దిశా నిర్దేశం చేసిన ఈ ఏడాదికి కొద్దిరోజుల్లో గుడ్‌బై చెప్పనున్న నేపథ్యంలో కొన్ని మైలురాళ్లు ఇవిగో..

# ఏఐ నామ సంవత్సరమే!

### డీప్‌సీక్ సంచలనంతో ఆరంభం

ఏడాది మొదట్లో జనవరిలోనే చైనాకు చెందిన డీప్‌సీక్ సంచలనం సృష్టించింది. డీప్‌సీక్-ఆర్1 అనే లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్‌ఎల్‌ఎం) ఏఐ రంగాన్ని ఓ కుదుపు కుదిపింది. గొలుసుకట్టు థాట్ రీజనింగ్ మీద దృష్టి సారించిన దీనికి అతి తక్కువ ఖర్చుతోనే శిక్షణ ఇవ్వటం గమనార్హం. మిస్ట్రల్ ఏఐ ఫిబ్రవరిలో తీసుకొచ్చిన లీ చాట్ తక్కువదేమీ కాదు. హై స్పీడ్ అసిస్టెంట్ అయిన ఇది సెకండుకు వెయ్యి పదాల వరకూ అవుట్‌పుట్ ఇస్తుంది. అదే నెలలో పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ శిఖరాగ్ర సదస్సులో 100కు పైగా దేశాలకు చెందిన విధానకర్తలు ఏఐ అంశాలపై చర్చించారు. దీనికి ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహ అధ్యక్షత వహించారు. ప్రభుత్వాలు ఏఐ మీద నిశితంగా దృష్టి సారిస్తున్నాయనే సంగతిని ఇది ఘనంగా చాటిచెప్పింది.

### ఫొటోనిక్ ఏఐ చిప్

ఏఐ రంగంలో ఖర్చును తగ్గించే విషయంలోనూ 2025 కొత్త దారిని చూపించింది. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాకు చెందిన సెమీకండక్టర్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన కొత్తరకం ఫొటోనిక్ ఏఐ చిప్ దీనికి ఒక ఉదాహరణ. డేటా ప్రాసెసింగ్ కోసం విద్యుత్తుకు బదులు కాంతిని వాడుకోవటం దీని ప్రత్యేకత. మరోవైపు చైనాకు చెందిన డీప్‌సీక్ చవక ఆర్1 వర్షన్ ఏఐ మోడల్‌ను తీసుకొచ్చింది. అమెరికా కంపెనీలతో పోలిస్తే 70% తక్కువ ఖర్చుతోనే దీనికి శిక్షణ ఇచ్చినట్టు కంపెనీ ప్రకటించింది.

### గ్రాక్ అద్భుతం

జెమినైని అధునాతనంగా తీర్చిదిద్దే క్రమంలోనే గూగుల్ నవంబరులో ప్రొ, డీప్ థింక్ వర్షన్లతో జెమినై 3ని ఆవిష్కరించింది. అడ్వాన్స్‌డ్ రీజనింగ్ దీని ప్రత్యేకత. అనంతరం కొద్ది రోజులకే ఇలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్‌ఏఐ మరో అడుగు ముందుకేసి గ్రాక్ అనే ఏఐ బాట్‌ను పరిచయం చేసింది. దీన్ని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లోనూ సమ్మిళితం చేయటం విశేషం. ట్వీట్ల మతలబులను అప్పటికప్పుడు తెలుసుకోవటానికి ఇప్పుడు యూజర్లు ఎక్కువగా దీన్నే ఆశ్రయిస్తున్నారు. సమాచారాన్ని విడమరచి చెప్పటంలో ఇది అద్భుతః అనిపిస్తోంది. ఇమేజ్‌లు, పొట్టి వీడియోలనూ సృష్టిస్తోంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ తమ రీలవెంట్ కార్యక్రమంలో కొత్త నోవా 2.0 మోడల్‌ను పరిచయం చేసింది. ఇది టెక్స్ట్, ఇమేజెస్, వీడియోస్, డాక్యుమెంట్స్, స్పీచ్‌లను ప్రాసెస్ చేయగల మల్టీమోడల్ ఫౌండేషన్ మోడల్స్ వేదిక.

### జెమినై రోబోటిక్స్, మనుస్ ఏఐ అసిస్టెంట్

మనుషులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం లేకుండా నిత్య జీవితంలో ఉపయోగపడే పనులను నిర్వహించటం సాధ్యమేనని మార్చిలో ఆవిష్కృతమైన అటనమస్ ఏఐ ఏజెంట్ 'మనుస్' నిరూపించింది. మరోవైపు గూగుల్ డీప్‌మైండ్, యాప్‌ట్రానిక్ సంయుక్తంగా జెమినై రోబోటిక్స్‌ను పరిచయం చేశాయి. ఇదో విజన్ లాంగ్వేజ్ మోడల్. రోబోలకు తమ చుట్టుపక్కల ప్రపంచాన్ని అర్థం చేసుకొని, మసలుకోవటానికిది తోడ్పడుతుంది. మనిషి మెదడును అనుకరించగల 'సూపర్ ట్యూరింగ్ ఏఐ' పరిశోధన గొప్ప పురోగతి సాధించింది. యూసీఎల్‌ఏ, టెక్సాస్ ఏఅండ్‌ఎం, పలు సంస్థల భాగస్వామ్యంతో రూపొందించిన ఏఐ చిప్ స్వల్ప విద్యుత్తుతోనే అప్పటికప్పుడు తనకుతాను నేర్చుకోగలదు. ఆయా పరిస్థితులకు అనుగుణంగా పనులు చేయటానికి తోడ్పడగలదు.

### జీపీటీ 5, జెమినై ఫ్లాష్ మోడళ్లు

ఆంత్రోపిక్ మేలో అటనమస్, బహుళ అంచెల పనుల కోసం క్లాడ్ 4 మోడళ్లను తీసుకొచ్చింది. దీన్ని మరింత మెరుగుపరచే ఓపస్ 4, సానెట్ 4 వర్షన్లనూ పరిచయం చేసింది. ఇక గూగుల్ సంస్థ జూన్‌లో మెరుగు పరచిన జెమినై 2.5 ప్రొ, ఫ్లాష్ మోడళ్లను తీసుకొచ్చింది. అధునాతన రీజనింగ్, మల్టీమోడల్ సామర్థ్యాలు వీటి సొంతం. ఇవి ప్రయోగాత్మక డీప్ థింక్ వంటి మోడళ్లకు దన్నుగా నిలిచాయి. రీజనింగ్, మల్టీమోడల్ అవగాహనను మెరుగుపరచే ఉద్దేశంతో ఓపెన్‌ఏఐ ఆగస్టులో భారీ మోడల్ జీపీటీ-5ని ఆవిష్కరించింది. కాకపోతే ఇది యూజర్ల నుంచి కొన్ని విమర్శలు ఎదుర్కొంది.

### ఓపెన్‌ఏఐతో డిస్నీ జట్టు

ఓపెన్‌ఏఐ డిసెంబరులో అధునాతన రీజనింగ్, కోడింగ్, లాంగ్ కాంటెక్స్ట్ సామర్థ్యాలతో కూడిన జీపీటీ 5.2 మోడల్‌ను పరిచయం చేసింది. ఇదే నెలలో ఓపెన్‌ఏఐ, వాల్ట్ డిస్నీ కంపెనీలు మూడేళ్ల భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఓపెన్‌ఏఐకి చెందిన సోరా ద్వారా జనరేటివ్ వీడియోలను సృష్టించటానికి 200కు పైగా డిస్నీ పాత్రలను వాడుకోవటం దీని ఉద్దేశం.

### ఫిజికల్ ఏఐ మహత్తు

కృత్రిమ మేధ మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లను దాటుకొని భౌతిక రూపం ధరిస్తోంది. రోబోలకు ఆలోచన, వివేచన శక్తిని ప్రసాదిస్తోంది. అదే ఫిజికల్ ఏఐ. ఏవో కొన్ని కమాండ్ల మేరకు నడచుకోవటం కాకుండా మనుషుల్లా ఆలోచించి, నడచుకోగల హ్యూమనాయిడ్ రోబోలకు ప్రాణం పోస్తోంది. టెస్లా రూపొందిస్తోన్న ఆప్టిమస్ రోబోలు ప్రయోగాత్మక ఉత్పత్తి దశకు చేరుకున్నాయి. ఎన్‌విడియాకు చెందిన ఓమ్నివర్స్, ఫిజికల్ ఏఐ ఫ్రేమ్‌వర్క్స్ వివిధ రంగాల్లో రోబోల రూపకల్పనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఫిజికల్‌ఏజెంట్, ఎనెర్‌వర్స్ వంటి ఏజెంట్ ఫ్రేమ్‌వర్క్స్ అయితే రోబోలకు ఏఐ మోడళ్లను సమ్మిళితం చేస్తున్నాయి. కమాండ్స్‌ను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా మలచుకోవటానికివి తోడ్పడుతున్నాయి.

### అదరగొట్టిన కొన్ని ఏఐ టూల్స్

**జెమినై 3:** గూగుల్ తాజా ఏఐ మోడల్. సృజనాత్మక రచన, సమస్యల పరిష్కారం, ప్రత్యక్ష రీజనింగ్‌లో దిట్ట.

**నానో బనానా:** సమగ్ర ఏఐ ఆధారిత పర్సనల్ అసిస్టెంట్. రోజువారీ డిజిటల్ పనులకు తోడు.

**ఓపెన్‌ఏఐ అట్లాస్:** ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్. బిల్టిన్‌గా చాట్‌జీపీటీ సామర్థ్యాలు సొంతం.

**అడోబ్ మ్యాక్స్ ఏఐ సూట్:** ఏఐ సామర్థ్యాలతో కూడిన సృజనాత్మక టూల్స్ బుట్ట.

**వియో 3:** టెక్స్ట్ ప్రాంప్ట్‌లతో వీడియోలుగా మలచే మోడల్. వాటికి డైలాగ్స్, సౌండ్ ఎఫెక్ట్స్, సంగీతాన్నీ జోడిస్తుంది.

**చాట్‌జీపీటీ 5.2:** ఓపెన్‌ఏఐ చాట్‌బాట్ తాజా వర్షన్. ప్రొఫెషనల్, సంక్లిష్ట నాలెడ్జ్ పనులకు ప్రత్యేకం.

**పర్‌ప్లెక్సిటీ కామెట్:** పర్సనల్ ఏజెంట్‌లాంటి ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్. టాస్కులను ఆటోమేట్ చేయటం, కంటెంట్ సారాంశాన్ని గుదిగుచ్చటం వంటి పనులను తేలికగా చేసేస్తుంది.

**ఫ్లో:** గూగుల్ రూపొందించిన అధునాతన ఫిల్మ్ మేకింగ్ టూల్. టెక్స్ట్ ప్రాంప్ట్స్, ఇమేజెస్ నుంచి వీడియో క్లిప్స్, సీన్స్, స్టోరీలను జనరేట్ చేస్తుంది.

## ట్రూకాలర్‌లో వాయిస్‌మెయిల్

ట్రూకాలర్ మనదేశంలో ఆండ్రాయిడ్ యూజర్ల కోసం కొత్తగా వాయిస్‌మెయిల్ ఫీచర్‌ను తీసుకొచ్చింది. మిస్డ్ కాల్స్ నుంచి వాయిస్ మెసేజ్‌లను స్వీకరించటానికి, వాటి ట్రాన్స్‌క్రిప్షన్‌ను చదవటానికిది వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ మనదేశంలో అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ప్రీమియం చందా




తీసుకున్నవారికి ఏఐ ఆధారిత కాల్ ఫీచర్లూ లభిస్తాయి. దీన్ని వాడుకోవాలంటే ఆ నంబరు మీద కాల్ ఫార్వర్డింగ్ ఎనేబుల్ అయ్యుండటం తప్పనిసరి. ఇందులో స్మార్ట్ కాల్ కేటగిరైజేషన్, స్పామ్ ఫిల్టరింగ్‌తో పాటు ప్లేబ్యాక్‌ను అడ్జస్ట్ చేసుకోవటం వంటి ఫీచర్లూ ఉంటాయి. వాయిస్‌మెయిల్‌ను వినటమే కాదు, చదువుకోవచ్చు కూడా. ఇది తెలుగుతో పాటు 12 భాషల్లో వాయిస్‌మెయిల్‌ను ట్రాన్స్‌క్రిప్ట్ చేస్తుంది. ఈ వాయిస్‌మెయిళ్లనీ పరికరంలోనే స్టోర్ అవుతాయి. ఇదెలా పనిచేస్తుందంటే.. మనం ఎవరికైనా ఫోన్ చేసినప్పుడు అవతలివారు కాల్ ఎత్తనప్పుడు ఈ ఫీచర్ మీద తాకి మాటలను రికార్డు చేయొచ్చు. అది వెంటనే అవతలివారికి చేరుతుంది. వాళ్లు దాని వినొచ్చు లేదా చదవొచ్చు. వెంటనే తిరిగి కాల్ చేయాల్సిన అవసరమున్నప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.

## ఇక టీవీలోనూ ఇన్‌స్టా రీల్స్

ఇన్‌స్టాగ్రామ్ వ్యక్తిగత స్క్రీన్స్ నుంచి ఇంటిల్లిపాదీ గడిపే లివింగ్ రూమ్‌కు విస్తరిస్తోంది. టెలివిజన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ను పరిచయం చేయటానికి అమెజాన్‌తో చేయి కలిపింది. ఇన్‌స్టాగ్రామ్ ఫర్ టీవీ అనే ఈ యాప్‌ను ఇప్పటికే అమెరికాలో కొన్ని అమెజాన్ ఫైర్ టీవీల్లో అమలు చేయటం మొదలెట్టింది.

ఇప్పటివరకూ ఇన్‌స్టాగ్రామ్ వాడకం చాలావరకూ మొబైల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు,



ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లకే పరిమితమైంది. కొత్త టీవీ యాప్‌తో ఇప్పుడు టీవీల్లోనూ దీన్ని వాడుకోవచ్చు. మామూలుగా ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో స్టోరీలు, ఫొటోలు, వ్యక్తిగత మెసేజ్‌లు, రీల్స్ వంటివన్నీ ఉంటాయి. అయితే టీవీ యాప్ మాత్రం రీల్స్‌కే పరిమితం. ఫైర్ టీవీ రిమోట్‌తో పెద్ద తెర మీద రీల్స్‌ను చూడొచ్చు. ఒక్కరే కాకుండా అందరితో కలిసి వినోదాన్ని ఆస్వాదించొచ్చు. దీన్ని వాడుకోవటం తేలికే. అమెజాన్ యాప్‌స్టోర్ నుంచి ఇన్‌స్టాగ్రామ్ ఫర టీవీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సైన్ ఇన్ కావాలి. ఒక టీవీ ఐదు ఇన్‌స్టా ఖాతాలను సపోర్టు చేస్తుంది. రీల్స్‌ను చూసే తీరును బట్టి ప్రతి ఖాతాకూ ప్రత్యేకమైన రికమెండేషన్లు అందుతాయి. ఇందులో తమ ఇన్‌స్టాగ్రామ్ ప్రైమరీ ప్రొఫైల్‌ను కనెక్ట్ చేసుకోవద్దని అనుకునేవారికీ సదుపాయం ఉంటుంది. టీవీ వాడకం కోసం విడిగా ఖాతాను సృష్టించుకోవచ్చు.

- యాప్‌లో వ్యూయర్లు ఇష్టమైన క్రియేటర్ల కోసం వెతకొచ్చు. ప్రొఫైళ్లను పరిశీలించొచ్చు, నచ్చిన అంశాలను బ్రౌజ్ చేసుకోవచ్చు.
- రీల్స్ అన్నీ ఛానెల్స్ రూపంలో విడిపోయి కనిపిస్తాయి. వ్యూయర్లు నేరుగా టీవీ నుంచే వీడియోలను లైక్, కామెంట్ చేయొచ్చు. ఫోన్‌ను వాడకుండానే ఇంటరాక్ట్ కావొచ్చు.

## హమ్మయ్య.. 3ఐ/అట్లాస్ పోయింది!

కొన్ని నెలలుగా ఖగోళ శాస్త్రవేత్తల చర్చల్లో నానుతున్న 3ఐ/అట్లాస్ తోకచుక్క ఎట్టకేలకు సురక్షితంగా భూ కక్ష్యను విడిచి పోయింది. మన సౌర మండలం ఆవలి నుంచి వచ్చిన ఇది గ్రహాంతరవాసుల నౌక కావొచ్చని, భూమి మీద దాడి చేయొచ్చని కొందరు శాస్త్రవేత్తలు చేసిన హెచ్చరికలు నిజం కాదని దీంతో తేలిపోయింది. భూమికి అత్యంత సమీపంలోకి.. అంటే 27కోట్ల కిలోమీటర్ల చేరువలోకి వచ్చిన తర్వాత ఇది దూరంగా వెళ్లటం ఆరంభించింది. ఇప్పుడిది గురుగ్రహం దిశగా సాగుతోంది. వచ్చే సంవత్సరం మార్చి 16న గురుడికి 5.3కోట్ల కి.మీ. సమీపంలోకి వచ్చి, శని గ్రహం దిశగా వెళ్తుంది. 2026, జులైలో శనిని, 2027 జూన్‌లో యురేనస్, 2028లో యురేనస్‌ను దాటుకొని వెళ్తుంది. 2029లో ప్లూటో సమీపానికి వెళ్లి, చివరికి 2030ల్లో మన సౌర మండలాన్ని దాటుతుంది. 3ఐ/అట్లాస్‌ను చిలీలో నెలకొల్పిన నాసాకు చెందిన అట్లాస్ టెలిస్కోప్ జులై 1న గుర్తించింది. మన సౌర మండలం ఆవలి నుంచి వచ్చిన అంతర్‌నక్షత్ర అతిథుల్లో ఇది మూడోది. ఇంతకుముందు 2017లో 1ఐ/ఒవుమావువా, 2019లో 2ఐ/బోరిసోవ్ మన సౌర మండలంలోకి వచ్చాయి. సుదూర నక్షత్రం సమీపంలో 800 కోట్ల సంవత్సరాల క్రితం 3ఐ/అట్లాస్ ఏర్పడి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంటే మన సౌర మండలం కన్నా చాలా పురాతనమైందన్నమాట. మనం ఇంత దగ్గరగా అధ్యయనం చేసిన అతి పురాతన ఖగోళ వస్తువూ ఇదే. 3ఐ/అట్లాస్ దర్శనమిచ్చిన తొలినాళ్లలో అది గ్రహాంతర జీవుల సాంకేతిక పరిజ్ఞానం కావొచ్చని, భూమి మీద హఠాత్తుగా దాడి చేయొచ్చని హార్వర్ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు పరిశోధకులు హెచ్చరించారు. సాధారణ తోకచుక్కకు భిన్నమైన లక్షణాలు కనిపించటమే దీనికి కారణం.



మన పాలపుంతను పోలిన మరో గెలాక్సీని భారతీయ శాస్త్రవేత్తలు గుర్తించారు. విశ్వం ఏర్పడ్డాక 150 కోట్ల ఏళ్లలోనే ఇది పురుడు పోసుకోవటం విశేషం. ప్రస్తుతం విశ్వం వయసు 1380కోట్ల సంవత్సరాలు. అంటే శాస్త్రవేత్తలు పురాతన ప్రపంచానికి సంబంధించిన గెలాక్సీని చూస్తున్నారన్నమాట. దీనికి అలకనంద అని పేరు పెట్టారు.

## కవల పాలపుంత!

విశ్వం తొలినాళ్లతో ముడిపడిన నమ్మకాలకు అలకనంద విరుద్ధంగా ఉండటం ఆశ్చర్యపరుస్తోంది. విశ్వం పుట్టిన వెంటనే గెలాక్సీలు చాలావరకూ అస్తవ్యస్తంగా, చిందరవందరగా ఉండేవన్నది శాస్త్రవేత్తల నమ్మకం. అయితే శాస్త్రవేత్తలు జేమ్స్ వెబ్ టెలిస్కోప్‌తో స్కాన్ చేసి చూడగా, ఈ గెలాక్సీ పూర్తిస్థాయిలో వర్తులాకారంలో ఉన్నట్టు తేలింది. ఇది అచ్చం మన పాలపుంతను పోలి ఉందని ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది.



పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్ ఆఫ్ ద టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (ఎన్‌సీఆర్‌ఏ-టీఐఎఫ్‌ఆర్)కు చెందిన పరిశోధక విద్యార్థిని రాశి జైన్ ఈ సంవత్సరం తొలినాళ్లలో అలకనందను గుర్తించారు. అనంతరం తన సూపర్‌వైజర్ వడదేకర్‌కు దీని గురించి తెలిపారు. మొదట్లో ఆయన నమ్మలేదు. మొత్తం 70వేల ఖగోళ వస్తువుల వివరాలను పరిశీలించగా ఇదొక్కటే వర్తులాకారంలో ఉంది మరి. సుమారు 30వేల కాంతి సంవత్సరాల విస్తీర్ణంలో పరచుకొని ఉన్న దీనికి రెండు సమానమైన చేతుల ఆకారాలున్నాయి. ఇవి మధ్యభాగంలోని డిస్క్ నుంచి పుట్టుకొని వస్తున్నాయి. వీటితో పాటు నక్షత్ర మండలాలు విస్తరించి ఉన్నాయి. పాలపుంతతో పోలిస్తే మూడింట ఒకవంతు సైజు గల ఇందులో వెయ్యికోట్ల నక్షత్రాలున్నాయి. పాలపుంతలో కనిపించే దాని కన్నా సుమారు 20-30 రెట్లు ఎక్కువ వేగంతో కొత్త నక్షత్రాలు పుడుతున్నాయనీ పరిశోధకులు చెబుతున్నారు. అలకనంద మీద మరిన్ని పరిశోధనలు చేయాలనీ భావిస్తున్నారు.

## చాట్‌జీపీటీ యాప్స్ డైరెక్టరీ షురూ

ఓపెన్‌ఏఐ సంస్థ చాట్‌జీపీటీని 'ఎవ్రీథింగ్ యాప్'గా మలచటంలో మరో అడుగు ముందుకేసింది. యాప్‌లో ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న టూల్స్‌ను బ్రౌజ్ చేయటానికి తోడ్పడే యాప్ డైరెక్టరీని అధికారికంగా పరిచయం చేసింది. యాపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ మాదిరిగా దీని ద్వారా ఫీచర్డ్ యాప్స్‌ను బ్రౌజ్ చేయొచ్చు. ఇష్టమైన యాప్స్‌ను వెతుక్కోవచ్చు. ఈ యాప్ స్టోర్‌ను వెబ్ మీద https://chatgpt.com/apps/ లో చూడొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్, విండోస్‌లోనైతే ఎడమ వైపున యాప్స్ బటన్ మీద క్లిక్ చేసినా కనిపిస్తాయి. యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోకుండానే వాడుకునే సదుపాయం ఉండటం విశేషం. యాప్ మీద క్లిక్ చేసి కనెక్ట్ బటన్ మీద తాకితే చాలు. చాట్‌జీపీటీలోనే నేరుగా వాడుకోవచ్చు. ప్రస్తుతానికి యాప్ సెక్షన్‌లో ఫీచర్, లైఫ్‌స్టైల్, ప్రొడక్టివిటీ అని మూడు విభాగాలు ఉన్నాయి. ఈ యాప్స్‌ను వాడుకునే తీరును తెలిపే స్క్రీన్‌షాట్లు కూడా ఉంటాయి. యాపిల్ మ్యూజిక్, స్పోటిఫై, డోర్‌డ్యాష్, అడోబ్ ఫొటోషాప్, కాన్వా, ట్రిప్‌అడ్వైజర్ వంటి యాప్స్ ఎన్నో అందుబాటులో ఉన్నాయి. నచ్చిన యాప్‌తో కనెక్ట్ అయ్యి యాప్‌ను వాడుకోవటమే తరువాయి.



## నకిలీ వెబ్‌సైట్ల వలలో పడొద్దు

ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకీ అధునాతనంగా మారుతున్నాయి. ఇలాంటి స్థితిలో నకిలీ వెబ్‌సైట్లను గుర్తించటం కీలకంగా మారింది. నేరగాళ్లు అధీకృతమైనవిగానే కనిపించే వెబ్‌సైట్లను సృష్టించి, వినియోగదారులను బోల్తా కొట్టిస్తుంటారు. వీటితో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌ల వంటి వాటిని దొంగిలిస్తుంటారు. అందువల్ల అప్రమత్తంగా ఉండటం, నకిలీ వెబ్‌సైట్లను గుర్తించటం అవసరం. వీటిని పట్టుకోవటానికి కొన్ని హెచ్చరిక సంకేతాలు తోడ్పడతాయి.

**డొమైన్ పేరులో తేడాలు:** నేరగాళ్లు చాలావరకూ ప్రముఖ కంపెనీలకు చెందిన వెబ్‌సైట్ల నకిలీలు సృష్టిస్తుంటారు. అక్షర క్రమంలో మార్పులతో బురిడీ కొట్టించాలని ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకు- ఫ్లిప్‌కార్ట్.కామ్ బదులు ఫ్లిప్‌కార్ట్‌ఆఫర్స్.ఇన్ అని మార్చొచ్చు. అమెజాన్.ఇన్‌లో ఓ అక్షరాన్ని సున్నాగా పేర్కొనొచ్చు. ఇలా డొమైన్ పేర్లలో వెంటనే పోల్చుకోలేని విధంగా చిన్న చిన్న మార్పులు చేస్తుంటారు. నిశితంగా చూస్తే తప్ప ఇది తెలియదు. కాబట్టి ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు వెబ్‌సైట్ల పేర్లను తనిఖీ చేసుకోవాలి.

**కంటెంట్‌లో అక్షర దోషాలు:** ప్రముఖ కంపెనీలు తమ వెబ్‌సైట్లలో కంటెంట్, డిజైనింగ్ మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాయి. అక్షరదోషాలేవీ లేకుండా జాగ్రత్త పడతాయి. అందువల్ల కంటెంట్‌లో ఎక్కువగా అక్షరదోషాలు, సరిగాలేని వాక్యాలు, నాసికరం గ్రాఫిక్స్ కనిపిస్తే నకిలీ వెబ్‌సైట్ కావొచ్చని అనుమానించాలి. తొందర తొందరగా వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసినప్పుడు, కంటెంట్‌ను సరిగా చెక్ చేయనప్పుడు ఇలాంటి తప్పులు దొర్లుతుంటాయి.

**కాంటాక్ట్ సమాచారం ఇవ్వకపోవటం:** విశ్వసనీయమైన వెబ్‌సైట్లలో అబౌట్ అజ్ పేజీ లేదా కాంటాక్ట్ సమాచారం ఉంటుంది. నకిలీ వెబ్‌సైట్లలో ఇది ఉండదు. నేరగాళ్లు కావాలనే ఇలా సృష్టిస్తుంటారు. వెబ్‌సైట్‌లో కంపెనీకి సంబంధించిన సమాచారం కనిపించకపోతే మోసం చేయటానికి ఉద్దేశించింది కావొచ్చని అనుమానించాలి. అలాగే ఆఫీసు చిరునామా, కస్టమర్ కేర్ నంబర్, జీమెయిల్ వంటి ఉచిత ఈమెయిల్ ఐడీ వంటివి పేర్కొనకపోయినా సందేహించాల్సిందే.



**సెక్యూర్ కనెక్షన్ లేకపోవటం:** అటాకర్ల దాడుల నుంచి కాపాడటానికి వెబ్‌సైట్లు టీఎల్‌ఎస్/ఎస్‌ఎస్‌ఎల్ సర్టిఫికెట్లను ఉపయోగిస్తాయి. మీ పరికరం, సైట్ మధ్య డేటా మార్పిడిని ఇవి ఎన్‌క్రిప్ట్ చేస్తాయి. ఈ సర్టిఫికెట్లలో డొమైన్, ఆర్గనైజేషన్, ఎక్స్‌టెండెడ్ వ్యాలిడేషన్ అని మూడు రకాలుంటాయి. నేరగాళ్లు చాలావరకూ డొమైన్ వ్యాలిడేషన్ సర్టిఫికెట్లను వాడుకుంటారు. ఈ సర్టిఫికెట్ డొమైన్ యాజమాన్యాన్ని ధ్రువీకరిస్తుంది గానీ సంస్థ వివరాలను ధ్రువీకరించదు. వాణిజ్య అవసరాలకు ఇది తగదు. కాబట్టి యూఆర్‌ఎల్‌కు ముందు https:// ఉందేమో చూసుకోవాలి. ఇది కనెక్షన్ సురక్షితమని తెలియజేస్తుంది. కేవలం http మాత్రమే ఉన్నట్టయితే సురక్షితం కాదని తెలుసుకోవాలి.

**నమ్మశక్యం కాని ఆఫర్లు:** ప్రముఖ కంపెనీల వస్తువులు అతి తక్కువ ధరకే ఇస్తామని చెప్పటమూ హెచ్చరిక సంకేతమే. యూజర్లు త్వరగా పేమెంట్ పూర్తిచేయటం కోసం నేరగాళ్లు ఇలాంటి పన్నాగం పన్నుతుంటారు. కాబట్టి నమ్మశక్యం కాని ధరలకు వస్తువులు దొరుకుతున్నాయంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిందే.

**పురికొల్పే సందేశాలు:** 'కేవలం ఒక వస్తువే ఉంది. త్వరపడండి' అంటూ ఊరించటం ద్వారానూ మోసగాళ్లు బురిడీ కొట్టించొచ్చు. లేదా కౌంట్‌డౌన్ టైమర్లతో కొనేలా పురికొల్పొచ్చు. పేజీని రిఫ్రెష్ చేసిన ప్రతిసారీ ఇది రీసెట్ అవుతుంటుంది. ఆఫర్ నిజమైందో కాదో ధ్రువీకరించుకోకుండా వెంటనే నిర్ణయం తీసుకునేలా చేయటం వీటి ఉద్దేశం. ఇలాంటి అనుచిత సందేశాలు వెబ్‌సైట్లో కనిపిస్తే నకిలీది కావొచ్చని అనుమానించాలి.

## ఘోస్ట్‌పెయిరింగ్ మోసం

వాట్సప్‌లోని డివైస్ లింకింగ్ ఫీచర్‌లో లోపమున్నట్టు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) హెచ్చరించింది. వాట్సప్ ఖాతా మీద అటాకర్లు పూర్తి ఆధిపత్యం దక్కించుకోవటానికి, వెబ్‌వర్షన్‌లో అప్పటి మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు అన్నింటినీ యాక్సెస్ చేయటానికిది ఆస్కారం కలిగిస్తుండటం ఆందోళనకరం. దీనికి 'ఘోస్ట్‌పెయిరింగ్' అని పేరు పెట్టింది. అథెంటికేషన్ అవసరం లేకుండానే పెయిరింగ్ కోడ్స్ ఉపయోగించి అటాకర్లు దీంతో ఖాతాలను హైజాక్ చేస్తున్నారు. పాస్‌వర్డ్, సిమ్ స్వాప్స్ చేయకుండానే దీనికి పాల్పడుతున్నారు.




### ఇలా మొదలవుతుంది


మీ కాంటాక్ట్‌లో ఉన్న విశ్వసనీయమైన వ్యక్తుల నుంచే 'హాయ్, చెక్ దిస్ ఫొటో' అనే సందేశంతో ఈ మోసం మొదలవుతుంది. ఇందులో ఫేస్‌బుక్ మాదిరి ప్రివ్యూతో కూడిన లింక్ ఉంటుంది. అది నకిలీ ఫేస్‌బుక్ వ్యూయర్‌కు తీసుకెళ్తుంది. కంటెంట్‌ను చూడటానికి వెరిఫై చేయాలని అడుగుతుంది. ఇక్కడే అటాకర్లు రంగంలోకి దిగుతారు. ఎలాంటి అనుమానం లేకుండా యూజర్లను తమ ఫోన్ నంబర్ ఎంటర్ చేసేలా బురిడీ కొట్టించి, వాట్సప్ లింక్ డివైస్ ఫీచర్‌ను వాడుకుంటారు. ఇలా బాధితులు తమకు తెలియకుండానే వాట్సప్ ఖాతా మీద అటాకర్లకు పూర్తి యాక్సెస్ ఇస్తారు. దీంతో అటాకర్లకు పూర్తి ఆధిపత్యం లభిస్తుంది. ఒకసారి యాక్సెస్ లభించగానే మోసగాళ్లు తమ పరికరాలకు సింక్ అయిన వాట్సప్ మెసేజ్‌లను చదవటం సాధ్యమవుతుంది. కొత్త మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు, వాయిస్ నోట్స్ అన్నీ చూస్తారు. బాధితుల కాంటాక్ట్స్‌కు, గ్రూప్ చాట్స్‌కు మెసేజ్‌లు కూడా సెండ్ చేయగలరు.

### జాగ్రత్త సుమా

తెలిసిన కాంటాక్టుల నుంచి అనుమానిత లింకులు వస్తే క్లిక్ చేయొద్దని, వాట్సప్ లేదా ఫేస్‌బుక్‌గా పేర్కొనే బయటి సైట్స్‌లో ఫోన్ నంబరును ఎంటర్ చేయొద్దని సెర్ట్-ఇన్ సూచించింది.


## దినచర్య సూచి గూగుల్ సీసీ

గూగుల్ మరో కొత్త ప్రయోగాత్మక ఏఐ ఏజెంట్‌ను ఆవిష్కరించింది. దీని పేరు సీసీ. ఇది రోజూ ఉదయాన్నే ఈమెయిళ్లు, క్యాలెండర్ వివరాలు, ఇతర డాక్యుమెంట్లు అన్నింటినీ కలగలిపి ఏఐ జనరేటెడ్ సారాంశాన్ని అందిస్తుంది. యువర్ డే హెడ్ అనే శీర్షికతో యూజర్ ఇన్‌బాక్స్‌లో బ్రీఫింగ్ ఇస్తుంది. ఆ రోజున చేయాల్సిన పనులు, కట్టాల్సిన బిల్లులు, అపాయింట్‌మెంట్లు వంటివన్నీ ఇందులో ఉంటాయి. ఈమెయిల్ డ్రాఫ్ట్‌ను జనరేట్ చేయటానికి, దానంతటదే గూగుల్ క్యాలెండర్‌కు ఈవెంట్స్‌ను యాడ్ చేయటానికీ దీన్ని వాడుకోవచ్చు. కస్టమ్ రిక్వెస్ట్‌తో నేరుగా మెయిల్ చేయటం లేదా జవాబు ఇవ్వటం ద్వారానూ సీసీకి ఆదేశాలు ఇవ్వచ్చు. మీ గురించి తెలుసుకునేలా దీనికి శిక్షణ ఇవ్వచ్చు కూడా. ఐడియాలు, చేయాల్సిన పనులను గుర్తుపెట్టుకోమనీ చెప్పొచ్చు. జెమినై సాయంతో ఏఐ మోడల్స్‌తో పనిచేసే ఇది జీమెయిల్, గూగుల్ క్యాలెండర్, గూగుల్ డ్రైవ్‌లను సింక్ చేయటంతో పాటు అంతర్జాలం నుంచి సమాచారాన్ని తీసుకోవటం ద్వారా యూజర్ల గురించి మరింత బాగా తెలుసుకోగలదు. మీ గురించి మరింత తెలుసుకునేలా తీర్చిదిద్దేలా చేసి, అవసరాలకు అనుగుణంగానూ సీసీని మలచుకోవచ్చు.



# ఈనాడు సినిమా

## దిల్లీలో పెద్ది సందడి


రామ్ చరణ్

'పెద్ది'గా ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నారు అగ్రహీరో రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా దిల్లీలో ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న రానుంది. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## చిరస్థాయిగా నిలిచిపోయేలా... దండోరా


రవీంద్ర బెనర్జీ, అనిల్ రావిపూడి, మురళీకాంత్, శివాజీ, బిందుమాధవి, నవదీప్

నటీనటులు పాత్రల్లో జీవిస్తూ కనిపించిన ప్రతి సినిమా చిరస్థాయిగా నిలిచిపోతుందని... ప్రచార చిత్రాలు చూస్తుంటే 'దండోరా' సినిమా ఆ జాబితాలో నిలిచిపోతుందన్నారు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల హైదరాబాద్‌లో 'దండోరా' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మణికా చిక్కాల, మౌనికారెడ్డి, బిందుమాధవి కీలక పాత్రలు పోషించిన చిత్రమిది. మురళీకాంత్ దర్శకుడు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మాత. ఈ చిత్రం ఈ గురువారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ కార్యక్రమంలో మైత్రీ శశిధర్ రెడ్డి, నటులు రవికృష్ణ, బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

### దుమారం రేపిన శివాజీ వ్యాఖ్యలు

'దండోరా' వేడుకలో నటుడు శివాజీ కథానాయికల వస్త్రధారణని ప్రస్తావిస్తూ కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. 'కథానాయికల అందం చీరలోనూ, నిండుగా ధరించే దుస్తుల్లోనే ఉంటుంది. ఫ్యాషన్ దుస్తులు వేసుకున్నప్పుడు అందరూ బాగున్నాయనే అంటారు కానీ, లోపల తిట్టుకుంటారు' అంటూ అసభ్య పదజాలంతో ఆయన వ్యాఖ్యలు చేశారు. వాటిపై చిత్ర పరిశ్రమ నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. కథానాయకుడు మంచు మనోజ్, గాయని చిన్మయి, దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తోపాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళలను వస్తువుల్లా చూస్తూ, అగౌరవ పరిచేలా సీనియర్ నటుడు చేసిన వ్యాఖ్యలపై ఆయన తరఫున తాను క్షమాపణ చెబుతున్నానంటూ ఎక్స్ వేదికగా ఓ లేఖని పంచుకున్నారు మంచు మనోజ్. శివాజీ సలహాలు కథానాయికలకు అవసరం లేదంటూ ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు గాయని చిన్మయి, నటి అనసూయ.


### 'మా'కు ఫిర్యాదు

కథానాయికల్ని ఉద్దేశించి నటుడు శివాజీ అవమానకరంగా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయంటూ చిత్ర పరిశ్రమలోని వంద మందికి పైగా మహిళల తరఫున 'వాయిస్ ఆఫ్ విమెన్' పేరుతో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడికి కొందరు మహిళా సినిమా ప్రముఖులు బహిరంగంగా లేఖ రాశారు. శివాజీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవల్సి వస్తుందంటూ హెచ్చరించారు. సినీ ప్రముఖులు నందినిరెడ్డి, సుప్రియ యార్లగడ్డ, స్వప్నదత్, లక్ష్మీమంచు, ఝాన్సీ లక్ష్మి పేరిట ఈ లేఖని విడుదల చేశారు.

### క్షమాపణలు చెప్పిన శివాజీ

నాలుగు మంచి మాటలు చెప్పే క్రమంలో... రెండు అభ్యంతరకరమైన పదాలు దొర్లాయంటూ తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు నటుడు శివాజీ. "కొంతమంది కథానాయికలు ఇటీవల జరిగిన వేడుకల్లో ఇబ్బందులు పడిన సందర్భాల్ని ఉద్దేశించే నేను మాట్లాడాను. అమ్మాయిలు అందరినీ ఉద్దేశించి కాదు. కథానాయికలు బయటకు వెళ్లినప్పుడు వస్త్రధారణ జాగ్రత్తగా ఉండాలనే ఉద్దేశమే తప్ప, అవమానపరచాలని కాదు. ఆ క్రమంలో నేను వాడిన పదజాలంపై మహిళలకు క్షమాపణలు చెబుతున్నా" అన్నారు శివాజీ.

## రామోజీ ఫిల్మ్ సిటీలో జాన్ అబ్రహాం యాక్షన్


జాన్ అబ్రహాం

ఈ ఏడాది 'ది డిప్లొమాట్', 'టెహ్రాన్' లాంటి వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించారు బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన.. దర్శకుడు రోహిత్ శెట్టితో కలిసి ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్నట్లు తెలిపింది చిత్రబృందం. ఈ షెడ్యూల్‌లో ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాల్ని తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించాయి చిత్ర వర్గాలు. ముంబయి మాజీ పోలీసు కమిషనర్ రాకేశ్ మరియా జీవితం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రాన్ని రోహిత్ శెట్టి తన మునుపటి సినిమాల కన్నా భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారని, త్వరలో మిగిలిన తారాగణానికి సంబంధించిన వివరాల్ని ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## రెడీ అవుతున్నారు... శంకరవరప్రసాద్‌గారు


చిరంజీవి

స్టైల్‌గా... శక్తివంతంగా తెరపై కనిపిస్తూ 'మన శంకరవరప్రసాద్‌గారు' వినోదాలు పంచుతారని చెబుతోంది ఆ చిత్రబృందం. చిరంజీవి కథానాయకుడిగా.. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే 'మన శంకరవరప్రసాద్‌గారు'. వెంకటేశ్ కీలక పాత్రని పోషించారు. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాతలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయని చిత్రబృందం చెప్పింది. మంగళవారం ఈ చిత్రంలోని లుక్‌ని విడుదల చేసింది. అందులో సూట్ ధరించి, గన్ చేతపట్టి స్టైలిష్‌గా కనిపిస్తున్నారు చిరంజీవి. త్వరలోనే చిరంజీవి, వెంకటేశ్‌లపై చిత్రీకరించిన పాటని విడుదల చేయనున్నామని, అందుకు సంబంధించిన వివరాల్ని త్వరలోనే వెల్లడిస్తామని సినీవర్గాలు చెప్పాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## కలిసి నటిస్తున్నారా?

అగ్ర కథానాయకులు చిరంజీవి - మోహన్‌లాల్ కలిసి ఓ చిత్రంలో నటించనున్నారా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. చిరంజీవి కథానాయకుడిగా, బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇదివరకు 'వాల్తేరు వీరయ్య' సినిమాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది ఈ కలయిక. రెండో సినిమా కోసం ఇటీవలే జట్టు కట్టింది. వచ్చే ఏడాదిలో పట్టాలెక్కనున్న ఈ సినిమాలోనే మోహన్‌లాల్ ఓ కీలక పాత్రని పోషించే అవకాశాలున్నట్టు సమాచారం. ఇటీవలే చిత్రబృందం ఆయన్ని సంప్రదించినట్టు తెలిసింది. తెలుగులో అగ్ర తార అయిన చిరంజీవి, మలయాళ అగ్ర హీరో మోహన్‌లాల్ కలిసి నటిస్తే అదెంతో ప్రత్యేకం కానుంది. మోహన్‌లాల్ ఇదివరకు 'గాండీవం', 'మనమంతా', 'జనతా గ్యారేజ్', 'కన్నప్ప' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించారు.

## ఎదగడం అంటే మారడమని తెలుసుకున్నా!

**నెపోటిజం వల్ల అవకాశాలు సులభంగా వచ్చినప్పటికీ.. చివరికి ప్రేక్షకుల అంగీకారమే ముఖ్యమని అంటోంది బాలీవుడ్ కథానాయిక అనన్యపాండే. భిన్నమైన చిత్రాలతో యువతను విశేషంగా ఆకట్టుకునే తార ఈమె. ఇటీవలే 'కేసరి ఛాప్టర్ 2'తో తెరపై సందడి చేసిన ఈ భామ.. త్వరలో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ' సినిమాతో ఈ ఏడాదికి గుడ్ బై చెప్పడానికి సన్నద్ధమవుతోంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య తన బాల్యం, కెరీర్ తొలినాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది.**


అనన్య పాండే

"రాబోయే రెండు మూడేళ్లలో నేను ఇంకా నా వృత్తిలో అత్యుత్తమ నటిగా ఉంటూ అగ్రస్థానంలో ఉండాలని కోరుకుంటున్నా. కెరీర్ ప్రారంభించినప్పుడు విజయం, వైఫల్యాల గురించి అంతగా తెలియదు. పోస్టర్లపై ప్రత్యేకంగా.. ఆకర్షణగా కనిపిస్తే చాలు అనుకున్నా. వాస్తవానికి అవన్నీ ఇప్పటికీ ఉన్నాయి. కానీ నా లక్ష్యం మెరుగైన నటిగా నా ప్రతిభను ప్రపంచానికి చూపించాలి. ప్రస్తుతం నా దృష్టింతా దాని పైనే ఉంది. కళ పట్ల చాలా ఆకలి ఉంది".

### చేయాల్సినవి చాలా ఉన్నాయి

"ఒక నటిగా ప్రయోగాత్మక పాత్రలు చేస్తూ.. ప్రతి కొత్త ప్రాజెక్టుతో నన్ను నేను సవాలు చేసుకోవాలనేది నా కోరిక. నాకు ఇప్పుడే కెరీర్ మొదలుపెట్టినట్లు అనిపిస్తుంది. తొలినాళ్ల నుంచి భిన్నమైన పాత్రల్లో నన్ను ప్రేక్షకులు చూస్తూనే ఉన్నారు. నటిగా నాకిది ఉత్తేజకరమైన సమయమని భావిస్తున్నా. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల పెరుగుదల కారణంగా విభిన్న కథల్ని పరిచయం చేస్తున్నారు దర్శకనిర్మాతలు. ఇప్పటికీ కొన్ని జానర్లలో నటించలేదు. బయోపిక్‌లు, యాక్షన్ సినిమాలు, స్పోర్ట్స్ డ్రామాలు, హారర్ లాంటి జానర్లలోకి నేను ఇంకా అడుగుపెట్టలేదు. అందుకే ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయనేది నా అభిప్రాయం".

### పాఠశాల రోజుల నుంచే విమర్శలు

"సినీరంగంలోకి వచ్చాక కాదు.. చిన్నతనంలోనే ఎన్నో విమర్శల్ని ఎదుర్కొన్నా. నా పని కాకుండా వ్యక్తిత్వం గురించి వచ్చే విమర్శలే నన్ను ఎక్కువ ప్రభావితం చేశాయి. ఈ అనుభవాలు నాకు మాత్రమే ప్రత్యేకం కాదు.. ఆ వయసులో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటారు. కాలక్రమేణా.. ఎదగడం అంటే మారడమని గ్రహించా. చిన్నప్పుడు సోషల్ మీడియాలో తక్కువ లైక్‌లు వచ్చినా కూడా భారంగా అనిపించేది. కానీ నా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎందుకంటే సోషల్ మీడియాని వినియోగించడంలో కఠినంగా వాళ్లు ఉండడం వల్లే నా బాల్యం సాఫీగా సాగింది".

### ధ్యానం చేయకపోతే ఆ రోజంతా బాధే

"రోజులు మారుతున్నా కూడా బంధుప్రీతి (నెపోటిజం) గురించి చిత్రపరిశ్రమలో చర్చలు జరుగుతూనే ఉంటాయి. చంకీ పాండే కుమార్తెగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడం గర్వంగా ఉంది. ఈ కారణంగా వరుస అవకాశాలు వచ్చినా.. నటన, ప్రేక్షకులతో కమ్యూనికేషన్ చాలా ముఖ్యం. సినిమాలతో పాటు నా జీవితంలో ఆధ్యాత్మికత, ధ్యానానికి ప్రాధాన్యత ఎక్కువ. రోజూ ఉదయం ధ్యానం చేస్తాను. ఒక వేళ అలా చేయపోతే ఆ రోజంతా బాధగానే ఉంటుంది.

## శరవేగంగా నేను రెడీ


హవీశ్, కావ్య థాపర్

హవీశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను రెడీ'. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన భారీ యాక్షన్ సన్నివేశాల్ని హైదరాబాద్‌లో చిత్రీకరించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే 95శాతం షూటింగ్ పూర్తయిందని, త్వరలో పాటల్ని చిత్రీకరించబోతున్నట్లు వెల్లడించాయి. కుటుంబం, వినోదం, ప్రేమ లాంటి అంశాలతో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, హరితేజ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## నన్ను కాపాడుకోవడానికి ఎలాగైనా మారతా!


సందీప్ కిషన్

"మంచోడు.. మహానుభావుడు, చెడ్డోడు.. రాక్షసుడు.. చూసే నీ చూపును బట్టి" అని అంటున్నారు సందీప్ కిషన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'సిగ్మా' సినిమా కోసమే ఇదంతా. తమిళ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతోనే దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'అన్వేషణ ప్రారంభమవుతుంది'నే వ్యాఖ్యతో విడుదల చేసింది చిత్రబృందం. "ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగైనా మారతా" అంటూ సందీప్ కిషన్ చెప్పే డైలాగ్‌తో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ టీజర్. విభిన్నమైన యాక్షన్ కామెడీ అడ్వెంచర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా కీలక పాత్ర పోషిస్తుంది.

## ఒక్క చిత్రంతో అంతా మారిపోతుందని తెలుసు!

**క్రిస్మస్ సందర్భంగా థియేటర్లలో సందడే సందడి. అగ్ర కథానాయకులు బరిలో లేరు కానీ... యువ తారలు నటించిన పలు సినిమాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. అందులో బలమైన ప్రచారంతో 'శంబాల' ప్రేక్షకుల దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. బుధవారం రాత్రి ప్రత్యేక ప్రదర్శనలతోనే ఈ సినిమా సందడి షురూ అవుతోంది. ఈ సందర్భంగా ఆయన తన పుట్టినరోజైన మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఈ నేపథ్యంలోనే 'శంబాల' ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలివీ...**


ఆది సాయికుమార్

**ఇప్పటిదాకా వచ్చిన 'శంబాల' ప్రచార చిత్రాలన్నీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తొలిసారి ఈ కథ విన్నప్పుడు మీకు కలిగిన అనుభూతిని పంచుకుంటారా?**

ఈ పేరు చెప్పగానే నాకు భలే నచ్చేసింది. కథ విన్నాక ఇది కచ్చితంగా చేయాల్సిన సినిమా అనిపించింది. పైగా పురాణాలతో ముడిపడిన ఇలాంటి కథలు ఇప్పుడు ప్రేక్షకులకు బాగా నచ్చుతున్నాయి. మన పురాణాల్లో శంబాలకి ప్రత్యేకత ఉంది. అదొక స్వచ్ఛమైన ప్రదేశం, అక్కడ ఎటువంటి కల్మషం లేని మనుషులు ఉంటారని ఓ నమ్మకం. అలాంటి ఊరి చుట్టూ సాగే కథే ఈ చిత్రం. ఈ సినిమా చేయాలనుకున్న కొన్ని రోజులకే 'కల్కి 2898 ఎ.డి' విడుదలైంది. ఆ సినిమాతో 'శంబాల' పేరు మరింత ప్రాచుర్యంలోకి వచ్చింది.

**మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

నేను ఇందులో ఓ జియాలజిస్ట్ పాత్రని పోషిస్తున్నా. ఒక ఉల్క వచ్చి ఓ గ్రామంలో పడితే, దాని గురించి పరిశోధన చేయడానికి జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నన్ను శంబాల అనే ఊరికి పంపిస్తుంది. ఆ తర్వాత ఏమైందనేది తెరపై చూసి తెలుసుకోవల్సిందే. 1980 దశకం నేపథ్యంలో సాగే కథ కావడంతో లుక్స్, కాస్ట్యూమ్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకొని నా పాత్రని డిజైన్ చేశారు. విజువల్ ఎఫెక్ట్స్, ప్రొడక్షన్ డిజైన్... ఇలా ప్రతి విభాగం అత్యుత్తమంగా పనిచేసింది.

**నమ్మకాలకీ, సైన్స్‌కీ మధ్య సాగే కథ అని ప్రచార చిత్రాల్ని బట్టి తెలుస్తోంది. ఈ విషయాల్లో మీ వ్యక్తిగత అభిప్రాయం ఏమిటి?**

నాకు నమ్మకాలు ఉన్నాయి కానీ, మరీ మూఢ నమ్మకాలైతే లేవు. ఇంట్లో పాటించే చిన్న చిన్న నమ్మకాల్ని విశ్వసిస్తా. విజ్ఞానాన్ని మాత్రం బలంగా నమ్ముతాను. నమ్మకాలు, సైన్స్‌ని మించిన విషయాలు ఇందులో ఉంటాయి. అవేమిటన్నది తెరపై చూసి తెలుసుకోవల్సిందే.

**ఈ సినిమా ప్రయాణంలో మీకు ఎదురైన సవాళ్లు ఎలాంటివి?**

ప్రస్తుతం ప్రేక్షకులు సినిమాటిక్ అనుభవాన్ని కోరుకుంటున్నారు. అలాంటి అనుభూతిని ఇచ్చే సినిమాలే వాళ్లకు నచ్చుతున్నాయి. లేదంటే ఓటీటీలో చూసేద్దాం అనే నిర్ణయానికి వచ్చేస్తారు. అది దృష్టిలో పెట్టుకునే ప్రేక్షకుడికి ఓ ప్రత్యేకమైన అనుభూతిని పంచేలా ఈ సినిమా చేయాలనుకున్నాం. అందుకోసం నా మార్కెట్ స్థాయికంటే రెండింతలు ఎక్కువ వ్యయం చేసి ఈ చిత్రాన్ని రూపొందించారు నిర్మాతలు. ఈ సినిమా దాదాపు రాత్రిళ్ల నేపథ్యంలోనే సాగుతుంది. ఆ క్రమంలో చాలా కష్టాలు ఎదురయ్యాయి. ఫస్ట్ లుక్ నుంచి ఈ చిత్రానికి సంబంధించిన ప్రతిదీ ప్రేక్షకులకు నచ్చేసింది. సినిమా విడుదలకు ముందే మేమంతా సంతోషంగా ఉన్నామంటే కారణం అదే.

**ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో మీ కుటుంబం మొత్తం భాగమైనట్టుంది కదా?**

నాన్నని మేమే లాగాం (నవ్వుతూ). సినిమా వేడుకలో మా అమ్మ కూడా ఓ డైలాగ్ చెప్పారు. ఆ వీడియో చాలా వైరల్ అయ్యింది. కొన్ని సినిమాలకి అన్నీ కలిసొస్తుంటాయి. 'శంబాల' విషయంలో నాకు ప్రతిదీ కలిసొచ్చింది. ప్రేక్షకుల్ని మెప్పిస్తే మేం అనుకున్నది నెరవేరినట్టే.

**కథానాయకుడిగా 14ఏళ్ల ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమనిపిస్తోంది?**

ఇన్నేళ్లు ఆటుపోట్లను ఎదుర్కొంటూ మనుగడ సాధించడం సంతృప్తినిచ్చే విషయం. ఒక్క సినిమాతో అంతా మారిపోతుందని నాకు తెలుసు. ఆ నమ్మకమే మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించింది.

**క్రిస్మస్ సందర్భంగా చాలా సినిమాలు విడుదలవుతున్నాయి కదా. ఈ పోటీ గురించి మీ అభిప్రాయం?**

ఇది సినిమాకి మంచి సీజన్. అందుకే అన్ని చిత్రాలకీ మేలు జరుగుతుందని నా నమ్మకం. మా క్రికెట్ జట్టులో రోషన్ ఓ సభ్యుడు. తన 'ఛాంపియన్' కూడా ఈ వారమే విడుదలవుతోంది. అది కూడాపెద్ద విజయం సాధిస్తుంది.

**కొత్తగా చేస్తున్న సినిమాల కబుర్లు?**

ఈటీవీ విన్ సంస్థలో 'సబ్‌ఇన్‌స్పెక్టర్ యుగంధర్' అనే సినిమా చేశా. థియేటర్ కోసమే చేసిన చిత్రమది. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది.

## క్రిస్మస్‌కి మిషన్ సాంటా



సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకొని భారీ వసూళ్లను సొంతం చేసుకున్న యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ'. ఇప్పుడీ బాటలోనే 'మిషన్ సాంటా' అనే మరో యానిమేషన్ సినిమా ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమైంది. క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న థియేటర్లలో సందడి చేయనుందీ చిత్రం. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ సినిమా భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో ఒకేసారి విడుదల కానుంది. బ్రాడ్ విజన్ ఇండియా, స్టూడియో 56 సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. "లాస్ ఏంజెలీస్‌లో కథ, పాత్రల డిజైనింగ్‌ను పూర్తి చేసుకుందీ చిత్రం. భారతీయ సీనియర్ యానిమేషన్ నిపుణుల పర్యవేక్షణలో సుమారు 20నెలల పాటు 150మందికి పైగా కళాకారుల శ్రమతో ప్రొడక్షన్ పనుల్ని పూర్తి చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకుల మనసులను తాకే భావోద్వేగాలు, సాహసాలు ఇందులో ఉంటాయ"ని నిర్మాణ సంస్థలు తెలిపాయి.

## భయపెట్టే ప్రత్యేకమైన సినిమా

**'ఈషా' సినిమా తన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తుందని చెబుతున్నారు అఖిల్‌రాజ్. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న యువ కథానాయకుడీయన. మరో కథానాయకుడు త్రిగుణ్‌తో కలిసి 'ఈషా' చిత్రంలో నటించారు. హెబ్బా పటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ పృథ్వీరాజ్ ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హేమ వెంకటేశ్వరరావు నిర్మించగా... బన్నీ వాస్, వంశీ నందిపాటి కలిసి గురువారం ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా అఖిల్‌రాజ్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...**


అఖిల్ రాజ్

"ఒకొక్క అడుగు వేస్తూ.. ఆడిషన్స్‌లో పాల్గొంటూ అవకాశాల్ని అందుకుంటూ ఇక్కడివరకూ వచ్చా. అలా 'సఖియా' అనే సిరీస్ ప్రచార చిత్రాన్ని చూసి దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఆడిషన్స్‌కు పిలవగా, అందులో ఎంపికై చేసిన సినిమానే 'ఈషా'. 'రాజు వెడ్స్ రాంబాయి' కంటే ముందే ఒప్పుకున్న సినిమా ఇది. కానీ ఆ సినిమా తరువాతే 'ఈషా' విడుదలవుతోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాలో రాజు పాత్ర ఎంతగా నచ్చిందో, ఇందులో వినయ్ అనే యువకుడిగానూ ప్రేక్షకులపై అంతే ప్రభావం చూపిస్తా. ఇందులో ఆత్మ ఉందా లేదా? ఉంటే అది ఎవరిది అన్నది తెరపై చూసి తెలుసుకోవల్సిందే".

● "చిన్నప్పటి నలుగురు స్నేహితుల చుట్టూ తిరిగే కథ ఇది. నేనొక కథానాయకుడిగా కనిపిస్తా. ఈ సినిమా నాకు నటుడిగా కొత్త అనుభవాన్ని ఇవ్వడంతోపాటు, ఎన్నో కొత్త విషయాల్ని నేర్పించింది. థియేట్రికల్‌గా ఓ మంచి అనుభూతిని పంచుతూనే అందరినీ భయపెట్టే ఓ ప్రత్యేకమైన సినిమా ఇది".

● "నా జీవితాన్ని సమూలంగా మార్చేసింది 'రాజు వెడ్స్ రాంబాయి'. నాకు ఓ ముఖాన్ని ఇచ్చిన చిత్రం అది. నేను ఎంత దూరం ప్రయాణించినా, అది నా కెరీర్‌కు ఎంతో ప్రత్యేకం. ఇప్పుడు కూడా ఇంకా ఆ సినిమా విడుదలకు ముందు ఒప్పుకున్న కథల్లోనే నటిస్తున్నా. ఇకపై నేను ఎలాంటి కథల్ని ఎంపిక చేసుకుంటానన్నదే కీలకం".

## ప్రాక్టీస్ బిట్స్

**పర్యావరణం అంశాలు**

1. నిజ-సమయ ఉద్గార పర్యవేక్షణ కోసం BS7 వాహనాల్లో ఏ కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు?
1) ఆన్-బోర్డ్ డయాగ్నోస్టిక్స్ 2) సెలెక్టివ్ క్యాటలిటిక్ రిడక్షన్ 3) డీజిల్ పార్టిక్యులేట్ ఫిల్టర్ 4) ఆన్-బోర్డ్ మానిటరింగ్

2. జనవరి 2025 నాటికి భారతదేశంలో BS7 ఉద్గార ప్రమాణాల స్థితి ఏమిటి?
1) దేశవ్యాప్తంగా పూర్తిగా అమలవుతోంది. 2) ప్రణాళిక, అభివృద్ధి దశల్లో ఉంది. 3) ప్రధాన నగరాల్లో మాత్రమే అమలైంది. 4) BS6 కి అనుకూలంగా వదిలివేశారు.

3. BS7 నిబంధనల ప్రకారం పెట్రోల్, డీజిల్ వాహనాలు రెండింటికీ ఏ కాలుష్యకారక ఉద్గార పరిమితిని ప్రామాణీకం చేయాలని భావిస్తున్నారు?
1) కార్బన్ డై ఆక్సైడ్ 2) నైట్రోజన్ ఆక్సైడ్లు 3) సల్ఫర్ డై ఆక్సైడ్ 4) పర్టిక్యులేట్ మ్యాటర్

4. భారతదేశంలో BS7 నిబంధనల అమలుతో సంబంధం ఉన్న సంభావ్య సవాలు ఏమిటి?
1) తగ్గిన వాహన భద్రతా ప్రమాణాలు 2) పెరిగిన వాహన ఉద్గారాలు 3) వాహన తయారీదారులకు అధిక తయారీ ఖర్చులు 4) ఇంధన లభ్యత తగ్గడం

సమాధానాలు: 1-2, 2-2, 3-2, 4-3.



# సంక్షిప్త సమాచారానికి సరళ రూపాలు!



కుటుంబంలో రకరకాల ఖర్చులు, పొదుపులు ఉంటాయి. వాటిపై నియంత్రణ ఉండాలంటే ఆదాయ సమర్థ వినియోగంపై అవగాహన ఉండాలి. ఎన్నికల్లో పార్టీల పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే గెలుచుకున్న ఓట్ల శాతాన్ని, సీట్ల సంఖ్యను తెలుసుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో సమాచారాన్ని వివిధ విభాగాలుగా విభజించి ప్రదర్శించే చిత్రపటాలు బాగా ఉపయోగపడతాయి. గణితశాస్త్రంలో ముఖ్యంగా దత్తాంశ విశ్లేషణలో భాగమైన వృత్తాకార రేఖాచిత్రాలు ఒక సంపూర్ణ మొత్తం, దానిలోని భాగాల మధ్య సంబంధాన్ని దృశ్యరూపంలో స్పష్టంగా తెలియజేస్తాయి. ఒక వృత్తాన్ని భాగాలుగా చేసి, ప్రతి భాగం మొత్తం సమాచారంలో ఎంత శాతాన్ని లేదా ఎంత కోణాన్ని వ్యక్తీకరిస్తుందో సులభంగా గ్రహించవచ్చు. వీటిపై పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. వాటికి సమాధానాలను తేలికగా కనుక్కోవాలంటే శాతాలు, డిగ్రీలు, కోణాలు, నిష్పత్తి, అనుపాతం, సగటు తదితర ప్రాథమిక గణిత భావనలపై పట్టు పెంచుకోవాలి.

**జనరల్ స్టడీస్ – అరిథ్‌మెటిక్**

## వృత్తాకార రేఖాచిత్రాలు (పై-చార్టులు)

పోటీ పరీక్షల్లో 'దత్తాంశ అన్వయం' అనే అధ్యాయానికి సంబంధించిన ఉపవిభాగమైన వృత్తాకార రేఖాచిత్రాలు (పై-చిత్రాలు) పై ప్రశ్నలు అడుగుతున్నారు. వృత్తాకార రేఖాచిత్రం అనేది వృత్త రూపంలో దత్తాంశాన్ని సూచించే ఒక రకమైన గ్రాఫ్. ఇందులో దత్తాంశానికి సంబంధించిన వివరాలను కొన్ని సెక్టార్లు/భాగాల్లో ఇస్తారు. అవి ఆ వృత్తానికి చెందిన భిన్నం లేదా అనుపాత భాగాల్లో వ్యక్తమవుతాయి. ఈ వృత్తాకార రేఖాచిత్రంలోని అన్ని భాగాలు కలిసి 100 శాతం లేదా 360° లకు సమానంగా ఉంటాయి. సాధారణంగా వృత్తాకార రేఖా చిత్రాల్లో ఒక సంస్థ/వ్యక్తి/కుటుంబానికి చెందిన ఆదాయాలు, ఖర్చులు, పొదుపు లేదా వ్యాపారంలో లాభనష్టాలు, ఉత్పత్తి, అమ్మకాలు తదితర సమాచారాన్ని శాతాలు లేదా డిగ్రీల్లో ఇస్తారు. వాటిని సులభంగా అవగాహన చేసుకోవడానికి వీలుగా వృత్తంలో పొందుపరుస్తారు.


**ప్రాథమిక సూత్రాలు**

1) కోణాన్ని శాత రూపంలోకి మార్చడానికి $= \frac{x^\circ}{360^\circ} \times 100$

2) ఒక సెక్టారు కోణాన్ని కనుక్కోవడానికి సెక్టారు కోణం $= \frac{\text{దత్తాంశంలో ఇచ్చిన విలువ}}{\text{మొత్తం విలువ}} \times 360^\circ$

## మాదిరి ప్రశ్నలు

**I.** వృత్త రేఖా చిత్రాన్ని జాగ్రత్తగా గమనించి, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలను రాయండి.




ఒక విద్యార్థికి నాలుగు పాఠ్యాంశాల్లో వచ్చిన మార్కుల శాతాన్ని సూచించే వృత్తరేఖ చిత్రం
మొత్తం మార్కులు = 500

**1.** విద్యార్థికి నాలుగు సబ్జెక్టుల్లో వచ్చిన సగటు మార్కులు ఎన్ని?
1) 150 2) 125 3) 135 4) 130

**వివరణ:** విద్యార్థికి గణితంలో వచ్చిన మార్కులు $= 500 \times \frac{40}{100} = 200$

సైన్సులో వచ్చిన మార్కులు $= 500 \times \frac{10}{100} = 50$

హిందీలో వచ్చిన మార్కులు $= 500 \times \frac{30}{100} = 150$

ఆంగ్లంలో వచ్చిన మార్కులు $= 500 \times \frac{20}{100} = 150$

$= \frac{200 + 50 + 100 + 150}{4} = \frac{500}{4} = 125$ **జ: 2**

**2.** గణితం, సైన్సు సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల మధ్య నిష్పత్తి ఎంత?
1) 3 : 1 2) 1 : 4 3) 4 : 1 4) 1 : 3

**వివరణ:** గణితం, సైన్సు సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల మధ్య ఉన్న నిష్పత్తి = 200 : 50 = 4 : 1 **జ: 3**

**3.** హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల మధ్య నిష్పత్తి ఎంత?
1) 2 : 3 2) 3 : 2 3) 1 : 2 4) 2 : 1


**వివరణ:** హిందీ, ఆంగ్లం సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల మధ్య నిష్పత్తి = 150 : 100 = 3 : 2 **జ: 2**



**4.** సైన్సులో వచ్చిన మార్కులు హిందీలో వచ్చిన మార్కుల్లో ఎంత శాతం?
1) 23.33% 2) 30% 3) 31% 4) 33.33%

**వివరణ:** సైన్సులో వచ్చిన మార్కులు, హిందీలో వచ్చిన మార్కుల్లో శాతం $= \frac{50}{150} \times 100 = 33.33\%$ **జ: 4**

**II.** కింది వృత్తరేఖాచిత్రం ఆధారంగా, ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.




ఒక వ్యక్తి ఖర్చులు, ఆదాయం సూచించే వృత్తరేఖా చిత్రం

**1.** ఆ వ్యక్తి నెలకు తనకు వచ్చిన ఆదాయంలో ఇంటి అద్దె కింద ప్రతినెలా రూ. 300 చెల్లిస్తోంటే అతడి మిగులు ఎంత?
1) రూ.550 2) రూ.650 3) రూ.350 4) రూ.450

**వివరణ:** ఈ ప్రశ్నలో ఒక వ్యక్తి నెలకు తనకు వచ్చిన ఆదాయంలో ఇంటి అద్దె కింద ప్రతినెలా రూ.300లు చెల్లిస్తున్నాడని ఇచ్చారు.
అంటే వృత్తంలో 30° ఉన్న ఇంటి అద్దె రూ.300గా ఇచ్చారు.
వృత్తంలో మిగులు = 65°

$\Rightarrow \frac{65^\circ}{30^\circ} \times 300 =$ రూ.650



**జ: 2**

**2.** మిగతా ఖర్చులన్నింటితో పోల్చుకుంటే వ్యక్తి తన ఆదాయంలో ఎంత ఎక్కువ (డిగ్రీల రూపంలో) ఫీజులను చెల్లిస్తున్నాడు?
1) 25° 2) 35° 3) 45° 4) 55°

**వివరణ:** దత్తాంశం నుంచి అన్ని ఖర్చులూ కలిపి $= 30^\circ + 25^\circ + 50^\circ + 30^\circ = 135^\circ$, ఫీజులకు $160^\circ$ అని అవగతమవుతుంది.
కాబట్టి, మిగిలిన ఖర్చులన్నింటితో పోల్చుకుంటే వ్యక్తి తన ఆదాయంలో $25^\circ (160^\circ - 135^\circ)$ ఫీజులకు ఎక్కువగా చెల్లిస్తున్నాడు. **జ: 1**

**3.** వ్యక్తి మొత్తం ఆదాయం రూ.7200 అనుకుంటే వస్త్రాల కింద అతడు నెలకు ఎన్ని రూపాయలు ఖర్చు చేస్తున్నాడు?
1) రూ.300 2) రూ.400 3) రూ.500 4) రూ.600

**వివరణ:** ఆ వ్యక్తి మొత్తం ఆదాయం = రూ.7200
$= 360^\circ =$ రూ.7200
ఆ వ్యక్తి వస్త్రాల కింద చేస్తున్న ఖర్చు $= 25^\circ$ (చిత్రం నుంచి)
∴ ఆ వ్యక్తి వస్త్రాల కింద చేస్తున్న ఖర్చు (రూపాయల్లో)
$= 25^\circ \times \frac{7200}{360^\circ} =$ రూ.500

**జ: 3**



రచయిత: జె.వి.ఎస్.రావు



**పదో తరగతి – తెలుగు**



## ప్రత్యక్ష దైవాలు

**ఫైనల్ పరీక్షలు 2026 – ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు**

**1. 'ప్రత్యక్షదైవాలు' పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.** **8 మార్కులు**

**జ:** ఎర్రన్న రచించిన ఆంధ్ర మహాభారతంలోని కౌశిక మహర్షి కథ నుంచి ఈ పాఠ్యాంశాన్ని గ్రహించారు. ధర్మవ్యాధుడు మంచి వ్యక్తిత్వం గలవాడు. ధర్మసూక్ష్మాలు తెలిసినవాడు. కేవలం తల్లిదండ్రుల సేవను మాత్రమే నమ్మినవాడు. వేదపఠనం, వ్రతాలు కంటే తల్లిదండ్రుల సేవే ప్రధానమైందని భావించినవాడు. తల్లిదండ్రుల సేవతోనే అనేక ధర్మాలు తెలుసుకున్నవాడు. ఎంతో జ్ఞానాన్ని సంపాదించిన కౌశిక మహర్షికి తెలియని తల్లిదండ్రుల సేవ గురించి చెప్పకనే చెప్పాడు. తల్లిదండ్రులకు ఇష్టమైన ఆహారం, బట్టలు, నగలు ఇవ్వడం ద్వారా వారిని సంతోషపరిచినవాడు. తల్లిదండ్రులను, అగ్నిని, గురువును, ఆత్మను పూజించినవారు ధన్యులు అని చెప్పాడు. అతడికి సనాతన ధర్మంపై మంచి నమ్మకం ఉంది. సనాతన ధర్మాచరణపై మంచి అభిలాష ఉన్నవాడు. అత్యుత్తమమైన తన వ్యక్తిత్వంతో ఇతరులను కూడా ప్రభావితం చేయగల గొప్పవాడు.

**2. 'వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి.**

**జ:** ఎంతో కష్టపడి పిల్లలను చదివించి, పెంచి, పోషించిన తల్లిదండ్రులు ఈ రోజుల్లో పిల్లలకు భారమై పోతున్నారు. అందుకే వారిని వృద్ధాశ్రమాలలో చేరుస్తున్నారు. కానీ, నిజానికి తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు. ప్రత్యక్ష దైవాలు పాఠంలో కౌశికుడు ఒక మహర్షి. ధర్మాలు తెలిసినవాడు. అయినా అతడికి ధర్మసూక్ష్మాలు తెలియవు. అన్ని ధర్మాల కంటే గొప్పది తల్లిదండ్రుల సేవ. తల్లిదండ్రులను సంతృప్తిపరచడంలో ఉన్న ఆనందం, తృప్తి ఇంక ఏ ధర్మాచరణ వల్ల కలుగదని ధర్మవ్యాధుని జీవితం ద్వారా తెలుసుకోవచ్చు. ధర్మవ్యాధుడు కేవలం తల్లిదండ్రుల సేవ ద్వారా అనేక ధర్మాలను ధర్మసూక్ష్మాలను తెలుసుకున్నాడు. మహాజ్ఞాని అయిన కౌశిక మహర్షి అంతటి వాడికి కూడా ధర్మసూక్ష్మాలు చెప్పగలిగాడు. వేదాధ్యయనం, యజ్ఞాలు, వ్రతాల కంటే తల్లిదండ్రుల సేవతోనే అనేక ధర్మాలు తెలుస్తాయని తన జీవితం ద్వారా నిరూపించాడు. తల్లిదండ్రులను, గురువును, అగ్నిని, ఆత్మను పూజించినవారు సుఖంగా ఉంటారని తెలియజేస్తాడు. ఈ పాఠం ద్వారా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని పరిశీలించినట్లయితే తల్లిదండ్రుల సేవ వల్ల కలిగే గొప్పతనం తెలుస్తుంది. నిజానికి కౌశిక మహర్షి వంటి మహాజ్ఞానికి ధర్మవ్యాధుడు గురువయ్యాడు. అతడి జీవితాన్ని గొప్ప మలుపు తిప్పే తల్లిదండ్రుల సేవ అనే ధర్మసూక్ష్మాన్ని తెలియజేశాడు. తల్లిదండ్రులను సేవిస్తే అన్ని రకాల పాపాలు పటాపంచలమవుతాయని చెప్పాడు. కాబట్టి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్చకుండా సేవించడం వల్ల పిల్లలు ధన్యులవుతారు. అనేక ధర్మసూక్ష్మాలు తెలుసుకొని లోకానికి ఆదర్శవంతులు అవుతారు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: సూర్యనారాయణ శర్మ

# 100 ప్రయోగాలు.. 150 వసంతాలు!

గత జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పదవి చేపట్టారు. నాటి నుంచి తరచూ సంచలన నిర్ణయాలతో వార్తల్లో నిలుస్తున్నారు. అంతరిక్షరంగ సాంకేతికతతో పాటు సైనిక సామర్థ్యపరంగా భారతదేశం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. గణతంత్ర వేడుకలకు అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అత్యధికంగా పద్మ పురస్కారాలు ప్రకటించింది. తెలంగాణ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సేవలను సులభతరం చేసే విధంగా వాట్సాప్ సేవలను ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవం, బ్రిక్స్ విస్తరణ, పశ్చిమ కనుమలకు ప్రపంచస్థాయి గుర్తింపు తదితర పరిణామాలకు ఈ ఏడాది తొలి నెల వేదికగా నిలిచింది. జాతీయ, ప్రపంచస్థాయి అవార్డులు, నియామకాలు, క్రీడా పోటీల ఫలితాలు, కీలక పోస్టుల్లో ఉన్నవారి పదవీకాలాల పొడిగింపులు మొదలైన ముఖ్యాంశాలన్నీ పోటీ పరీక్షార్థులు ఇంకోసారి గుర్తు చేసుకోవాలి.




కాలచక్రం మరో సంవత్సరాన్ని తనలో కలిపేసుకుంటున్న క్రమంలో దేశీయంగా, అంతర్జాతీయంగా భారత్ అనేక ఘనతలు సాధించింది. తెలుగు రాష్ట్రాలు ప్రగతి ప్రస్థానాలకు వేదికలుగా మారాయి. ప్రపంచంలో ఏర్పడిన కొత్త పొత్తుల నుంచి అంతరిక్షంలో దేశం వేసిన అడుగుల వరకు అన్నీ చెరగని ముద్రలుగా నిలిచాయి. దేశంలో అమలైన విప్లవాత్మక చట్టాలు మొదలు రాష్ట్రాల్లో సాకారమైన అభివృద్ధి పథకాల వరకు ఎన్నో కీలక ఘట్టాలు చరిత్రలోకి చేరాయి. ఇలాంటి వర్తమాన విశేషాలపై పట్టు సాధించడం పోటీ పరీక్షల్లో విజయానికి తొలిమెట్టుగా సాయపడుతుంది. ఈ నేపథ్యంలో గడిచిన పన్నెండు నెలల ముఖ్యాంశాలను 'ఈనాడు-ప్రతిభ' నేటి నుంచి అందిస్తోంది. ఏ ఒక్క మార్కును వదులుకోకూడదనే పట్టుదలతో, గత విశేషాలను అభ్యర్థులు మరోసారి మననం చేసుకోవాలి. లక్ష్యంవైపు దృఢంగా అడుగులు వేయాలి.

## ముఖ్యాంశాలు

➡ ఉత్తర్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన 1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి భువనేష్ కుమార్ 2025, జనవరి 1న భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు.

➡ రక్షణ మంత్రిత్వ శాఖ 2025 సంవత్సరాన్ని సంస్కరణల ఏడాదిగా ప్రకటించింది.

➡ కేరళ 23వ గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రమాణస్వీకారం చేశారు. బిహార్ కొత్త గవర్నర్‌గా ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు.

➡ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్య దేశంగా పాకిస్థాన్ రెండేళ్ల పదవీకాలం 2025, జనవరి 1న ప్రారంభమైంది. భద్రతా మండలిలో తాత్కాలిక సభ్య దేశంగా పాకిస్థాన్ పదవి చేపట్టడం ఇది ఎనిమిదోసారి.

➡ లూసియానాకు చెందిన రిపబ్లికన్ మైక్ జాన్సన్ అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా తిరిగి ఎన్నికయ్యారు.

➡ ప్రతిష్ఠాత్మక సంతోష్ ట్రోఫీ – 2024 విజేతగా పశ్చిమ బెంగాల్ నిలిచింది. ఫైనల్‌లో కేరళపై 1–0తో విజయం సాధించి రికార్డు స్థాయిలో 33వ సారి ఈ టైటిల్‌ను నెగ్గింది.


➡ వియత్నాం రాజధాని హనోయ్‌ను ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరంగా ప్రకటించారు. ఇక్కడ పీఎం 2.5 స్థాయులు క్యూబిక్ మీటర్‌కు 266 మైక్రోగ్రాములకు చేరుకున్నాయి.



భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డులను 2025 సంవత్సరానికి గాను మను బాకర్ (షూటింగ్), హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్‌కుమార్ (పారాఅథ్లెటిక్స్), డి.గుకేష్ (చెస్)లకు ప్రకటించింది.

➡ భారత అణుశక్తి రంగ నిపుణుడు డాక్టర్ ఆర్.చిదంబరం (88) ముంబయిలోని జాస్లోక్ ఆసుపత్రిలో మరణించారు. 1974లో భారత మొదటి శాంతియుత అణు పరీక్ష నుంచి 1998లో ఆపరేషన్ శక్తికి నాయకత్వం వరకు భారతదేశ అణు ప్రయాణాల్లో డాక్టర్ చిదంబరం అంతర్భాగంగా ఉన్నారు.

➡ అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవాన్ని జనవరి 22న నిర్వహించారు.



అర్జెంటీనా పురుషుల ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ లియొనెల్ మెస్సీకి అమెరికా అత్యున్నత పౌర పురస్కారం యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని అందుకున్న మొదటి పురుష ఫుట్‌బాల్ ఆటగాడిగా మెస్సీ నిలిచారు.

➡ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్‌గా, అంతరిక్ష శాఖ నూతన కార్యదర్శిగా డాక్టర్ వి.నారాయణన్ నియమితులయ్యారు.

➡ లెబనాన్ నూతన అధ్యక్షుడిగా జనరల్ జోసెఫ్ జౌన్ ఎన్నికయ్యారు.

➡ దక్షిణ భారత దేశంలో మొదటి అంటువ్యాధుల పరిశోధన, రోగ నిర్ధారణ ప్రయోగశాల (ఐఆర్‌డీఎల్)ను స్థాపించడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) బెంగళూరు మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఎంసీఆర్ఐ)ను ఎంపిక చేసింది.

➡ ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) రెడ్ లిస్ట్ ఆఫ్ థ్రెటెన్డ్ స్పీసిస్ నిర్వహించిన మొదటి మల్టీ – టాక్సన్ గ్లోబల్ మంచినీటి జంతుజాల సర్వే భారత్‌లోని పశ్చిమ కనుమలను అంతరించిపోతున్న మంచినీటి జాతులకు కీలకమైన ప్రపంచ హాట్‌స్పాట్‌గా గుర్తించింది.

➡ కేరళలోని కోజికోడ్‌లోని ప్రఖ్యాత కప్పడ్ బీచ్, కన్నూర్‌లోని చల్ బీచ్‌లకు డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను ప్రదానం చేసింది.

➡ వెనుజువెలా 46వ అధ్యక్షుడిగా నికోలస్ మాదురో వరుసగా మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు.

➡ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) అథ్లెట్స్ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా దిగ్గజ లాంగ్ జంపర్ అంజు బాబీ జార్జ్ ఎంపికయ్యారు.

➡ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద మొత్తం రూ.700 కోట్ల వ్యయంతో 56 కొత్త వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులు 10 (రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, అస్సాం, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం) రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, భూమి క్షీణతను పరిష్కరించడం, వాతావరణ స్థితిస్థాపకతను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

➡ అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతలు చేపట్టారు. 2017 - 2021 మధ్యకాలంలో అమెరికా 45వ అధ్యక్షుడిగానూ ట్రంప్ పనిచేశారు.



ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2025 మహిళల సింగిల్స్ విజేతగా మ్యాడిసన్ కీస్ (అమెరికా), పురుషుల సింగిల్స్ విజేతగా జానిక్ సిన్నర్ (ఇటలీ) నిలిచారు.

➡ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ జాతీయ పసుపు బోర్డును జనవరి 14న ప్రారంభించారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం నిజామాబాద్‌లో ఏర్పాటు చేశారు. పసుపు బోర్డు మొదటి ఛైర్‌పర్సన్‌గా పల్లె గంగారెడ్డి నియమితులయ్యారు.

➡ భారత వాతావరణ విభాగం (ఐఎండీ) జనవరి 15 నాటికి 150 వసంతాలు పూర్తి చేసుకుంది.

➡ రెండు అత్యాధునిక యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ నీలగిరి, ఐఎన్ఎస్ సూరత్, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగ్‌షీర్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు.



కేంద్ర ప్రభుత్వం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 139 మందికి పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది.

➡ జనవరి 16న ఇస్రో అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన 4వ దేశంగా భారత్ నిలిచింది.

➡ డాక్టర్ కె.ఎస్.చౌహాన్ రచించిన 'పార్లమెంట్: పవర్స్, ఫంక్షన్స్ అండ్ ప్రివిలేజస్, ఎ కంపారిటివ్ కాన్‌స్టిట్యూషనల్ పర్‌స్పెక్టివ్' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ న్యూదిల్లీలో విడుదల చేశారు.



భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వ్యోమగామి నిక్ హేగ్‌తో కలసి స్పేస్‌వాక్ నిర్వహించారు. సునీతా విలియమ్స్ ఇలా స్పేస్ వాక్ చేయడం ఇది 8వ సారి.

➡ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు.

➡ జనవరి 16న భారత లోక్‌పాల్ 11వ వ్యవస్థాపక దినోత్సవాన్ని న్యూదిల్లీలో ఘనంగా నిర్వహించారు. 2013 లోక్‌పాల్, లోకాయుక్తల చట్టం ప్రకారం 2014, జనవరి 16న లోక్‌పాల్ ఏర్పాటైంది.



భారత గణతంత్ర వేడుకలకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవ శకటాల వేడుకలో మహాకుంభ మేళా శకటం (ఉత్తర్‌ప్రదేశ్), 14 దేవతా మూర్తుల ఆరాధన (త్రిపుర), ఏటికొప్పాక పర్యావరణ అనుకూల శకటం (ఆంధ్రప్రదేశ్)లకు వరుసగా తొలి మూడు బహుమతులు లభించాయి.

➡ అస్సాం - మేఘాలయ కేడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు.

➡ దేశంలోనే అతిపెద్ద వాహన ప్రదర్శన 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో'ను జనవరి 17న ప్రధాని నరేంద్ర మోదీ న్యూదిల్లీలో ప్రారంభించారు. ఐదు రోజుల పాటు దీన్ని నిర్వహించారు.



కేంబ్రిడ్జిలోని బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక గేట్స్ - కేంబ్రిడ్జ్ ఇంపాక్ట్ ప్రైజ్‌ను 2025 సంవత్సరానికి బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మహిళా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఉర్బాసి సిన్హాకు ప్రదానం చేసింది.

➡ జనవరి 29న ఇస్రో.. సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ - ఎఫ్ 15 రాకెట్ ప్రయోగించింది. తద్వారా ఎన్‌వీఎస్ - 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపింది. ఇది శ్రీహరికోట నుంచి ఇస్రోకు 100వ ప్రయోగం.

➡ అంతర్జాతీయ సైబర్ నేరాల దర్యాప్తునకు సంబంధించి భారత్ - అమెరికా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో ఇరు దేశాల అధికారులు మరింత సహకారం అందించుకొనేలా ఈ ఒప్పందాన్ని రూపొందించారు.



తూర్పు భారతదేశంలో మొదటి ఖగోళ అబ్జర్వేటరీని పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాలోని పంచేట్‌కొండపై ప్రారంభించారు. దీనికి ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ పేరు పెట్టారు. లద్దాఖ్, నైనిటాల్, మౌంట్ అబు, గిర్నానీ హిల్స్, కవలూర్‌లలో ఇప్పటికే 5 అబ్జర్వేటరీలు ఉన్నాయి.

➡ ఇండియా ఓపెన్ 2025 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో విక్టర్ అక్సెలెసెన్ (డెన్మార్క్), మహిళల విభాగంలో అన్ సె-యంగ్ (దక్షిణ కొరియా) విజేతలుగా నిలిచాయి. న్యూదిల్లీలో ఏటా ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ నిర్వహిస్తారు.

➡ మొదటి ఖోఖో ప్రపంచ కప్ పోటీలు జనవరి 13న న్యూదిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 23 దేశాలు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో భారత పురుష, మహిళల జట్లు విజేతలుగా నిలిచాయి. మహిళల ఫైనల్లో భారత్ 78–40తో నేపాల్‌పై విజయం సాధించింది. పురుషుల ఫైనల్లో 54–36తో భారత్, నేపాల్‌పై గెలిచింది.

➡ బ్రిక్స్ కూటమిలో నైజీరియా భాగస్వామ్య దేశంగా చేరింది. నైజీరియా చేరికతో మొత్తం బ్రిక్స్ భాగస్వామ్య దేశాల సంఖ్య తొమ్మిదికి చేరింది. బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్థాన్, మలేసియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్‌లు ఇప్పటికే భాగస్వామ్య దేశాలుగా ఉన్నాయి.

➡ గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ 2025 ప్రకారం సంప్రదాయ సైనిక బలగాల సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో 4వ స్థానంలో నిలిచింది. తొలి మూడు స్థానాల్లో వరుసగా అమెరికా, రష్యా, చైనా నిలిచాయి.



రచయిత: సీహెచ్ కృష్ణప్రసాద్

## గణిత తార్కిక పరీక్ష

సూచన (ప్ర. 1 – 5): > అనేది + గా, < అనేది – గా, + అనేది ÷ గా, ^ అనేది × గా, – అనేది = గా, × అనేది > గా, = అనేది < గా మారితే కింది ప్రశ్నలకు సరైన సమాధానం గుర్తించండి.

**1.** 1) $6+3>8=4+2<1$ 2) $4>6+2\times32+4<1$ 3) $8<4+2=6>3$ 4) $14+7>3=56+3>2$

సాధన: $6+3>8=4+2<1$ అంటే $6\div3+8<4\div2-1$

$\Rightarrow 2+8<2-1 \Rightarrow 10<1$ (అసత్యం)

$4>6+2\times32+4<1$ అంటే $4+6\div2>32\div4-1$

$=4+3>8-1 \Rightarrow 7>7$ (అసత్యం)

$8<4+2=6>3$ అంటే $8-4\div2<6+3 \Rightarrow 8-2<9$

$\Rightarrow 6<9$ (సత్యం)

సమాధానం: 3

**2.** 1) $14>18+9=16+4<1$ 2) $4>3\wedge8<1-6+2>24$ 3) $3<6\wedge4>25=8+4>1$ 4) $12>9+3<6\times25+5>6$

సాధన: $14>18+9=16+4<1$ అంటే

$14+18\div9<16\div4-1$

$=14+2<4-1 \Rightarrow 16<3$ (అసత్యం)

$4>3\wedge8<1-6+2>24$ అంటే

$4+3\times8-1=6\div2+24$

$=4+24-1=3+24 \Rightarrow 28-1=27$

$\Rightarrow 27=27$ (సత్యం)

సమాధానం: 2

**3.** 1) $13>7<6+2=3\wedge4$ 2) $9>5>4-18+9>16$ 3) $9<3<2>1\times8\wedge2$ 4) $28+4\wedge2=6\wedge4+2$

సాధన: $13>7<6+2=3\wedge4$ అంటే $13+7-6\div2<3\times4$

$=13+7-3<12 \Rightarrow 17<12$ (అసత్యం)

$9>5>4-18+9>16$ అంటే $9+5+4=18\div9+16$

$\Rightarrow 18=18$ (సత్యం)

సమాధానం: 2

**4.** 1) $29<18+6=36+6\wedge4$ 2) $18>12+4\times7>8\wedge2$ 3) $32>6+2=6<7\wedge2$ 4) $31>1<2=4>6\wedge7$

సాధన: $29<18+6=36+6\wedge4$ అంటే

$29-18\div6<36\div6\times4$

$=29-3<6\times4 \Rightarrow 26<24$ (అసత్యం)

$18>12+4\times7>8\wedge2$ అంటే $18+12\div4>7+8\times2$

$=18+3>7+16 \Rightarrow 21>23$ (అసత్యం)

$32>6+2=6<7\wedge2$ అంటే $32+6\div2<6-7\times2$

$=32+3<6-14 \Rightarrow 35<-8$ (అసత్యం)

$31>1<2=4>6\wedge7$ అంటే $31+1-2<4+6\times7$

$=30<46$ (సత్యం)

సమాధానం: 4


**5.** 1) $7>7<7+7=14$ 2) $7\wedge7>7+7=7\wedge7>1$ 3) $7<7+7=6$ 4) $7+7>7=8$

సాధన: $7>7<7+7=14$ అంటే $7+7-7\div7<14$

$=14-1<14 \Rightarrow 13<14$ (సత్యం)

సమాధానం: 1

సూచన (ప్ర. 6 – 10): 'O' అంటే సంకలనం, 'Q' అంటే భాగాహారం, 'Z' అంటే <, 'M' అంటే వ్యవకలనం, 'X' అంటే సమానం, 'A' అంటే గుణకారం, 'Y' అంటే > గా భావిస్తే కింది ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించండి.



పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో గణిత తార్కిక పరీక్ష అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో ప్రశ్నలో ఇచ్చిన సంజ్ఞలకు బదులు దత్తాంశంలో ఇచ్చిన సంజ్ఞలు ఉపయోగించి జవాబు గుర్తించాల్సి ఉంటుంది. అంటే గణిత సమీకరణాల్లోని గుర్తులకు బదులు సూచనల ఆధారంగా వేరొక గుర్తులను వినియోగించి సమీకరణాన్ని సాధించాలి. ఈ విభాగంలో ప్రశ్నల సాధనకు గణిత సంజ్ఞలపై పట్టు అవసరం. BODMAS సూత్రంతో సులువుగా సమాధానాలు కనుక్కోవచ్చు.

# దత్తాంశంలోని సూచనలు.. ఆచరిస్తేనే మార్కులు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

**6.** 1) 2 Z 2 A 4 O 1 A 4 M 8 2) 10 X 2 O 2 A 4 O 1 M 2 3) 8 Y 2 A 3 A 4 Q 2 A 4 4) 12 X 4 O 2 Q 1 A 4 A 2

సాధన: 2 Z 2 A 4 O 1 A 4 M 8 $\Rightarrow 2<2\times4+1\times4-8$

$=2<8+4-8 \Rightarrow 2<4$ (సత్యం)

సమాధానం: 1

**7.** 1) 1 O 1 Q 1 M 1 Y 3 Q 1 2) 2 Q 1 O 10 A 1 Z 6 A 4 3) 3 O 2 O 10 Q 2 X 10 A 2 4) 5 Q 5 A 5 O 5 Y 5 A 2

సాధన: 1 O 1 Q 1 M 1 Y 3 Q 1 $\Rightarrow 1+1\div1-1>3\div1$

$=1>3$ (అసత్యం)

2 Q 1 O 10 A 1 Z 6 A 4 $\Rightarrow 2\div1+10\times1<6\times4$

$=2+10<6\times4 = 12<24$ (సత్యం)

సమాధానం: 2

**8.** 1) 3 O 2 X 2 Q 1 A 3 O 1 2) 6 M 2 Y 10 Q 2 A 3 O 1 3) 10 A 2 Z 2 Q 2 A 10 Q 2 4) 10 A 2 Y 2 Q 1 A 10 Q 2

సాధన: 3 O 2 X 2 Q 1 A 3 O 1 $\Rightarrow 3+2=2\div1\times3+1$

$\Rightarrow 5=7$ (అసత్యం)

6 M 2 Y 10 Q 2 A 3 O 1 $\Rightarrow 6-2>10\div2\times3+1$

$=4>5\times3+1 \Rightarrow 4>16$ (అసత్యం)

10 A 2 Z 2 Q 2 A 10 Q 2 $\Rightarrow 10\times2<2\div2\times10\div2$

$=20<1\times5 \Rightarrow 20<5$ (అసత్యం)

10 A 2 Y 2 Q 1 A 10 Q 2 $\Rightarrow 10\times2>2\div1\times10\div2$

$=20>2\times5 \Rightarrow 20>10$ (సత్యం)

సమాధానం: 4

**9.** 1) 32 X 8 Q 2 A 3 Q 1 A 2 2) 14 X 2 A 4 A 2 M 2 Q 1 3) 2 Y 1 A 1 Q 1 O 1 A 1 4) 16 Y 8 A 3 O 1 A 2 M 2

సాధన: 32 X 8 Q 2 A 3 Q 1 A 2 $\Rightarrow 32=8\div2\times3\div1\times2$

$\Rightarrow 32=4\times3\times2 \Rightarrow 32=24$ (అసత్యం)

14 X 2 A 4 A 2 M 2 Q 1 $\Rightarrow 14=2\times4\times2-2\div1$

$\Rightarrow 14=16-2 \Rightarrow 14=14$ (సత్యం)

సమాధానం: 2

**10.** 1) 8 Q 4 A 1 M 2 X 16 M 16 2) 8 O 2 A 12 Q 10 X 18 Q 9 3) 6 Q 2 O 1 O 1 X 16 A 1 4) 2 O 3 M 4 Q 2 Z 1 A 2

సాధన: 8 Q 4 A 1 M 2 X 16 M 16

$\Rightarrow 8\div4\times1-2=16-16$

$=2\times1-2=16-16 \Rightarrow 0=0$ (సత్యం)

సమాధానం: 1

**11.** L గుణకారాన్ని, M భాగాహారాన్ని, P సంకలనాన్ని, Q వ్యవకలనాన్ని సూచిస్తే, 16 P 24 M 8 Q 6 M 2 L 3 = ?

1) $\frac{13}{2}$ 2) $-\frac{1}{6}$ 3) $14\frac{1}{2}$ 4) 10

సాధన: 16 P 24 M 8 Q 6 M 2 L 3

$=16+24\div8-6\div2\times3$

$=16+3-3\times3 \Rightarrow 19-9=10$

సమాధానం: 4

**12.** – అనేది ÷ ను, + అనేది × ను, ÷ అనేది – ను, × అనేది + ను సూచిస్తే, కింది వాటిలో ఏది సత్యం?

1) $52\div4+5\times8-2=36$ 2) $43\times7+5+4-8=25$ 3) $36\times4-12+5\div3=420$ 4) $36-12\times6\div3+4=60$

సాధన: $52\div4+5\times8-2=36$

$\Rightarrow 52-4\times5+8\div2=36$

$\Rightarrow 52-20+4=36 \Rightarrow 36=36$

సమాధానం: 1



రచయిత
రాజేశ్ మధు, విషయ నిపుణులు

## Word of the Day 870

*Lousy*

***Telugu meaning:*** దిగజారిన, బాగాలేని

***English meaning:*** The word lousy (లౌజీ) is an adjective that describes something of very poor quality or something that is unpleasant or unsatisfactory.

***Synonyms:*** Awful, Miserable; ***Antonyms:*** Excellent, Superb

***Usage:*** **1.** He gave a lousy performance in the interview because he was unprepared and nervous.

**2.** The service at the restaurant was so lousy that many customers left without ordering food.

## కరెంట్ అఫైర్స్



2025, డిసెంబరు 21 నాటికి ఎలాన్ మస్క్ సంపద విలువ 749 బి.డాలర్ల (రూ.67.41 లక్షల కోట్లు)కు చేరింది. ప్రపంచంలోనే తొలిసారిగా 700 బి.డాలర్లకు పైగా నికర సంపద కలిగిన వ్యక్తిగా మస్క్ రికార్డు సాధించారు. డెలావేర్ సుప్రీంకోర్టు 139 బిలియన్ డాలర్ల (రూ.12.51 లక్షల కోట్లు) విలువైన టెస్లా స్టాక్ ఆప్షన్లను పునరుద్ధరించడంతో పాటు, 2018లో ఎలాన్ మస్క్‌కు ప్రకటించిన 55 బి.డాలర్ల (రూ.4.95 లక్షల కోట్లు) వేతన ప్యాకేజీకి అనుకూలంగా తీర్పు వెలువరించడంతో ఇది సాధ్యమైంది.



ప్రభుత్వరంగ సంస్థలకు అవసరమైన సేవలు, వస్తు సామగ్రిని సమీకరించేందుకు నిర్వహిస్తున్న ది గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (జెమ్) ద్వారా ఇప్పటివరకు 11.25 లక్షలకు పైగా ఎంఎస్ఈలకు రూ.7.44 లక్షల కోట్లకు పైగా విలువైన ఆర్డర్లు లభించాయి. వాణిజ్య - పరిశ్రమల శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. జెమ్ సమీకరించే ఉత్పత్తుల్లో, ఎంఎస్ఈల వాటా 25% తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్దేశించగా, అంతకుమించి ఈ సంస్థల నుంచి సమీకరణ గత నెలకే 44.8%కి చేరింది.

విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల గురించి నీతి ఆయోగ్ 2025, డిసెంబరు 22న 'ఇంటర్నేషనలైజేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' (దేశంలో ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ) పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. 2024 లెక్కల ప్రకారం మొత్తంగా 13.35 లక్షల మంది విదేశాల్లో చదువుతున్నారు. ఇందులో 8.5 లక్షల మంది అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాల్లోనే ఉన్నారు. 2016-24 మధ్య 8.84% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. విదేశాల్లో చదువుల కోసం భారతీయ విద్యార్థులు రూ.6.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది మన జీడీపీలో 2%కి సమానమని వివరించింది.

అణు రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా తీసుకొచ్చిన సస్టెయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇటీవల పార్లమెంటులో నెగ్గిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని 2025, డిసెంబరు 21న ప్రభుత్వ నోటిఫికేషన్ వెల్లడించింది. కొత్త చట్టం రాకతో ద ఆటమిక్ ఎనర్జీ చట్టం-1962, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజీ చట్టం-2010 రద్దవుతాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

### వివిధ సామాజిక ఉద్యమాలు


**అరవయ్యో దశకంలో భూస్వాముల దోపిడీలు, అణచివేతలపై అన్నదాతలు, శ్రామికులు కదం తొక్కారు. తేయాకు తోటల్లో ఆయుధాలతో తిరగబడ్డారు. ఉద్యమాలు హింసాత్మకమయ్యాయి. ప్రభుత్వాలు కఠినచర్యలు చేపట్టినా పోరాటాలు ఆగలేదు. ఆఖరికి పాలకులు ప్రగతిశీల శాసనాలు చేయాల్సి వచ్చింది. ఆ మేరకు రైతులకు, గిరిజనులకు కొన్ని ప్రయోజనాలు చేకూరాయి. అదే తరహాలో దేశవ్యాప్తంగా పలు లక్ష్యాల కోసం సామాజిక ఉద్యమాలు జరిగాయి.**

### వివిధ సామాజిక ఉద్యమాలు

సాంఘిక లక్ష్యాలను సాధించేందుకు భారతదేశంలో రకరకాల సామాజిక ఉద్యమాలు జరిగాయి. సాధారణంగా ఇవి రాజకీయ స్వభావాన్ని కలిగి ఉంటాయి. కానీ రాజకీయాలకు అతీతంగా ఏకమైన రైతులు కూడా అనేక పోరాటాలు సాగించారు.

### నక్సల్‌బరీ ఉద్యమం

దేశంలోని ప్రముఖ సామాజిక ఉద్యమాల్లో నక్సల్‌బరీ ఉద్యమం ఒకటి. ఈ ఉద్యమం 1967లో పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభమైంది. అనంతరం దేశంలోని చాలా ప్రాంతాలకు విస్తరించింది. భూస్వాముల దోపిడీ, రాజ్యం అణచివేత ధోరణులపై రైతులు, భూమి లేని శ్రామికులు, నిమ్నకులాల వారు పోరాడే విధంగా వ్యవస్థీకృతం చేసింది.




కర్ణాటక రాజ్య రైతు సంఘం, షేత్కారీ సంఘటన (ఎస్ఎస్), భారతీయ కిసాన్ యూనియన్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## జాతీయ వినియోగదారుల దినోత్సవం

డిసెంబరు 24

చరిత్రలో ఈనాడు




వ్యక్తిగత, సామాజిక, కుటుంబ అవసరాల కోసం వస్తువులు లేదా సేవలు పొందే వ్యక్తిని వినియోగదారుడు అంటారు. ప్రతి పరిశ్రమ ద్వారా ఉత్పత్తి చేసే వస్తువు లేదా సేవ అంతిమంగా వినియోగదారుకు చేరాలనే ఉద్దేశంతోనే ఆయా సంస్థలు పనిచేస్తుంటాయి. వీరు లేకపోతే కంపెనీలకు మనుగడే ఉండదు. వినియోగదారులకు నాణ్యమైన వస్తు, సేవలు అందించడం సంస్థల ప్రాథమిక విధి. అయితే వివిధ కంపెనీలు మోసపూరిత ధోరణితో కన్స్యూమర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. మన దేశంలో వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో ఏటా డిసెంబరు 24న 'జాతీయ వినియోగదారుల దినోత్సవం'గా (National Consumer Day) నిర్వహిస్తారు. దీన్నే 'జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం' (National Consumer Rights Day) అని కూడా అంటారు. వినియోగదారుల రక్షణ, సాధికారత, హక్కులపై అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

### చారిత్రక నేపథ్యం

☛ భారతదేశంలో అత్యంత ముఖ్యమైన చట్టాల్లో వినియోగదారుల రక్షణ చట్టం 1986 ఒకటి. అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, లోపభూయిష్ట వస్తువులు, నాణ్యత లేని సేవల నుంచి వినియోగదారుడిని రక్షించడం దీని లక్ష్యం. దీని అమలుకు ముందు మన దేశంలో వినియోగదారుల సమస్యలకు సరైన పరిష్కారం లేదు. విక్రేతల దోపిడీ అధికంగా ఉండేది. ఈ చట్టం వచ్చాక ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం అయ్యింది.

☛ ఈ చట్టాన్ని భారతదేశంలో వినియోగదారుల హక్కుల మాగ్నా కార్టా అని పిలుస్తారు.

☛ ఇది 1986, డిసెంబరు 24న మన దేశంలో అమల్లోకి వచ్చింది. భారత్‌లోని వినియోగదారుల హక్కుల్లో నిర్మాణాత్మక మార్పు తీసుకొచ్చిన ఈ చట్టం అమలైన తేదీని ఏటా 'జాతీయ వినియోగదారుల దినోత్సవం'గా జరపాలని 2019లో భారత ప్రభుత్వం ప్రకటించింది. 2020 నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

**భారతదేశంలో వినియోగదారుల హక్కులు, వినియోగదారుల రక్షణ చర్యలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.**

## Latest Updates

### Operator Posts

Hindustan Aeronautics Limited (HAL) is inviting applications for Operator posts in various departments on a temporary basis at its Nashik unit in Maharashtra. The total no. of posts is 11. The last date for online applications is 31 December 2025.

### Senior Resident Posts

The All India Institute of Medical Sciences (AIIMS Bhopal) is inviting applications for Senior Resident posts in various departments on a contract basis. The total no. of posts is 128. The application fee is Rs.1500. The last date for online applications is 15 January 2026.

### Manager Jobs

Engineers India Limited (EIL) is inviting applications for Manager positions in various departments. The total no. of posts is 22. Eligible candidates can apply online before 2 January 2026.

### Did You Apply..?

*Today (December 24) is the last date for the following Jobs/ Apprentice posts*

☛ Executive posts in NTPC Limited. ***Qualification:*** Degree (Electrical/Mechanical/Electronics/Instrumentation).

☛ 4,116 Apprentice posts in Northern Railway. ***Eligibility:*** 10th class, ITI.

☛ Cluster Manager Posts in SIDBI. ***Eligibility:*** Bachelor's Degree, MBA.

*For more information and other notifications - scan QR code*

## Bank Exams

### English

### Para Jumbling

***Directions (Qs. 1 - 7):*** *Rearrange the following sentences in the proper sequence to form a meaningful and coherent paragraph.*

**1. A.** Central banks use monetary policy tools such as interest rate hikes to control excessive inflation.

**B.** Persistent inflation erodes purchasing power and disproportionately affects lowincome households.

**C.** Inflation refers to a sustained rise in the general price level of goods and services in an economy.

**D.** However, aggressive tightening can slow economic growth and dampen investment sentiment.

**E.** Therefore, policymakers aim to strike a balance between price stability and growth.

A) CABDE B) BDEAC C) CBAED D) BECAD E) CDAEB

**2. A.** Digital payments reduce transaction costs and improve efficiency for both consumers and businesses.

**B.** India has witnessed rapid growth in digital payments driven by smartphones and internet access.

**C.** However, concerns related to cybersecurity and data privacy remain significant challenges.

**D.** Government initiatives and regulatory frameworks support the adoption of cashless transactions.

**E.** Addressing these risks is essential for sustaining trust in digital financial systems.

A) ACBDE B) CBADE C) BADCE D) ACBED E) BCAED

**3. A.** Governments borrow to finance infrastructure, welfare schemes, and economic stimulus programmes.

**B.** High public debt can crowd out private investment and strain fiscal sustainability.

**C.** Public debt refers to the total outstanding liabilities of a government.

**D.** Therefore, prudent debt management is essential for long-term economic stability.

**E.** Borrowing becomes risky when debt grows faster than the economy.

A) ACBDE B) CABED C) CADEB D) BACED E) DACEB

**4. A.** Financial regulation aims to ensure stability and protect consumers in the banking system.

**B.** Weak regulation can lead to excessive risk-taking and financial crises.

**C.** Regulators set capital requirements, conduct supervision, and enforce compliance norms.

**D.** After major crises, regulatory frameworks are often strengthened.

**E.** Such measures enhance confidence in the financial system.

A) BDCAE B) ADBCE C) ABCDE D) ACBDE E) ABECD

**5. A.** Microfinance institutions provide small loans to individuals lacking access to formal banking.

**B.** These loans help promote entrepreneurship and self-employment.

**C.** High interest rates and over-indebtedness can undermine borrower welfare.

**D.** Therefore, responsible lending practices are crucial in microfinance.

**E.** Microfinance plays a role in financial inclusion and poverty reduction.

A) ABCDE B) BACDE C) ABEDC D) CBADE E) ABECD

**6. A.** Structural reforms aim to improve productivity and long-term growth.

**B.** Such reforms often face resistance due to short-term disruptions.

**C.** Economic reforms include changes in labour laws, taxation, and business regulations.

**D.** Over time, reforms can enhance competitiveness and investment.

**E.** Effective communication helps build public support for reforms.

A) CABDE B) ABDCE C) CEADB D) CBAED E) CBDAE

**7. A.** Increased competition encourages banks to innovate and improve service quality.

**B.** Liberalisation has led to the entry of new private and foreign banks.

**C.** Customers benefit through better products and competitive pricing.

**D.** However, excessive competition may pressure banks' profitability.

**E.** Regulators monitor competition to ensure systemic stability.

A) BCAED B) CBEAD C) BCEDA D) BACDE E) ABCDE

*Scan the QR code for Key*

*Writer: P. Manoj Kumar, Subject Expert*

ప్రభుత్వాలనూ భయపెడుతున్నాయి..
పౌరులనూ భీతావహులను చేస్తున్నాయి..
వాణిజ్య సంస్థలనూ వణికిస్తున్నాయి..
అందరిదీ అదే సమస్య..

తేనీరు నుంచి టేకోవర్ దాకా ఆర్థిక వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. దీంతో అంతర్జాలాన్నే అడ్డాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పెద్ద మొత్తంలో పైకంతో పాటు రహస్యాలనూ దొంగిలిస్తున్నారు. డిజిటల్ భద్రతకు సవాల్ విసురుతున్నారు. వీటి నుంచి రక్షించే నైపుణ్యం ఉన్నవారి కోసం యావత్ ప్రపంచం ఎదురు చూస్తోంది. సుమారు 40 లక్షల మంది సుశిక్షితులైన సైబర్ నిపుణుల కొరత ఉందని నివేదికల సారాంశం. మన దేశానికే 8 లక్షల మంది అవసరమని అంచనా. ఇందులో మీరొకరు కావాలనుకుంటున్నారా?



## మోసాలకు కళ్లెం
# అవకాశాల అస్త్రం

దేశానికి సైనికుల మాదిరి.. డిజిటల్ ప్రపంచానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల సేవలే కీలకం. సమాచారాన్ని పంచుకోవడం నుంచి దేశ వ్యాపార ప్రయోజనాలను చూసుకోవడం వరకూ సైబర్ సెక్యూరిటీపైనే ఆధారపడి ఉంటుంది. టెక్నాలజీ వినియోగం పెరిగే కొద్దీ సైబర్ దాడులూ ఎక్కువవుతున్నాయి. మోసాలకు ఆన్‌లైన్ అత్యుత్తమ వేదికగా నిలుస్తోంది. ప్రభుత్వాలూ, సంస్థలూ, వ్యక్తులకు సైబర్ నేరగాళ్లతో నిరంతర యుద్ధం జరుగుతూనే ఉంటోంది. ఇందులో విజయం మేటి సైబర్ నిపుణులతోనే సాధ్యం.

నిశిత పరిశీలన చేయాలే గానీ.. ప్రతి సంక్షోభం నుంచీ కొత్త కెరియర్ పుట్టుకొస్తుంది. ప్రతి సవాలూ కొత్త ఉద్యోగాలకు వీలు కల్పిస్తుంది. ప్రతి సమస్యా నూతన హోదాలకు బాట వేస్తుంది. కేంద్ర ప్రభుత్వ చొరవ, ప్రోత్సాహం కారణంగా దేశంలో ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటల్ రంగంలోకి మారాయి. వాణిజ్య, పాలనా కార్యకలాపాలు వర్చువల్ రూపు దాల్చాయి. దీంతో నేర స్వరూపంలోనూ మార్పు వచ్చింది. ఊరు వెళితే తాళాలు బద్దలు కొట్టి ఉన్నవన్నీ ఊడ్చుకెళ్లే స్థానంలో అదను చూసి ఎరవేసి బ్యాంక్ అకౌంట్లో ఉన్నదంతా కొల్లగొట్టడమే సైబర్ క్రైమ్. 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 22 లక్షల సైబర్ దాడులు జరిగినట్టు ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ ఒక్క సంవత్సరంలోనే సైబర్ నేరాల ఫలితంగా రూ.22,485 కోట్ల నష్టం వాటిల్లిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎంత అప్రమత్తంగా ఉన్నా సైబర్ చోరీలు ఆగకుండా కొత్త రూపం దాలుస్తున్నాయి. 2022లో 10 లక్షల సైబర్ నేరాలు జరగగా రెండేళ్లలోనే రెట్టింపు కావడం ఇందుకు ఉదాహరణ. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా సైబర్ దాడులకు గురవుతున్న దేశాల్లో భారత్ ముందు వరుసలో నిలిచింది.



**యస్.వి. సురేష్**
సంపాదకుడు,
ఉద్యోగ సోపానం

| సైబర్ నేరాలు | |
|---|---|
| 2022 | 9,56,800 |
| 2023 | 15,56,215 |
| 2024 | 22,00,000 |

### బీటెక్ సైబర్ సెక్యూరిటీ

సైబర్ దాడులు ఇంత వేగంగా పెరుగుతున్నందున ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవడంతో వీటిని ఎదుర్కొనేందుకు కొత్త అభ్యసనా శాస్త్రం రూపుదాల్చింది. అండర్ గ్రాడ్యుయేషన్ కంప్యూటర్ సైన్స్‌లో భాగంగా సైబర్ సెక్యూరిటీ ఒక శాస్త్రంగా అవతరించింది.

✦ ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, ఓటీపీ ఫ్రాడ్, క్రెడిట్, డెబిట్ కార్డుల నకిలీ ప్రొఫైల్స్, నకిలీ ట్రేడింగ్ యాడ్స్, గేమింగ్ యాప్స్, అల్గారిథమ్స్ వశపరచుకోవడం, డేటా చౌర్యం లాంటి సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు బోధించాల్సిన పాఠ్యాంశాలలో స్వల్పకాల సర్టిఫికెట్ కోర్సులూ, డిప్లొమాలూ రూపొందాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలు సైబర్ దాడుల వల్ల ఎక్కువ ప్రభావితం కావడంతో వీటికి సైబర్ సెక్యూరిటీ సేవలు అవసరమయ్యాయి. ఇక్కడే కొత్త కెరియర్ మొగ్గ తొడిగింది.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

### దూసుకెళ్తోంది

సైబర్ నేరాలు శరవేగంగా పెరుగుతున్నందున సైబర్ సెక్యూరిటీ కెరియర్ కూడా దూసుకెళుతోంది. ఒక సర్వే ప్రకారం 2025లో సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలు 40 శాతం పెరిగాయి. ఉద్యోగాల రీత్యా ఇంతటి భారీ పెరుగుదల ఏ రంగంలోనూ మనం చూడలేం. దీనికి తగ్గట్టు మంచి వేతనాలూ అందిస్తున్నారు. తాజా అభ్యర్థులకు రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వార్షిక వేతనం అందిస్తోన్న కెరియర్‌గా సైబర్ సెక్యూరిటీ నిలుస్తోంది. పైగా సైబర్ దాడులకు వివిధ రంగాలు కలవరపడుతున్న వేళ సెక్యూరిటీ నిపుణుల కోసం జల్లెడ వేస్తున్నాయి. అందువల్ల నిపుణుల కొరత ఎదుర్కొంటున్న రంగంగానూ సైబర్ సెక్యూరిటీ యువతను ఆహ్వానిస్తోంది.

### ఎగరేసుకుపోతున్నారు!

సైబర్ నేర ప్రపంచం విస్తరిస్తున్నంత వేగంగా సైబర్ సెక్యూరిటీ నిపుణులు తయారుకాకపోవడంతో దేశంలోని అన్ని రకాల వ్యాపార సంస్థలకూ వీరి అవసరం ఏర్పడింది. తాజా పట్టభద్రుల నుంచి అనుభవం ఉన్న మధ్య, సీనియర్ స్థాయి నిపుణుల వరకూ సంస్థలు అన్వేషిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సెక్యూరిటీ, థ్రెట్ హంటింగ్, జీరో ట్రస్ట్ నైపుణ్యాలు ఉన్న యువతను వెంటనే నియమించుకోవడానికి సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. టెక్ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, యాక్సెంచర్‌లతో పాటు వివిధ ఫైనాన్స్, హెల్త్ కేర్ సంస్థలు సైబర్ సెక్యూరిటీ నిపుణుల కోసం నిరీక్షిస్తున్నాయి.

✦ ఇండియాలో సైబర్ సెక్యూరిటీ మార్కెట్ 15.8 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. ఈ డిమాండ్ ఏటా పెరుగుతూనే ఉంటుందని నిపుణుల అంచనా. దాదాపు దేశాలన్నీ సైబర్ దాడులు ఎదుర్కొంటున్నాయి. కాబట్టి సైబర్ సెక్యూరిటీ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది.

✦ ఈ రంగంలో అవసరాలను లోతుగా అర్థం చేసుకోవడం, తగిన హోదాలను గుర్తించడం, వాటికి అనువైన కోర్సుల ఎంపిక ద్వారా అత్యున్నత డిమాండ్ ఉన్న సైబర్ సెక్యూరిటీ కెరియర్‌లోకి అడుగు పెట్టవచ్చు.

# బీబీఏ, బీబీఎం ఏది బాగు?

**సీఈసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. బీబీఏ లేదా బీబీఎం చేయాలనుంది. ఈ రెండూ ఒకటేనా, మేటి సంస్థలు, ప్రవేశ పరీక్షల వివరాలు తెలపండి? - తేజస్విని**

■ ఇంటర్మీడియట్‌లో సీఈసీ (కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్) గ్రూపు చదువుతున్న విద్యార్థులకు డిగ్రీ స్థాయిలో మేనేజ్‌మెంట్ విద్య ఎంతో అనుకూలం. వ్యాపారం, ఆర్థిక వ్యవస్థ, పరిపాలన లాంటి అంశాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం వల్ల బీబీఏ (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) లేదా బీబీఎం (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులు సహజమైన కొనసాగింపుగా మారతాయి. బీబీఏ, బీబీఎం రెండూ అండర్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ డిగ్రీలే అయినప్పటికీ, వాటిలో స్వల్ప తేడా ఉంటుంది.

● బీబీఏ కోర్సు ప్రధానంగా బిజినెస్ ప్రపంచం మొత్తం ఎలా పనిచేస్తుందో సమగ్రంగా పరిచయం చేస్తుంది. ఇందులో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్, ఆపరేషన్స్, అకౌంటింగ్, బిజినెస్ అనలిటిక్స్ లాంటి అన్ని విభాగాలపైనా ప్రాథమిక అవగాహన కల్పిస్తారు. తరగతులతో పాటు కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌నూ పెంపొందిస్తారు. భవిష్యత్తులో కార్పొరేట్ రంగంలో వివిధ విభాగాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారికీ, ఉన్నత విద్యలో భాగంగా ఎంబీఏ చదవాలనుకున్నవాళ్లకూ బీబీఏ ఒక బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది.

● బీబీఎం కోర్సు మేనేజ్‌మెంట్ సిద్ధాంతాలు, నాయకత్వ లక్షణాలు, వ్యూహాత్మక నిర్ణయాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. ఆర్గనైజేషనల్ బిహేవియర్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ స్టడీస్ లాంటి సబ్జెక్టులు ఇందులో ప్రధానంగా ఉంటాయి. ఒక సంస్థను సమర్థంగా ఎలా నిర్వహించాలి, నిర్ణయాలు ఎలా తీసుకోవాలి, బృందాన్ని ఎలా నడిపించాలి అనే అంశాల్లో లోతైన అవగాహన కల్పించడమే ఈ కోర్సు లక్ష్యం. ఇందులోనూ తరగతులతో పాటు కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ఇండస్ట్రీకి అవసరమైన నైపుణ్యాలను పెంపొందిస్తారు.



● భారతదేశంలో దాదాపు అన్ని సంస్థలూ/ విశ్వ విద్యాలయాల్లోనూ ఈ రెండు కోర్సుల సిలబస్‌లో పెద్దగా తేడా లేదు. ఉద్యోగ అవకాశాలూ సమానంగానే ఉన్నాయి. కాబట్టి ఏది ఎంచుకోవాలి అనే నిర్ణయం పూర్తిగా మీ ఆసక్తి, లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది.

● బీబీఏ/ బీబీఎం కోర్సులు అందించే మంచి కళాశాలలెన్నో ఉన్నాయి. ముఖ్యంగా ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ హైదరాబాద్, క్రైస్ట్ యూనివర్సిటీ బెంగళూరు, సింబయాసిస్ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్, నార్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, అమిటీ, గీతం, కేఎల్ యూనివర్సిటీ ఇవన్నీ మెరుగైన సంస్థలే. వీటిలో నచ్చిన స్పెషలైజేషన్‌తో బీబీఏ/ బీబీఎం చదువుకోవచ్చు.

**ఐఐఎంలు:** ఇండోర్, షిల్లాంగ్, రోహతక్, జమ్మూ, రాంచీ, బోధ్‌గయ, అమృత్‌సర్ వీటిలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. తీవ్ర పోటీ కారణంగా సీటు పొందడం కష్టమే అయినప్పటికీ నిబద్ధత, ప్రణాళికతో ప్రయత్నిస్తే మేటి బోధన కారణంగా అద్భుతమైన ఉపాధి అవకాశాలు సొంతమవుతాయి.

● చాలా బిజినెస్ స్కూళ్లు, కళాశాలలు ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్‌తో ప్రవేశం కల్పిస్తున్నాయి. ప్రముఖ సంస్థల్లో సీటు కోసం ప్రవేశ పరీక్షలో ప్రతిభ తప్పనిసరి. సీయూఈటీ (కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్), సెట్ (సింబయాసిస్), ఎన్‌ప్యాట్ (నార్సీ మోంజీ), ఐపీమ్యాట్ (ఐఐఎం) ముఖ్యమైన పరీక్షలు.

● ప్రవేశ పరీక్షల్లో సాధారణంగా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ లాంటి అంశాలు ఉంటాయి. ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే మంచి బిజినెస్ స్కూల్లో బీబీఏ/బీబీఎంలో సీటు పొందడం పెద్ద కష్టం కాదు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

## వర్క్ ఫ్రమ్ హోమ్

### బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రై.లి.లో

#### 1. ట్యాలెంట్ అక్విజిషన్

నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్, కోఆర్డినేషన్, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంప్లాయి రిలేషన్స్, ఎంప్లాయ్‌మెంట్ ఎంగేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ఇంటర్వ్యూ కోఆర్డినేషన్, ఎంఎస్-ఎక్సెల్, మల్టీటాస్కింగ్, ఆన్‌బోర్డింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమ్ స్క్రీనింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ట్యాలెంట్, టీమ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 14
☛ https://tinyurl.com/35rhm8yc

#### 2. అడ్మిన్ సపోర్ట్

నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, అటెన్షన్ టు డిటెయిల్, కొలాబరేషన్, కస్టమర్ సపోర్ట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీబీఎంఎస్), డేటా ఎంట్రీ, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఎక్సెల్, మల్టీటాస్కింగ్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, ప్రయారిటైజ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిపోర్ట్ రైటింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్, టీమ్‌వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 14
☛ https://tinyurl.com/44d7v7c7

## ఇంటర్న్‌షిప్స్

### ఫేస్‌బుక్ అండ్ ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్ క్రియేటర్

సంస్థ: మెరు టెక్నోసాఫ్ట్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఫేస్‌బుక్ యాడ్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-5,500
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/ye25hu5w

### షాపిఫై డిజైనర్

సంస్థ: ఆర్ట్‌క్లిమ్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, కేన్వా, ఈ-కామర్స్, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వెబ్ డిజైన్
స్టైపెండ్: రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/8whhryun

### హైదరాబాద్‌లో రియాక్ట్‌జేఎస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఆస్క్ ఫస్ట్
నైపుణ్యాలు: ఫ్రేమర్, జావాస్క్రిప్ట్, నెక్స్ట్.జేఎస్, నోడ్.జేఎస్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, రిడక్స్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 14
☛ https://tinyurl.com/m43n3x78

### కస్టమర్ సర్వీస్/కస్టమర్ సపోర్ట్

సంస్థ: లివో రిక్రూట్‌మెంట్ కన్సల్టెంట్ ఎల్‌ఎల్‌పీ
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్‌ఎం), డేటా అనాలిసిస్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, టెక్నికల్ సపోర్ట్
స్టైపెండ్: రూ.14,000-16,000
దరఖాస్తు గడువు: జనవరి 17
☛ https://shorturl.at/7Necx

### డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: అయతనా డిజైన్స్ అండ్ బిల్డింగ్ మార్ట్ ప్రై.లి.
నైపుణ్యాలు: మార్కెటింగ్ అండ్ ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.12,000
దరఖాస్తు గడువు: జనవరి 10
☛ https://tinyurl.com/mrxf5rnu

### కంటెంట్ రైటింగ్

సంస్థ: డెవొరియె
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 15
☛ https://tinyurl.com/2sse25mh

### క్యాడ్ డిజైన్

సంస్థ: హర్షజ్ స్టూడియో
నైపుణ్యాలు: ఆటోక్యాడ్, ఆటోడెస్క్ ఫ్యూషన్ 360, బ్లెండర్ 3డీ, కాటియా, రైనో
స్టైపెండ్: రూ.13,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 31
☛ https://shorturl.at/nA7Oz

## బీఈఎల్‌లో..

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, నవీ ముంబయి ఒప్పంద ప్రాతిపదికన ట్రెయినీ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● ట్రెయినీ ఇంజినీర్-1 (మెకానికల్): 04
● ప్రాజెక్ట్ ఇంజినీర్-1: 02
**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(మెకానికల్), బీఎస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
**వయసు:** 1-12-2025 నాటికి 28 - 32 ఏళ్లు ఉండాలి. ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **వేతన శ్రేణి:** నెలకు ట్రెయినీ ఇంజినీర్‌కు రూ.30,000 - రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు రూ.40,000 - రూ.55,000.
**దరఖాస్తు ఫీజు:** పోస్టులను అనుసరించి రూ.150 నుంచి 400+జీఎస్టీ. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్‌ఎంలకు ఫీజు లేదు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 6.
**ఎంపిక:** రాత పరీక్ష (సీబీటీ)/ ఇంటర్వ్యూలతో.
**వెబ్‌సైట్:** https://bel-india.in/job-notifications/

## యంగ్ ప్రొఫెషనల్స్

ఐటీఐ లిమిటెడ్, బెంగళూరు.. పలు విభాగాల్లో యంగ్ ప్రొఫెషనల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● యంగ్ ప్రొఫెషనల్: 215
**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, బీఈ, ఎంబీఏ, పీజీ, డిప్లొమా, ఐటీఐతో పాటు పని అనుభవం ఉండాలి.
**వయసు:** 35 నుంచి 45 ఏళ్లు ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 12.
**ఎంపిక:** స్కిల్‌టెస్టుతో.
**వెబ్‌సైట్:** https://itiltd.in/careers.php?lan=en

## అసిస్టెంట్ ఇంజినీర్లు

ది బ్రేత్ వేట్ బర్న్ అండ్ జేసప్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, కోల్‌కతా...ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
● అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్): 16
● అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్): 02
● అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్): 02
● అసిస్టెంట్ ఆఫీసర్: 01
**అర్హత:** సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఈ/ బీటెక్/ ఎంబీఏ/ పీజీడీబీఎంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
**వయసు:** జనవరి 1, 2026 నాటికి 30 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు రూ.30,000.
**దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా bbjhrm@bbjconst.com కు పంపాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** 10.01.2026.
**ఎంపిక:** ఇంటర్వ్యూతో.
**వెబ్‌సైట్:** https://www.bbjconst.com/careers.html



# ఐఓసీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో ఒకటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్).. 394 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. డిప్లొమా, డిగ్రీలతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్ష, స్కిల్/ ప్రొఫిషియన్సీ/ ఫిజికల్ టెస్టులతో నియామకాలు ఉంటాయి.

**పోస్టు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ (జేఈఏ)-(ప్రొడక్షన్)
**ఖాళీలు:** 232
**అర్హత:** కెమికల్ ఇంజినీరింగ్/ కెమికల్ టెక్నాలజీ/ కెమికల్ టెక్నాలజీ (ఫెర్టిలైజర్/ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో డిప్లొమా లేదా బీఎస్సీ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ)

**పోస్టు:** జేఈఏ(పీఅండ్‌యూ)
**ఖాళీలు:** 37
**అర్హత:** మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీఎస్సీ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ) సెకండ్ క్లాస్ బాయిలర్ కాంపిటెన్సీ సర్టిఫికెట్ (బీసీసీ)/ బాయిలర్ అటెండెంట్‌లో నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి.

**పోస్టు:** జేఈఏ(పీ అండ్‌యూ-ఓఅండ్‌ఎం)
**ఖాళీలు:** 22
**అర్హత:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్/ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (ఇండస్ట్రియల్ కంట్రోల్) బ్రాంచ్‌తో డిప్లొమా.

**పోస్టు:** ఫైర్ అండ్ సేఫ్టీ
**ఖాళీలు:** 51
**అర్హత:** ఇంటర్మీడియట్, ఫైర్ సబ్-ఆఫీసర్స్ కోర్సు సర్టిఫికెట్, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఎత్తు 165 సెం.మీ. (ఎస్టీలకు 5 సెం.మీ. మినహాయింపు), ఛాతీ 81-86 సెం.మీ., బరువు 50 కేజీల ఉండాలి.

**పోస్టు:** జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్
**ఖాళీలు:** 20.
**అర్హత:** బీఎస్సీ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ).
✦ విద్యార్హతల డిప్లొమా, డిగ్రీలను జనరల్ అభ్యర్థులు 50 శాతంతో, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 45 శాతంతో పూర్తిచేయాలి.

### పరీక్ష ఇలా

ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో 100 మార్కులకు ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు. వ్యవధి 120 నిమిషాలు.

❖ ప్రశ్నపత్రంలో మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఏలో సబ్జెక్టు నాలెడ్జ్‌కు 75 మార్కులు, సెక్షన్-బీలో న్యూమరికల్ ఎబిలిటీకి 15 మార్కులు, సెక్షన్-సీలో జనరల్ అవేర్‌నెస్‌కు 10 మార్కులు కేటాయించారు.

❖ ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది. సీబీటీ తేదీ, పరీక్ష కేంద్రాల సమాచారాన్ని ఈ-మెయిల్‌కు తెలియజేస్తారు. సంస్థ వెబ్‌సైట్‌లోనూ వివరాలు ప్రకటిస్తారు.

❖ సీబీటీలో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 35 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. వీరిని పోస్టుకు ఇద్దరిని చొప్పున స్కిల్/ ప్రొఫిషియన్సీ/ ఫిజికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇందులోనూ విజయవంతమైతే ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

### సన్నద్ధత

సబ్జెక్టు పరిజ్ఞానానికే ఎక్కువ మార్కులు కేటాయించారు. సబ్జెక్టు సంబంధిత ముఖ్యాంశాల అధ్యయనం, పునశ్చరణ చేయాలి.

❖ న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్‌పై అవగాహన కోసం పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

❖ వ్యవధిలోగా సమాధానాలు గుర్తించడమూ ముఖ్యమే. సమయ నిర్వహణపై పట్టు సాధించడం కోసం మాక్ టెస్టులు రాయడం ఉపయోగపడుతుంది.

❖ రుణాత్మక మార్కులు లేవు కాబట్టి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయొచ్చు. ముందుగా తెలిసినవీ, ఆ తర్వాత తెలియనివీ ప్రయత్నించవచ్చు.

### వివరాలు

**వయసు:** 31.12.2025 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.
**దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.300. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.
**వేతన శ్రేణి:** నెలకు రూ.25,000-1,05,000. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ప్రొడక్టివిటీ, పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్‌లు, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, పీఎఫ్, ఎల్‌టీసీ, హౌస్ బిల్డింగ్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సులు.. మొదలైన సదుపాయాలు ఉంటాయి.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.01.2026
**వెబ్‌సైట్:** https://www.iocl.com/

చదువు

కెరియర్, ఉన్నత విద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.


మా చిరునామా:
**చదువు,** ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512
edc@eenadu.in

## ఉన్నావ్ అత్యాచార నిందితుడి శిక్ష నిలిపివేత

- కుల్దీప్ సింగ్‌కు బెయిల్ మంజూరుచేసిన దిల్లీ హైకోర్టు



దిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో దిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో దోషిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తున్న భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్ శిక్షను నిలిపివేస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది. అంతేకాదు షరతులపై బెయిల్‌ను కూడా మంజూరు చేసింది. ఉన్నావ్ అత్యాచార కేసులో తనను దోషిగా నిర్ధారించిన 2019 ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సెంగర్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్ పెండింగులో ఉండటంతో దీనిపై తీర్పు వెలువడేంత వరకూ సెంగర్ శిక్షను సస్పెండ్ చేస్తున్నట్లు జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. బెయిల్ కోసం రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలంది. నిందితుడు బాధితురాలి ఇంటి పరిధిలోకి వెళ్లకూడదని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులకు పాల్పడవద్దని ఆదేశించింది. ఈ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని తెలిపింది. పిటిషన్ విచారణలో అతడు దోషిగా తేలితే పూర్తి శిక్షను అనుభవించాల్సి ఉంటుందని తెలిపింది. 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీకి బదిలీ చేశారు. అనంతరం బాధితురాలి తండ్రి కస్టడీ మరణం కేసులోనూ సెంగర్ దోషిగా తేలడంతో పలు కేసుల్లో అతడికి జీవిత ఖైదు విధించారు.

## యెమెన్ అంతర్యుద్ధ బందీల విడుదలకు ఒప్పందం

కైరో: యెమెన్‌లో గడచిన 11 సంవత్సరాలుగా సాగుతున్న అంతర్యుద్ధంలో భాగంగా నిర్బంధించిన 2,900 మంది ఖైదీలను విడుదల చేసేలా అక్కడి ప్రభుత్వానికి, హూతీ తిరుగుబాటుదారులకు మధ్య అంగీకారం కుదిరింది. యెమెన్‌లో నియుక్తుడైన ఐక్యరాజ్యసమితి ప్రత్యేక రాయబారితో పాటు రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ అంగీకారం కుదిరిందని సౌదీ రాయబారి మహమ్మద్ అల్ జబీర్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. విడుదల కానున్న బందీలలో సౌదీ అరేబియా, సూడాన్ దేశానికి చెందిన పౌరులూ ఉన్నారని హూతీల నాయకుడు అబ్దెల్‌ఖాదర్ అల్ ముర్తదా వెల్లడించారు. ఒమన్ రాజధాని మస్కట్‌లో ఈ ఒప్పందం కుదిరింది. హూతీలకు, యెమెన్ ప్రభుత్వానికి మధ్య ఇంత పెద్ద స్థాయిలో బందీల విడుదల ఒప్పందం కుదరడం ఇదే ప్రథమమని ముర్తదా తెలిపారు.

## పాలస్తీనీయుడి ఇంటిపై ఇజ్రాయెలీల దాడి

జెరూసలెం: ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయెలీ సెటిలర్లు స్థానిక పాలస్తీనీయుని ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. పిల్లలపై బాష్పవాయువు ప్రయోగించడంతోపాటు పలు గొర్రెల్ని హతమార్చారు. యూదు సెటిలర్‌లు పాలస్తీనీయులపై దాడికి పాల్పడటం ఈ ప్రాంతంలో సర్వసాధారణమైందని స్థానికులు వాపోయారు. తాజా ఘటనకు సంబంధించి ఐదుగురు సెటిలర్లను అరెస్టు చేశామని ఇజ్రాయెలీ పోలీసులు తెలిపారు. నిందితులు బాధితుడి ఇంటి తలుపులు, కిటికీలను ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న పిల్లలపై బాష్పవాయువు ప్రయోగించడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. సెటిలర్లు ఇంటి పశువుల పాకలోకి చొరబడి మూడు గొర్రెల్ని చంపేయడంతోపాటు నాలుగింటిని గాయపరిచారు.

## నీట్, జేఈఈలలో ముఖ గుర్తింపు విధానం!



దిల్లీ: వచ్చే సంవత్సరం నీట్, జేఈఈ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షల్లో ముఖ గుర్తింపు విధానాన్ని ప్రవేశపెట్టాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) యోచిస్తోంది. పరీక్షకు దరఖాస్తు చేసే సమయంలో అభ్యర్థులే లైవ్ ఫొటోగ్రాఫ్ తీసుకునే ఆప్షన్‌ను కూడా ప్రవేశ పెట్టేందుకు ఏజెన్సీ చర్యలు తీసుకుంటోంది. "నీట్ - 2025 సందర్భంగా యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఆధార్ సాయంతో ముఖాన్ని గుర్తించే పద్ధతిని పరీక్షించింది" అని అధికార వర్గాలు తెలిపాయి. "దిల్లీలోని కొన్ని పరీక్షా కేంద్రాల్లో పీఏసీ ఆధార్ సాయంతో అభ్యర్థుల ముఖ గుర్తింపు చేపట్టారు. ఎన్ఐసీ డిజిటల్ మౌలిక సదుపాయాలకు దీన్ని అనుసంధానించారు" అని ఆ వర్గాలు వివరించాయి. వచ్చే సంవత్సరం నుంచి అన్ని ప్రధాన పరీక్షల్లో ఈ పద్ధతిని ఉపయోగించనున్నారని తెలిపారు.

## పట్టుబడిన మాదక ద్రవ్యాల స్మగ్లర్

- దుబాయ్ నుంచి భారత్‌కు తరలింపు

దిల్లీ: కోట్ల రూపాయల మాదక ద్రవ్యాలను పట్టుకున్న కేసుకు సంబంధించి కేంద్ర హోంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖలు సమన్వయంతో పనిచేసి ఒక స్మగ్లర్‌ను యూఏఈ నుంచి భారత్‌కు రప్పించగలిగాయి. గత సంవత్సరం 1,289 కేజీల కొకైన్, మెఫెడ్రోన్ మాదక ద్రవ్యాలు, 40 కేజీల థాయ్ గంజాయి పట్టుబడిన కేసులో నిందితుడైన రితిక్ బజాజ్ (36) అధికారుల చేతికి చిక్కకుండా విదేశాలకు పారిపోయాడు. అతని కోసం ఇంటర్‌పోల్ సంస్థ అక్టోబరు 9న రెడ్ అలర్ట్ నోటీసు జారీ చేసింది. 2024 అక్టోబరు 2న ఎఫ్ఐఆర్ నమోదైంది. తప్పించుకు తిరుగుతున్న రితిక్ బజాజ్‌ను కోర్టు ఈ సంవత్సరం మే 19న నేరగాడుగా ప్రకటించింది. రెడ్ అలర్ట్ నోటీసు జారీ చేసిన నాటినుంచీ ప్రపంచ వ్యాప్తంగా విచారణ సంస్థలు అప్రమత్తమై నిందితుని కదలికలపై నిఘా ఉంచాయి. నిందితుడు యూఏఈ దిశగా పయనిస్తున్నాడని సీబీఐకి బ్యాంకాక్ ఉప్పందించింది. రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఇంటర్‌పోల్ అధికారులు నిందితుణ్ని దుబాయ్‌లో నిర్బంధించారని దిల్లీ పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దుబాయ్ వెళ్లిన ఒక ప్రత్యేక బృందం మంగళవారం నిందితుణ్ని భారత్‌కు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకూ 17 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్టు వారు వివరించారు.

# సంగీతానికి గాయం!

- ఢాకాలోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రం ధ్వంసం
- పేరు మార్చుకుని బతికిపోయామన్న తబలా విద్వాంసుడు బిశ్వాస్
- ఢాకాలో 48 గంటల నరకం తర్వాత బంగ్లాదేశ్ నుంచి భారత్ చేరిక

కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని మైనక్ బిశ్వాస్ అనే తబలా విద్వాంసుడు వెల్లడించారు. ఆ దేశంలో చిక్కుకుపోయిన తాను 48 గంటల నరకాన్ని అనుభవించానని, పేరు మార్చుకుని బతికిపోయానని వివరించారు. ఢాకాలోని భారత్ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్న ప్రాంతంలో చిక్కుకున్న తాను ఎలాగోలా అక్కడి నుంచి బయటపడ్డానని తెలిపారు. ఢాకాలోని ధన్‌మోండీ ప్రాంతంలో ఛాయానౌత్ పేరుతో ప్రముఖ సరోద్ విద్వాంసుడైన సిరాజ్ అలీ ఖాన్ కార్యక్రమం ఏర్పాటైంది. అయితే ఆందోళనకారులు ఆ కార్యక్రమ వేదికను ధ్వంసం చేశారు. దీంతో ఆయన కార్యక్రమం రద్దయింది. ఆయన ఎలాగోలా తప్పించుకుని శనివారం కోల్‌కతాకు చేరుకున్నారు. ఖాన్ తల్లి ఆయేషా, ఆయన బృందంతోపాటు బిశ్వాస్ ఢాకాలో చిక్కుకుపోయారు. అల్లర్ల కారణంగా వారిని సోమవారం నాటికి భారత్ వెనక్కి తీసుకు రాగలిగింది. ఈ 48 గంటల్లో అత్యంత భయానక పరిస్థితులను వారు ఎదుర్కొన్నారు.



ధ్వంసమైన ఛాయానౌత్‌లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

### ఎన్నోసార్లు వెళ్లా.. కానీ!

'నేను బంగ్లాదేశ్‌కు ఎన్నోసార్లు వెళ్లా. కానీ ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ ఎదుర్కోలేదు. స్థానికుల మధ్య శత్రుత్వం తీవ్రంగా పెరిగింది. భయాందోళనల కారణంగా ఎక్కువ సమయం నేను హోటల్లోనే ఉన్నా. 18, 19 తేదీల్లో హింస చెలరేగడంతో లాబీలోకీ రానీయలేదు. అత్యవసర పనిమీద బయటకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో నా భారతీయ గుర్తింపును రహస్యంగా ఉంచాల్సి వచ్చింది. నా పేరును ముస్లిం శబ్దం వచ్చేలా మార్చుకున్నా. ఖాన్ సహాయకుడు పల్లబ్ ఘోష్‌సహా మిగతా సిబ్బంది అంతా సోమవారం ఉదయమే క్యాబ్ బుక్ చేసుకుని ఢాకా విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయ లాంజ్‌లో చాలా గంటలపాటు వారు వేచి ఉండాల్సి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు వారి విమానం బయలుదేరింది' అని బిశ్వాస్ వివరించారు.

### మానసిక ఒత్తిడికి గురయ్యాం

'ఢాకా వీధుల్లో అల్లర్లు రోజూ జరుగుతుండటంతో మేం ఏ మాత్రం రిస్కు తీసుకోలేదు. 18వ తేదీ నుంచి 19వ తేదీ ఉదయం విమానాశ్రయంలో అడుగుపెట్టే దాకా మానసిక వ్యథను అనుభవించాం. విమానాశ్రయానికి వచ్చే దారిలో నా తబలా గురించి తీవ్రంగా ఆందోళన చెందా. దానిని ధ్వంసం చేస్తారని భయపడ్డా. అదృష్టవశాత్తూ దారిలో మేం ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కోలేదు. కోల్‌కతాలో నా తబలాను తీసుకున్నాక ప్రశాంతంగా అనిపించింది' అని బిశ్వాస్ తెలిపారు.

### 1960 నాటి ఛాయానౌత్ ధ్వంసం

ఢాకాలోని సాంస్కృతిక కేంద్రం ఛాయానౌత్‌ను 1960లో నిర్మించారు. ఇంక్విలాబ్ మంచా అధికార ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో శుక్రవారం తెల్లవారుజామున అల్లరిమూక దానిని ధ్వంసం చేసింది. తబలా, హార్మోనియం వంటి పలు సంగీత పరికరాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఛాయానౌత్‌లో కచేరీ చేయాల్సిన సిరాజ్ అలీ ఖాన్ మూలాలు బంగ్లాదేశ్‌లోని బ్రహ్మన్‌బెరియాలో ఉన్నాయి. కోల్‌కతాలో ఉంటున్న ఆయన ఢాకాలో కచేరీ కోసం ఈ నెల 16వ తేదీన బంగ్లాదేశ్ వెళ్లారు. అక్కడి హోటల్‌లో వారు సాధన చేస్తుండగా.. ఛాయానౌత్‌పై దాడి జరిగినట్లు సమాచారం వచ్చింది. దీంతో తన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని శనివారమే ఖాన్ కోల్‌కతాకు వచ్చారు. కానీ ఆయన బృందం 22వ తేదీ వరకూ అక్కడే చిక్కుకుపోయింది. చివరకు వారు సోమవారం కోల్‌కతా చేరుకున్నారు.

### ఏమీ మాట్లాడకుండా ఉన్నందువల్లే..

'నేను ఏమీ మాట్లాడకుండా ఉండటంవల్లే ఢాకా వీధుల్లో దాడులకు గురికాకుండా తప్పించుకోగలిగా. అక్కడి ప్రజల్లో భారత్ వ్యతిరేక సెంటిమెంట్ స్పష్టంగా కనిపించింది. వారు నేరుగా నా ముందు వ్యక్తం చేయకపోయినా పరిస్థితి అర్థమైంది. భాష యాసను బట్టి భారతీయులని స్థానికులు గుర్తిస్తారనే భయంతో నోళ్లు మూసుకుని ఉన్నాం. హోటల్‌వద్ద క్యాబ్‌లను బుక్ చేసుకునేటప్పుడు పేర్లు మార్చుకున్నాం. దీనికి హోటల్ వ్యక్తి సహాయం చేశారు' అని బిశ్వాస్ వివరించారు.

### చక్కబడ్డాక మళ్లీ వెళ్తా..

'పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. బంగ్లాదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాక మళ్లీ వెళ్తా. మా మాండలికాలు వేర్వేరుగా ఉండొచ్చు. కానీ ఒకే భాష మాట్లాడతాం. మేం వారికి శత్రువులం కాదు' అని బిశ్వాస్ పేర్కొన్నారు.



ఆగ్రాలోని తాజ్‌మహల్ ఆవరణలో కమ్మేసిన పొగమంచు

# వెయ్యిమంది వంటవాళ్లు.. 30 వేల మంది అతిథులు

- మధ్యప్రదేశ్‌లో భారీగా పెళ్లివిందు





విందుకు సిద్ధమైన వంటకాలు

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని సాంచీ ఎమ్మెల్యే ప్రభు రామ్ చౌధరీ పెద్ద కుమారుడు పర్వ్ చౌధరీ వివాహ విందుకు వెయ్యిమంది వంటవాళ్లు పనిచేయగా వివిధ రంగాలకు చెందిన దాదాపు 30 వేల మంది హాజరయ్యారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ చిన్న కుమారుడు డాక్టర్ అభిమన్యు తన స్నేహితురాలైన డాక్టర్ ఇషితా పటేల్‌ను ఆదివారం ఉజ్జయినిలో వివాహం చేసుకున్నారు. ఎలాంటి బహుమతులు, హంగూ, ఆర్భాటాలు లేకుండా మరో 21 పెళ్లిళ్లతో కలిపి తంతు ముగించడం అందరి దృష్టిని ఆకర్షించింది. దానికి పూర్తిభిన్నంగా ఈ విందు ఉండటం చర్చనీయాంశమైంది. దీని కోసం రాయ్‌సెన్‌లో ఎనిమిది ఎకరాల్లో వేదిక ఏర్పాటు చేశారు. కేంద్రమంత్రులు- జ్యోతిరాదిత్య సింధియా, శివరాజ్ సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా తదితరులు దీనిలో పాల్గొన్నారు. వీరికోసం దేశ, విదేశ వంటకాలను సిద్ధం చేశారు. రాజస్థాన్ నుంచి కళాకారులు వచ్చి సంప్రదాయ సంగీతాన్ని వినిపించారు. రాయ్‌సెన్‌లో ఈ స్థాయి వేడుక ఎన్నడూ జరగలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిజానికి పర్వ్ చౌధరీ పెళ్లి భోపాల్‌లో చాలా నిరాడంబరంగా చేశారు. రిసెప్షన్ కోసం మాత్రం 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెంట్ వేశారు. వేదిక చుట్టూ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆ మైదానం ఒక చిన్న టౌన్‌షిప్‌లా అనిపించింది. ఖర్చు ఎంతనేది తెలియాల్సి ఉంది.

# ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు

- విధానాల రూపకల్పనకు సలహా కమిటీ
- తెలంగాణవాసి వైజయంతికి చోటు

ఈనాడు, దిల్లీ: ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు విద్య, ఉద్యోగాలు, ఇతర విషయాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు విధాన రూపకల్పన చేయాలంటూ సుప్రీంకోర్టు అక్టోబరు 17న జారీచేసిన తీర్పు మేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆశామేనన్ ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో కూడిన సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన ట్రాన్స్‌జెండర్ హక్కుల పోరాట కార్యకర్త వైజయంతి వసంత మోగ్లీకి స్థానం కల్పించింది. అలాగే కర్ణాటకకు చెందిన అక్కై పద్మశాలి, గ్రేస్‌బాను, జిందాల్ గ్లోబల్ లా స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ సౌరవ్ మండల్, సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రీసెర్చ్ సీనియర్ రీసెర్చ్ అసోసియేట్ నిత్యారాజశేఖర్, అసోసియేషన్ ఫర్ ట్రాన్స్‌జెండర్ హెల్త్ ఇన్ ఇండియా సీఈఓ డాక్టర్ సంజయ్ శర్మ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. సీనియర్ న్యాయవాది జైనా కోఠారి అమికస్‌క్యూరీగా వ్యవహరిస్తారు. సామాజిక న్యాయం, సాధికారశాఖ సంయుక్త కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కేంద్ర మహిళా, శిశుసంక్షేమం, వైద్యఆరోగ్యం, విద్య, కార్మిక, ఉపాధికల్పన, సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ, న్యాయం, సామాజిక న్యాయం, సాధికార శాఖల కార్యదర్శులను ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమించారు. విద్య, ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్‌లకు సమాన అవకాశాలు కల్పించడంపై ఈ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సమాజంలోని అన్నివర్గాలతో సంప్రదింపులు జరిపి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. నివేదికను అన్ని వ్యవస్థలూ స్వీకరించాల్సి ఉంటుంది. మొత్తం 10 అంశాలపై అధ్యయనం చేసి ఆరునెలల్లోపు కమిటీ ఒక సమగ్ర నివేదికను కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖకు అందిస్తుంది.

## ముర్షిదాబాద్ అల్లర్ల ఘటన.. 13 మందికి జీవిత ఖైదు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి తండ్రిని, కుమారుడిని కొట్టి చంపిన ఘటనలో స్థానిక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మూకదాడికి పాల్పడిన 13 మందికి జీవిత ఖైదును విధించింది. జంగిపుర్‌లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు రాష్ట్రంలోనే తొలిసారిగా ఇలాంటి శిక్షలు వేసింది. దోపిడీ నేరంపై 10 ఏళ్లు, ఇంట్లోకి చొరబడినందుకు 10 సంవత్సరాలు, అల్లర్లకు పాల్పడినందుకు ఐదేళ్ల జైలుశిక్ష కూడా దోషులకు విధించింది. అన్ని శిక్షలూ ఏకకాలంలో అమలవుతాయని పేర్కొంది. ఈ తీర్పుపై కలకత్తా హైకోర్టులో అప్పీలు చేసుకోవాలా వద్దా? అని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివాస్ చటర్జీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 12న వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఘర్షణల్లో జఫ్రాబాద్‌లోని హరగోవింద (72), ఆయన కుమారుడు చందన్ దాస్ (42)లపై ఓ అల్లరిమూక.. దాడిచేసి కొట్టి చంపిన విషయం తెలిసిందే.

## సమాచార వక్రీకరణను అడ్డుకునేందుకు కేంద్రం కసరత్తు

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి దృశ్య శ్రవణ సమాచారానికి చేసిన మార్పులేవో స్పష్టంగా ప్రకటించేట్లు ఐటీ నిబంధనలను సవరించాలని అక్టోబరులో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించింది. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టే విషయంలో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలపై మరింత బాధ్యత మోపాలని నిశ్చయించింది. వీటి గురించి సమాచార సాంకేతిక (ఐటీ) పరిశ్రమతో సంప్రదింపులు పూర్తిచేశామనీ, సవరించిన నిబంధనలను త్వరలో విడుదల చేస్తామని కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు. ఏఐ కంటెంట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరాన్ని ఐటీ పరిశ్రమ గుర్తించిందనీ, కంటెంట్‌కు ఎంతవరకు మార్పులు చేయవచ్చనేదానిపై స్పష్టత ఉండాలని మాత్రం కోరిందని ఆయన వివరించారు. దృశ్యశ్రవణ సమాచారానికి సాధారణ సాంకేతికతలతో మెరుగులు దిద్దడానికి, ఏఐని ఉపయోగించి మార్పుచేర్పులు చేయడానికి మధ్యనున్న తేడాను గమనించాలనీ ఐటీ పరిశ్రమ కోరినట్లు కృష్ణన్ వివరించారు. దీంతో ఎలాంటి మార్పులను ఎంతవరకు ఆమోదించాలనే విషయమై ఇతర మంత్రిత్వ శాఖలతో సంప్రదిస్తున్నామనీ, ఆ తరవాత కొద్దిరోజుల్లోనే సవరించిన నిబంధనలతో ముందుకొస్తామని చెప్పారు.

## సిక్కింలో రబ్బరు పడవ బోల్తా

- జవాను మృతి

గ్యాంగ్‌టక్: సిక్కింలోని పాక్యోంగ్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తీస్తా నదిలో సైనిక శిక్షణ సమయంలో ఓ జవాను ప్రయాణిస్తున్న రబ్బరు పడవ (రాఫ్ట్) బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 191 ఆర్టిలరీ రెజిమెంటుకు చెందిన లాన్స్ నాయక్ రాజశేఖర్ ప్రాణాలు కోల్పోయినట్లు మంగళవారం పోలీసులు వెల్లడించారు. సోమవారం వార్షిక రాఫ్టింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సమయంలో రాజశేఖర్ ప్రయాణిస్తున్న రబ్బరు పడవ.. దెబ్బతిన్న ఓ వంతెన నిర్మాణాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆయన నదిలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న సహాయ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పశ్చిమ బెంగాల్‌లోని కలిమ్‌పోంగ్ జిల్లా తార్‌ఖోలా వద్ద నది దిగువ ప్రాంతంలో అతని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.



జమ్మూకశ్మీర్‌లోని గుల్‌మార్గ్ స్కీ రిసార్ట్ మంచులో పర్యాటకుల సందడి



జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఆకట్టుకుంటున్న భారీ క్రిస్మస్ చెట్టు



రష్యా దాడి అనంతరం ఉక్రెయిన్‌లోని కీవ్‌లో ఓ భవనంలో ఎగసిపడుతున్న మంటలు

## రష్యా క్షిపణుల వర్షం.. ముగ్గురి మృతి

కీవ్: ఉక్రెయిన్‌పై దాడుల్ని రష్యా మరింత ముమ్మరం చేసింది. మంగళవారం తెల్లవారుజామున 650 డ్రోన్‌లను, దాదాపు 40 క్షిపణులను ఉక్రెయిన్‌పై ప్రయోగించింది. ఈ దాడిలో నాలుగేళ్ల బాలునితో సహా ముగ్గురు మరణించారు. ఉక్రెయిన్‌లోని 13 ప్రాంతాల్లో జనావాసాలు, విద్యుత్ గ్రిడ్‌లపై ఈ దాడి జరిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అతిశీతల వాతావరణం నెలకొన్న ఉక్రెయిన్‌లో ప్రజలు చలికి గజగజలాడారని దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. మరోవైపు ఉక్రెయిన్ రష్యాల మధ్య శాంతి ఒప్పందం కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలకు సానుకూల స్పందన లభించింది. ఈ ప్రతిపాదనలు తమ డిమాండ్లను చాలా వరకూ పూర్తిచేసేలా ఉన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ పేర్కొన్నారు. శాంతి చర్చల్లో ఇరు పక్షాలకూ కోరినవన్నీ లభించే అవకాశం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మొత్తం మీద సానుకూలంగా ఉన్నాయని ఉక్రెయిన్ నేత అమెరికా ఆధ్వర్యంలో జరిగిన శాంతి చర్చలపై వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్‌లతో తాము నిర్వహించిన చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ వెల్లడించారు.

## 'ప్రజా భాగస్వామ్యం' జాతీయ భద్రతకు మూలస్తంభం: ద్రౌపదీ ముర్ము



దిల్లీ: సమాజ భాగస్వామ్యం జాతీయ భద్రతను బలపరుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. ప్రజలు తమ చుట్టూ ఏం జరుగుతుందో నిష్క్రియాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం లేదని.. అయితే, తమ సొంత పరిసరాలు, దాని వెలుపల ఉన్న ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'జన్ భాగీదారి(ప్రజా భాగస్వామ్యం)' ప్రజా-కేంద్రీకృత భద్రతకు మూలస్తంభమని ఆమె పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'ప్రజా-కేంద్రీకృత జాతీయ భద్రత, వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజ భాగస్వామ్యం' అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సామాజిక మాధ్యమం సమాచార, కమ్యూనికేషన్ ప్రపంచాన్ని మార్చివేసిందని పేర్కొన్నారు. 'తప్పుడు వార్తల నుంచి ప్రజలను రక్షించడం చాలా సవాలుతో కూడిన పని. ఈ చర్యను నిరంతరం, చాలా ప్రభావవంతంగా కొనసాగించాలి. దేశానికి ఉపయోగపడే నిజమైన సమాచారాన్ని అందించే క్రియాశీల వినియోగదారులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని ఆమె అభిప్రాయపడ్డారు.

## ఏటా 16 వేల కొత్త జీవజాతుల గుర్తింపు

దిల్లీ: శాస్త్రవేత్తలు గతంలో ఎన్నడూ లేనంత వేగంగా కొత్త జీవజాతుల్ని కనుగొంటున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. ఏటా 16 వేల కొత్త జీవజాతులు కనుగొంటున్నారని, ఇది వాటి సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు పేర్కొంటున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాకు చెందిన పరిశోధకులు 20 లక్షల జీవ జాతులను వర్గీకరించారు. ఈ వర్గీకరణలో జంతు, వృక్ష సంతతికి చెందిన అన్ని రకాల జీవులకూ స్థానం కల్పించారు. 2015-20 మధ్య కాలంలో ఏటా 16 వేల కొత్త జీవజాతులు నమోదయ్యాయని, ఇందులో 10 వేల జంతు జాతులు, 2,500 వృక్ష జాతులు, 2 వేల శిలీంధ్ర రకాలు ఉన్నాయి. వైజ్ఞానికంగా నిర్వచించని జీవజాతుల్ని పరిరక్షించడం సాధ్యం కాదని యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాలో ఎకాలజీ విభాగానికి చెందిన జాన్ వియెన్స్ పేర్కొన్నారు. జీవజాతుల వర్గీకరణ, నమోదు.. వాటి సంరక్షణకు ఎంతో ముఖ్యమని వియెన్స్ తెలిపారు. 'ఉందో లేదో తెలియని జీవజాతిని సంరక్షించడం సాధ్యం కాదు. ప్రస్తుతం కొత్త జీవజాతుల్ని వాటి ప్రత్యక్ష గుణగణాల ఆధారంగా వర్గీకరిస్తున్నాం. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందే కొద్దీ ఆయా జాతుల్ని వాటి జన్యు నిర్మాణం ఆధారంగా గుర్తించే పరిస్థితి వస్తుంది. ఇది మరింత విలక్షణమైన రీతిలో బ్యాక్టీరియా, శిలీంధ్ర జాతుల్ని గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అని చెప్పారు.

## అలా చేయడం నిర్బంధించడం కాదు

- కుక్కలకు ఆహార వివాదంపై బాంబే హైకోర్టు

ముంబయి: అనుమతిలేని ప్రదేశాల్లో కుక్కలకు ఆహారం పెట్టకుండా ఎవరినైనా నిరోధించడం భారతీయ న్యాయ సంహిత ప్రకారం నేరపూరిత నిర్బంధం కాబోదని బాంబే హైకోర్టు పేర్కొంది. ఒక హౌసింగ్ సొసైటీ ప్రవేశద్వారం వద్ద వీధి కుక్కలకు ఆహారం పెట్టకుండా తమను నిరోధించిన వ్యక్తిపై ఓ మహిళ, ఆమె మిత్రులు క్రిమినల్ కేసు దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేస్తూ జస్టిస్ రేవతీ మోహితే డేరే, జస్టిస్ సందేశ్ పాటిల్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈనెల 18న వెలువరించిన తీర్పు ప్రతులను న్యాయస్థానం మంగళవారం విడుదల చేసింది. ఫుట్‌పాత్‌లపైన, హౌసింగ్ సొసైటీ ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద, పిల్లలు గుమిగూడే స్కూల్ బస్టాపుల వద్ద వీధికుక్కలకు ఆహారం పెట్టడాన్ని నిరోధించడాన్ని నేరపూరిత అవరోధం కల్పించడంగా పరిగణించలేమని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. ఇది ఆహారం పెట్టే స్థలం కాదని నిందితుడు ఆ మహిళకు తెలియజెప్పిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

## హిజ్బుల్ నేత కుమారుల అప్పీలు కొట్టివేత

దిల్లీ: ఉగ్ర కార్యకలాపాలకు నిధుల బదలాయింపు కేసులో తమపై అభియోగాలు మోపడాన్ని సవాలు చేస్తూ హిజ్బుల్ ముజాహిదీన్ అధినేత సయ్యద్ సలాహుద్దీన్ కుమారులిద్దరు దాఖలు చేసిన అప్పీలును దిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. జస్టిస్ వివేక్ చౌదరి, మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. 2021లో విచారణ కోర్టు తమపై నమోదుచేసిన అభియోగ పత్రాన్ని నిందితులు సవాలు చేశారు. పాకిస్థాన్ స్థావరంగా పనిచేస్తున్న ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌కు హవాలా మార్గంలో డబ్బులు బదలాయించడానికి సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఈ వ్యాజ్యాన్ని నమోదు చేసింది. ఈ కేసులో హిజ్బుల్ నేత కుమారులు షాహిద్ యూసుఫ్, సయ్యద్ అహ్మద్ షకీల్‌లను అరెస్టు చేశారు.

## లండన్‌లో గ్రెటా థన్‌బర్గ్ అరెస్టు



ఇంటర్నెట్ డెస్క్: పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ లండన్‌లో అరెస్టయ్యారు. పాలస్తీనాకు మద్దతుగా చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న ఆమెను అక్కడి భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 'పాలస్తీన్ యాక్షన్' అనే సంస్థ ప్లకార్డును పట్టుకుని గ్రెటా నిరసనకు దిగారు. ఆ సంస్థను బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ నిషేధం విధించింది. లండన్‌లో గతంలో వివిధ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్న అభియోగాలపై పలువురు పాలస్తీనా మద్దతుదారులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వీరికి బెయిలు లభించలేదని సమాచారం. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ పాలస్తీన్ యాక్షన్ సంస్థకు చెందిన 8 మంది సభ్యులు లండన్ ప్రధాన వీధుల్లో నిరవధిక నిరసన చేపట్టారు. ఇజ్రాయెల్ రక్షణశాఖతో సంబంధమున్న ఓ బీమా సంస్థ సమీపంలో వారు నిరసనకు దిగారు. కార్యాలయం ముందు ఎరుపు రంగు పూశారు. దీంతో రంగంలోకి దిగిన లండన్ పోలీసులు తొలుత ఓ మహిళసహా ఇద్దరిని అరెస్టు చేశారు. ఆ తర్వాత సంబంధిత సంస్థకు మద్దతుగా నిలిచారన్న ఆరోపణలతో గ్రెటాను అదుపులోకి తీసుకున్నారు.




## ఒక్కపూట భోజనంతో ప్రయోజనాలు

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌లో భాగంగా రోజుకు ఒక్క పూటే భోజనం (వన్ మీల్ ఎ డే/ఓఎంఏడీ) చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యమైనవి కొన్ని..
✦ జీర్ణశక్తి, రోగనిరోధక శక్తి పెరుగుదల ✦ కణ మరమ్మతు ప్రక్రియ క్రియాశీలం ✦ దీర్ఘాయుష్షు ✦ ఆరోగ్యకరమైన చర్మం ✦ మెదడు పనితీరులో వృద్ధి ✦ రక్తపోటు నియంత్రణ ✦ గుండె జబ్బుల తగ్గుదల ✦ మధుమేహ, కాలేయ కొవ్వు ముప్పు తగ్గుదల ✦ పొట్ట చుట్టూ కొవ్వు కరుగుదల. అయితే ఓఎంఏడీ సమయంలో పోషకాలు మెండుగా ఉండే ఆహారం తీసుకోవాలి.
– ఎరిక్ బెర్గ్, రచయిత

# జీవ వైవిధ్యం ఇతివృత్తంతో అసెంబ్లీ క్యాలెండర్

● సభాపతి అయ్యన్నపాత్రుడితో కలిసి ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'జీవ వైవిధ్యం-ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం' ఇతివృత్తంతో అసెంబ్లీ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను సభాపతి అయ్యన్నపాతుడితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ తీరప్రాంతం, గడ్డి మైదానాలు, కోరింగ మడ అడవులు వంటి విభిన్న ఆవరణ వ్యవస్థలకు చెందిన పన్నెండు వన్యప్రాణుల చిత్రాల సమాహారంగా వినూత్నంగా క్యాలెండర్‌ను రూపొందించినందుకు సీఎం అభినందించారు. 'ఈ పన్నెండు వన్యప్రాణులను కేవలం కాగితంపై ఉన్న చిత్రాలుగా మాత్రమే చూడకూడదు, వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. స్వచ్ఛమైన ప్రకృతిని కాపాడుకోవాలనే మన సమష్టి బాధ్యతలను ఈ



అసెంబ్లీ సెక్రటేరియట్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అయ్యన్నపాత్రుడు, చంద్రబాబు, పయ్యావుల కేశవ్, ప్రసన్న కుమార్

క్యాలెండర్ వివరిస్తుంది. పర్యావరణ సమతౌల్యానికి భంగం వాటిల్లితే అది మానవ-వన్యప్రాణి సంఘర్షణకు దారితీస్తుంది. పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ గురించి ఈ క్యాలెండర్ శక్తివంతమైన సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పులతో కలిగే తీవ్ర పరిణామాల గురించి హెచ్చరిస్తోంది'' అని సీఎం తెలిపారు.

### వన్యప్రాణుల పట్ల శాసనవ్యవస్థ నిబద్ధతను చాటేలా

సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. వన్యప్రాణి(సంరక్షణ)చట్టం 1972లోని షెడ్యూల్-1 కింద అత్యున్నతస్థాయి రక్షణ కల్పించిన 12 వన్యప్రాణుల చిత్రాలను ఈ క్యాలెండర్‌లో ప్రచురించామని తెలిపారు. 'పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ పట్ల శాసనసభకు ఉన్న నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ఎ, ఆర్టికల్ 51ఎ(జి) స్ఫూర్తితో ఈ క్యాలెండర్ రూపొందించాం. వన్యప్రాణులు, ప్రకృతిని కాపాడాల్సిన ఆవశ్యకతపై సమాజాన్ని చైతన్యపరిచేందుకు ప్రజాప్రతినిధుల సభ చేస్తున్న ప్రయత్నమే ఈ క్యాలెండర్' అని వివరించారు.

### 12 వన్యప్రాణుల వివరాలతో

ఈ క్యాలెండర్‌లో ఒక్కో నెలకు ఒక వన్యప్రాణి చిత్రాన్ని కృత్రిమ మేధతో రూపొందించి ప్రచురించారు. అందులో పెద్దపులి, చిరుతపులి, ఏనుగు, మొసలి, దేవాంగ పిల్లి, కృష్ణ జింక, పెద్ద ఉడత, కొండ ముచ్చు, ఎలుగుబంటి, నీటి పిల్లి /బావురు పిల్లి, గానుగ/తెల్ల తోరం, ఆలివ్ రిడ్లే తాబేలు ఉన్నాయి. ఇవి రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో కనిపిస్తాయనే వివరణనూ ఆయా చిత్రాలతోపాటు ఇచ్చారు.

# బంగ్లాదేశ్‌లో మారణకాండను ముక్తకంఠంతో ఖండించాలి

● సుపరిపాలనకు సిసలైన చిరునామా వాజ్‌పేయీ
● మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



'అటల్స్ విజన్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామచందర్‌రావు, డా.కె.లక్ష్మణ్, బాల్‌రాజ్, వెంకయ్యనాయుడు, బండారు దత్తాత్రేయ, భారతి

నారాయణగూడ, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలి. అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనేలా కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కోరారు. మంగళవారం హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ స్మారక విద్యాసంస్థల సభామందిరంలో భారత సాంస్కృతిక శాఖ సహకారంతో త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతిని పురస్కరించుకొని 'అటల్‌జీ స్మృతి సమ్మేళనం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ.. 'బంగ్లాదేశ్ కష్టాల్లో ఉన్న ప్రతి సందర్భంలో భారత్ అండగా నిలిచింది. 70వ దశకంలో బంగ్లాదేశ్ ప్రజలపై పాకిస్థాన్ దమనకాండకు పాల్పడుతున్నప్పుడు భారత్ ఆదుకుంది. నేడు అక్కడి హిందువులపై దాడులకు తెగబడటం, దేవాలయాలను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య. వాజ్‌పేయీ సుపరిపాలనకు అసలు సిసలైన చిరునామా. ప్రస్తుత ప్రభుత్వాలు కూడా నిధుల వ్యయంపై ఆలోచించాలి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని అడిగారా..? మన బడ్జెట్ అంత ఉందా..? అప్పులు తీర్చే మార్గం మన దగ్గరుందా..? అని ప్రశ్నించారు. విద్య, వైద్యం మినహా మిగతా ఉచితాలను సమీక్షించాలి. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం మైనారిటీలను ప్రత్యేకంగా చూడటం దేశానికి మంచిది కాదు' అని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ డా.కె.లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 'అటల్స్ విజన్ ఇండియాస్ రిసాల్వ్ ఫర్ ఎ ప్రొగ్రెసివ్ నేషన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. త్రినేత్ర ఫౌండేషన్ నిర్వాహకులు నూనె బాల్‌రాజ్, భారతి కలవగుంట తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహంపై మంత్రుల కమిటీ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. పురపాలక శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎన్టీఆర్ విగ్రహం, స్మారక మందిరం నమూనా రూపకల్పన, అనువైన ప్రదేశం ఎంపిక, డీపీఆర్ సమీక్ష, విగ్రహం ఎత్తు వంటివి ఈ కమిటీ నిర్ణయిస్తుంది.

# 3 రోజుల్లో 2,555 బోగస్ జనన ధ్రువపత్రాలు

### శ్రీసత్యసాయి జిల్లాలో ఆగని నకిలీల పరంపర

ఈనాడు, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో బోగస్ జనన ధ్రువపత్రాల జారీ కొనసాగుతోంది. అగళి మండలం కొమరేపల్లి పంచాయతీలో 3,892 బోగస్ పత్రాలు, బత్తలపల్లి మండలం పోట్లమర్రి పంచాయతీలో 1,982 నకిలీ జనన ధ్రువపత్రాలు జారీ అయి నెల కూడా తిరగకముందే అదే మండలం రామనపల్లి పంచాయతీ నుంచి మూడు రోజుల్లోనే 2,555 ధ్రువపత్రాలు జారీ అయినట్లు మంగళవారం వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరగాళ్లు గ్రామ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్స్ ఐడీలను హ్యాక్ చేసి దుర్వినియోగానికి పాల్పడి ఉంటారని ఉన్నతాధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. దీనిపై 'ఈనాడు' వరుస కథనాలతో వైద్య, ఆరోగ్యశాఖ జనన, మరణాల నమోదు విభాగం స్టాటిస్టికల్ అధికారి కళాధర్ ఆధ్వర్యంలో ఓ బృందం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించింది. జనన మరణాల నమోదు విభాగం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోగస్ పత్రాలన్నిటినీ రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అనుమానాలున్న 14 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు.

### ఏళ్ల తరబడి ఒకే పాస్‌వర్డ్

కొమరేపల్లి, పోట్లమర్రి, రామనపల్లి పంచాయతీలు 2020లో కొత్తగా ఏర్పడ్డాయి. నాటి నుంచి ఆ గ్రామాల కార్యదర్శులు పంచాయతీకి సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డులు క్రియేట్ చేసుకోలేదు. పాత పంచాయతీవే కొనసాగించారు. మిగతావారూ ఏళ్ల తరబడి వారి పేరుపక్కన 1234 ఉండేలా ఏ మాత్రం భద్రతలేని సాధారణ పాస్‌వర్డులను కొనసాగించడం.. ఒకరికొకరు షేర్ చేసుకోవడంతో వాటిని హ్యాక్ చేయడం అక్రమార్కులకు సులువైంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని 582 కేంద్రాల్లో జనన, మరణాల నమోదు ప్రక్రియను ప్రక్షాళన చేయాలని.. లాగిన్ ఐడీ, పాస్‌వర్డులను రద్దు చేసి కొత్తవి సృష్టించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లాలో 1,500 జనాభా ఉన్న శేందూర్‌సనీ గ్రామ పంచాయతీలో మూడు నెలల్లో ఏకంగా 27 వేల జననాలు నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. అక్రమ వలసదారులు స్థానిక, ఓటరు నమోదు కోసం పెద్దఎత్తున దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లాలో బోగస్ ధ్రువపత్రాల జారీపై సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

### బోగస్ పత్రాలు రద్దు చేస్తున్నాం

జనన, మరణాల నమోదు విభాగం రాష్ట్ర డిప్యూటీ చీఫ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావును దీనిపై వివరణ కోరగా. . ఈ వ్యవహారంపై ఎప్పటికప్పుడు విచారణ చేస్తున్నామన్నారు. బోగస్ పత్రాల రద్దుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

# లోక్‌భవన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పాల్గొన్న గవర్నర్ దంపతులు

ఈనాడు, అమరావతి: లోక్‌భవన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ దంపతులు ఎస్.అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. ''క్రిస్మస్ అంటే మనకు ప్రేమ, దయ గురించి నేర్పిన జీసస్‌ను ఆనందంగా స్మరించుకునే సమయం.. ఏసు జీవితం మనందరికీ ధర్మం, విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపడానికి ప్రేరణ ఇస్తుంది'' అని వ్యాఖ్యానించారు. బాలలతో కలిసి గవర్నర్ దంపతులు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. రెవరెండ్ జేవీ అరుణ్‌కుమార్, డాక్టర్ జి.శరత్, ఎం.ప్రసాద్ ప్రారంభ ప్రార్థన, బైబిల్ పఠనం, క్రిస్మస్ సందేశాన్ని చదివి వినిపించారు.

# విద్యుత్తు ప్లాంట్లకు నేరుగా ఘన వ్యర్థాలు!

● నాలుగు నగరాల్లో కొత్తవి ఏర్పాటు
● డిస్కంలతో ప్లాంట్ల నిర్వాహకుల ఒప్పందం
● రోజూ 7వేల టన్నుల వ్యర్థాల సమస్యకు త్వరలో పరిష్కారం: మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఘనవ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపే దిశగా ముందడుగు పడింది. కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్తు సరఫరాకు విద్యుత్తు పంపిణీ సంస్థల(డిస్కం)తో నిర్వాహకులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. సచివాలయంలో మంగళవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ సమక్షంలో డిస్కంల అధికారులు, ప్లాంట్ల నిర్వాహకులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లు విశాఖపట్నం, గుంటూరులో ప్రస్తుతం ఉన్నాయి. నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలులో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో కొత్తగా ఏర్పాటుచేస్తున్నారు. ప్రస్తుతం ఉన్నవి, కొత్తగా ప్రారంభించేవి కలిపి రాష్ట్రంలో రోజూ 7వేల టన్నుల వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నాయి.



### రెండేళ్లలో ప్లాంట్ల నిర్మాణ పనులు పూర్తి

ఈ సందర్భంగా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడారు. 'కొత్తగా ఏర్పాటుచేస్తున్న నాలుగు విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం తరఫున అవసరమైన స్థలం కేటాయిస్తున్నాం. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లు ప్రైవేట్ సంస్థల నిర్వాహకులే పెట్టుబడులు పెడుతున్నారు. వీటిలో ఉత్పత్తి చేసే విద్యుత్తును సరఫరా చేసేందుకు డిస్కంలతో ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్రంలో పుర, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో రోజూ 7,500 టన్నుల వ్యర్థాల్లో 7వేల టన్నులు ప్లాంట్లకు వెళ్తాయి. మిగిలిన 500 టన్నులకు వివిధ విధానాల ద్వారా పరిష్కారం కనుగొంటాం. ప్లాంట్ల నిర్మాణ పనులు వచ్చే రెండేళ్లలో పూర్తవుతాయి. మార్కెట్లలో వచ్చే వ్యర్థాల నిర్వహణకు ఏడు ప్లాంట్లు, విశాఖ, విజయవాడ, తిరుపతిలో మూడు ఈ-వేస్ట్ ప్లాంట్లు, మరో మూడుచోట్ల చికెన్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుకు టెండర్లు పిలుస్తున్నాం' అని మంత్రి నారాయణ వివరించారు.

**వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయనున్న కొత్త ప్లాంట్ల వివరాలు**

| నగరం | ప్లాంట్ సామర్థ్యం (మెగావాట్లలో) | రోజూ వినియోగించే వ్యర్థాలు (టన్నుల్లో) |
|---|---|---|
| నెల్లూరు (దొంతాలి) | 12 | 604 |
| కాకినాడ (రామేశ్వరం) | 15 | 957 |
| కడప (కొలుములపల్లి) | 15 | 781 |
| కర్నూలు (గార్వేయపురం) | 15 | 751 |

# సాగును లాభసాటి చేస్తున్నాం

● జాతీయ కిసాన్ దివస్ సందర్భంగా రైతులకు చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: సాగును లాభసాటి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. జాతీయ కిసాన్ దివస్ సందర్భంగా రైతులకు ఎక్స్ వేదికగా మంగళవారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని చౌదరీ చరణ్‌సింగ్‌కు నివాళి అర్పించారు.

# పీవీ నరసింహారావుకు చంద్రబాబు నివాళి

మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. ప్రజా సేవతో పాటు సాహితీసేవ కూడా చేసి ఆయా రంగాల్లో తనదైన ముద్ర వేసిన మహానుభావుడు పీవీ అని ఎక్స్ వేదికగా కొనియాడారు.

# జనాన్ని నరికినా తప్పు లేదని జగన్ పిలుపునిచ్చారు

● అందుకే ఆయన పుట్టిన రోజు నాడు వైకాపా శ్రేణుల అరాచకం
● లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ధ్వజం



ఈనాడు, అమరావతి: 'జనాన్ని నరికినా తప్పుడు లేదు, వారిని భయభ్రాంతులకు గురిచేయాలి' అని వైకాపా అధినేత జగన్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపు ఇవ్వడంతోనే ఆయన పుట్టిన రోజు నాడు వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలు సృష్టించారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. వివిధ ప్రాంతాల్లో వైకాపా శ్రేణులు నిర్వహించిన జగన్ పుట్టిన రోజు వేడుకల్లో మూగజీవాల్ని నరికి ఆయన ఫ్లెక్సీకి రక్తాభిషేకాలు చేయడం తదితర చర్యలు అమానుషమని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం పిల్లి మాణిక్యరావు విలేకరులతో మాట్లాడారు. ''పుటిన రోజు వేడుకలైతే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడమనో, సేవా కార్యక్రమాలు చేయమనో చెప్పాలి. జగన్ మాత్రం రక్తతర్పణం చేయమని చెప్పారు. మళ్లీ వైకాపా అధికారంలోకి వస్తే రప్పా..రప్పామని నరికేస్తామని సంకేతాలు ఇచ్చారు'' అని దుయ్యబట్టారు.

# కరెంటోళ్ల జనబాట!

● ఎస్పీడీసీఎల్‌లో ప్రారంభం
● విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం
● కార్యక్రమాన్ని చేపట్టిన సీఎండీ శివశంకర్

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్ వినియోగారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడం.. లోవోల్టేజీ సమస్యల పరిష్కారం కోసం 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. డిస్కం పరిధిలోని 9 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కార్యక్రమాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ లాంఛనంగా సోమవారం ప్రారంభించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తమ సిబ్బందితో కలిసి నిర్దేశిత గ్రామాలకు వెళ్లి ప్రజలను కలిసి అక్కడి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ స్థాయిల్లో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. కార్యక్రమం నిర్వహించే ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ లైన్లు పరిశీలించడం, విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, వాలిన స్తంభాలు, వేలాడే తీగలను సరిచేయడం, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తు పెంచడం, అవసరమైన చోట కంచె ఏర్పాటు వంటి పనులు నిర్దేశిత వ్యవధిలో చేసేలా చర్యలు తీసుకుంటాం. మొదటి రోజు డిస్కం పరిధిలో 28,672 సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటిలో 507 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాం' అని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం కింద గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ఏర్పాటు.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై వినియోగదారులకు అవగాహన..కల్పించనున్నట్లు చెప్పారు. పీఎం కుసుమ్ కింద ఫీడర్ స్థాయిలో మినీ సౌర ప్రాజెక్టులు ఏర్పాటు చేసి రైతులకు పగటి వేళల్లో 9 గంటలపాటు ఉచిత విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు!

ఈనాడు, అమరావతి: 'కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. సోషల్ మీడియా, యూట్యూబర్లకు కూడా అక్రిడేషన్లు ఇచ్చే అంశంపై అధ్యయనానికి కమిటీ వేశాం. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారు' అని మంత్రి పార్థసారథి వివరించారు. కార్యక్రమంలో సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్, ఐజేయూ సెక్రటరీ జనరల్ సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, నాయకులు కంచల జయరాజు, వెంకటేశ్వర్లు, దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, ఏచూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

# 27న విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 27న కాకినాడలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ సంస్థల అధికారులు పాల్గొంటారని తెలిపారు. అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# రహదారి పక్కన వానరాల కళేబరాలు

● వైఎస్సార్ కడప జిల్లాలో కలకలం



నెల్లూరు జిల్లా సీతారామపురం – కడప జిల్లా పోరుమామిళ్ల రహదారిపై విగతజీవులుగా వానరాలు

బద్వేలు, పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వానరాలను చంపి వాహనంలో తీసుకొచ్చి రోడ్డుపక్కన పడేసిన హృదయవిదారక ఘటన వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం టేకూరుపేట ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం సాయంత్రం వెలుగుచూసింది. పశువులను మేపేందుకు వెళ్లిన కాపర్లు రోడ్డుపక్కన 21 వానరాలు విగతజీవులుగా పడిఉండటాన్ని చూసి పోరుమామిళ్ల అటవీశాఖ అధికారులకు మొబైల్‌లో తెలియజేశారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానికులు కళేబరాలను పరిశీలించగా.. వానరాలు విద్యుదాఘాతానికి గురైన ఆనవాళ్లు కనిపించాయి. అవన్నీ ఎక్కడో చనిపోయి ఉండొచ్చని, ఆటోలో తీసుకొచ్చి రహదారిపై పడేసినట్లు అనుమానిస్తున్నారు. అనంతరం కప్పలపల్లి యువకులు వానరాల కళేబరాలకు పూజలు చేశారు. జేసీబీతో గుంత తీసి పూడ్చివేశారు. టేకూరుపేట ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలోనే ఇంత హడావుడి జరిగినా అటవీ శాఖ అధికారులు ఆ దరిదాపుల్లోకి కూడా రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# గర్భిణిపై మీ పార్టీ సైకోల దాడి పైశాచికం కాదా జగన్?

మీ జన్మదినం.. ప్రజలకు ప్రాణసంకటం: మంత్రి లోకేశ్



ఈనాడు, అమరావతి: ''తన ఇంటిముందు టపాసులు కాల్చొద్దన్నందుకు శ్రీసత్యసాయి జిల్లాలో ఓ గర్భిణిపై వైకాపా సైకోలు దాడిచేయడం పైశాచికం కాదా?'' అని వైకాపా అధినేత జగన్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిలదీశారు. వైకాపా వాళ్ల ఉన్మాదం ఓ గర్భిణి ఆరోగ్య పరిస్థితిని విషమం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పనులు తప్పని మీ పార్టీ నాయకులకు కనీసం చెప్పరా? అని ప్రశ్నించారు. జగన్ పుట్టినరోజు ప్రజలకు ప్రాణసంకటంగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జగన్ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వైకాపా శ్రేణులు చేసిన దౌర్జన్యాల్ని ఖండించారు. బాధితుల ఆవేదనను ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూగజీవాల్ని బలిచ్చి జగన్ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేయడం, పల్నాడు జిల్లా సత్తెనపల్లె మండలంలో తెదేపా కార్యకర్తలపై వైకాపా నేతల కర్రల దాడి, విజయవాడలో మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యకర్తల ముఖాలకు కేకు రాయడం లాంటి ఘటనలతో రూపొందించిన వీడియోను పోస్టుకు జతచేశారు.

# అందరూ చేశారనే మేమూ ప్రచారం చేశాం!

● బెట్టింగ్ యాప్ కేసులో మంచు లక్ష్మి, రీతూచౌదరి, సన్నీయాదవ్‌ల వాంగ్మూలం

ఈనాడు, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసులో నిందితుల తొలి విడత విచారణను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ముగించింది. మొత్తం 25 మంది నిందితుల్లో 22 మందిని ఇప్పటికే విచారించగా... మిగిలిన ముగ్గురినీ మంగళవారం విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది. సీఐడీ కార్యాలయంలో నిర్వహించిన సిట్ విచారణకు సినీనటి మంచు లక్ష్మి, యాంకర్ రీతూ చౌదరి, యూట్యూబర్ భయ్యా సన్నీయాదవ్ హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు ఎందుకు ప్రమోషన్ చేయాల్సి వచ్చిందని సిట్ అడిగిన ప్రశ్నలకు ముగ్గురూ దాదాపు ఒకే రీతిలో సమాధానం చెప్పినట్లు తెలిసింది. పలువురు సినీ ప్రముఖులు ప్రమోషన్ చేసినందునే తామూ చేశామని చెప్పినట్లు సమాచారం. గేమింగ్ యాప్‌లు అనుకొని మాత్రమే తాము ప్రచారం చేశామని వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిసింది. ప్రమోషన్ కోసం తమతో ఆన్‌లైన్‌లోనే సంప్రదింపులు జరిపారని, పారితోషికం పెద్దగా ఇవ్వలేదని, సంబంధిత లావాదేవీల సమాచారాన్ని అప్పగిస్తామని చెప్పినట్లు సమాచారం. విచారణ అనంతరం మంచు లక్ష్మి తిరిగి వెళ్తున్న క్రమంలో మీడియా ప్రతినిధులు మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆమె 'క్రిస్మస్, కొత్తసంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు' అని చెప్పి వెళ్లిపోయారు. ఈ కేసులో సిట్ ఇప్పటికే సినీ నటులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, నిధి అగర్వాల్‌తోపాటు వైకాపా నాయకురాలు శ్యామల, యాంకర్లు విష్ణుప్రియ, శ్రీముఖి, యూట్యూబర్లు అమృతచౌదరి, హర్షసాయి, టేస్టీ తేజ, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు తదితరులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది. వీరిలో ఇప్పటికే పలువురు ఈడీ విచారణను సైతం ఎదుర్కొనడం గమనార్హం.

# పోలవరం విస్తరణను అంగీకరించబోం

ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో తెలంగాణ వాదన

ఈనాడు, హైదరాబాద్: ఏపీ చేపడుతున్న పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు చట్టవిరుద్ధమని, ఈ లింక్ ద్వారానే గోదావరి- కావేరి నదుల అనుసంధానం చేయాలన్న ఆ రాష్ట్రం వాదనను అంగీకరించేది లేదని తెలంగాణ స్పష్టం చేసింది. మంగళవారం దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సర్వసభ్య సమావేశం, నదుల అనుసంధాన ప్రత్యేక కమిటీల సమావేశాలను కలిపి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తన అభిప్రాయాలు తెలిపింది. పోలవరం- నల్లమలసాగర్ నుంచి కావేరీకి అనుసంధానం చేయాలని, ఇచ్చంపల్లి నుంచి అనుసంధానాన్ని మార్చాలంటూ తొలుత ఈ సమావేశంలో ఏపీ చేసిన ప్రతిపాదనను తెలంగాణ తోసిపుచ్చింది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విస్తరణ రాష్ట్ర పునర్విభజన చట్టానికి విరుద్ధమని, ఇతర ఒప్పందాలను ఉల్లంఘించినట్లు అవుతుందని పేర్కొంది. పోలవరం నుంచి కావేరీకి నీటిని తీసుకెళ్తే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలను విస్మరించినట్లు అవుతుందని, దీని వల్ల నదుల అనుసంధాన ప్రక్రియ లక్ష్యం దెబ్బతింటుందని, దీనికి అంగీకరించబోమని స్పష్టం చేసింది. సమావేశానికి తెలంగాణ తరఫున అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ ప్రసాద్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యప్రసాద్ హాజరయ్యారు.

# దివ్యాంగులకు త్వరలో త్రిచక్ర మోటారు వాహనాలు

మంత్రి డీబీవీ స్వామి వెల్లడి




ఈనాడు, అమరావతి: దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా వారికి నెలకు రూ.6 వేల పింఛన్ ఇస్తోందని దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని పలువురు దివ్యాంగులు కలిశారు. దివ్యాంగులకు ఏడు వరాలైన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమరావతిలో దివ్యాంగ భవన్, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, క్రీడల్లో ప్రోత్సాహం, ప్రత్యేక ఆర్థిక రాయితీలు, బహుళ అంతస్తుల ప్రభుత్వ గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, వైద్య- సామాజిక భద్రత ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి స్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి స్పందిస్తూ దివ్యాంగులకు త్వరలో ఉచితంగా మూడు చక్రాల రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు అందిస్తామని వెల్లడించారు. నియోజకవర్గానికి 10 మంది చొప్పున 1,750 మంది దివ్యాంగులకు రూ.17.50 కోట్ల విలువైన వాహనాలు అందిస్తామన్నారు. దివ్యాంగుల కోసం విశాఖలో రూ.200 కోట్లతో పారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

# కన్హా శాంతివనం ధ్యాన దినోత్సవానికి గిన్నిస్ రికార్డు

2 కోట్ల మంది వర్చువల్‌గా వీక్షణ

నందిగామ, న్యూస్‌టుడే: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలోని ధ్యాన మందిరంలో హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేష్ డి పటేల్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించిన ప్రపంచ ధ్యాన దినోత్సవం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. ఈ నెల 21న రాత్రి 8 గంటలకు ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్న సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని 175 దేశాల్లో 2 కోట్ల మంది వర్చువల్‌గా యూట్యూబ్ ద్వారా వీక్షించారని... శ్రీరామచంద్ర మిషన్ పీఆర్‌ఓ చంద్రారెడ్డి మంగళవారం తెలిపారు.

# ధ్యానంతో ఒత్తిడి నుంచి ఉపశమనం: దాజీ



కమలేశ్ డి.పాటిల్

ఈనాడు, అమరావతి: విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిళ్ల నుంచి ధ్యానం ఉపశమనాన్ని కలిగిస్తుందని రామచంద్ర మిషన్, కన్హా శాంతివనం అధ్యక్షుడు కమలేశ్ డి.పాటిల్ (దాజీ) పేర్కొన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో తన బృందంతో కలిసి అధికారులకు ధ్యానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఇటీవల కన్హా శాంతివనాన్ని సందర్శించారని, ఆయన విజ్ఞప్తి మేరకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



రాష్ట్ర సచివాలయంలో మెడిటేషన్ శిక్షణా తరగతులకు హాజరైన అధికారులు, సిబ్బంది

# ఆర్బీఐ గణాంకాలతో.. తెదేపా, జనసేన అసత్యాలు బట్టబయలు

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఏపీ బ్రాండ్ దెబ్బతిందని, అప్పుడు రాష్ట్రంలో ఎలాంటి పారిశ్రామిక పురోగతీ లేదని తెదేపా, జనసేన పార్టీలు ఇన్నాళ్లూ చెప్పినవన్నీ అసత్యాలేనని రిజర్వు బ్యాంకు ఇటీవల విడుదల చేసిన గణాంకాలతో స్పష్టమైందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలిపారు. 2019-24 మధ్య ఉత్పత్తి రంగంలో దక్షిణ భారతదేశంలో తొలి స్థానంలో, జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో ఏపీ నిలిచిందని గుర్తుచేశారు. ఆ ఐదేళ్లలో పారిశ్రామిక రంగ పురోగతిలో దక్షిణాదిలో తొలి స్థానంలో, జాతీయ స్థాయిలో 8వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. మంగళవారం జగన్ కార్యాలయం ఈ వివరాలను ప్రకటించింది.

# ‘తేపీటి పురుగు’... తేలిగ్గా తీసుకోవద్దు..



తలలో పేను కంటే చిన్నగా ఉండే చిగ్గర్ మైట్ కీటకం

## ఈ కీటకం కరిస్తేనే స్క్రబ్ టైఫస్ వ్యాధి

- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమయ్యే ప్రమాదం
- చిన్న కీటకాలతో ఇంటా, బయటా జాగ్రత్త సుమా



పొలాల్లో, పొదల్లో.. పచ్చిక బయళ్లలో.. శుభ్రత లేని, తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సంచరించే ఓ చిన్న కీటకం చిగ్గర్ మైట్. కొన్ని ప్రాంతాల్లో దీన్ని ‘తేపీటి పురుగు’ అంటారు. తలలో ‘పేను’ కంటే చిన్నగా ఉండే ఈ కీటకం కరిస్తే ‘స్క్రబ్ టైఫస్’ వ్యాధి సోకుతుంది. సకాలంలో చికిత్స తీసుకోకపోతే అనారోగ్యం పాలై ప్రాణాపాయ పరిస్థితులు ఎదురవుతాయి. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు ఈ కేసులు 1,715 నమోదు కాగా, 12 మంది మరణించడం కలవరపెడుతోంది. అయితే డెంగీ, మలేరియా ఇతర వ్యాధుల్లా ‘స్క్రబ్ టైఫస్’ కేసులు కూడా ఏటా నమోదు అవుతూ ఉంటాయి, ఎవరూ ఆందోళన చెందవద్దని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ధైర్యం నింపుతున్నారు.. ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే మరణాలు నమోదు కావడం అందరూ అప్రమత్తం కావలసిన అవసరాన్ని సూచిస్తోంది. ఈ వ్యాధిపై అధ్యయనానికి జాతీయ స్థాయి నిపుణులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కీటకం ప్రమాదకరంగా రూపాంతరం చెందడం వెనుక కారణాల అన్వేషణ బ్యాక్టీరియా జన్యుక్రమంపై అధ్యయనం చేయాలని భావిస్తోంది.

### కీటకం ప్రభావం దేశమంతటా..

దిల్లీ, లద్దాఖ్, దాద్రా-నగర్ హవేలీ మినహా మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా తమిళనాడు (7,308), ఒడిశా (6,586), పశ్చిమ బెంగాల్ (4,674), రాజస్థాన్ (3,326), మధ్యప్రదేశ్ (2,551), కర్ణాటక (1,870), ఆంధ్రప్రదేశ్ (1,715), అస్సాం (1,555) కేసులు నమోదయ్యాయి. మరణాలు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోనే చోటుచేసుకోవడం గమనార్హం.

### శుభ్రతలేని ప్రాంతాల్లోనే ఎక్కువ



గడ్డి పొదలు, శుభ్రతలేని తోటలు, నిర్వహణ లేని ప్రాంతాలు.. ఎలుకలు సంచరించే ప్రాంతాలే స్క్రబ్ టైఫస్ హాట్‌స్పాట్లు. వర్షాకాలంలో మొదలై శీతాకాలం ముగిసేవరకు తేపీటి పురుగుల తాకిడి ఎక్కువ. ఇటీవల వరుస తుపానులతో వీటికి మరింత అనుకూల వాతావరణం ఏర్పడిందని నిపుణులు భావిస్తున్నారు.

### వ్యక్తిగత శుభ్రత..



- చంకలు, తొడల మధ్య భాగాల్లో స్నానం చేశాక తడి లేకుండా శుభ్రంగా తుడుచుకోవాలి.
- శుభ్రమైన, బాగా దులిపి పరిశీలించిన తర్వాతే దుస్తులు, సాక్సులు, బూట్లు వేసుకోవాలి.
- కీటకాలు ఇంట్లోకి చొరబడకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి.
- వైద్యుల సూచన మేరకు చర్మానికి కీటక నివారిణి క్రీములు రాసుకోవడం ఉత్తమం.



తేపీటి పురుగు

తేపీటి పురుగు కుట్టినచోట ఏర్పడే నల్లటి మచ్చ

### ఆరు బయటకు వెళ్తే..

- ఆరుబయట పొదలు, గడ్డి ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు, పాదాలు కప్పి ఉంచేలా సాక్సులు, బూట్లు ధరించాలి.
- పొలాలు, పార్కులకు వెళ్లేటప్పుడు గడ్డి ప్రదేశాల్లో నేరుగా నేలపై కూర్చోవద్దు. కింద వస్త్రం వేసుకోవాలి. ఇంటికి వచ్చాక ఆ దుస్తులు బాగా దులపాలి/ వేడి నీటిలో నానబెట్టి ఉతకాలి.

### ఇంట్లోనూ జాగ్రత్త సుమా..

- ఇంటి పరిసరాల చుట్టూ పొదలు, గడ్డి ఎప్పటికప్పుడు తొలగించాలి. పచ్చదనం, పచ్చిక బయళ్లు, గృహోపకరణ సామగ్రి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఈ కీటకాలు ఎలుకల శరీరానికి అతుక్కుని జీవించే అవకాశం ఉంటుంది. అందుకే ఇంట్లో ఎలుకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పెంపుడు జంతువులు బయట తిరిగి వస్తే వాటి శరీరంపై కీటకాలు లేకుండా జాగ్రత్తపడాలి.

### కార్యాలయాల్లో..

- కార్యాలయాలు, గోదాముల్లో శుభ్రత పాటించాలి. వృథాలు, ఆహార వ్యర్థాల నిర్వహణ సమర్థంగా ఉండాలి.
- చెదల నివారణ తరహాలోనే ఎప్పటికప్పుడు ఎలుకలు, కీటకాల నివారణ చర్యలు చేపట్టాలి.

### ఇవిగో లక్షణాలు.. వెంటనే గుర్తిస్తే ఇబ్బంది లేనట్టే

- ఈ కీటకం కుట్టినచోట ఓరియెంటియా సుట్సుగముషి బ్యాక్టీరియా ద్వారా శరీరంపై కాలినట్లు చిన్న మచ్చ ఏర్పడుతుంది. మచ్చ లేకున్నా వ్యాధి సోకిన లక్షణాలు 7 నుంచి 20 రోజుల్లో బయటపడతాయి.
- తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం, వణుకు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.



- ఎలుకలను కుట్టిన తర్వాత ఈ కీటకాలు మనుషుల్ని కుడితే బ్యాక్టీరియా ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వృద్ధులపై స్క్రబ్ టైఫస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- స్క్రబ్ టైఫస్ అనుమానిత లక్షణాలు ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ మాత్రలతో నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.
- ఆలస్యం చేస్తే ఇన్ఫెక్షన్ పెరిగి ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉంది.

### చంకలు, గజ్జల్లోనూ కీటకాలు అతుక్కుపోవచ్చు..

– డాక్టర్ డి.సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపల్, ఎస్వీ వైద్య కళాశాల, తిరుపతి

స్క్రబ్ టైఫస్‌కు కారణమైన చిగ్గర్ కీటకం తలలో పేను కంటే చిన్నగా ఉంటుంది. తల్లి కీటకం నుంచి బ్యాక్టీరియా గుడ్లలోని లార్వాకు చేరుతుంది. గుడ్ల నుంచి పిల్లలు బయటకు వచ్చి శరీరంలో చంకలు, గజ్జల్లో అతుక్కుపోయి రక్తం పీలుస్తుంటాయి. శరీరంపై దురద లేదా ఏదో కుట్టినట్లు అనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఒంటి నొప్పులు, జ్వరం వంటి లక్షణాలను సాధారణ మాత్రలు వాడుతూ కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో తాత్కాలికంగా జ్వరం తగ్గినా, ఆ తర్వాత ప్రభావం బయటపడుతోంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు సకాలంలో పరీక్షలు చేయించుకోకపోతే ఈ బ్యాక్టీరియా ప్రభావంతో ఇబ్బందులు ఎదురవుతాయి. ఐజీఎం ఎలిసా పరీక్ష ద్వారా పాజిటివ్ కేసులను గుర్తించే వీలుంది. ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. చెమ్మ ఉన్నచోట కీటక సంచారానికి అవకాశం ఎక్కువ. కీటక నివారిణులు వంటివి వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదు. సకాలంలో అప్రమత్తమైతే తక్కువ ఖర్చుతో సులువుగా నయం చేయవచ్చు.

– ఈనాడు, అమరావతి

## ట్రాన్స్‌కో ట్రూడౌన్ రూ.134.08 కోట్లు

### డిస్కంలకు సర్దుబాటు చేసేందుకు ఏపీఈఆర్‌సీ అనుమతి

**ఈనాడు, అమరావతి:** విద్యుత్ సంస్థలు మరోసారి ట్రూడౌన్ చేశాయి. నాలుగో నియంత్రిత వ్యవధి (2019-20 నుంచి 2023-24 మధ్య) ఐదేళ్లలో ఏపీ ట్రాన్స్‌కో రూ.134.08 కోట్ల ట్రూడౌన్ మొత్తాన్ని డిస్కంలకు సర్దుబాటు చేసేందుకు అనుమతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్లలో నాన్ టారిఫ్ ఆదాయంతో కలిపి ఏపీఈఆర్‌సీ అనుమతించిన మొత్తం కంటే నాలుగో నియంత్రిత వ్యవధిలో ట్రాన్స్‌కో ఆదాయంలో రూ.902.94 కోట్లు మిగులు ఉందని, వివిధ కాంపోనెంట్స్‌పై డిప్రిసియేషన్ కింద అనుమతించిన మొత్తంలోనూ రూ.156.81 కోట్లు మిగులు ఉన్నట్లు ట్రాన్స్‌కో ప్రతిపాదనలు దాఖలు చేసింది. ఈ మేరకు రూ.1,059.75 కోట్లను డిస్కంలకు విద్యుత్ వినియోగ నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేసేందుకు అనుమతించాలని ట్రాన్స్‌కో ప్రతిపాదనలు దాఖలు చేసింది. అందులో వివిధ సర్దుబాట్ల తర్వాత ట్రూడౌన్ కింద రూ.134.08 కోట్లు డిస్కంలకు సర్దుబాటు చేసేందుకు కమిషన్ అనుమతించింది.

## కొబ్బరి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎఫ్ఎఫ్‌సీ

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**ఈనాడు, అమరావతి:** కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు 3 ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ), ఐదు ఎకరాల్లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతు ఉత్పత్తి సంస్థలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కొబ్బరి పరిశ్రమ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ‘కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల కోసం రాజోలు నియోజకవర్గంలోని తూర్పుపాలెం, అమలాపురం నియోజకవర్గంలోని మామిడికుదురు మండలంలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కొబ్బరికాయల తొక్క వొలిచి, ఎండు కొబ్బరికాయలను తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు పంపుతున్నారు. కోనసీమలో కొబ్బరి ప్రాసెసింగ్ పరిశ్రమలు లేకపోవడమే కారణం. దీనిపై అధ్యయనం చేసి జిల్లా స్థాయిలో చర్యలు చేపట్టాలి. నిల్వ సౌకర్యాలు, పరీక్షా కేంద్రానికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలి. కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాలు కేటాయించే అవకాశముంది. ఉభయ గోదావరి జిల్లాలకు ఇది ఎంతో ఉపయోగం’ అని మంత్రి పేర్కొన్నారు.

## 58 రకాల శస్త్రచికిత్సలు చేసేందుకు ఆయుర్వేద వైద్యులకు అవకాశం

### కేంద్రం మార్గదర్శకాల అమలు దిశగా చర్యలు

**ఈనాడు, అమరావతి:** నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న ఆయుర్వేద పీజీ వైద్యులు 58 రకాల శస్త్ర చికిత్సలు స్వతంత్రంగా చేసే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. భారతీయ కేంద్ర వైద్య మండలి (సీసీఐఎం) 2020 నవంబరు 20న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అప్పటి వైకాపా ప్రభుత్వం విస్మరిస్తే.. దాని అమలు దిశగా కూటమి ప్రభుత్వం తాజాగా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 39 శల్య తంత్ర (సాధారణ శస్త్రచికిత్సలు), 19 శలాక్య తంత్ర (ఈఎన్‌టీ, నేత్ర, దంత వంటి ఇతర విభాగాల) శస్త్రచికిత్సల నిర్వహణకు ఆయుర్వేద పీజీలకు కోర్సుల సమయంలో అధికారిక శిక్షణ ఇస్తారు. అర్హత పొందిన ఆయుర్వేద పీజీ వైద్యులకు స్వతంత్రంగా శస్త్రచికిత్సలు చేసే వెసులుబాటు కల్పిస్తారు. తాజా నిర్ణయంలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్. . ఆయుష్ సంచాలకుడు దినేష్‌కుమార్ ఇతర అధికారులతో సమీక్షించారు. విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో శల్య, శలాక్య తంత్ర పీజీ కోర్సులు ప్రవేశపెట్టాలని, ఆపరేషన్ థియేటర్లు, శస్త్రచికిత్స పరికరాలు సమకూర్చాలని ఆదేశించారు. పీజీ విద్యార్థులకు శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించేలా నాణ్యమైన విద్యతో కూడిన కోర్సులు నిర్వహించాలని సూచించారు. పురాతన భారతీయ వైద్య విధాన ప్రక్రియలను ఆధునిక చికిత్స విధానంతో అనుసంధానం చేయడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

## నేవీ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌కు ప్రొటోకాల్ ఉన్నతి

**ఈనాడు, అమరావతి:** విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌నకు రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తర్వాతి స్థానం కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రెసిడెన్స్‌లో ఆర్టికల్ 23 ప్రకారం ఆయనకు ఆ ప్రొటోకాల్ వర్తిస్తుందని తెలిపింది. గతంలో ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్‌నకు ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ సభ్యులు/ విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల తర్వాతి స్థానంలో ఆర్టికల్ 24 ప్రకారం ప్రొటోకాల్ పాటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ పోస్టు.. ఆర్మీ కమాండర్లు/ ఆర్మీ వైస్ చీఫ్ ర్యాంక్‌తో సమానమైందని తూర్పు నౌకాదళం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. వారికి స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రెసిడెన్స్‌లో ఆర్టికల్ 23 ప్రకారం ప్రొటోకాల్ కల్పిస్తున్నందున, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌నకు కూడా వారితో సమానంగా వర్తింపజేయాలని కోరింది. దానికి అనుగుణంగా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వు జారీచేసింది.

## నీట్ పీజీ మెడికల్ కౌన్సెలింగ్ రివైజ్డ్ షెడ్యూల్ విడుదల

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ సూచనల మేరకు నీట్ పీజీ మెడికల్ రివైజ్డ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ని జాతీయ వైద్య కమిషన్ విడుదల చేసింది. కౌన్సెలింగ్ తేదీలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రకటించామని పీజీ మెడికల్ ఎంట్రన్స్ బోర్డు కార్యదర్శి రీటా సింగ్ తెలిపారు. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. ◆ అఖిలభారత కోటా రెండో విడత కౌన్సెలింగ్ గడువు డిసెంబరు 25, రాష్ట్ర కోటాలో డిసెంబరు 30లోగా కళాశాలలో చేరాలి.

◆ మూడో విడత కౌన్సెలింగ్ అఖిలభారత కోటా డిసెంబరు 26 నుంచి జనవరి 2 వరకు నిర్వహించాలి. జనవరి 11లోగా కళాశాలలో చేరాలి. రాష్ట్ర కోటాలో జనవరి 2 నుంచి 11 లోగా కౌన్సెలింగ్ నిర్వహించి 17వ తేదీ వరకు చేరవచ్చు.

◆ అఖిలభారత కోటా మిగులు విడత (స్ట్రే) కౌన్సెలింగ్ జనవరి 15 నుంచి 21వ తేదీలోగా నిర్వహించి జనవరి 31లోగా, రాష్ట్రంలో జనవరి 21 నుంచి 24వ తేదీలోగా నిర్వహించి జనవరి 31లోగా ప్రక్రియను ముగించాలి

## నకిలీ పైళ్లతో వైకాపా సర్పంచి భూ ఆక్రమణ

**ఈనాడు, అమరావతి:** తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని తప్పుడు దస్తావేజులతో వైకాపా సర్పంచి ఆక్రమించాడని పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కొత్తపాలేనికి చెందిన శ్రీనివాసరావు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బి.శ్రీనివాసులు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన కుటుంబానికి దక్కాల్సిన ఆస్తిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడమే కాక చంపుతానని సమీప బంధువులే బెదిరిస్తున్నారని చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన రూప అనే మహిళ ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని ఆక్రమించాలని చూస్తున్న వారికి స్థానిక తహసీల్దార్, ఎస్సై అండగా నిలుస్తున్నారని అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలానికి చెందిన అర్జునరావు వాపోయారు.

# పీల్చే గాలిలో ‘మైక్రోప్లాస్టిక్స్’!

- ప్రధాన నగరాల్లో ప్రమాదకరంగా మారుతున్న వైనం
- ప్రభుత్వాలు అప్రమత్తం కావాలని పరిశోధక బృందం హెచ్చరిక

**ఈనాడు, చెన్నై**పీల్చే గాలిలో కాలుష్య కారకాలే కాదు, ప్రాణాంతక మైక్రోప్లాస్టిక్‌లూ తేలియాడుతూ వస్తున్నాయని, అవి శ్వాస ద్వారా మన శరీరాల్లోకి వెళ్తున్నాయని పరిశోధకులు గుర్తించారు. వాటిలోని సూక్ష్మజీవులతో ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), చెన్నైలోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమాటికల్ సైన్స్ (ఐఎంఎస్‌సీ), ముంబయిలోని హోమీబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌బీఎన్ఐ), కల్యాణిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) శాస్త్రవేత్తలు అభిషేక్ బిస్వాస్, నిరుపమా సైని, నిఖిల్ చివుకుల, అరీజిత్ సమల్, మహేశ్ రవికుమార్, పుణ్యశ్లోక్ భాదూరి, గోపాలకృష్ణ దర్భా ఈ పరిశోధన చేపట్టారు. 2021-23 మధ్య దిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై నగరాల్లోని గాలి నమూనాలను సేకరించి, పరీక్షించి, మైక్రోప్లాస్టిక్స్ ఉనికిని గుర్తించారు. ఇదీ వారి పరిశోధన సారాంశం..

### చలికాలంలో ఎక్కువ ప్రభావం

కోల్‌కతా, దిల్లీ నగరాల్లో చలికాలంలో గాలిలో మైక్రోప్లాస్టిక్స్ తీవ్రత ఎక్కువగా ఉంది. క్యూబిక్ మీటర్ గాలిలో 14.18-14.23 మైక్రోగ్రాములుగా నమోదైంది. జనాభా రద్దీ, సింథటిక్ దుస్తుల వాడకం, వ్యర్థాల నిర్వాహణలో లోపాలతో మైక్రోప్లాస్టిక్స్ గాలిలో కలుస్తున్నాయి. వేసవితో పోల్చితే చలికాలంలో వీటి పరిమాణం పెరుగుతోంది. ఇక సముద్రతీర నగరాల్లో వీటి ప్రభావం స్వల్పంగా ఉంది. చెన్నైలో క్యూ.మీ.కు 4 మై.గ్రా, ముంబయిలో 2.65 మై.గ్రా ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ గాలి ప్రసరణ బాగుండటం, చలి తీవ్రత, సింథటిక్ దుస్తుల వాడకం తక్కువగా ఉండడానికి కారణాలు. అయితే, ఒక ప్రాంతంలో వెలువడిన మైక్రోప్లాస్టిక్స్ గాలిద్వారా దూర ప్రాంతాలకూ వ్యాపిస్తున్నాయి. ఉదాహరణకు దిల్లీ నుంచి ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్‌కు ఎక్కువగా, బంగ్లాదేశ్, అస్సాంలకు పాక్షికంగా ప్రయాణిస్తున్నాయి. అలాగే, కోల్‌కతా నుంచి బంగాళాఖాతంలోకి, ముంబయి, చెన్నై ద్వారా అరేబియా, హిందూ మహాసముద్రాల వైపు వ్యాపిస్తున్నాయి. అలా వెళ్లిన మైక్రోప్లాస్టిక్స్ సముద్రజీవుల ద్వారా మనిషి ఆహారంలోకి చేరొచ్చు.

### జీవితకాలంలో 2.9 కిలోలు శరీరంలోకి

◆ ఎక్కువగా దుస్తుల్లోంచి మైక్రోప్లాస్టిక్స్ ఏర్పడతాయి. దుస్తులు 11 రకాల పాలిస్టర్ కారకాలను వెదజల్లుతున్నాయి. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్, ప్యాకేజింగ్ వస్తువులు, పెద్దమార్కెట్లలో అమ్మే పాలిమర్ పీవీసీ ప్లాస్టిక్ వస్తువుల, బ్యానర్లు, బొమ్మలు, గృహోపకరణాలు, ఈ-వేస్ట్, చెత్తను కాల్చడం ద్వారా గాలిలో మైక్రోప్లాస్టిక్స్ కలుస్తున్నాయి. ◆ గాల్లోని పీఎం10 కాలుష్య కారకాలకు ఇవి అనుబంధంగా ఉన్నాయి. ప్రయోగశాలల్లో వాయు నమూనాలను పీవై-జీసీ-ఎంఎస్ విధానంలో పరీక్షించగా నగరాల్లో సగటున క్యూ.మీ. గాలిలో 8.8 మై.గ్రా మైక్రోప్లాస్టిక్స్ ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ లెక్కన ఒక మనిషి జీవిత కాలంలో సగటున 2.9 కిలోల మైక్రోప్లాస్టిక్స్‌ను పీల్చే ప్రమాదముంది. ◆ మైక్రోప్లాస్టిక్స్‌పై పోగుపడే ప్రమాదకర స్ట్రెప్టోకోకి (బ్యాక్టీరియా), కొనిడియా (ఫంగస్) సహా పలురకాల వైరస్‌లు, సూక్ష్మజీవుల తిత్తులు, నానో పార్టికల్స్ మనుషుల్లో వ్యాధులకు కారణమవుతాయి. ఊపిరితిత్తుల కణజాలానికి హాని చేస్తాయి. రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసి, శ్వాససంబంధ సమస్యలు తెస్తాయి. పట్టణవాసులు వాడే ప్లాస్టిక్ వస్తువుల దుష్ప్రభావంపై శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు దృష్టి సారించాలని, మేలైన విధానాలు రూపొందించాలని ఈ పరిశోధకులు సూచించారు.

# మేడారం మెరిసేలా... జాతర మురిసేలా!

- రూ.251 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు

ఈనాడు – వరంగల్

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమించింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై దృష్టి సారించింది. ఎన్నడూ లేని విధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోంది.





మేడారం గద్దెల ప్రాంగణం (డ్రోన్ చిత్రం) ★ పగిడిద్దరాజు, గోవిందరాజుల నూతన గద్దె.. గోడలపై చిహ్నాలు

## అసాంఘిక శక్తుల ఫోన్లపై నిఘాకు అనుమతి మరో ఏడాది పొడిగింపు

**ఈనాడు, అమరావతి:** ప్రజాభద్రత దృష్ట్యా... టెలిఫోన్లు, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్ల ద్వారా అసాంఘిక శక్తుల ఫోన్ సంభాషణలు వినేందుకు, వారి మధ్య నడిచే సంక్షిప్త సందేశాలు చదివేందుకు రాష్ట్ర నిఘా విభాగానికి ఇప్పటికే ఉన్న అధికారాన్ని రాష్ట్రప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ప్రస్తుతం నిఘా విభాగాధిపతి, ఎస్ఐబీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల డీజీ/ఐజీలకు ఉన్న అధికారం డిసెంబరు 31తో ముగియనుంది. దీన్ని 2026 జనవరి 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకూ పొడిగిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫోన్ సంభాషణలు వినేందుకు వీరు తొలుత హోంశాఖ ముఖ్య కార్యదర్శి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇది 60 రోజుల పాటు అమల్లో ఉంటుంది. ఆ గడువు ముగిశాక దాన్ని పునరుద్ధరించుకోవాలి. ఇది కూడా 180 రోజులకు మించకూడదు. భారతీయ టెలిగ్రాఫ్ చట్టం, ఐటీ చట్టం సహా ఇతర నియమావళికి అనుగుణంగా ఈ ఫోన్ సంభాషణలు వినేందుకు అధికారం కల్పించింది.

## ఉబికొచ్చే గంగ.. ఈ ఆలయం ప్రత్యేకత



తెలంగాణలోని మంచిర్యాల మహంకాళీనగర్‌లో మహారాష్ట్ర చంద్రపూర్‌కు చెందిన ఓ వలసదారు నిర్మించిన దేవాలయం ప్రత్యేకత సంతరించుకుంది. 50 ఏళ్ల కిందట ఇక్కడకు వలస వచ్చిన హరిసింగ్-సోనిబాయి దంపతులు.. కర్రతో రొట్టె పీటలు, గాజుల స్టాండ్, ఇతర సామగ్రి తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగించేవారు. వీరికి అయిదుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. 45 ఏళ్ల కిందట వీరు ఆలయాన్ని నిర్మించి మహంకాళి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కింద భూగర్భంలో మరో గది నిర్మించి దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం చుట్టూ వేసవి, వానాకాలం తేడా లేకుండా ఎప్పుడూ రెండు నుంచి మూడు అడుగుల ఎత్తున నీరు నిలిచి ఉంటుంది. ఆ నీరు ఆలయం లోపలికి ఎలా వస్తుందో ఎలా పోతుందో ఇప్పటికీ తెలియదు. ఇక్కడ ఏటా దసరాకు దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. అనారోగ్యానికి గురైన వారు ఆ నీటిని తీసుకెళ్లి స్నానం చేస్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఇక్కడి వారి నమ్మకం. హరిసింగ్ 25 ఏళ్ల కిందట చనిపోయారు. వారి వారసులు దాదాపు 120 కుటుంబాలు. 300 మంది జనాభాతో మహంకాళీనగర్ కాలనీగా ఏర్పాటైంది.

### కాంక్రీట్‌తో ఫ్లోరింగ్ చేసినా...


హరిసింగ్ భార్య సోనిబాయి మాట్లాడుతూ.. ‘భూమిని కొనుగోలు చేసి.. అప్పట్లోనే రూ.5 లక్షల ఖర్చుతో ఆలయాన్ని నిర్మించాం. దుర్గాదేవి విగ్రహం ప్రతిష్ఠించినప్పటి నుంచి నీరు ఉబికి వస్తోంది. నీరు రాకుండా రెండు మూడుసార్లు సిమెంట్, కంకరతో ఫ్లోరింగ్ చేయించాం. టైల్స్ వేయించాం. అయినా నీటి ధార ఆగలేదు’’ అని వివరించారు.

–న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

## చీమకుర్తి గ్రానైట్ ప్రపంచ స్థాయిలో మెరిసేలా!

### భౌగోళిక గుర్తింపునకు దరఖాస్తు

**ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే చీమకుర్తి:** ప్రకాశం జిల్లా చీమకుర్తి బ్లాక్ గెలాక్సీ రకం గ్రానైట్‌కు భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ సాధించే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక్కడ లభించే ముడిరాయిలోని ప్రత్యేకతలను ప్రస్తావిస్తూ స్థానిక గ్రానైట్ యజమానుల సంఘం ప్రతినిధులు జాగ్రఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీకి దరఖాస్తు చేశారు. త్వరలో ఆ సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్నారు. ఈ తరహా గ్రానైట్ ఇతర దేశాల్లో ఇంకెక్కడైనా లభిస్తుందా.. అన్నది పరిశీలించి, అన్ని ధ్రువీకరణలు పూర్తయ్యాక జీఐ ట్యాగ్ అందించే అవకాశం ఉంది. చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమ ఏళ్లుగా ఎందరికో ఉపాధి నిస్తోందని, జీఐ ట్యాగ్ లభిస్తే ప్రపంచవ్యాప్తంగా బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ఎగుమతులు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రపంచంలో ఈ రకం రాయి ఎక్కడా లేనందున జీఐ గుర్తింపు తప్పక లభిస్తుందని భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.





చీమకుర్తిలో గ్రానైట్ క్వారీ ◆ బ్లాక్ గెలాక్సీ రకం గ్రానైట్

### ఎగుమతులు పెరిగి క్వారీల విస్తరణ

పాలపుంతలో నక్షత్రాలు మెరిసినట్లుగా నల్లని రాయిపై బంగారపు రంగు చుక్కలు మెరుస్తూ ఆకర్షణీయంగా కనిపించడం వల్ల చీమకుర్తి గ్రానైట్‌కు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మిగతా రకాలతో పోలిస్తే, దీనికి ధర ఎక్కువే. చైనాలో ఇంటి ఎలివేషన్‌కు ఇది ఎక్కువగా వాడతారు. అక్కడికి ముడిరాయిని ఎగుమతి చేస్తుండగా, పాలిష్ చేసిన పలకలను ఇటలీ, వియత్నాం, ఈజిప్ట్, సౌదీ అరేబియా దేశాలకు తరలిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఎన్నో క్వారీలున్నప్పటికీ, ఒక్క చీమకుర్తిలోనే, అదీ దక్షిణం వైపు భూభాగంలోనే బ్లాక్ గ్రానైట్ నిల్వలున్నాయి. ఆర్ఎల్‌పురం, బోదవాడ కలుపుకొని ప్రస్తుతం 40 క్వారీలు నడుస్తున్నాయి. 1978లో తొలి క్వారీ లీజు ఇవ్వగా, 1990 నుంచి ఎగుమతులు పెరిగి, క్వారీలు విస్తరించాయి. కొవిడ్‌కు ముందువరకు ఎగుమతులతో విదేశీ మారకద్రవ్యం బాగా లభించేది. కొంతకాలంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిర, అనిశ్చిత పరిస్థితుల్లో ఎగుమతులు కొంత మందగించాయి. ప్రస్తుతం నెలకు 50 వేల క్యూబిక్ మీటర్ల వరకు ముడిరాయిని వెలికితీస్తున్నారు.



## బాహుబలి నీటితొట్టె

దాదాపు 9 మీటర్ల పొడవున్న ఈ భారీ రాతి తొట్టె తెలంగాణలోని వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట ఎల్లమ్మ తాటి వనంలో బయటపడింది. దశాబ్దం క్రితమే దీనిని స్వాధీనం చేసుకున్న రాష్ట్ర పురావస్తుశాఖ... అయిదు భారీ క్రేన్‌ల సాయంతో మ్యూజియానికి తరలించింది. ప్రస్తుతం ఖిలావరంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న మ్యూజియం భవనం ముందు ఉంది. ఇది కాకతీయుల కాలం నాటిదని చరిత్రకారులు అరవింద్ తెలిపారు. ఏనుగులు, గుర్రాలకు తాగు నీటి కోసం చెక్కించి ఉంటారని వివరించారు.

–న్యూస్‌టుడే, ఖిలావరంగల్; ఈనాడు, హనుమకొండ